భారతి

మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

ఆగస్టు 1964

సంపుటము 41 : : సంచిక 8

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

ఆగస్టు 1964

నవ్యాంధ్ర సాహిత్యంలో దృక్పథాలు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

సాహిత్యంలో దృక్పథాలు సంఘంలో సమకాలీన భావసంచలనాన్ని వ్యక్తం చేసేవిగా ఉంటాయి. రచయిత సంఘంలోని వాడే కనుక అతని వ్యక్తిత్వం, ఆలోచన, ఎంత స్వతంత్రించినా సాంఘికమైనవే; ఎంత సాంఘికమైనా అతని ప్రత్యేకతను నిరూపించేవే! ఉదాహరణకు నవ్యాంధ్ర సాహిత్యానికి వైతాళికులైన వీరేశలింగం, గురజాడ కవులను పోల్చిచూస్తే ఈ సత్యం బోధపడుతుంది. సంఘ సంస్కరణం, జాతి పునరుజ్జీవనం, తదనుగామియైన సాహిత్యం - యివి వారిద్దరికీ ముఖ్యలక్ష్యాలు అయినప్పటికీ వారి రచనలమధ్య ఎంతో భేదం వుంది. జీవితాన్ని గూర్చిన దృక్పథంలో, తత్త్వజిజ్ఞాసలో వారికి సామ్యం లేదు. కారణం వారి వ్యక్తిత్వాలు వేరు: వీరేశలింగంగారికి కర్మప్రధానం, సాహిత్యసృష్టి అందుకు ఉపకరణం మాత్రమే. గురజాడవారికి నవ్యసాహిత్యసృష్టి ప్రధానం. దానికి సజీవమైన భాషా, సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించే సంప్రదాయమూ ఏర్పరచేందుకే ఆయన కర్మానుష్ఠానము. వ్యావహారిక భాషకు సాహిత్యప్రతిపత్తి కలిగించేందుకు గిడుగు రామమూర్తిగారితో కార్యరంగంలో దూకారు వారు. ఆ రోజుల్లో బ్రాహ్మ సమాజం, ఆర్య సమాజం, రెండింటి ప్రభావమూ ఆంధ్రదేశంమీద ప్రసరించింది. వీరేశలింగంగారు కార్యదీక్షలో రాజారామమోహనుని అపరావతారమంటే అతిశయోక్తికాదు. ఆయనకు సంఘంమీదే దృష్టి. అప్పారావుగారి దృష్టి అంతర్దృష్టి. ఇతరులను విమర్శించేముందు తన్ను తాను విమర్శించుకునే స్వభావం అయనది. జీవిత స్వరూపాన్ని తాత్త్వికుడుగా, స్థితప్రజ్ఞుడుగా దర్శించి మానవప్రేమలో, మంచితనంలో, తుదివిశ్వాసం నిలుపుకొన్నవారు అప్పారావుగారు. వీరేశలింగంగారి రచనలో అటువంటి మౌలికమైన తత్త్వాన్వేషణ కనిపించదు. క్షాత్రప్రక్రియలు, సామాజిక ప్రయోజనం ఆయన సాహితీరంగంలో అన్వేషించి, సాధించినవి.

దివ్యజ్ఞాన సమాజోద్యమ ప్రభావం బెసెంటు మద్రాసులో అడుగుపెట్టిన తర్వాత

ప్రారంభమైంది. బ్రాహ్మసమాజం, ఆర్య సమాజం, రెండూ క్రైస్తవమతాన్నీ పాశ్చాత్యసంస్కృతినీ చూచి పాఠాలు నేర్చుకున్నవే. మన ఆచారాల్లో, సంప్రదాయాల్లో, వ్యవస్థల్లో ఉన్న లోపాల్ని దిద్దుకునేందుకూ, మనల్ని మనం విమర్శించుకునేందుకూ వాని ప్రధానం దోహదం చేసింది. కాని దివ్యజ్ఞాన సమాజం అలా కాదు. హిందూమతానికీ, భారతీయ సంస్కృతికీ అత్యున్నతస్థానం యిచ్చి నివాళి పట్టింది. ఇది ఒక పెద్దమలుపు. మనల్ని మనం అర్థంచేసుకునేందుకూ, అభినందించుకొని ఆత్మగౌరవం పెంపొందించుకొనేందుకూ యీ ఉద్యమం తోడ్పడింది. దేశం మత, సాంస్కృతికభావాల్లో అలా ఆత్మగౌరవం పెంపొందించుకోవటంలో గాంధీ మహాత్ముని జాతీయకృషికి రంగం సంసిద్ధమైంది. ఆయన దేశీయతా భావాన్ని సుప్రతిష్ఠితం చేశాడు. పాశ్చాత్యుల ఆధిక్యతను దేశం మానసికంగా తోసిపుచ్చింది. ఆత్మాభిమానం బలపడింది. ఈ పరిణామం, వంగదేశ విభజన ప్రయత్నం విఫలమైన తర్వాత, వంగసాహిత్యంలో, ముఖ్యంగా రవీంద్రుని రచనలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బ్రాహ్మసమాజపు భావాలనుండి పద్ధతులనుండి రవీంద్రుడు ఎలా ఉపనిషత్తుల వైపూ, వైష్ణవభక్తి సంప్రదాయంవైపూ మొగ్గుతూవచ్చాడో ఆయన వ్రాసిన నవల "గోరా"లో స్పష్టమౌతూవుంది. ఆంధ్ర దేశంలో ఆనాటి వంగసాహిత్యప్రభావమే రాయప్రోలు సుబ్బారావు, వేంకట పార్వతీశ్వరులు, కృష్ణశాస్త్రి ప్రభృతుల రచనలలో కనిపిస్తుంది. ఇందులో ముఖ్యమైనది కవిత్వం మీది ప్రభావమే. ఏమంటే వంగభాషలోని నవలలు అనువదింపబడినప్పటికీ, వాటివల్ల ప్రభావితమైన స్వతంత్ర రచనలు తెలుగులో చెప్పుకోదగ్గవిలేవు. స్వతంత్రముగా వ్రాయబడిన నవలలు వీరేశలింగంగారు పెట్టిన పరవడినే చాలవరకు అనుసరించినవి. అందులో పేర్కొనదగినవి చిలకమర్తివారి నవలలు.

వంగసాహిత్యప్రభావమూ, పందొమ్మిదవ శతాబ్దపు ఆంగ్లసాహిత్యంలో ప్రబలిన 'కాల్పనికోద్యమ' (Romantic movement) ప్రభావమూ తోడై తెలుగులో భావకవిత్వమూ, నవ్యసాహిత్యోద్యమమూ ఆవిర్భవించాయి. 'రొమాంటిసిజమ్' అంటే కల్పనకంటె రమణీయతను, చమత్కారంకంటె స్పృహణీయతను, ఆలోచనకంటె హృదయావేగాన్ని ప్రధానం చేసికొన్న సాహిత్యోద్యమం. ఈ ఉద్యమానికి చెందిన ఆంగ్ల కవులలోనే ఒక్క వర్డ్సువర్త్, కీట్స్ కవుల రచనల్లో తప్ప వివేచనకు అందే స్వాయంసిద్ధమైన తత్త్వదృక్పథం, అది యిచ్చే పరిపూర్ణతా మిగతా కవుల రచనల్లో కనిపించవు. రచన ఎంత ఆ పాత మధురమైనా, అక్షర రమ్యత కలిగినదైనా, హృదయానుభూతినీ చిత్తవృత్తినీ వెంటనే వెలువరించేదైనా, అందులో లీనమై ధ్వనిస్తూ నిలుకడ మీద నిలిచే ఒక 'నిజం' ఉండాలి. అది లేకపోతే కాలంధాటికి ఆ రచన ఆగలేదు. వర్డ్స్వర్త్, కీట్సు కవులలో తప్ప మిగతా వారిలో అది కేవలం ఒక నిస్పృహగా, ఒక విశ్వాసంగా, ఒక ఆదర్శంగా లేక, సౌందర్య లాలసగా మాత్రమే భాసిస్తుంది. జీవితాన్ని

గూర్చి కవి సాధించిన తత్త్వదృక్పథపు స్థాయిని అందుకోదు. తెలుగు నవ్యకవితారంగంలోనూ యిదే లోపం. కావ్యానికి ఆవేశముగాని, భావశబలతగాని ఒక్కటే చాలదు; అది ఆలోచనతో అనుభవ పరంపరతో మథింపబడి ఒక సమ్యగ్దృష్టిగా రూపొందినప్పుడే కావ్యానికి నిండుదనం వస్తుంది.[1] అభిరుచులు, 'ఫాషన్లు' మారినా అప్పుడే దానికి విలువ తగ్గదు. ఇక్కడ కావ్యం దీర్ఘమా హ్రస్వమా అనే కొలత ముఖ్యంకాదు. చిన్న కథలోనూ, ఖండ కావ్యంలోనూ యీ గుణం సాధించవచ్చు. తెలుగులో కాల్పనికోద్యమానికి చెందిన రచనల్లో అటువంటివి వ్రేళ్ళమీద లెక్కింపవచ్చు.

గడచిన అర్థశబాబ్దిలో తెలుగులో కవిత్వంకంటె నవల పొందిన పరిణామమే సాహిత్య భవితవ్యానికి ఫలప్రదంగా కనిపిస్తోంది యివ్వాళ. చిలకమర్తివారి నవలలూ, పానుగంటివారి వ్యాస సంపుటాలూ వీరేశలింగం అడుగుజాడల్లో, బ్రాహ్మసమాజ ఛాయల్లో నడిచాయి. వేంకట పార్వతీశ్వరుల నవలల్లో కాల్పనికోద్యమ ప్రభావం, దాని లోటుపాట్లతో సహా పూర్తిగా కనిపిస్తుంది. తర్వాత దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణుడు, వివేకానందుడు, తిలక్, గాంధీల ప్రభావం హిందూ సంప్రదాయము మీద ఆసక్తినీ భక్తినీ రేకెత్తింపజేయగా సాహిత్యంలో రూపొందినది 'ఆధ్యాత్మిక వాదం'. ఉన్నవ లక్ష్మినారాయణగారి 'మాలపల్లి' గాంధీమతానికి ఎత్తిన కరదీపిక. కాని ఆధ్యాత్మికవాదాన్ని బాగా మెలిద్రిప్పి, దాన్ని 'హేతువాదానికి కేవలం ప్రతిద్వంద్విగా రూపొందించిన నవలా రచయిత విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథవారి దృష్టి హైందవ సంప్రదాయంలోని వైశిష్ట్యాన్ని మూల మూలలా వెదకి సమర్థింపజూచే నిశితదృష్టి. ఈ దృష్టి అధునాతనమైన భావాన్ని పాశ్చాత్యసంస్కృతి వాసనగల ఏ చిన్న విషయాన్ని సహింపని తీవ్రవాదిదృష్టి. అడవి బాపిరాజుది సంస్కారాన్ని అభిలషించే మనస్సు; శిల్పకళకూ సౌందర్యానికి అంకితమైన భావము. ఆయన వ్రాసిన 'తుపాను' వంటి నవలల్లో గంభీరమైన ఆత్మజిజ్ఞాస వుంది. గాని నవల అనే ప్రక్రియలో పాత్రోన్మీలనము, కథా సంవిధానము ఆయన సరిగా అర్థం చేసుకొన్నట్లు తోచదు.

ఆర్యసమాజం విగ్రహారాధననీ, వర్గవ్యవస్థనీ నిశితంగా విమర్శించింది. దయానందసరస్వతి 'సత్యార్థ ప్రకాశిక' పీఠికలో- "సత్యమైన అర్థాన్ని ప్రకాశపరచటమే యీ గ్రంథం యొక్క ప్రయోజనం," అని వ్రాస్తూ, "సంప్రదాయంలో సత్యాసత్య స్వరూపాన్ని వివేచించటమే విద్వాంసుల ముఖ్య కర్తవ్యం" అని ఉద్బోధించారు. పై భావాల ప్రేరణ పొందినదే 'హేతువాదం'. త్రిపురనేని రామస్వామిచౌదరి "ఈ స్వరూపాన్ని వివేచించటమే విద్వాంసుల ముఖ్యకర్తవ్యం" అని ఉద్బోధించారు. పై భావాల ప్రేరణపొందినదే 'హేతువాదం'. త్రిపురనేని రామస్వామిచౌదరి ఈ ఉద్యమా

1- Poetry is the spontaneous overflow of powerful feelings: it takes its origin from emotion recollected in tranquility (Words worth: Preface to Lyrical Ballads.)

నికి మూలపురుషుడు. సత్యాసత్య స్వరూపాన్ని వివేచించటం ఎలాగ? అంటే ఆయన దృష్టి ముఖ్యంగా వర్ణవ్యవస్థమీదా, ఆర్య ద్రావిడ విభేదంమీదా ప్రసరించటంవల్ల, పురాణేతిహాసాలను ఆదృష్టితోనే పరిశీలించి అందులో తనకు తోచిన సత్యం, (అంటే చారిత్రకార్థం) ఊహతో నిగ్గు తేల్చి చెప్పటానికి గ్రంథాలు వ్రాశారు. బెర్నార్డ్‌షా ప్రభావం యీయనమీద ఎంతో కొంత ఉన్నదిగాని, షాలో కనిపించే తార్కిక కౌశలంగాని, సృజనాత్మకశక్తిగాని, ఆరకం హాస్యంగాని యీయనలో లేకపోవటం గమనించదగిన విషయం. దీన్ని 'హేతువాదం' అనటంకంటె 'భౌతికవాదం' అనటమే ఎక్కువ సబబుగా ఉంటుందేమో! ఈ ఉద్యమంలోని 'తిరుగుబాటు' తీవ్రత మాత్రం యువజనులను ఎక్కువగా ఆకర్షించింది. ఫలితంగా బెర్ట్రెండ్ రస్సెల్, కార్ల్‌మార్క్స అటుతర్వాత ఎమ్. ఎన్. రాయ్ దార్శనికుల ప్రభావం విస్తరిల్లుతూ కొందరు రచయితలలో వ్యక్తమైంది. గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి వీరిలో చెప్పుకోదగ్గ నవలా రచయితలు.

కాల్పనికోద్యమానికి చెందిన కవిత్వంలో జీవితాన్ని గూర్చిన సమగ్రదృష్టి లోపించటం గుర్తించి దానికి ప్రతిక్రియగా (Reaction) విప్లవాత్మకంగా 'వాస్తవికత', 'అధివాస్తవికత' అనే నినాదాలతో కవిత్వంలో 'అభ్యుదయ'పథం త్రొక్కినవాడు శ్రీశ్రీ. దానికి తగిన తాత్త్వికదృష్టికోసం 'మార్క్సిజం'ను ఆశ్రయించారు యీ ఉద్యమానికి చెందినవారు. భాష, ఛందస్సువంటి విషయాల్లో గురజాడవైపు మళ్లటం గమనింపదగిన విషయం. గురజాడలోని 'నవ్యత', 'వాస్తవికత' వీరిని ఆకర్షించాయి. 'మార్క్సిజమ్'ను దాటి వీరి అన్వేషణ యింకా సాగుతూనే ఉంది.

బ్రాహ్మసమాజంతో తారసపడి దాని మీద తిరుగుబాటుచేసి, ఆధ్యాత్మికవాదానికీ, హేతువాదానికీ, (భౌతికవాదానికీ), సామ్యవాదానికీదూరంగాతొలగి మొపాసా, డి. హెచ్. లారెన్స్‌లవంటి రచయితలచేత ప్రభావితుడై, ఒక విశిష్టదృక్పథాన్ని ఏర్పరచుకొని, వివాహవ్యవస్థమీదా, సంఘంలోని కుళ్లుమీదా దెబ్బతీసిన రచయిత చలం. ఈయనలో వ్యక్తిగతంగా వచ్చిన పరిణామం లోకానికి సువిదితమే.

పై పరామర్శదృష్ట్యా స్థూలంగా ఏర్పడుతున్న విషయం: తెలుగు సాహిత్యంలో కాల్పనికోద్యమం సన్నగిల్లుతూ రావటం; తర్వాత ప్రధానప్రక్రియలుగా నవల, కథ, రూపొందటం. విశ్వనాథ, గోపీచంద్, చలం-యీ ముగ్గురూ భిన్నమైన దృక్పథాలకు చెందినవారైనా తెలుగులో 'నవల'కు వీరు దిద్దితీర్చిన రూపం ప్రధానంగా చెప్పుకోదగ్గది. ఉదాహరణకు బుచ్చిబాబు నవల 'చివరకు మిగిలేది' పరిశీలిస్తే అందులో యీ ముగ్గురి ప్రభావమూ సమ్మిశ్రితమై ఎలా 'నవల' మరొక్కమెట్టు పైకి వెళ్లుతూఉందో గోచరమౌతుంది.ఇప్పట్లో తెలుగులో 'నవల'కున్న స్థానం మరిదేనికీ లేదనీ చెప్పుకోవాలి.

గడచిన అరవై ఏళ్లలో సంఘసంస్కరణ, జాతిపునరుజ్జీవనం, సాహిత్యంలో నవ్యత-వీటి పరస్పరసంబంధం తెలుగు రచయితల దృక్

థాలలో ఎలా ప్రతిబింబిస్తూ వచ్చిందో క్లుప్తంగా తెలుపుతుంది పై పరామర్శ. నవ్యాంధ్ర సాహిత్యకల్లోలినిలో అంతర్వాహినిగా హేతువాదానికీ (భౌతికవాదానికీ), ఆధ్యాత్మికవాదానికీ జరుగుతున్న ఒక నిరంతరసంవాదం గోచరిస్తుంది. ఈ సంవాదమే ఒక్కొక్కసారి వ్యక్తులమధ్య వర్గాలమధ్య విద్వేషంగా దిగజారిపోతూఉంటుంది. ఈ సంవాదం భాషల్లో స్వేచ్ఛకూ నియంత్రణకూ, భావాల్లో అధునాతనత్వానికీ, సనాతనత్వానికీ, తత్త్వచింతనలో విచికిత్సకూ, విశ్వాసానికీ, కలన్పలో వాస్తవికతకూ, భావనకూ జరిగే సంఘర్షణగా వివిధరూపాలలో ప్రత్యక్షమౌతుంది. సాహిత్యవ్యవసాయమూ, సత్యాన్వేషణమూ జీవితంలో ఒకటైన ప్రతిరచయితా ఏదో సమన్వయం సాధించటానికి ప్రయత్నిస్తాడు. ఈ సమన్వయం తీరు ఎన్నోరకాలగా ఉండవచ్చు ద్వంద్వంలో మొదటినుంచీ ఒక్కదానివైపే మొగ్గటం; లేక ఒకదానినుండి మరొక దానివైపు ప్రయాణం చెయ్యటం; లేక రెండింటినీ అధిగమించి అతీతమైన పథాన్ని అందుకోవటం; రచయితకు సంబంధించిన యీ 'ఆత్మకథ'ను అతని సాహిత్యకృషి ప్రతిబింబిస్తుంది. ఈ పద్ధతిలో కొందరు రచయితలను పరామర్శించటమే ఈ వ్యాసాల ఉద్దేశం.

1. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

కాల్పనికోద్యమ (Romantic Movement) ప్రభావంలో ప్రారంభమైన విశ్వనాథ సత్యనారాయణ సాహితీ కృషి అనతి కాలంలోనే ఆ ప్రభావాన్ని అధిగమించి ఆయన ఏర్పరచుకొన్న విశిష్ట దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ వచ్చింది. ఆయన ప్రతిభ భావనాత్మకమేకాదు. ఆలోచనాత్మకంకూడా. ఆపైన ఆ భౌతిక దర్శనాశక్తి (Capacity for spiritual insight) ఒకటి ఆయన భావనకు, సామాన్యంగా కాల్పనిక రచయితల భావనకు లేని తత్త్వ పరిపూర్ణతను ఇచ్చింది. కాని ఆయనలో భావన, ఆలోచన, దర్శనము (insight) అన్నీ హైందవ సంప్రదాయ నిబద్ధమైనవి. అవి ఆ పరిధి దాటి వెళ్లకూడదనే ఆయన దృఢ సంకల్పము. అదే సత్యనారాయణగారి దృక్పథంలో బలానికీ, బలహీనతకూ కూడా హేతువైనట్లు తోస్తుంది. ఆ దృక్పథం ఏమిటి? దాని ప్రత్యేకతా, పరిణామమూ ఎటువంటివి? సమకాలీన భావ సంచలనంలో ఆ దృక్పథానికి గల సంబంధం ఏమిటి? 1

ఏకవీర

'ఏకవీర' కాల్పనికోద్యమ ప్రభావంలో పుట్టింది. కథలో, నిర్మాణంలో ఆ ఉద్యమ సంప్రదాయాన్ని పూర్తిగా అనుసరించినా విశ్వనాథ ఏకవీర పాత్రను పోషించిన విధానం కథ ముగించిన తీరు, ఆయన ప్రత్యేక దృక్పథాన్ని సూచిస్తాయి. భావనాత్మక ప్రేమకు (Romantic love) సాహిత్యంలో, కవి సమయాల్లాంటివే కొన్ని 'సమయాలు' (Conventions) ఉన్నాయి. తొలిచూపులో, ఊరూ, పేరూ తెలీకుండానే, ప్రేమ జనించటం (Love at first sight) ఆ ప్రేమ మంగాకరిమీదికి మరల్చేందుకు వీల్లేదనటం; ప్రేమ కోసం ఏ త్యాగం చెయ్యటానికైనా సిద్ధం కావటం; ప్రేమ చిహ్నాలను ఆరాధించటం; విరహావస్థలో తన ప్రేమను గూర్చి సన్నిహిత వ్యక్తికి హృదయం విప్పి చెప్పుకోవటం; యివన్నీ ప్రేమ ఫలించేదాకా దాని లక్షణాలు—ప్రేమ ఫలిస్తే వివాహం, ఫలించకపోతే మరణం. (అంతటితో రొమాంటిక్ కథా, కవి

---

1. ఒక మనవి. రచయిత దృక్పథాన్ని ఖండించటంగాని, సమర్థించటంగాని ఈ విచారణలో భాగంకాదు. భిన్నమైన దృక్పథాలు సాహితీ రంగంలో వ్యక్తమవుతూ వచ్చినప్పుడు అం ఒక దాని కొకటి ప్రతి ద్వంద్విగా రూపొందుతూ రావటవి ముదావహమైన పరిణామంకాదు. సత్యాన్వేషణ కుంటువడి, ఉత్తమ సాహిత్య సృష్టీ దాని ఆస్వాదనా అవరోధింపబడుతవి. సాహిత్యం రాజకీయరంగంకాదు. ప్రాభవానికీ, పలుకుబడికీ ప్రాకులాడుతూ సాహితీపరులు లక్ష్యశుద్ధి కోల్పోవటం విచారం. రచయితల దృక్పథాలను, వారి రచనల ద్వారా సానుభూతితో, చిత్తశుద్ధితో అవగాహన చేసుకోవటం సాహితీ జిజ్ఞాసువు ప్రథమ కర్తవ్యం. దానివల్ల రచయితల మధ్య పైకి కనిపించే భిన్నత్వం, వైరుధ్యం కాక వెనుక కొంత ఏకత్వం కూడా దృశ్యం కావచ్చునేమో! వర్గతత్త్వం అనే కాలుష్యంనుంచి నదస్సు పరిశుద్ధం కావటానికి ఇదే మార్గం.

త్వమూ కూడా ఆగిపోతాయి.) ఈ లక్షణాలన్నీ 'ఏకవీర' లో తు. చ. తప్పకుండా ఉన్నాయి. 'ఏకవీర' లోని ప్రేమికులు రెండు జంటలూ దురదృష్ట జాతకులు (Star-crossed lovers) ప్రేమకు యీ విధి ప్రాతికూల్యం కూడా రొమాంటిక్ సంప్రదాయంలో భాగమే. పోతే కథా నిర్మాణం విషయంలో రొమాంటిక్ కథలు త్రికోణం (Triangle) వలెగాని 'క్రాస్' (Cross) వలెగాని ఉండటం మామూలు. 'ఏకవీర' నిర్మాణం క్రాస్ (X) వలె ఉంటుంది:— ఏకవీర కుట్టాన్‌ల సంబంధంలో పరిణామం, మీనాక్షీ వీర భూపతుల సంబంధంలో పరిణామం రెండూ 'క్రాస్' వలెనే ఉన్నాయి; మొదట కుట్టాన్ విముఖత్వమూ ఏక వీర సుముఖత్వమూ, ఇద్దరూ దగ్గరగా రావటానికి ప్రయత్నించడం; ఆ ప్రయత్నం ఫలించే ముహూర్తం రావటం; ఆ ముహూర్తంలోనే కుట్టాన్ రాచ కార్యంమీద వెళ్లిపోవడం; అంతటితో ఏకవీరలో నిస్పృహ, విముఖత్వం ప్రారంభమై, చివరకు కుట్టాన్ సుముఖుడుగా తిరిగి రాగా ఏకవీర ఈ లోకంనుంచే విముక్తురాలు కావటం. అలాగే వీరభూపతి సుముఖత్వం మీనాక్షి విముఖత్వం; కుట్టాన్ రహస్యం చెప్పటంతో సమీకరణ చెంది, ఆ ముహూర్తంలోనే వీరభూపతి మీనాక్షిపట్ల విముఖుడు కావటమూ, అప్పటినుంచీ మీనాక్షి భర్త ప్రేమ వాంఛించటమూ జరుగుతుంది. పర్యవసానం వీర భూపతి సన్న్యాసం.

పై రీతిగా రొమాంటిక్ సంప్రదాయాన్ని పూర్తిగా పుణికి పుచ్చుకున్న నవల 'ఏకవీర'. కాని ఆ సంప్రదాయాన్ని అధిగమించిన ప్రత్యేకత కూడా కలిగి ఉండటంవల్లే అది కావ్య గౌరవం కలిగిన నవలగా నిలిచింది. ఆ ప్రత్యేకత ఏమిటి? విశ్వనాథ తన ప్రేమికుల మనస్తత్వంలో ప్రేమకూ, ధర్మానికీ సంఘర్షణ ఒకటి ప్రవేశ పెట్టారు. వీర భూపతి ప్రబోధంలో కుట్టాన్ ధర్మం వైపు మొగ్గటానికి ప్రయత్నిస్తాడు. మీనాక్షి తన స్నేహితుణ్ణే వివాహమాడిన సంగతి తెలియటంతో అతనిలో పరివర్తన సంపూర్ణమౌతుంది. మీనాక్షి మీద ప్రేమను సోదర ప్రేమగా మార్చుకొని ధర్మపత్నిపట్ల సుముఖుడౌతాడు. మీనాక్షిలోనూ ధర్మంపట్ల ఇటువంటి పరివర్తనే కలుగుతుంది. వీళ్లిద్దరూ వ్యవస్థా ధర్మాన్నిపూర్తిగా స్వీకరించినవారు. కాని వీర భూపతిలో పరిణామమూ, అంతకంటె కథా నాయిక ఏక వీరలో ధర్మానికీ, ప్రేమకూ జరిగిన సంఘర్షణా ఈ విషయమే నవలలో ముఖ్యమైన వస్తువు. అదే రచయిత ప్రత్యేకంగా నిరూపించదలచుకొన్న తాత్త్విక విషయము.

''వివాహమైన రెండు సంవత్సరములుగా నేకవీర ఆతని (వీరభూపతిని) మరచిపోయినది. అతనిస్థానమున కుట్టానునకు వసతి నిర్మించినది. కుట్టానా వసతిలో నిలిచినాడుకాడు. తాను నిర్మించిన ప్రేమ సౌధమునకు గుట్టాను తీసిన నిర్దయా ద్వారమునుండి తన తొల్లింటి వలపుకాడు ప్రవేశించిన మాట ఏక వీర కవగతము కాలేదు; తన కిపుడు పెరిగిన తెలిపట్టు చీరల మీద మక్కువ వెదకి చూచుకొనలేదు. తన తొల్లింటి ప్రేయోమూర్తి యామె కనులకుఁ గట్టినట్లుండెను. ఆమె యతని ప్రత్యక్షమైన మూర్తినిఁ గూర్చి, దాని నిలుకడను గూర్చి వితర్కించుకొనలేదు. అది యామెకు సర్వ లోకముల నుండి తాను గుప్త పరచుకొన్న ధనము. ఆధనమునకు యాథార్థ్యము లేదని యామెకు తెలియును. ధర్మ మునకు సాధనము యాథార్థ్యమునకు దవ్వైనది. అందుచేత నామె ధర్మబద్ధయై యా ధనము మాట మరచిపోయినది. ధర్మముతోడి ధనము నభిలషించినది. ఈ క్రొత్త ధన మామెకు స్వర్గదూర మతిగమించినది. ఈ రెండు ధనము లామె కయాథార్థములైనవి. మొదటి ధనము మధుర ప్రేమ మయమైనది. రెండవ ధనము ధర్మ ప్రేమ మయమైనది. తనకు దూరములైన ఈ రెంటిలో నేది మనస్సున నిల్పుటకు యోగ్యమైనదో ఆమెకుఁ దెలియలేదు. తెలివి కొలది రెండవ దానిని మనస్సున నామె నిలుపును. తనకుఁ దెలియకుండ మొదటిది తాను వచ్చి తన మనసావరించును. ఆ యా వృత్తి యామెకు దెలిసి తెలియ నట్లుండును.''-(ఏక వీర 18 అధ్యా) మనస్సులో అవ్యక్తమైన భాగం (Unconscious) ఒకటి ఉందనీ, దానికీ వ్యక్తమైన భాగానికీ (Conscious) సంఘర్షణ ఉంటుందనీ, గుర్తించి పాత్రపోషణ చేసిన మొదటి తెలుగు నవలా రచయిత విశ్వనాథ. ఏకవీరకు తెలిపట్టు చీరల మీద ఆసక్తి పెరగటం, అప్పటి ఆమె మనస్థితిని గూర్చి రచయిత చేసిన వ్యాఖ్యానమూ గమనింప దగినవి.

ఏకవీర అవ్యక్తమన స్స్థితి ఆమెను ధర్మమునుండి ప్రేమ వైపు లాగుతున్నది. 'ఆరంజే విరుంబు' అన్న వాక్యము, గులాబి వాళ్లపిల్ల అమృతం నవ్వే నవ్వూ, ఆమె పరిస్థితిని అపహాస్యం చేస్తున్నవి. కానీ వ్యక్తమైన మనస్సు (Conscious) ధర్మమునే అంటి పెట్టుకొని ఉంది. వర్షర్తువు తెచ్చిన ఉద్విగ్నతపై సంఘర్షణని తీవ్రం చేసింది. అంతలో శరత్కాలము, మీనాక్షీ సుందరేశ్వరుల కల్యాణోత్సవము, కూచిపూడి వారి 'గొల్ల కలాపమూ'—'కలాపము' చూచేందుకు ఏకవీర మీనాక్షి ఇంటికి వెళ్లింది. ఆమె మనస్సులోని వ్యక్తావ్యక్తముల మధ్య (ధర్మ ప్రేమముల) సంఘర్షణ 'కలాపము' హేతువుగా పర్యవసించింది. భామ వేషము విప్రలంభావస్థలు పదింటిలో ఎనిమిదింటిని అభినయింపగా ''ఏకవీర ప్రాణములు పూర్వములైన ఎనిమిదవస్థలు మానసికముగా ననుభవించినవి'' తొమ్మిదవదైన జడతావస్థ ఏక వీరను వర్తమాన స్థితికి తెచ్చినది. అది వ్యక్తావ్యక్తముల సమీకరణము: అధిగాఢమై, దుర్భరమై, విశ్రమించేందుకు ఏకవీర యింటి లోపలికి వెళ్లింది. అక్కడ వీరభూపతి చిత్రం కనిపించింది. ఏకవీర వ్యక్తంలోనుంచి అవ్యక్తంలోకి (మానసికంగా) వెళ్లటమూ, ఆమె శారీరకంగా యింటి ప్రాంగణంనుంచీ లోపలికి వెళ్లటమూ ఒక్కటై, ఆమె వీరభూపతి చిత్తరువు చూడటం అనేది మనస్సుకూ, శరీరానికీ, ఆంతర్యానికీ, బాహ్యానికీ సమన్వయం సిద్ధించి భేదం నశించిన స్థితి అయింది:—''అప్పు

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

డామె స్థితిలోని యణువునకును, రస జగత్తును దాటిన యునికి లేదు. ఆమె మనస్సులో మీనాక్షి లేదు. అది మీనాక్షి యుల్లని లేదు. తా నెవరో కూడ లేదు. తానున్నది రస జగత్తు. ఆమె నాయిక. అందులో వాసక సజ్జిక నాయకుని కొర కెదురు చూచుచున్నది.'' అవ్యక్తము వ్యక్తముతో గలియుటే, స్వప్న జాగ్రదావస్థల ఏకీకరణమే రసజగత్తు. ఏకవీర ఈ స్థితిలోనుండగా 'కలాపము'లో కృష్ణుడు ప్రవేశించుట, ఏకవీర ఉన్న గదిలో వీరభూపతి ప్రవేశించుట, ఒక్కసారే జరిగింది. ఆరేండ్ల క్రితం వారి చూపులు కలిపిన నిమేషమునకూ యిప్పుడు మరల చూపులు కలిసిన నిమేషమునకు 'వారి యిర్వురి మనస్సులో వ్యవధి తోచెను.' ఇక్కడ క్షణము అనంతమైంది. కాలమే లయించి పోయింది. వీరభూపతి కౌగలించుకోనగానే ఏకవీర చైతన్యము సమాధ్యవస్థ పొందింది. ఇక్కడ విశ్వనాథ రచన ధ్వనినే ఆశ్రయించింది : ''ఆమెకు భూమధ్య రేఖా ప్రాంతస్థుని ఉత్తర ధ్రువ సమీపమున కొక్కసారి కొనిపోయి నట్లయ్యెను.'' కుండలిని మేల్కొని ఊర్ధ్వముఖియైనదని ధ్వని......''హృదయమునుండి ధ్వని రీతి వచ్చిన గాలి ఆమె కంఠమందు స్తంభించిపోయెను'' కుండలిని అనాహత (హృదయము) చక్రం దాటి విశుద్ధ (కంఠం) చక్రాన్ని తాకిన దనుట. ''ఆమెకు హృదయ సంచలనమునందు మాత్రమే స్థితి. తక్కిన సర్వాణువులయందు ప్రళయము. చక్షుశ్శ్రోత్ర జిహ్వా ఘ్రాణేంద్రియ జ్ఞానమంతయు త్వగింద్రియమంద లీనమై ఆ స్పర్శ గుణ మతిక్రాంత మర్యాదయై 'ఆమె' యన్న పదార్థ వాచ్యమైన సర్వమునందు నిండినది.'' ఇది సమాధ్యవస్థకు లక్షణము. ఏకవీర ప్రేమ తపస్సు యిలా యోగముగా ఫలించింది.

తర్వాత మళ్లీ యథాస్థితి. ఏకవీరకు సర్వవిషయమూ తెలియజెప్ప బడింది. తెల్లవారింది. ''సూర్య భగవాను డెఱ్ఱని నిప్పులు గ్రక్కుచున్నాడు'' సూర్యుడు కర్మసాక్షి. ''ఏకవీరకు భయమై కన్నులు మూసికొన్నది. తన దేహమందు, ప్రత్యణువునందు వీరభూపతి స్పర్శ సుఖ చిహ్నములు ముద్రితములైనట్లు తోచినదామెకు. కనులు తెఱచినది. ఎదురుగా గుఱ్ఱపువాళ్ల పిల్ల యమృతము నిలుచున్నది... దాని కన్నులెఱ్ఱగా నున్నవి. ఇంతకు ముందా తూరుపు దూరాన దోచిన సూర్యబింబ మా పిల్లగా దనదగ్గరకు వచ్చినట్లున్నదామెకు.'' సూర్యుడు ఏకవీర ఉల్లంఘించిన వ్యవస్థా ధర్మానికీ, అమృతము. ఆ ధర్మాన్ని ప్రబోధించేసే ఆమె అంతరాత్మ. (Moral Conscience) కూ ప్రతీకలు. మనస్సులో చెలరేగిన ఈ ధర్మ జిజ్ఞాసకు ఏక వీర తాళలేక పోయింది. అంతలో ధర్మా ధర్మ వివక్షకు అతీతమైన తత్వం మళ్లీ ఆమెను స్పృశించటంతో ఆమెలోని ధర్మజిజ్ఞాస పర్యవసించి రాబర్ట్సనోబిలితో ఆధ్యాత్మిక వినాదముగా బహిర్గతమైంది. ''సర్వధర్మాన్ పరిత్యాజ్యమమ ఏకం శరణం వ్రజ.'' ఏకవీర, లోకమునూ లోక ధర్మాన్ని వదలి వైగై వైపు నడిచింది. ''పరమేశ్వర జటావివరాగ్రవినిస్సృత యగు గంగానది మధురా సమీపమున వైగై నది యైనదట.'' వైగై పరమేశ్వరుని నుండి విడివడిన శక్తికి ప్రతీక. కథా ప్రారంభము మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణోదంతముతో, 'వైగై' అవతరణంతో జరిగింది, కథ ముగింపు ఏకవీర 'వైగై' లో లీనమగుటతో.

ఏకవీర వెంట కుట్టాను పరుగెత్తినాడు. ఏకవీర ద్వంద్వాతీతమైన తత్త్వ దర్శనమునకు ప్రతీక అయినచో కుట్టాన్ వ్యవస్థా ధర్మమునకు ప్రతినిధి. వ్యవస్థా ధర్మము తత్త్వమును పట్టుకోవలెననే ప్రయత్నిస్తుంది. కాని ఫలితం? కుట్టాన్ ఆమెను నీటిలో బడకుండా కౌగలించుకోగా ''ఆ రక్తమంతయు మృత్యు స్పర్శమునకలుగు శైత్యమునలవరించుకొన్నది... ఆమెలో నాడి నిలిచి పోయెను. కుట్టాన్‌నునకు ప్రబోధము కలిగెను. తన కౌగిలిలోని నిర్జీవ పదార్థమతడు వెనుకకు ద్రోసెను.'' కుట్టాన్ స్పర్శయే ఏకవీరకు మృత్యు స్పర్శగా పరిణమించిందట! కేవలం వ్యవస్థాగతమైన ధర్మంతో తత్వ నిరూపణ జరుగదు అనిధ్వని. లోక ధర్మానికీ వ్యక్తి ధర్మానికీ సంఘర్షణ తీవ్రం కావటమొక తపస్సు, ఆ తపస్సు ఫలిస్తే యోగసిద్ధి, ద్వంద్వాతీతమైన తత్త్వదర్శనము. తత్త్వ దర్శనం చేసిన వ్యక్తి లోక వ్యవహారము పట్ల తటస్థుడు, విరాగి. వీరభూపతి సన్న్యాసం అందుకే, కాని అది కుట్టాన్‌కు అర్థం కాదు: కుట్టాన్ వ్యవస్థా ధర్మబద్ధుడు.

'ఏకవీర నవల చివరి మూడు అధ్యాయాలూ ఉత్తమ కవిత్వం. ఔచిత్యము, మనస్తత్వ చిత్రణము, శాస్త్ర పరిజ్ఞానము తాత్త్వికదృష్టి, ధ్వనీ—ఇవి పరిపుష్టంగా ఉన్న రచన; ఈస్థాయిలో వచన కవిత్వం, అసలు ఇంతకంటె కవిత్వమే, విశ్వనాథ తర్వాత వ్రాయలేదంటే అతిశయోక్తి కాదేమో!

'ఏకవీర' నవలలో విశ్వనాథ వివాహవ్యవస్థనూ సమర్థించలేదు, వైయక్తిక ధర్మమైన వలపునూ సమర్థించలేదు. రెండింటికీ అతీతమైన సమన్వయాన్నే ప్రతిపాదించారు. అదే హైందవ సంప్రదాయం యొక్క మూల సూత్రంగా సూచించారు. ఆ నాటి వంగ సాహిత్యప్రభావం దృష్ట్యా విశ్వనాథ త్రొక్కిన త్రోవ ఉత్కృష్టమైనది, విశిష్టమైనది. వంగ భాషలో బంకిం చంద్రుని నవలలు వ్యవస్థా ధర్మాన్ని సమర్థించేవి, రవీంద్రుని వంటి బ్రాహ్మసమాజకులు వైయక్తిక ధర్మాన్ని, రొమాంటిసిజమ్ ద్వారా సమర్థిస్తున్నట్లు రాయప్రోలు, కృష్ణ శాస్త్రి వేంకట పార్వతీశ్వరుల రచనలద్వారా వ్యక్తమైంది. విశ్వనాథ ఈ రెండు ధోరణుల్నీ విమర్శించారు 'ఏకవీర' సృష్టిలో. ఉదాహరణకు: ''శృంగారరసము భగవంతుని జెప్పినపుడాలంబన విభావము (కృష్ణునితోపాటు) సత్యభామయగుచున్నదని తెలిసికొనుట తేలికగాదు. వంగదేశ కవులు జయదేవ విద్యాపతులు రాధ కావదవి గట్టి పెట్టిరి. ఆ శృంగారము చైతన్యుని తన్మయత్వము ధ్వనించునుగాని శంకరుని విజ్ఞానమునుధ్వనించదు. సిద్ధేంద్ర యోగి జయదేవవిద్యాపతులవలె భక్తుడు కాదు. యోగి, జ్ఞాని.'' రాధ వైయక్తిక ధర్మమైన వలపునకు ప్రతినిధి; రుక్మిణి వ్యవస్థాధర్మమైన పత్నీత్వమునకు ప్రతినిధి; ఈ రెండింటికి సమన్వయమూ సత్యభామ—అని విశ్వనాథ అభిప్రాయం. ఆ సమన్వయమేమిటో చిత్రించటానికే ఏకవీర పాత్ర సృష్టి.

నిజానికి రవీంద్రుడుకూడ ఇటువంటి సమన్వయం కోసమే క్రమంగా ఉన్ముఖుడౌతూ వచ్చాడు. ఆయన బ్రాహ్మమతం నుంచీ హైందవ సంప్రదాయం వైపు, దాని మూలసూత్రాల వైపూ వేసిన అడుగులే 'నౌకాభంగము', (The wreck) 'గోరా' నవలలు. 'ఏకవీర' తో పోల్చదగిన నవల 'నౌకాభంగము'. అందులో భావనాత్మకప్రేమ (Romantic love) కంటే హిందూ వివాహ వ్యవస్థ శక్తివంత మైనదంటూ నిరూపించేందుకు రవీంద్రుడు చేసిన ప్రయత్నం ఎంత అస్తవ్యస్తంగా పరిణమించిందో, తర్కిస్తే విశదమౌతుంది. 'ఏకవీర' యొక్క తాత్త్వికమైన పటిమ దానికి లేదు. 'ఏకవీర' కావ్యమైన నవల.

'ఏకవీర' లో నిరూపించబడినది హైందవ వ్యవస్థ కాదు. అవిచ్ఛిన్నమైన హైందవ సంప్రదాయానికి మౌలికమైన తత్త్వమేదో . అదే సూచింపబడింది. ఏకవీర నోబిలితో అన్న మాటలు: ''వాదమునకు పై వాదమెపుడునున్నది. తీవ్రతర వాది వచ్చినపుడు లొంగిపోవు సిద్ధాంతములు ప్రతిపాదించి ఏమి. ప్రతిపాదించక ఏమి? ... నేడొక వందమంది నీ మతస్థులైరి రేపు నీ తలదన్నినవాని మాటచే వారు వాని మతమవలంబింతురు. ఇది వృథాప్రయాస. మహా విజ్ఞాని తన మోక్షము తాను సాధించుకొనును. సనాతన ధర్మము యుగముల తరబడి నిలచినది. వాదములూ వ్యవస్థలూ కాలానుగతములు; వాదములకు పై వాదములు, వ్యవస్థకు మించిన వ్యవస్థ ఉండటం సాధ్యం. సనాతనధర్మము వీనికతీతమైనది. కాలాతీతమైనది. వ్యవస్థా ధర్మానికీ, వ్యక్తి ధర్మానికీ ఏర్పడే సంఘర్షణలో, దేనివైపూ మొగ్గక రెండింటినీ అధిగమించిన సమన్వయాన్ని సాధించటంతో ద్వంద్వాతీతమైన తత్త్వాన్నిదర్శించటం జరుగుతుంది. ఆ తత్త్వమే సనాతన ధర్మము. అది కేవలం వ్యక్తిగతమైన సాధన, సామూహికమైనది కాదు—క్రమంగా విస్తృతమూ వివిధమూ అయిన హైందవ సంప్రదాయము యొక్క స్వరూపమిదే.''2 'ఏకవీర'లో వ్యక్తమైన ఈ దృక్పథమే, విశ్వనాథలో ఇదేస్థాయిలో, ఎప్పుడూ ఉండినట్లయితే, ఈ వరవడిలోనే ఆయన సాహిత్య కృషి తర్వాత కూడా సాగినట్లయితే, పేచీయే ఉండేదికాదు. కాని అలా జరుగలేదు!

'ఏకవీర' లో విశ్వనాథ చేసిన ఉత్తమ రచనలోనే, వ్యగ్రత కనిపించే పట్టులొకటి రెండున్నాయి. ''అతని (భామవేషము) అభినయమునకు సర్వవిద్యలకు జన్మ స్థానమైన బీజాక్షర రూపమున దామ విగ్రహమున నావేశించియున్న శివుడు, నాదతనుడు, సుందరేశ్వస్వామి పులకితుడై కనులు తెఱచి చూచుచుండెను. మీనాక్షీదేవి కూడ ముగ్ధయై యతని వంక జూచుచుండెను..... కన్నులు విచ్చి చూచుచున్న సుందరేశ్వరుని కంటి వేడిమికిపూజారి చేతి చామరము మండి పోయినది. పూజారి చాకలివాని చేతి కాగడా యంటు కొన్నదని వానిని గోపబడినాడు.'' అప్రత్యక్షము అలౌకికమునైన విషయము మనోగతమైనది ఒకవైపు, ప్రత్యక్షము లౌకికమునైన బాహ్యవర్తనము మరొకవైపు, ఈ రెండింటి మధ్య గల సంబంధాన్ని గూర్చిన తత్త్వనిరూపణం ఏకవీర పాత్ర ద్వారా జాగరూకతతో చేయుచున్న కవి ఇక్కడ తన కర్తవ్యమును విస్మరించటం కాకపోతే పై వాక్య......ల అన్వయమూ ఔచిత్యమేమిటి? దామ విగ్రహమూ, భామవేషాభినయము లౌకికమైనవి, విగ్రహము 'కన్ను తెఱచి చూచుట', 'ఆ కన్నుల వేడిమికి 'చామరము మండుట' లౌకికముగ అసంభవం...కాదు సంభవమే, అది దేవుని మహిమ అని వాదిస్తే ఆ 'మహిమ'కు సందర్భశుద్ధి, ఔచిత్యము లేదు అని చెప్పాలి. పోతే ఈ వర్ణన అప్రత్యక్షము అలౌకికమైన దానికి ప్రతీక మాత్రమే అంటే ప్రతీక కూడా ఇక్కడ సంభావ్యమైన లౌకికవర్తనంగానే ఉండటం అవసరం. ఏమంటే ఇది నవలకాని పురాణం కాదు! అందువల్ల ఏవిధంగా చూచినా పై వాక్యాలలో కనిపించేది తొట్రుపాటే అనుకోవాలి. ఏకవీర రాబర్టునోబిలితో వాదప్రతి వాదములు చేసిన తర్వాత ఆమె అన్న చివరి మాటలు: ''వాదమునకు పై వాదమెపుడునున్నది... మహావిజ్ఞానఖని తన మోక్షము తాను సాధించుకొనును''....శిరోధార్యములు. కాని ఈ పట్టున విశ్వనాథ ఆసక్తి ఏకవీర తత్త్వ దర్శనము మీదకంటె ఆమె పరమత ఖండనము చేసి విజయము సాధించుటమీదే ఎక్కువగా నిలిచినదేమో అనుటకు తార్కాణమైన వాక్యాలు: ''చాలనాళ్లగా దేవునికొక సంకల్పమున్నది. ఆ నాటి నాటక ప్రదర్శనమువలన స్వామి యా సంకల్పముత్తేజితమైనది. ఏకవీర కన్నులు భగవంతుని కన్నులతో గలిసెను. స్వామి యా చూపువెంట నామెలో ప్రవేశించెను. ఏకవీర భగవంతుని ప్రవేశభారమునకాగలేక మూర్ఛ

---

2 "Hinduism is therefore not a definite dogmatic creed, but a vast, complex, but subtly unified mass of spiritual thought and realisation. Its tradition of the god-ward endeavour of the human spirit has been continuously enlarging through the ages.

The dialectic of religious advance through tradition, logic and life helps the conservation of Hinduism by providing scope for change. We rise from life to thought and return from thought to life in a progressive enrichment which is the attainment of ever higher levels of reality. Tradition is something which is for ever being worked out anew and recreated by the free activity of its bollowers. What is built forever is for ever building. If a tradition does not grow, it only means that its followers have become spiritually dead. Throughout the History of Hinduism the leaders of thought and practice have been continualy busy experimenting with new forms, developing new ideals to suit new conditions." (The Hindu View of Life: Dr. S. Radhakrishnan)

బోయినది. స్వామి విగ్రహము పూజారులచటనుండి కదల్పలేక పోయిరి. ద్వంద్వాతీతమైన తత్త్వమునకు సుందరేశ్వర స్వామి ప్రతీకమైనచో, ఆ తత్త్వ దర్శనమున ఏకవీర ఉత్తేజితయై పరమతఖండనమునకు బూను కొన్నదని చెప్పుటే ఉద్దేశమైనచో అందుకు పై వాక్యములు సరియైనవిగా తోచుటలేదు. స్వామికి చాల నాళ్లుగా సంకల్పముండుట ఏమిటి? స్వామి విగ్రహమును పూజారులు కదల్చలేక పోవుట ఏమిటి? ఈ 'మహిమ' వల్ల సాధించిన విశేషమేమిటి? సూచించిన శాస్త్రార్థమేమిటి? ఇది మతావేశము చేయు కల్పన, చెప్పుచున్న తాత్త్విక విషయమును వదలి దాని ప్రతీకపై రచయిత వ్యామోహపడినట్లు సూచించు రచన. నేలవిడచిన సాము.

'ఏకవీర'లో ఉన్నదో లేదో అన్నట్లు తోచిన ఈ మబ్బు జీర క్రమంగా ప్రస్ఫుటమై పెద్దదై విశ్వనాథ దృక్పథంయొక్క విశాల గగన నీలిమను ఆహరించింది. ఫలితం, తర్వాత ఆయన తత్త్వాన్ని వదలి ప్రతీకను, ద్వంద్వాతీతమైన సనాతన ధర్మం కంటె ఎక్కువగా ద్వంద్వంలో ఒకటైన వ్యవస్థా ధర్మాన్నే సమర్థిస్తూ వచ్చారు. 'ఏకవీర' తర్వాత వ్రాసిన నవలల్లో వ్యవస్థా ధర్మమే సనాతన ధర్మమని, అపోహ కలిగించేంత మేర తన దృక్పథం మార్చుకున్నారు. అందుకు ముఖ్య హేతువులు : (1) తన ఆ భౌతిక దర్శనా శక్తితో హైందవ వ్యవస్థా ధర్మాన్నీ, దాని ప్రయోజనాన్ని అవగాహన చేసుకొన్న విశ్వనాథ ఆ వ్యవస్థను ప్రేమించటమేకాదు, దాన్ని గూర్చి ఒక 'రొమాంటిక్' వ్యామోహం (Romantic passion) లో పడిపోయారు. అందుకు బాగా దోహదం చేసినది ఆ వ్యవస్థయొక్క క్షీణ దశ. ఆ వ్యవస ను సమర్థించటమే ఆయనకు ప్రథమ కర్తవ్యంగా తోచింది. ఆ వ్యవస్థ కాల నిర్జితమౌతున్న ఒకానొక సాధనము మాత్రమేననీ, దాని గమ్యమైన తత్త్వము అంతకంటె ముఖ్యం కాబట్టి ప్రాతను వర్జించి క్రొత్త సాధనము నిర్మించటమే కర్తవ్యమనీ ఆయన ఆలోచించలేదు. అలా ఆలోచించేందుకు ఆయనకు అవకాశంలేదు అప్పట్లో. (2) తెలుగు దేశంలో ముఖ్యంగా సాహిత్యంలో అప్పుడు పొడసూపిన హేతువాదమూ, భౌతికవాదమూ, పురాణాల అవహేళనా, వర్ణ విభేద నిరసనమూ మొదలైనవి విశ్వనాథలో కలిగించిన ఆవేశమే మరొక కారణం. పాశ్చాత్య నాగరకతా ప్రభావమూ, పరదేశీయుల రాజకీయ, సాంఘిక, ఆర్థిక వ్యవస్థ దేశంలో అనాలోచితంగా అంటు త్రొక్కబడుతూ ఉండటమూ, హిందూ వ్యవస్థ క్షీషిణదశకు కారణాలుగా కనిపించాయి కాబట్టి, స్వమత రక్షణము, పరమత ఖండనమే ఆయనకు కర్తవ్యంగా తోచింది. అందుకు దీక్ష వహించిన విశ్వనాథ సనాతన ధర్మాన్ని ప్రకాశం చెయ్యటంకంటె స్వపక్ష సమర్థనమే, వ్యవస్థా ధర్మ ప్రబోధమే సాహిత్యానికి ప్రయోజనంగా భావించారు. (3) "శక్తి చచ్చిపోయిన జాతికి మహా జీవవంతమైన యొక సంస్థ వెగటనిపించును. "(వేయి పడగల) వ్యవస్థ క్షీణించటం చూచిన విశ్వనాథ తన జాతిలో శక్తి కూడా క్షీణించిందని భ్రమించారు. వ్యవస్థనూ, దాని ధర్మాన్నీ అర్థం చేసుకోలేని వాళ్లు దాన్ని అధిగమించి తత్త్వ దర్శనం చెయ్యటమంటే ఏమిటో తెలుసుకోగలుగుతారా? అన్న సందేహంలో పడి, అలాంటివారికి వ్యవస్థా ధర్మాన్ని నొక్కి చెప్పటమే ముఖ్యమన్న నిర్ణయానికి వచ్చారు. జాతి శక్తిని గూర్చిన ఈ అపోహ విశ్వనాథ స్వభావంలో ఒక భాగం. సాహిత్య రంగాన్ని సమర రంగంగా దర్శించిన విశ్వనాథ పై అపోహకు అనుగుణంగా తన వ్యూహ రచన (Strategy) సాగించారు. కాని సాహిత్యం యుద్ధరంగమూకాదు. దాని ప్రయోజనం తాత్కాలికమూకాదు! (4) పై జెప్పిన పరిస్థితులూ కారణాలూకాక అంతకంటె ముఖ్యమైనది విశ్వనాథ వ్యక్తిత్వమే. "నే నొక విపరీత ప్రకృతిని. నాకు నీ లోక మార్గమునకు లగించునట్లులేదు. నాకీనాటి ప్రతి విషయము పేదవాని ప్రాణమునకు విరోధముగా, సత్యమునకు విరోధముగా గనపడుచున్నది. ఇది నా మనసులో నున్న దోషమేమో తెలియదు. నేను మరల గొన్నాళ్లూహించవలెను" 'వేయి పడగల'లో ఒక పాత్ర ద్వారా పలికించిన ఈ వాక్యాలు విశ్వనాథ తన మనస్స్థితిని గూర్చి పలికినవే. 'వేయి పడగలు' ఆ మనస్స్థితిని ప్రతిబింబించే నవల. (సశేషం)



కథాసాహిత్యం :

దేశీయత - వాస్తవికత

"మ ధు"

చక్రపాణిగారితో నాకున్న పరిచయం కొద్దిపాటిది! ఆయన అసలుసిసలైన నిరాశావాది అని పలువురు చెప్పుకోగా విన్నాను. అలాంటి వాళ్లకెంత దూరంగా ఉంటే అంత మంచిదన్న అభిప్రాయం నాది! పదేళ్ల క్రిందటి మాట. ఓ పెద్దమనిషి నన్నాయనకు పరిచయం చేస్తూ "చక్రపాణిగారూ! బహుశా మీరూ చూచే ఉంటారు. ఇతని కథలు ఈ మధ్య పత్రికల్లో పడుతున్నాయి" అన్నాడు. "అలాగా! ఈ అబ్బాయి కథలు వ్రాస్తున్నాడా?" అన్నారు చక్రపాణిగారు! అప్పటికి నేనేమో చేయరాని (లేని) పనిచేస్తున్నట్లు వరహీనపు పెళ్లికొడుకును చూచి పెళ్లిపెద్దలు జాలి పడినట్లు, తన ఆమోదంకోసం ఎదురు చూడకుండా ఓ వ్యక్తి రచనా వ్యాసంగం సాగించడం అదొక మహాపరాధమైనట్లు ఇంకా రకరకాలుగా భాసించిన ఆ భావ ప్రకటన ఇంకా నాకు జ్ఞాపకం ఉంది. రాజ్యాంగ చట్టరీత్యా రచనా స్వాతంత్ర్యం భారత పౌరుల్లో ఏ ఒక్కరికీ నిషేధింపబడలేదు. అందుకు అక్షరాస్యుడై ఉండి తీరాలన్న నిర్బంధమైనా లేదు.) ఈపాటి స్వల్ప విషయం చక్రపాణిగారికి తెలియదని ఎలా అనుకోగలను? అలాగని రాజకీయాలు, సంఘ సంస్కరణలు మున్నగు కలకువించిన విషయాలను గురించి 'వ్రాసి నేను రచనా స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగమేమీ చేయలేదు కదా! నేను వ్రాసేది స్వచ్ఛమైన కథలు. లోకం సందేహ ప్రాణులకు నిలయం. ఎటు పోయి ఎటు వస్తుందోనని అభాగిని, తప్పెవరిది, దైవోపహతులు అంటూ పాఠకులకు చాలా 'ఫేవరేట్'గా ఉన్న డజన్ పేర్లలో ఏ పేరును ఎన్నుకున్నా, దాని క్రింద కథ అనో, కథానిక అనో కుండలీకరణాల బందోబస్తుతోసహా నేనుదహ ంచడానికి మరచిపోయినట్టు నా శత్రువులైనా వాకొనలేరు. అప్పటికైనా సంతృప్తినొందక కథా ప్రారంభంలో నాందిగా నైతేనేమి, కథాంతంలో భరత వాక్యంగా నైతేనేమి 'ఈ కథలోని పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితం' అని ఉటంకించడానికైనా నేను బద్ధకించినవాణ్ణిగాను. "బొత్తిగా ఆధారమన్న మాట లేకుండా ఇంతటి సుదీర్ఘమైన రచనలు చేయగలగడం అసామాన్యమైన విషయ"మని పాఠకులు వ్రాసే ఉత్తరాలు నాకెంతైనా ఆనందం కలిగిస్తాయి! కానీ అలాంటి బుద్ధిమంతులైన పాఠకుల్లో సైతం పానకంలో పుడకల్లాగా ఒకరిద్దరు సంశయాత్ములుండడం మిక్కిలి శోచనీయమైన విషయం! ఒకాయన వ్రాశాడుగదా— "మీ కథలోని పాత్రలు, సంఘటనలు కేవలం కల్పితమన్నారు! చాలా బాగుంది. అంతవరకూ నేనూ మీతో ఏకీభవించకుండా ఉండలేను. కానైతే ఒక చిన్న సందేహం! కథలో ఒకచోట 'కాకినాడ' అన్నారు. ఈ కాకినాడ గూడ కల్పితమా, లేక అది మనం నివసిస్తున్న ఆంధ్రప్రదేశంలోని ఒక పట్టణమా?" అంటూ అభినందన లేఖకు ఆయన ఓ చొప్పదంటు ప్రశ్నను జతచేసి పంపారు. "పిచ్చి కుదిరింది. రోకలి తలకు చుట్టండి' అన్న సామెత బహుశా ఇలాంటి వాళ్లకోసమే పుట్టిందేమో! కాకపోతే కథ అడివిలోగానీ, అంతర్మథ్యంలోగానీ జరగదుగదా! అది జరగడానికి ఊరంటూ ఒకటి అవసరం గదా! అది కాకినాడైతేనేమి! కాశీ నగరమైతే నేమి?

చెప్ప వచ్చింది చక్రపాణిగారిని గురించి. క్రొత్త రచయితలు పెక్కుమంది వ్రాయడం సాధ్యమేనని నిరూపిస్తున్న ఈ రోజుల్లో వ్రాయకుండా ఉండడంగూడా సాధ్యమేనని నిరూపించిన పాత రచయిత చక్రపాణిగారు. అంతకు మించిన ప్రత్యేకత ఆయనలో కానరాదు. వాళ్ళా వీళ్ళా చెప్పుకోగా వినడమేగానీ ఆయన రచనల్ని స్వయంగా తిలకించే అదృష్టం నాకేన్నడూ కలగలేదు. సంవత్సరాని కొకటి రెండు సార్లయినా రచనలద్వారా తన సజీవత్వాన్ని 'రెన్యూ' చేయించుకోని రచయిత పాఠకుల స్మృతిపథంలోనుంచీ మాసిపోవడంలో ఆశ్చర్యమేముంది? మహామహా బ్యాంకు చెక్కులే మూడు మాసాల వ్యవధిలో కాలదోషం పడుతుండగా ఇక పత్రికల్లో పడే రచన యొక్క ఆయుష్కాలం ఏ పాటిది?

దేశీయకత - వాస్తవికత

చక్రపాణిగారితో నా ప్రథమ పరిచయాన్ని గురించి చెప్పాను. ఆ తరవాతి పదేళ్లలో నా పట్ల ఆయనలో నెలకొని ఉండిన ముభావం సడలిపోవడానికే నిండుగా మూడేండ్లు పట్టింది. ఆ పైన చిరునవ్వుల యుగం ప్రారంభమైంది. అటు పిమ్మట ఇటీవలిదాకా ముక్తసరిగా పలకరింపుల పీరియడ్ కొనసాగింది. ఇప్పుడిప్పుడు రోడ్డుపైన ఎదురైతే కాసేపాగి పరామర్శించడంగూడా జరుపుతున్నారు చక్రపాణిగారు.

అప్పటికది గొప్ప పరిణామమే ననిపించింది. సరసం, విరసం కొరకేగావచ్చునన్న సందేహం నిన్న మొన్నటిదాకా కలిగింది గాదు.

రెండు మాసాల క్రితం ఓ ఆదివారం రోజున చక్రపాణిగారికి నేనొంటరిగా పార్కులో తారసిల్లాను. ప్లాటుకోసం పార్కులో పచార్లు సలుపుతున్నారు కాబోలునని చూడగానే ఆయన ఓ ఛలోక్తి విసిరారు! "ప్లాటుకోసం పార్కులవెంట వీథులవెంట తిరగవలసిన అవసరం ఏముంది? హాయిగా ఇంట్లో మంచంపైన పడుకుని, ఏ పుస్తకం తిరగవేసినా ఓ ప్లాటు స్ఫురిస్తుంది. అలా కాదంటే ఎంతనాసి రకం సినిమాకు వెళ్లి కూర్చున్నా ఆట ఆఖరయ్యేసరికి నాలుగైదు కథలకు వస్తువు దొరుకుంది" అన్నాను.

"అలాగైతే మనం కథలకోసం పుస్తకాలపైన, సినిమాలపైన ఆధారపడుతున్నామన్నమాట! అంతేనా మధుసూధనం?" నింపాదిగా ప్రారంభించారు చక్రపాణిగారు— "కళను గురించిన ప్రాథమిక నిర్వచనాల్లో అది జీవితానికి ప్రతిబింబంగా ఉండాలన్న దొకటి. అలాగని అది జీవితానికి యథాతథమైన ఛాయా చిత్రంగా ఉండరాదని వెనువెంటనే ఓ సవరణ! రంగులతో హంగులతో మనోజ్ఞమైన చిత్రణ అవసరం. అందువల్ల జీవితం కంటే కళకొంత విభిన్నంగా, విలక్షణంగా ఉండక తప్పదు. పుట్టిన క్రొత్తలో మన ప్రబంధ నాయికలో ఈ లక్షణాలన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. కళ్లు కమలాలు. చెవులు శ్రీకారాలు. ముక్కు సంపెంగ పువ్వు. పాలిండ్లు అమృత కలశాలు. నడుముసన్నము. అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ వెనుకటి కవులు కళ్ల ఎదుట కనిపిస్తున్న మానవాంగనను విస్తరించి ఊహా ప్రపంచంలోని ప్రబంధ సుందరికే మెరుగులు దిద్దడంతో పోటీపడ్డారు. ఈ పరిణామం చివరికెక్కడికి దారి తీసిందో చెప్పనా మధుసూధనం! కళ్లు చెవులదాకా పాడవు సాగి ముఖం వికృతమైంది. పాలిండ్లు జంభా సురారి మదగజకుంభాలై పోయాయి. నడుము కంటికే కనిపించలేదు. ఆ వర్ణన ప్రకారం బొమ్మగీస్తే మానవాంగనమాట దేవుడెరుగు— అదొక పెద్ద రక్కసిలా తయారయ్యే ప్రమాదం ఏర్పడింది. ఇతివృత్తాలకు, వర్ణనలకు పుస్తకాలపైన, సినిమాలపైన ఆధారపడితే మన కథా సాహిత్యానికిగూడా అలాంటి ముప్పుతప్పదేమోనని నా సందేహం........."

ప్రమాదాలను శంకించడం నిరాశావాదుల స్వభావం!

చక్రపాణిగారి కుశంకల కన్నింటికీ నేను భయపడదలచుకోలేదు. ఆ మాటకొస్తే నేనాయన ప్రసంగాన్ని శ్రద్ధగా విననే లేదు!

కొంతసేపు మౌనం వహించిన తరువాత ఆయనే కొనసాగించాడు— "నీకో ఆశ్చర్యకరమైన వర్తమానం చెప్పనా మధుసూధనం! ఈ మధ్య నేను మళ్లీ కథలు వ్రాయాలన్న ధ్యాసలో పడ్డాను..........."

"భేషుగ్గా వ్రాయవచ్చు! తలచుకుంటే మీరు రోజుకో కథ వ్రాసి పారేయగలరు!"

"కానీ వచ్చిన చిక్కేమిటంటే మధుసూధనం— ఓ ప్రయాణికు డున్నాడనుకో! అతడు పరిగెడుతున్న రైల్లో గాఢంగా నిద్రపోయి లేచాడు. నిద్రలో ఉండగా ఎన్ని స్టేషనులు దాటిపోయాయో అతనికి తెలియదు. రైలెంతదూరం వచ్చిందో తెలియదు. ఏ ప్రాంతంలో పరుగిడుతోందో తెలియదు. రచయితనుగా నా పరిస్థితి గూడా అలాగే ఉంది. ఇటీవలి సాహిత్య విశేషాలు నాకు బొత్తిగా తెలియవు ......"

"తెలియకపోతేనేంలెండి మేష్టారూగారూ! చిటికెలో తెలుసుకోవచ్చు............"

"తెలియజెబుతావనేగదా నీ దగ్గర ఈ ప్రసక్తి తేవడం"!

అలాగైతే నాకామాత్రం పరిజ్ఞానమైనా ఉండదనేనా చక్రపాణిగారి అనుమానం! నిజం చెప్పొద్దూ, పనికిరాని విషయాల కన్నింటికీ చదరంగపుఎత్తులువేసే వాళ్లంటే నాకు ఒళ్లుమంట. ఈ ఆటలో నేను చక్రపాణిగారి దగ్గర ఓడి పోదలచుకోలేదు!

"మేష్టారుగారూ! సాహిత్య చరిత్రలో ఇది కథానికల యుగం! ఈనాడు కావ్యాలు లైబ్రరీ బీరువాలకు అలంకారాలుగా మాత్రమే పనికొస్తున్నాయి. ఛందస్సు నేర్చుకోడంవల్ల పరీక్షలో ఒకటి రెండు మార్కులు లభించడంకన్నా ఆశించదగ్గ గొప్ప ప్రయోజనమేమీ కనిపించదు. వచన కవిత్వమంటూ ఏమిటో వచ్చింది గానీ దాని పసదనం మరికొంత కాలం గడచిన తర్వాత గానీ అర్థమయ్యేటట్టు లేదు. ఇవి ప్రజల రోజులు. ప్రజలు మోజుపడి చదువుకుంటున్నవి కథలు, నవలలూ మాటేమిటని మీరడగవచ్చు! కానీ నన్నడిగితే కథకూ నవలకూ అట్టే భేదం లేదంటాను. తొండ ముదిరితే ఊసరవెల్లి కావడం లేదా, అలాగే కథను సాగదీస్తే అదే నవల! మరేమో నవలక్కు

'ఆ బ్రిడ్జిడ్ ఎడిషన్' కథ! అధమ పక్షం నెలకో వంద చొప్పున సంవత్సరానికి వెయ్యికి పైగా కథలు సృష్టించబడుతున్నాయి. వసంతంలో పువ్వులు పూసినట్టుగా, గ్రీష్మంలో ఎండలు కాసినట్టుగా దీపావళి పండుగకు కథల తిరణాల జరుగుతుంది. పోటీలో గెలుపొందిన కథానికకు పదానికి పావలా చొప్పున గిట్టుబాటవుతుంది. కథలు వ్రాయడం అప్రతిష్ఠగా భావింపబడుతున్న రోజులుగావు. మావాడు కథలు వ్రాస్తున్నాడని చెప్పుకోడం ఈనాడు గొప్ప............''

''బాగానే ఉందిగానీ మధుసూధనం— శైలి, శిల్పం జీవితచిత్రణ, ప్రయోజనం, మొదలైన వాటిని గురించి చెప్పవేం నువ్వు..............''

ఎక్కడికిపోగానీ చక్రపాణిగారి జేబులో ఎప్పుడూ కొన్ని వెలగకాయలు స్టాకుంటాయి— చర్చకు పూనుకున్న ఎదుటివాడి గొంతుకలో పడవేయడానికి.

అందుకే నేను చిక్కి బిక్కిరించదలచుకోలేదు!

''చూడండి మేష్టారుగారూ! నాకు నచ్చిన శైలి మీకు నచ్చక పోవచ్చు. నాకు ఉత్తమ శిల్పంగా గోచరించినది మీకు పరమ ఛండాలంగా కనిపించవచ్చు. ఇలాంటి విషయాల్లో ఎవరి నిర్ణయాలకు వాళ్లే రావడం మంచిది. అందుకే మీరొక పనిచేయడం సబబనిపిస్తుంది. వీలు చూచుకుని మీ అబ్బాయి నొకసారి మా ఇంటికి పంపండి. మచ్చుకు పత్రికలు కొన్ని పుస్తకాలు కొన్ని పంపుతాను. స్వయంగా మీరే పరిశీలించవచ్చు'' అన్నాను.

అన్నానేగానీ నా సలహా ఆయనకు రుచిస్తుందని అనుకోలేదు. రుచించినా రుచించకపోయినా నా అంతు తేల్చుకోదలచి పవాడికిమళ్లే చక్రపాణిగారు కుమారుణ్ణి నా దగ్గరికి పంపారు. ఒకటి రెండు పుస్తకాలే తెమ్మనుకుని 'ఇవ్వండి, ఇవ్వండి' అంటూ ఇంటి లోపలికి వచ్చిన ఆ కుర్రాడు గదిలో పడి ఉన్న పుస్తకాల గుట్టలు చూచి నిర్ఘాంతపడిపోయాడు. ఉన్నవాటిలో కొన్నింటిని మాత్రమే ఏరి రెండు పెద్ద కట్టలు తయారుచేశాను. దండిగా ఒక మనిషి మోతకు తక్కువగాలేని ఆ బరువు క్రింద కుర్రవాడి వెన్నెముక వంగిపోదన్న నమ్మకం కలిగింది గాదు. అందువల్ల పుస్తకాలతోసహా ఆ కుర్రవాణ్ణికూడా ఓ రిక్షాలోకి ఎక్కించి పరుగెడుతున్న రిక్షావైపు చూస్తూ ''చక్రపాణిగారూ! ఇసుక తక్కెడకు పేడ తక్కెడంటే ఏమిటో తెలుసుకొందురుగాక!'' అనుకున్నాను.

చక్రపాణిగారు తరువాత నాలుగు రోజులకే కనిపించారు. చదివారా అని అడిగాను. 'చదువుతున్నానన్నారు. మళ్లీ వారం రోజులకు మార్కెట్టులో కనిపించి ఇంకా చదవడం పూర్తి కాలేదన్నారు. రెండు నెలలు వేచి చూచినా అందుకు భిన్నమైన సమాధానం ఆయన దగ్గరనుంచీ లభ్యం కాలేదు. ఆఖరికొక రోజున ''మేష్టారుగారూ! మీ అభిప్రాయమేమిటో నేను తెలుసుకోక తప్పదు! మీ అంతటమీరు చెబితే సరే! లేదా నేనే మీ ఇంటికొచ్చి మీ అభిప్రాయం తెలుసుకునేదాకా అక్కడే కూర్చుని సత్యాగ్రహం చేయవలసి ఉంటుంది'' అంటూ అల్టిమేటమ్ జారీ చేశాను.

చక్రపాణిగారు అదోరకంగా నవ్వాడు.

ఆ నవ్వు కర్థమేమిటో అప్పుడు నాకు బోధపడిందిగాదు. మరునాటి సాయంకాలం ఇల్లు చేరుకున్న తర్వాత బోధపడింది! చక్రపాణిగారికి నేను పంపిన పుస్తకాలు ఆ పాటికి సురక్షితంగా తిరిగివచ్చి స్వస్థానం చేరుకున్నాయి. పుస్తకాలతో బాటుగా ఓ జాబుగూడా వచ్చింది—

''ప్రియమైన మధుసూధనం,

ముఖాముఖి మాట్లాడుతున్నప్పుడు మొగమాటంవల్ల నిష్కర్షమైన వాస్తవాలను బయటపెట్టడం సాధ్యం కాకపోవచ్చు. ముందుగా ఆలోచించుకోకుండా అశువుగా మాట్లాడడం వల్లఒకటి చెప్పబోయి మరొకటి చెప్పడంకూడా జరగవచ్చు. అందువల్ల నింపాదిగా కూర్చుని నాకు తోచిన నాలుగు ముక్కలు జాబులో వ్రాస్తున్నాను.

ప్రతి రంగంలోని అభివృద్ధినీ అంకెల్లోనూ, సంఖ్యల్లోనూ గణించి ఆనందించడానికి అలవాటుపడిన రోజులివి. సాహిత్య కేదారంలో కథల సాగుబడివల్ల లభ్యమౌతున్న పంట రాసినిబట్టి చూస్తే ఎవరికైనా అబ్బురమే కలుగుతుంది. రచయితల ఉత్సాహాన్ని అభినందించాలనే అనిపిస్తుంది. కానీ రచనా వ్యవసాయానికి కావలసింది ఉత్సాహమొక్కటేగాదు. మరికొన్ని దోహదాలుగూడా అవసరం. వాటిని సమకూర్చుకోడం పట్ల రచయితలకు శ్రద్ధ లోపించటం మిక్కిలి విచారకరమైన విషయమని మాత్రం చెప్పుకోక తప్పదు.

ఇది ఇంటింటా పత్రికలు విలసిల్లుతున్న కాలం. అబాల గోపాలమూ కథలు చదువుతున్న కాలం. ఇంతగా పఠనాభిరుచి ఎన్నడూ పెంపొందలేదన్న సత్యాన్ని ఎవ్వరూ కాదనలేరు. కానీ ఈ అవకాశాన్ని కథకులు ఎంతగా సద్వినియోగం చేసుకుంటున్నారన్నదే మనల్ని ఎదుర్కొంటున్న ప్రశ్న.

హుక్కా పీల్చవచ్చు. పేకాటలో కూర్చోవచ్చు. బద్ధకస్తులతో కలిసి బాతాఖానీకి పూనుకోవచ్చు. ఉబుసుపోక కోసం కథ చదివి తీరాలన్న నిర్బంధమేమీలేదు. హితముతో గూడినదే సాహి

దేశీయకత వాస్తవికత

త్యమైతే కాంతాసమ్మితంగా చెప్పేదే సాహిత్యమైతే, లోకానికి శ్రేయస్సును సంధానించేదే సాహిత్యమైతే ఆదికాలక్షేపానికి సాధన మనుకోడానికి మనసొప్పదు. ఉత్తమ చలనచిత్ర దర్శకులు కొందరు తాము తీసిన సినిమాలకు కావ్య గౌరవం లభించాలని ఆశిస్తారు. కథకునికి అలాంటి కోరిక ఎందుకుండదో నా కర్థం గాదు. సాహిత్య చరిత్రలో ఇది కథలయుగమన్నావు. సరే బాగుంది. అలాగైతే కాలానికి మారొడ్డి పదికాలలాపాటు నిలిచే గొప్ప కథానికలు కొన్ని కొన్ని ఈయుగంలో ఉద్భవించాలి గదా! ఇటీవల కొన్ని వాఙ్మయ చరిత్రలను పరిశీలించే అవకాశం నాకు కలిగింది. ఆ చరిత్రలో సగం మేరకు పురాణ కవిత్వానికే వినియోగమవుతోంది. పాతిక భాగాన్ని ప్రబంధా లాక్రమిస్తున్నాయి. మిగిలిన పాలికలో సరక వంతు తంజావూరు కవిత్వానికి సంక్రమిస్తున్నది. కాగా పోగా ఆధునిక సాహిత్యానికి మిగిలింది రెండణాల వాటా! ఈ చిన్న వాటాలో వీరేశలింగం దగ్గరనుంచీ గురజాడ అప్పారావు వరకూ పదిహేనుమంది దిగ్గజాలవంటి మహామహులను కూర్చోబెట్టి, ఆ పైన ఈనాటి మహా కావ్యాలకు, ఖండ కావ్యాలకు, భావ కవిత్వానికి అభ్యుదయ కవిత్వానికీ, నాటకాలకు నవలలకు చోటిచ్చి కథలదాకా వచ్చేసరికి మిగిలేది ఒక్క అరపేజీ మాత్రం! ఆ అరపేజీలో కనిపించేది ఒక చిన్న కథకుల జాబితా! రానున్న కాలంలో కథానికకు గొప్ప వికాసదశ ఒకటి ఉండి తీరుతుందన్న ఆశాభావమే గనుక లేకపోతే వాఙ్మయ చరిత్రలో కథలయుగానికి లభించి ఉన్న స్థానం గర్వింపదగినదేమీ కాదు.

గొప్ప వికాసదశ అన్నానుగదూ! అదెప్పుడు ప్రారంభమౌతుందో నేను చెప్పలేను. కానీ అందుకు ఇప్పుడు గాఢమైన ప్రయత్నాలు జరగడంలేదేమోనన్న విచారన్ని మాత్రం నిస్సంకోచంగా ప్రకటించగలను.

తిక్కనగారి కవిత్వమంటే, వేమన్నగారి పద్యాలంటే అప్పారావుగారి ముత్యాలసరాలంటే తెలుగువారికిష్టం. ఎందువల్లనంటావు మధుసూదనం? వాటిలో తెనుగుదనం ఉట్టిపడటంవల్ల! మన కథలంతా తెనుగుజాతి జీవితానికి దర్పణాలుగా ఉన్నాయా అని నేనడుగుతాను. సువిశాలమైనది ఆంధ్రదేశం. ఎడతెగని మహోద్యమానికి ఫలితంగా ముక్కోటి ఆంధ్రులూ ఒక కాపురంలోకి రావడం పదేళ్ల క్రిందటి సంఘటన. అదృష్టంకొద్దీ ఎప్పుడైన నాలుగైదు జిల్లాలగుండా రైల్లోనో, బస్సులోనో ప్రయాణంచేయడం తటస్థిస్తే కళ్ల ఎదుట నిజమైన తెనుగు దేశం ప్రత్యక్షమౌతుంది. పచ్చటి కొండ కోనలు, పచ్చికైనా మొలవని బోడిగుట్టలు, ఆహ్లాదం గొలిపే పంటభూములూ, భూసారాన్నంతా ఉప్పుదినిపోయిన చవిటి పర్రలు, జీవనదుల ప్రాంతంలో నవనాగరికతా సంరంభం, అడవి కొంపల్లో అజ్ఞానాంధకారం! ఎన్నో దృశ్యాలు మెరపుల్లా మెరసి మాయమౌతాయి. ఒక్కొక్క దృశ్యం హృదయస్థమై ఎంతకాలం గడచినా స్మృతిపథంనుంచీ మాసిపోదు. ఉదాహరణలు చెప్పనా మధుసూదనం! ఒకసారి నేను రైల్లో వెళ్తూ ఎర్రటి ఎండ ప్రొద్దున గుట్ట క్రింద చేలల్లో మనిషెత్తు పెరిగిన ప్రత్తిచెట్ల మధ్య ముఖాన క్రమ్ముకున్న చెమ్మటనైనా తుడుచుకోకుండా ఓపికగా ప్రత్తి కోసుకుంటూన్న ఓ పల్లెటూరి ఇల్లాలును చూచాను. ఇంకొకసారి రైలు అనంతపురంజిల్లాలో పరుగెడుతోంది. కనుచూపు ఆనినందాకా నల్లరేగడి పొలాలు పొడుగాటి నాగేటిచాళ్ల రైలు వేగంవల్ల గిర్రున వలయాలుగా తిరిగిపోతున్నట్లున్నాయి. సమయం మిట్టమధ్యాహ్నం. దాదాపు ఒకటి రెండు మైళ్లలో ఒకపూరుగానీ, కనీసం ఒక గానుక చెట్టయినా లేని ఆ నిర్జన ప్రదేశంలో ఓ బక్క రైతు మడక దున్నుకుంటున్నాడు. అలాంటి దృశ్యాలను మరచిపోదామన్నా మరచిపోగలమా మధుసూదనం! అసలు కాంతికీ చీకటికి ఈనాడు జరుగుతున్నంత ఘర్షణ ఏనాడు జరిగిందని! విద్యుచ్ఛక్తి వాడవాడలకు విస్తరిస్తోంది. ఎంత చిన్న పల్లెల్లోనైనా మచ్చుకైన సిమెంటు కట్టడాల్లో రేడియోల గానం వినవస్తోంది. నీటి పంపులు పాతాళగంగను పైకి తీసుకొస్తున్నాయి. చెరుకు గడలతో చూలాలవంటి లారీలు చక్కెర ఫ్యాక్టరీలకు పరుగెడుతున్నాయి. ఇదంతా ఒక కాంతిసముద్రమైతే ఇందులో ఎన్ని చీకటి దీవులు? పొట్టి గోడతో మట్టి దిన్నెలతో పూరి కప్పులతో ఈగలు ముసిరే పశువుల కొట్టాలతో పెంట దిబ్బల మధ్య మనుషులు పందులు సహజీవనం నెరపుతున్న కుగ్రామాలెన్ని? కోళ్ల గంపలతో, కుక్కల బలగంతో, కుండల సంచులతో మగవాళ్లకైతే గోచిపాతలు, ఆడవాళ్లకైతే చింకిపాతలు మినహా మరే ఆచ్ఛాదనమూ లేకుండా దేశం వెంట తిరిగే లేమిటి కుటుంబాలెన్ని? మరైతే ఈ యదార్థ జీవిత దృశ్యాలన్నీ మన కథా సాహిత్యంలో ఎందుకు ప్రతిబింబించడంలేదు? నిజానికి మధ్యాంధ్రంలో పొగాకు గిడ్డంగులలో పనిచేస్తున్న కార్మికుల జీవితం ఎలా గడుస్తున్నదీ నాకు తెలియదు. కడపజిల్లాలో చీనీ తోటలు పెంచే కర్షకుని స్థితిగతులను గురించి సర్కారు జిల్లాలవారికి తెలియదు. పోగా వాళ్ల పాలిటికీ వీళ్ల పాలిటికీ కూడా అలనాటి ఆఫ్రికా ఖండంలా అజ్ఞాత భూమి తెలంగాణా! ఆ మెదక్‌లో, ఆ నల్గొండలో, ఆ ఆదిలాబాదులో మనుషులు అన్నమే తిని బ్రతుకుతున్నారో, గాలే భోంచేసి బ్రతుకుతున్నారో మనకు తెలియదు. దిన పత్రికలుండబట్టి వార్తల మూలంగా కొంతకు కొంతైనా ప్రజాజీవనాన్ని గురించి తెలుసుకుంటున్నాముగానీ? అందుకోసం కథల్నే నమ్ముకుంటే మన

మొక కృత్రిమ ప్రపంచంలో పారవశ్యం పుచ్చుకోక తప్పదు. రాజమహేంద్రవరంలో పుట్టి, నెల్లూరులో ఆటలు పాటలు నేర్చుకుని విజయనగరంలో విపూత్నాలంకారాలు సంతరించుకుని.........అంటూ ఆంధ్రకవితా లతాంగిని అభివర్ణించడం పరిపాటి. తెలుగు కథానిక ఎక్కడ పుట్టిందో మనం నిక్కచ్చిగా చెప్పలేము. పెరిగింది మాత్రం మహాసాగర తీరంలో! అక్కడనుంచీ ఇటీవలే హైదరాబాద్ వెళ్ళింది. హైదరాబాద్‌నుంచీ అడపాదడపా విజయవాడకు, విశాఖకు వెళ్తుంది. అక్కడైనా ఆమె విహరించేది కాలేజి ప్రాంగణాల్లో మాత్రమే! లేదంటే మెల్లగా పేవ్‌మెంటు పైకి నడచివచ్చి అక్కడ బస్సెక్కి అబ్బాయివెంట, లేదా అమ్మాయివెంట వాళ్ళ ఇంటిదాకా వెళ్ళి సుమ సుకుమారి గావడంవల్ల కాబోలు అపాటికే అనురుసురైపోయి అక్కడే సొమ్మసిల్లిపోతుంది.

కథకు ఇతివృత్తం శరీరంలాంటిదైతే శైలిని వేషంతో ఉపమించవచ్చు. మొదట శైలి సంగతే చూద్దాము. ఏబదేళ్ళ క్రితం గ్రాంథిక భాషకు, వ్యావహారిక భాషకు పెద్ద ఎత్తున వచ్చిన తగాదాలో వ్యావహారికానికే విజయం లభించడం మనకు విదితమే! మరైతే ఈ వ్యావహారిక భాషలో ఉన్న సుగుణ మేమిటి ? ఇది ప్రజల రసనాగ్రాల్లో నృత్యం సలుపుతున్న జీవద్భాష కావడమే గదా ! అలాగైతే ఈ జీవద్భాషకు మన కథానిక లేమాత్రం న్యాయం చేకూరుస్తున్నాయని నేను నిన్ను ప్రశ్నిస్తున్నాను. ప్రాంతీయ విభేదాల కతీతంగా మన మొక శిష్ట వ్యావహారిక భాషను వాడుక చేస్తున్నాము. మంచిదే ! కానీ అలాగని రచయిత భాషకు పంచ ప్రాణాలవంటి ప్రాంతీయమైన పలుకుబళ్ళను విస్మరించవలసిన అగత్యం కనిపించదే ! విశ్వంగారు 'పెన్నేటి పాట' అన్న కావ్యం వ్రాశారు. నిబద్ది మనిషి, తిరణాలతోడు, లెక్కచిలేవరి, తల పేృటేగడం లాంటి ప్రాంతీయమైన వాడుకపదాలు అందులో దండిగా కనుపిస్తాయి. పెన్నేటిగట్టున ఉన్న పల్లెల బ్రతుకునీడ అందులో వర్ణితం గనుక అక్కడి ప్రజల భాష కావ్యంలో కనిపించడం భావ్యమని కావ్య రచయిత తలపోసి ఉంటారు. అదేం గ్రహచారమో గాని కథకుల్లో చాలామందికి అట్టి స్పృహ లీలగానైనా ఉన్నట్టు తోచదు. తన కథ సహజమైనదిగా తోపింపజేయాలన్న కోరిక రచయితకుంటే అతడు జీవద్భాషలో మణిపూసల వంటి నుడికారాల పట్ల ఉదాసీనత వహించలేడు. తన కథకూ, దేశకాల పరిస్థితులకూ సంబంధం లేదనుకుంటే—యిక సరేసరి, అతనికి మనం చెప్పగలిగిందేమీ లేదు.

పోగా శైలి కంటే ముందుగా చెప్పుకోవలసి ఉండినది 'వస్తువు' గనుక దాని సంగతి యిప్పుడు చూద్దాము—" మీకే సీజనులో కథ లెక్కువగా వస్తాయని నే నొకసారి ఒకానొక కథల పత్రిక సంపాదకవర్గంలో పనిచేస్తున్న మిత్రుణ్ణి అడిగాను. 'అదేమంత చిదంబర రహస్యం కాదే ! క్రొత్త సినిమా విడుదలైతే కార్యాలయపు రేవులో కథల ఓడ ఆగినట్లే ! దిగుమతయ్యే కథలన్నీ విడుదలైన సినిమా కథకు కార్బను కాపీలైతే అందుకు మేము పూచీదార్లంకాము' అన్నాడు మిత్రుడు. అతిశయోక్తి గావచ్చును గాక, కొంత నిజం ఉండకపోదని నా నమ్మకం. యువతీ యువకులు, కాలేజిలో నాటకాలు, ఉద్యానవనాల్లో యుగళగీతాలు, భగ్నప్రేమలు యివన్నీ సినిమా కథలో కవి సమయాలు. ఆ గాడివెంట గానుగ చక్రంలా చుట్టు దిరగడం ప్రారంభిస్తే మన కథానిక కింక యింపు సొంపు పెంపు చేకూరే దెప్పుడు ?

గోదావరిని గురించి వినని తెనుగువాళ్ళెవరు ? ఆమాట వింటే ప్రాణం లేచివచ్చినట్టుంటుంది. నూటి కొక రిద్దరు మినహాగా మిగిలినవారు గోదావరి నొకసారి కనులారా తిలకించే భాగ్యానికైనా నోచుకుని ఉండరు గనుక అసంఖ్యాకులైన ఆంధ్రుల పాలిటికి అది ఒక కల. గోదావరే ఒక కలైతే ఇక దానిపైన పడవ ప్రయాణం సంగతి చెప్పనే అక్కర్లేదు. పాఠకుల అదృష్టంకొద్దీ పాలగుమ్మి పద్మరాజుగా రొక కథ వ్రాశారు. 'గాలివాన' వ్రాసి తెలుగు కథకు అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చినందుకే గాదు, 'పడవ ప్రయాణం' వ్రాసి పాఠకుల హృదయాల్లో గోదావరిపైన పడవ ప్రయాణాన్ని గురించిన మధురానుభూతిని ప్రోదిచేసినందుకు గూడా ఆయన అభినందనీయులు. రాయలసీమ రాళ్ళసీమే నన్నది రూఢిగా ఉన్న ఒక అభిప్రాయం. ఆ రాయలసీమలో కొన్ని పల్లెటూళ్ళు అత్యద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి విడుదులని జమదగ్నిగా రొక కథ వ్రాసేదాకా చాలామందికి తెలియదేమో ! ఆ కథపేరు 'మరపురాని ఆ ఊరు'. మదనపల్లి దగ్గర ఓ చిన్న పల్లెటూరది ! ముగ్గురు కుర్రవాళ్ళు ఆ ఊరిచుట్టూ తిరగడమే కథలోని సారాంశం. ఐతేనేం, కథానిక మళ్ళీ మళ్ళీ చదివించే ఖండకావ్యంలా ఉండాలన్న సిద్ధంతానికి అదొక మచ్చుతునక. ఇంకొక కథ 'వీరకుంకుమ'. ఇరువదేళ్ళనాడు దేశంలో ఘోరంగా తిండికి కరువేర్పడింది. ప్రభుత్వం గంజి కేంద్రాలు ఏర్పాటు చేసింది. సరఫరా అయిన ఆహారధాన్యాలను మోతుబరులైన పెద కాపులే కాజేసి, ముంతలు చేత బట్టుకుని చింతచెట్ల నీడల క్రిందికి చేరిన బక్కవారికి గంజి అన్న పేరుతో ఉడుకునీళ్ళు వడ్డించారు. గంజితో పెదవులు తడి కాకమునుపే వడగాడ్పుల దెబ్బకు ముసలి ముతకలు కొందరు ఒళ్ళు చల్లబడగా కొయ్యబారిపోవడం జరిగింది. ఆ విషాదోదంతం దేశచరిత్రలోకి

దేశీయకత - వాస్తవికత

ఎక్కిందో లేదో నాకు తెలియదు. ఒకసారి 'వీరకుంకుమ' చదివితే గుండె జలదరిస్తుంది. ఒకనాటి దేశచరిత్రలో నుంచీ మలచుకున్న ఆ దివ్యశిల్పం పాఠకుల మానసాకాశంలో కలకాలం మెరుస్తుంది. ఏవీ ఎక్కడొస్తున్నాయి అలాంటి కథలు ? 'సిటీబస్సు తారురోడ్డుపైన పరుగిడుతోంది' అంటూ ప్రారంభమయ్యే కథలు నాకు వద్దు. 'పాపి కొండలమధ్య గోదావరి వడిగా ప్రవహిస్తోంది.' అంటూ ప్రారంభమయ్యే కథలు నాకు కావాలి. అలాగని నేను నగరాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నా ననుకోవద్దు. ఆంధ్రప్రదేశ విస్తీర్ణం కొన్ని వేల చదరపుమైళ్లయితే ఆ భూభాగమంతా గూడా కథానికకు విహారస్థలంగా ఉపకరించేదేనని నేను చెబుతాను. అందువల్ల ఓ పరిమిత వలయంలో గిరికీలు కొట్టవలసిన కక్కుర్తి మన కథానికకు లేదంటాను.

దేశంలాగే జీవితం గూడా ఎంతో వ్యాపకమైనది. ఎందరో కథకులు చేయి చేసుకోడంవల్ల కథావస్తువు తరిగిపోయిందని అనుకోవలసిన అగత్యం కనిపించదు. కేవలం ఒక్క వ్యక్తి సంపాదనపైనే ఆధారపడి పెద్ద పెద్ద సంసారాలు బతకవలసివున్న మన సమాజంలో కౌటుంబిక సమస్యలు దండిగానే ఉన్నాయి. ఒక్క కుటుంబ యజమాని దృష్ట్యా పరికిస్తే స్ఫురించేవాటిని మాత్రం పేర్కొంటాను. అప్పుల బాధలు, కొడుకుల్ని చదివించడంలో యిబ్బందులు, ఆడపిల్లలకు పెళ్లి కాక యిక్కట్లు మొదలైన సమస్యలు యిదివరకు పరామర్శింపబడినవే ! పోగా సంపాదిస్తున్న వ్యక్తిపైన కుటుంబంలో ఏ ఒక్కరికీ సానుభూతి లేకపోవడం, ఎవరికి వాళ్లు తమ అవసరాలు, సరదాలు తీరితే చాలుననుకోవడం, మాటిమాటికీ వెనకేసుకొచ్చి తల్లి ధూర్త సంతానాన్ని తండ్రి అజమాయిషీ నుంచి తప్పించడంలాంటి యితివృత్తాలు కుటుంబ యజమానిలో పుష్కలంగా ఉన్నాయి. అతిలోకమైన కథావస్తువు ఆధునిక కథానికకు పనికిరాదు. కానీ, వాస్తవికత ద్యోతకమైతే చాలదు, కథ ఆసక్తిజనకంగా గూడా ఉండాలి. మానవుడి సంఘజీవితానికి కుటుంబం కేంద్రబిందువైతే, దానినుంచీ గీసిన పెద్ద వర్తులమే సమాజం. ఆర్థిక, రాజకీయ సాంఘికాది రంగాల్లో వస్తున్న ప్రతి మార్పూ కుటుంబ వ్యవస్థపైన, సమాజ స్వరూపంపైన తన ప్రభావాన్ని నెరపుతోంది. అనవరత పరిశీలనానిరతిచేత రచయిత ఈ పరిణామగతిని ఆకళించుకోగలిగిన పక్షంలో అతడి కథకు ఎప్పటికప్పుడు క్రొంగ్రొత్త కథావస్తువు లభించకపోదు. రామారావు, ఎల్లయ్య, రాజేశ్వరి, పుల్లమ్మ అంటూ పాత్రలకు పేర్లు పెట్టి కథ హైదరాబాదులోనో, అనంతపురంలోనో జరిగినట్టు చెబితే అంతటితో దేశీయత, వాస్తవికత సాధింపబడినట్టు గాదు. ప్రతిమాట, ప్రతి వర్ణన, ప్రతి సంఘటన దేశీయతకు, వాస్తవికతకు దోహదం కలగజేయడంపైనే కథకుడి కృతకృత్యత ఆధారపడి ఉంటుంది. మన కథల్లో తెలుగు దుస్తులు తొడుక్కున్న బెంగాలీ పాత్రలు లేకపోలేదు. ఆమాటకొస్తే ఆ తెలుగు బెంగాలీ పాత్రలే కాస్త నయం ! ఈ లోకానికి సంబంధించిన ఈతిబాధలతోనూ ,జీవిత సమస్యలతోనూ జోక్యంలేకుండా అప్పుడే దివినుండి దిగివచ్చి భువిపైన గుడారాలు వేసుకుని తిండీ, నీళ్లూ గాకుండా ఆనందాలను, ఆదర్శాలను భోంచేస్తున్నట్టు కనిపించే విడ్డూరపు పాత్రలు గూడా అడపా దడపా తారసపడుతున్నాయి. మరికొన్ని కథల్లో మొదట చక్కగా ప్రేమించుకుని, తరువాత ఏవో ఖాళీ గలాటాలు కొనితెచ్చుకునే యువతీ యువకులైతే కనిపిస్తారు గానీ వాళ్ళ వెనుక నా అన్నవాళ్లతో గూడిన భగవత్సృష్టిగానీ, ఆ భగవత్సృష్టిలోని నరమానవులు కల్పించుకున్న సాంప్రదాయాలుగానీ లేశమాత్రంగా నైనా కనిపించవు. శూన్యంలో నిరాధార సేతువుల్లా వాళ్లెలా నిలిచి ఉండగలుగుతున్నారో ఊహించలేము ! పదింట తొమ్మిది వంతుల కథల్లో ఈనాడు కనిపిస్తున్న కాలేజీ వాతావరణాన్ని గురించే మాట్లాడుకుందాము.

వివాహ నిర్ణయాలు పై లోకంలో జరుగుతాయన్న గుడ్డి నమ్మకం మాట కేమిగానీ అవి ఈనాడు ఈ కళాశాల ప్రాకార కుడ్యాల మధ్యనే జరుగుతున్నా యనుకుందాం. ఐనా ఓ అబ్బాయి ఓ అమ్మాయిని ప్రేమించడంగానీ, ప్రేమించకపోవడంగానీ, పెళ్లాడడంగానీ పెళ్లాడకపోవడంగానీ వాటంతటవి మహత్తర పరిణామాలేవీ కావు. సామాజిక దృష్టికి పట్టాభిషేకం జరుగుతున్న ఈ కాలంలో ఆ పరిణామం కుటుంబంపైన, సమాజంపైన ఎలాంటి ప్రభావాన్ని నెరపిందన్న విషయమే ముఖ్యం. మధ్యతరగతి ఉద్యోగులకు, ఒకమాదిరిగా జరుగుబాటున్న రైతులకు కాలేజీ చదువులపైన వ్యామోహం ప్రబలింది. కుమారుడు తమను ఉద్ధరిస్తాడని కొందరు, తమ్ముళ్లను పైకి తీసుకొస్తాడని కొందరు, అతడు గొప్ప పదవిలో ఉండడం తమకు గర్వకారణమని కొందరు, ఇంకా రకరకాల కారణాలతో కాలేజి చదువులపైన డబ్బు దిమ్మరిస్తున్నారు అమ్మాయిని కట్టబెట్టాలన్న కోరికతో దగ్గరి బంధువు వందలు వేలు ఖర్చుచేసి చదివిస్తే, అతడి ఆశలు అడియాసలు చేసి విద్యార్థి వేరొక అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకునే ఉదంతాలెన్నో ఉన్నాయి. తన వ్యక్తిత్వంచుట్టూ అల్లుకున్న మమకారాలను పుటుక్కున త్రెంపి, ప్రేమ అన్న ఎండమావి వెంట

పరుగులుతీసి చివరికి ఆరని వేదనకు, తీరని వేసటకు గురయ్యే కళాశాల విద్యార్థి చిత్తప్రవృత్తి కథలో ఎందుకు చిత్రింప బడకూడదు? ఇంకొక హృదయవిదారకమైన వర్తమానం చెబుతాను. పుంజానంజా కలిసి పదెకరాలకన్నా ఎక్కువగాలేని రైతు కుటుంబం ఒకటి. రైతుకొక్కడే కొడుకు, నలుగురు కూతుళ్లు. తనొక్కడే సేద్యం నెగ్గించుకోలేక పెద్దల్లుణ్ణి ఇల్లరికం పెట్టుకున్నాడు. తాను, తన భార్య అల్లుడు కూతురు, మనుమళ్లు మనుమరాళ్లు, ఇంకా పెళ్లికాని చిన్న కూతురు వెరశీ పదిపన్నెండుమంది పల్లెలో ఎముకలు విరచు కుంటే కుమారుడు పట్టణంలో ఆరేళ్ల చదువు ముగించాడు. ఇక్కడ వీళ్లు పూటకింత సంగటిముద్ద దొరికితే చాలుననుకుంటే అతనక్కడ ప్రతినెలా హాస్టలుకు అదనపు బిల్లులు చెల్లించాడు. ఇక్కడ వీళ్లు చిరిగిన బట్టలకు మాసికలు వేసుకుంటే, అత నక్కడ నెలనాళ్లలో ఓ రోజు వేసి తీసిన దుస్తులు మరొక రోజు వేయకుండా యువరాజులా శీవి వెలయించాడు. చదువు పూర్తికాగానే అతడికో ఉద్యోగంగూడా లభించింది. కట్నాల కోసం, కానుకలకోసం ప్రాలుమాలి పెద్ద సంబంధం తీసు కొస్తే మీ కుమారుడు మీకు దక్కడని అనుభవజ్ఞులు వృద్ధ దంపతులకు సలహా ఇచ్చారు. వాళ్లుగూడా ముందుగనే తమ జాగ్రత్త తాము తీసుకున్నారు.— "బాబ్బాబూ! ఈనాడు మేము డబ్బు ముఖం చూస్తే రేపు నువ్వు మనుష్యుల ముఖం చూడవు. మన అంతస్థుకు తగిన సంబంధమైతే మనకు చాలు. నీ పెట్టు పోతల్ని ఆశించే అక్కచెల్లెళ్లు నలుగురున్నారు. కాటికి కాళ్లు చాచుకున్న ముసలివాళ్లం మేమున్నాము. వంట ఇంటిలోగూడ చెప్పులువేసుకుని తిరిగే కోడలు ఇంటికొస్తే మళ్లీ మేము నీ ఇంటి పంచలోనైనా రావడానికి వీలుండదు" అంటూ తల్లితండ్రులు కుమారునికి హితవు చెప్పిచూచారు. వాళ్ల హితబోధ అరణ్య రోదనంపాటిగూడా చేయగలిగిందిగాదు. తన విలువను తాను బాగా గుర్తెరిగిన కథానాయకుడు పెళ్లిళ్ల సంతలో తన రేటుపైన వేలంపాట పాడించుకుని స్వప్ర యోజకత్వంతో పాతికవేల రూపాయలకు ధరపలికాడు. వరుడి వైపు బంధువులు వెళ్లి రావడానికైనా వీల్లేని దూర ప్రాంతంలో పెళ్లి జరిగింది. మనసుండక కళ్లతో పెళ్లి వేడుక చూడ గలిగితే చాలుననుకుని వెళ్లిన బంధువులకు ఆ పట్టణంలో పెళ్లి జరుగుతున్న ఇల్లెక్కడో తెలిసిందికాదు. వాకబు చేసుకుంటూ వెళ్లేసరికి ముహూర్తం మించిపోయింది. వరుడు ఏ గర్భ గృహంలో ఉండిపోయాడోగానీ ఈ పల్లెటూరి పిచ్చి వాలకాలను పలకరించే వాళ్లే లేకపోయారు! అంటే ఏమన్నమాట? వరుడి దృష్టిలో వివాహంగా భావిస్తున్న సంఘటన ఏదైతే ఉందో అది అతనికీ, అతని కుటుంబానికీ మధ్య ఓ అగాధాన్ని సృష్టిం చిందన్నమాట!

సామాన్య మధ్య తరగతి కుటుంబాలపైన కాలేజీ చదువుల ప్రభావం గురించి చెప్పాను. కథల్లోని కమ్మని కల్పనలకు, జీవితంలోని కటువైన సత్యాలకు ఉన్న అంతరాన్ని అంచనా వేయడానికే ఈ ప్రయత్నం!— ఈ సందర్భంలో మరొక యదార్థ గాథనిక్కడ ఉదహరించడం సముచితమనిపిస్తోంది. పట్టణంలో బంగళా, కారు, పల్లెలో తోటలు గడించి ఉన్న ఓ పురప్రముఖుడు పట్టపరీక్షలో కృతార్థుడై వచ్చిన వంశో ద్ధారకుడికి పెళ్లిచేస్తున్నాడు. అయిదో గేటు (యాభైవేలు) దాటుకున్న కట్నం, చదువుకున్న పెళ్లికూతురు, విందుతోబాటు పాటకచ్చేరి, రాష్ట్ర నాయకుల ఆగమనం—అన్ని హంగులూ సల క్షణంగా కుదిరిన వివాహమది. ఆడపెళ్లివారు అందుకని మాట్లాడుకున్న బస్సుల్లో వచ్చి మూడంతస్థుల మేడలో విడిదిచేశారు. పందిరిక్రింద మేళతాళాలు మ్రోగుతుండగా ఓ కారువచ్చి నాలుగిళ్ల కవతల నిల్చింది. ఎవరో స్నేహితులు పెళ్లి కుమారున్ని చూడగోరుతున్నారని పిలుపందింది. అంగ రక్షకులతో పరివేష్టితురాలై కారులో కూర్చున్న అమ్మాయి ఒక్కతె విస్ఫులింగాలు రాలుతున్న చూపులతో వరుడికి స్వాగత మిచ్చింది. ఒకటి రెండు నిమిషాల వ్యవధిలో ఆ ఇద్దరి మధ్య జరిగిన ప్రసంగం తాలూకు వివరాలు మనకు తెలియవు. కానీ వరుడు లోపల కూర్చోగా వచ్చిన కారు వెనుదిరిగి తుర్రున అక్కడినుంచీ మటుమాయం కావడం మాత్రం చాలామంది చూచారు.

కారును కారుతోనే వెన్నంటినా దాని పరుగందుకోడం దీనితరం కాలేదు. అన్ని కథలకు మల్లే చివరికీ కథకుగూడా మహానగరమే గమ్యస్థానమైంది. ఒకటి రెండు రోజులదాకా కథానాయకుడికోసం గాలింపుల తతంగం జరిగింది. ముసలివాళ్లను (వరుడి తల్లితండ్రులు) మల్లగుల్లాలు పెట్టడమెందుకనుకున్న దేమో, వరుణ్ణి ఎత్తుకపోయిన అమ్మాయి వాళ్లను హోటలు గదిలో సంధించి వాళ్లబ్బాయి తనకు వ్రాసిన ప్రేమ లేఖలను, కలిసి తీయించుకున్న ఫోటోలను ప్రత్యక్ష సాక్ష్యాలుగా దఖలు చేసింది.

మిగిలిన కథ తరువాతి సంచికలో చదువుకో దగినది గనుక ఇక్కడ చెప్పబడటంలేదు. ఐనా కథకేముంది? ఎవరి ఊహ నుంచి లభించిన ఆధారాన్నిబట్టి కథ అల్లుకోనూవచ్చు, ముగింపు లిచ్చుకోనూవచ్చు! కానీ కథకంటే జీవితం ముఖ్యమైనది. ఆ జీవితంపట్ల భావి పౌరులకున్న దృక్పథం మరింత ముఖ్యమైనది.

దేశీయకత - వాస్తవికత

అంధకారంలో దారివెంట నడుస్తున్నామనుకో! కళ్లున్నా అంధత్వం ఆవహించినట్టే ఉంటుంది. అప్పుడు మీట నొక్కితే టార్చిలైటు వెలుగుతుంది. దారిలోని రాయిరప్పా, పురుగుపుట్రా, మిట్టా పల్లమూ విస్పష్టంగా కంటికానడంతో దారిపయనం సుకరవౌతుంది. అదిగో, ఆ టార్చిలైటులా కాంతులు విరజిమ్మి సమాజ స్వరూపం సాక్షాత్కారానికి తోడ్పడితే అంతకు మించి కథానికనుంచీ మనం ఆశించగలిగినదేమీ లేదు.

ఇంతటితో నేనీ లేఖను ముగించవచ్చును! ఎందుకంటే ఎవరికి తోచిన అభిప్రాయాలను వాళ్లు చెప్పుకోడమేగానీ కథానిక ఇలా ఉండాలని తెలియజెప్పే లక్షణ గ్రంథాలంతగా ఉన్నట్టు లేవు. పోగా 'విమర్శ సాహిత్యానికంతటికీ విశ్వసనీయమైన సంక్షిప్త లేఖనం వంటిది' అన్న ఆర్యోక్తికి మన సాహిత్య ప్రపంచంలో అంతగా పాటింపు ఉన్నట్లు కనిపించదు. ఐనా లక్షణ గ్రంథాలు పుట్టి, గొప్ప విమర్శలు బయల్దేరేలోగా వాటి తాకిడికి మనం సంసిద్ధులమై ఉండాలికదా! అట్టి సంసిద్ధతకు ప్రయత్నాలు జరగడంలేదని ఈ లేఖలో ఇదివరకే ఒకసారి సూచించాను. కథకుడికి రచనా వ్యాసంగానికి ప్రాణప్రదమైన విషయం గనుక మళ్లీ చెబుతున్నాను. కథలు వ్రాస్తున్న యువ మిత్రులు కొందరిని ఇటీవల నేను కలుసుకున్నాను. ఒక రచయిత తానే పత్రికకైతే కథలు వ్రాస్తున్నాడో, అది మినహాగా ఇతర పుస్తకాలు చదవడం లేదని తెలిసింది! ఆంగ్లంలో లోకవిఖ్యాతులైనవారు, ఆంధ్రంలో పేరెన్నిక గన్నవారు అయిన కథకులెందరైనా ఉన్నారు. వస్తువుకోసం జీవితాన్ని పరిశీలించడం ఎంత ముఖ్యమో, విధానంకోసం సాహిత్యాన్ని అధ్యయనం జేయడంగూడా అంతముఖ్యం. ఒక గీత వ్రాసే అధికారం కావాలంటే ఇరవై పేజీలు చదవాలని మెకాలే భావించాడు. అలా కాకుండా ఒక గీత చదివి ఇరవై పేజీలు వ్రాయడమే తన అభిమతమని ఎవరైనా చెబుతే, అతనితో మనం వాగ్వాదానికి సిద్ధంగా లేము—

మిత్రమా మధుసూదనం! చిట్టచివర నా దొకటే అభ్యర్థన. నేనూ నీలాగే తోచిన పద్ధతిలో వ్రాసేవాడినేగానీ 'కథానిక'పైన లాక్షణికుణ్ణిగాను. మనలో మనమాటగా ఇంత దూరం వ్రాశాను. నాయీ సాహసానికి నువ్వు నన్ను మన్నించగలవని నమ్ముతున్నాను.

ఉంటాను,

భవదీయుడు,

చక్రపాణి.''



అదృష్టాధ్వగమనం

శ్రీ బాలగంగాధర తిలక్

అన్నా
నన్నానవాలు పట్టగలవా
ఆనాటి వాణ్ణి నీ చెలికాణ్ణి
అవునులే - కాలమొక్కటే కాదు మన మధ్యదూరం
లౌకిక జగత్తు కల్పించిన వ్యత్యాసాల విశ్వాసాల పూర్వార్థగోళంలో
ప్రయోజన విజయపరంపరల పాలరాతి మేడమీద చిటారుగదిలో నువ్వు
నేనో మరి—ఇంకా సమాజంలో
స్థూలమైన ఆకృతిని అస్థిత్వాన్ని పొందని పొందలేని ఊహామరుత్తుని-ఏకాకిని !

ఇంకా అలాగే ఉన్నాను
రేగిన జుట్టుతో నలిగిన షరాయితో
కలల రంగు దుమ్ముపడిన కళ్ళ మంటలతో
ఇంకా అలాగే తిరుగుతున్నాను
నీహార ప్రతిసీరల మధ్య
నీరవ నదీ తీరాల వద్ద
నిరస్తపత్ర తరుశాఖల కింద
ఇలాగే తిరుగుతూ తిరుగుతూ
ఒకే ఒక తీగమాత్రం మిగిలిన యీ సితారాని మోసుకొని
యీ నిశాముఖాన నిలిచి పాడుకొంటున్నాను
ఎవరూ వినని పాటని
ఇలాగే నడుస్తున్నాను
ఏవరూ నడవని బాటని.

అన్నా
నువ్వన్నీ అమరిన అదృష్టశాలివి

అదృష్టాధ్వగమనం

ఇల్లూ వాకిలీ డబ్బూ హోదా పేరూ ప్రతిష్ఠా
వెండిమెట్ల నిచ్చెన లెక్కుతూన్న వేళల
నే నొక రావిచెట్టు నీడలో
కొమ్మమీద ఆహారం దొరకని కృకలాసం కంగారుచూపులో
ఊరవతల సందులలో
దుమ్ముకొట్టుకుపోయిన పిల్లలకళ్ళల్లో ఆరిపోతూన్న వెలుగులో
కాలవ వొడ్డున వంకర తిరిగిన తుమ్మచెట్టు కొమ్మల్లోంచి
కాలి మసైపోతూన్న పశ్చిమదిశా గగనంలో
ఒక భయంకర సృష్టిక్రమాన్ని మానవయత్న వైఫల్యాన్ని
ఊహించుకొని వొణికిపోయేవాణ్ణి.

మంచుబొట్లు రాలిపడే
మసకమసక వేకువ పోకచెట్ల కింద
కన్నీటితో వెతికేవాణ్ణి
నన్ను కికురించిన కలకోసం
నా కోర్కెల వెలుగుల వజ్రంకోసం.

అర్ధరాత్రివేళ
ఊరి పొలిమేరలో తోటలో
రాలిపడిన నక్షత్రాన్ని నిర్జరీ సురుచిర స్వప్నాన్ని
ఏరుకొని జేబులో దాచుకుందామని
ఎంత ప్రయత్నించేవాణ్ణి !

అపుడు నా వీపుమీద తారల తళుకు
నా నొసటమీద క్రొన్నెలవంక కులుకు
నన్ను చూసి వీడు పిచ్చివాడనీ మాంత్రికుడనీ
అవహేళన చేశారందరూ !

అన్నా
నే పుట్టినపుడు
ఏ పిచ్చి పొగడపువ్వుల గాలి సోకిందో

ఏ పండువెన్నెల మత్తు క్రమ్మిందో
ఏ పికిలిపిట్ట కిటికీలోకి వ్రాలి నాకేసి చూసి నవ్విందో
ఇలాగ యింద్రధనుస్సుల్ని అదృశ్యస్వర్గాల్ని అశ్రుత గాంధర్వాన్ని
అన్వేషించుకుంటూ
మామూలు దారుల్ని మర్యాదల్ని మంచీచెడ్డల్ని విడిచి
రాత్రిం దివామధ్య రహః కిర్మీర రథ్య పడిపోతున్నాను
ఆశతో విశ్వాసంతో ఆత్మబలంతో

కాని ఎన్నెన్ని అఘాతాలు! ఎన్ని అడ్డంకులు!
ఎన్ని వేదనా వాదనాయుతమైన నిశ్వాసాలు
ఈ గుండెలో ఎన్ని గాయాలు!

అన్నా
నేనొక జ్వాలావలయితుణ్ణి దుఃఖితుణ్ణి
నాలోపల నా బాధలు
నా వెలుపల క్షుతజగత్తు ఆక్రోశించిన కరుణాభీభత్స రవాలు
నిరంతర పరిణామ పరిణాహ జగత్కటాహంలో
సలసల క్రాగే మానవాశ్రు జలాలు!

అయినా
అంతర్గత సంగీతం అనుపను సుందరగీతం
నాలోపల వినపడుతూ నన్నిలాగ నడిపిస్తూ
సృష్టిలోని అర్థంకోసం జన్మలోని సాఫల్యంకోసం
జనన మరణాతీతమైన సురభిళ రహస్యంకోసం
ఎన్ని ఎడారిదారుల
కంటకిత కానన మార్గాల
పడుతూ లేస్తూ
పడుతూ లేస్తూ
ఒక్కొక్క తీగ తెగుతూ
మిగిలిన యీ విచిత్ర విపంచికను మీటుకుంటూ
ప్రతి గడపముందు ప్రతి గవాక్షం ముందు

అదృష్టాధ్వగమనం

నిలబడి పాడుతున్నాను పిలుస్తున్నాను
ప్రతి తెరనీ తొలగిస్తున్నాను
ప్రతి అరనీ తెరుస్తున్నాను

అన్నా
నన్నింకా గుర్తుపట్టలేకపోతున్నావు
నామాటనీ పాటనీ పోల్చుకోలేక పోతున్నావు
అన్నీ పోగొట్టుకున్నా నాలో ఆనందం తరుగలేదు
ఆకాశమంత నా ఏకాంతంలో
అనంత మానవ హృదయస్పందనం వినడం మానలేదు
అలసిన నా ప్రవాసంలో
అద్భుతసౌధాల మణికవాటాలు తెరచుకోవడం మానలేదు
మీవాణ్ణే మీ అందరిమధ్యా బతుకుతూన్న వాణ్ణే
అయినా నిలువెత్తు తెరవెనుక నిలిచిన నేపథ్యగాయకుణ్ణి.

ఇప్పటికీ మధుమాసంలో
సహకార తరువులకింద పవ్వళించిన వేళ
నా గళాన సౌందర్య మధూళి చిందుతుంది.
ఇప్పటికీ దిగులు నీరు నిండిన
కోటి మనస్సరస్తీరాల నా కవిత
కోరికల కోణాకారపు కొత్తచెట్లని నాటుతుంది

ఇప్పటికీ
యీ చీకటి మొగలో నిలిచి పాడుతూన్న నాకోసం
కుసుమం విప్పిన గోధుమవన్నె ప్రాచు
మొగలి పొదలనుండి పడగవిప్పి ఆడుతుంది
ప్రాగ్దిశాసుందరి ఖండచంద్ర పరిదీపిత కపోల్లాల హాసిస్తుంది
నా గుండెలపై శుక్రతార్క కిరణం సూటిగా వచ్చి వాలుతుంది.

నన్నెచోడుని కవిత్వము

శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి

ఈ విషయమును గురించి నేను వ్రాసిన గ్రంథమునకు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారి బహుమతి నాకు వచ్చి, నేను పుస్తకమును ముద్రించి పత్రికలకు పంపి ఐదేండ్లకు పైబడినను, ఒక్క నెల్లూరి పత్రికలలో తప్ప మఱి యెచ్చటను విమర్శలే రాకయుండినందులకు నేను ఆశ్చర్యపడుచుండగా ఇన్నాళ్లకు మిత్రులు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు నాయందు దయదార్చి జూన్ నెల భారతిలో తీవ్రమైన విమర్శ ప్రకటించి నా కుపకరించినందులకు వారికి నా కృతజ్ఞత నిదే తెలుపుకొనుచున్నాను. నా గ్రంథమును విమర్శించుటకు కారణము నేను పెక్కు చారిత్రక మత విషయక ప్రమాదముల పాలైతిననియు, నా రచన అప్రమాణికమై నిరర్థకమైనదనియు వ్రాసినారు. మంచిదే, పరవాలేదు. ఇదియే వాస్తవమైన యెడల నేను నా దోషములను సవరించుకొని జ్ఞానము నార్జించుటకు సంసిద్ధుడనే. కాని, ఎంత చూచుకొన్నను అట్లు కనబడక వీరి మార్గమే ఘోర ప్రమాద భూయిష్ఠమై 'అయోమయ' మై, అసంబద్ధ సిద్ధాంత ప్రతిపాదకముగా కనబడుచున్నందున ఒకపాటి సమాధానము ఆవశ్యకమైనది. పైగా వీరికి నా రచన కోపము కలిగించినది. వ్రాయు ధోరణిలో 'గ్రంథకర్త' 'ఉన్నాడు' ఇత్యాద్యేక వచన ప్రయోగమునకు కూడ పాల్పడినది. నిజముగా ఈ మహాశయుని హృదయమునకు నా రచన ఇంత నొప్పి కలిగించినదా! విమర్శకులు మడికి సింగన కాలముతో ప్రారంభించినందున నేనును ఆ వరుసలోనే సమాధానము వ్రాయుచున్నాను. నన్నెచోడుని కాల నిర్ణయమునకు అదియొక అవధిగా గద ఏర్పడియున్నది.

మడికి సింగనకాలము

ఆంధ్రవాఙ్మయ చరిత్రకారులు పలువురు మడికి సింగన కాలమును క్రీ. శ. పదునైదవ శతాబ్ద పూర్వార్థమనియు ఆతని పద్మపురాణ రచన క్రీ. శ. 1420 గాన వాసిష్ఠ రామాయణము తర్వాతిదనియు తలంచినారు. కాని సుప్రసిద్ధ చరిత్రకారులు కీర్తికాయులు శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తమ రెడ్డి రాజ్య చరిత్రలో నీతడు పదునాల్గవ శతాబ్ది ఉత్తరార్థమునను పదునైదవ శతాబ్దములో పూర్వార్థమునను ఉండియుండునని ప్రతిపాదించి (పుట 514) పద్మపురాణ రచనాకాలమును గురించి'అథోజ్ఞాపికలో 'ఆకర యుగాకల' ఇత్యాది పద్యమును గురించి యిట్లు వ్రాసినారు.

"According to this, the date is Saka 1342, corresponding to the cyclic year Sarvari, wednesday, the 5th tithi of the month of Margasira. The fortnight, whether it was the bright half or the dark half, is not stated. The date is irregular as the fifth tithi in the said month does not fall on wednesday in any one of the two fortnights. This verse, found only in a very few manuscripts, seems to be an interpolation; for, the age of Madiki Singana at the time of the composition of the Padma Puranam would be seventy three, even if he is taken to have been born to Ayyalamantri in Saka 1269 the date of Toyyeti Anapota's Daksharama record. If this date in the Padma Pura-

na is accepted, a still later date to his Vasista Ramayana has to be postulated. This does not seem to be the case. If he were such a late poet. he would have certainly mentioned Erra Pregada in his Kavi. stuti- The date given in the Padma Purana does not seem to be correct.''

మఱి యీ తారీఖు కుదురనిచో వేఱేది కుదురును? నా యభిప్రాయము 1347 అని గదా. అది ఎట్లు సాధువో నిరూపించెదను. శ్రీ శర్మగారు మునునూరి నాయకుల వంశమును గుఱించి తెలుగు సంస్కృతి సంపుటములో (పుట 288) నిట్లు వ్రాసియున్నారు—''ఆంధ్ర దేశాధిపతి అయిన తరువాత కాపయనాయకుడు తనతో సహకరించిన బంధువులకు, తన వర్ణమువారికిని నాయకత్వములిచ్చి తన స్థితిని కట్టుదిట్టము చేసికొనెను. అతడు పినతండ్రి రాజనాయకుని కుమారుడు అనవోత నాయకుని మధ్యాంధ్రదేశమునకు అధిపతిగా నియమించెను. ఇతనికి మొదట తూర్పు గోదావరి జిల్లా చోడవరము తాలూకాలోని తొయ్యేరును, తరువాత రాజమహేంద్రవరమును రాజధానులుగ నుండెను. చాల కాలము ఇతడు తొయ్యేటిలో నుండుటచే ఈతనికి తొయ్యేటి అనపోత భూపాలుడని వ్యవహారము. సముద్రతీరస్థ ఆంధ్ర దేశమున కాన్పించు కాపయనాయకుని కడపటి శాసనము శకవర్షము 1268 (క్రీ. శ. 1344—46) నాటిది గణపేశ్వరములో నున్నది. తొయ్యేటి అనవోత నాయకుని శాసనము ఈ ప్రాంతమున శకవర్షము 1269 (క్రీ. శ. 1347) నాటిది కనబడుచున్నది. ఇది దాక్షారామములో నున్నది. గోదావరీ దక్షిణ తీరస్థ సబ్బినాటి రాజ్యమునకు గురజాల తెనుంగు నృపాలుని కుమారుడును, మడికి సింగనకు ఆశ్రయదాతయును అయిన ముప్ప భూపాలుని అధిపతిని గావించెను. ఇతనికి ఇప్పటి ఆదిలాబాదుజిల్లాలోని రామగిరి రాజధాని.''

దీనికి కొంత వ్యాఖ్యానము కావలసి యున్నది. కాపయ నాయకుడు ఇట్లేల చేయవలసి వచ్చినది. ? అభిమానముచేత ఊళ్లు పంచిపెట్టినాడా లేక గొప్ప ప్రయోజనమును సాధింపగోరియా ? ముఖ్యముగా నీ రెండవదే. ప్రోలయ నాయకుడు మహమ్మదీయులను తఱిమి తీరాంధ్రదేశమును క్రీ. శ. 1325 లేక 1330 ప్రాంతమున కైవసము చేసికొనెను. ఆతని మార్గమును అనుసరించియు నాయకత్వమును అంగీకరించియు తెనుగు నాయకులు ఎందరో మహమ్మదీయులకు ఎదురు తిరుగసాగిరి. ఆంధ్రులలో స్వాతంత్ర్యోద్యమము పొడసూపినది. ప్రోలయనాయకునికి ఆతని పినతండ్రి కుమారుడు కాపయ నాయకుడు సహాయుడు. ఆంధ్రదేశము నంతటిని మహమ్మదీయుల బారినుండి విముక్త మొనరింప ఈ యిరువురును దీక్ష వహించిరి. ప్రోలయనాయకుడు ఈ కార్యమును ప్రారంభించి కాపయనాయకునికి వదలి గతించెను. కాపయనాయకుడు హోయసల వీరబల్లాలాది దక్షిణ దేశాధీశులను కూడ గట్టుకొని దేశమంతయు ఒక కలసి గట్టుగ మహమ్మదీయులను ఎదుర్కొను ప్రయత్నములు గావించెను. ఇందుల ఫలితము ఓరుగల్లు తిరుగబడి క్రీ. శ. 1336—37 ప్రాంతమున కాపయనాయకుని నాయకత్వమున మరల స్వతంత్ర రాజ్య మాయెను. ఈ కాలమందే విజయనగర రాజ్యము కూడ స్థాపింపబడినది. శ్రీ శర్మగారు పైన వ్రాసినదాని కర్థము ఈ వెంటనే కాపయ తన రాజ్యమందు బంధుమిత్రులను అచ్చటచ్చట పాలకులనుగా నియమించెనని గాదు. వారే ఎంతో వివరముగా ఆంగ్లమున A Forgotten Chapter of Andhra History లో వ్రాసియున్నారు. 'కట్టుదిట్టములు' చేసికొనుటకు కాపయనాయకునికి కొంతకాలము పట్టినది. అందులకు ఇతర కారణములను గూడ వారే కనిపెట్టి చూపియున్నారు. ఓరుగంటి యాక్రమణముతో కాపయ ఆంధ్రదేశాధీశ్వరుడును ఆంధ్రసురత్రాణుడును (సుల్తాను) ఆయెను. కాకతీయుల కాలమునందలి డెబ్బది యేడుగురు నాయకులును తమతొంటి స్థానములనే పాలించుచు కాపయనాయకునికి సాయము చేసినట్లు అనితల్లి కలువచేరు శాసనమువలన తెలియుచున్నది. అనగా తొయ్యేటి అనపోతాదులు వారివారి పెద్దల కాణాచియందే యుండిరని యర్థము. కాని క్రీ. శ. 1345 కు తర్వాత కొంత మార్పు కనబడుచున్నది గదా. తొయ్యేటి అనపోత నాయకుడు రాజమహేంద్రవరమునను, గుంటూరులోని గురజాల తెలుంగు నృపాలుని కుమారుడైన ముప్ప భూపాలుడు సబ్బి మండలమునను కనబడుచున్నారు. ఈ మార్పులకు కారణము శర్మగారు చూపినారంటిని గదా అది యిది—కాపయనాయకుడు ఢిల్లీ సుల్తాను నెదిరించుటకు హిందువులను కూడగట్టుకొన్నట్లే జాఫర్‌ఖాన్ అను మహమ్మదీయ సేనానితో సఖ్యముచేసి అతనికి సాయము చేయగా నతడు అల్లాఉద్దీన్ హసన్‌షా అను పేరుతో పొరుగుననే బహమనీ రాజ్యమును స్థాపించి, కృతఘ్నుడై, కాపయనాయకునికే ప్రక్కలోని బల్లెమాయెను. తన పొరబాటును గుర్తించి మేలుకొని తాను తీరాంధ్ర రాజ్యమును పూర్తిగ తొయ్యేటి అనపోత నాయకునికి ఒప్పగించి తనకు సమీపమున, ఉత్తరమున, గోదావరికి దక్షిణమున సబ్బినాటిలో గురజాల ముప్పనాయకుని నియమించెను. తీరాంధ్రదేశమున కాపయనాయకుని శాసనములు క్రీ. శ.

1346 కు తర్వాత కానరావు. అనపోత నాయకునివి ఆ మఱు సటి సంవత్సరమునుండి కనబడుచున్నవి. కావున అల్లాఉద్దీను రాజ్యాధిరోహణమును ఈ ఏర్పాట్లును సమకాలముననే జరిగి నవి. ముప్ప భూపాలునికి రామగిరి రాజధాని యైనది ఇప్పుడే.

దీనినిబట్టి కాపయనాయకుడును, అనపోతనాయకుడును, ముప్ప భూపాలుడును, మడికిసింగనయు, సింగన తండ్రి అయ్యల మంత్రియు, కందనామాత్యుడును సమకాలికులని తేలినది గదా. రామగిరి రాజధానిగా నబ్బినాటిని ముప్ప భూపాలుడు గ్రహించినది కాపయనాయక అనపోతనాయకుల జీవితకాలములోనే గదా. మఱి మడికి సింగన తండ్రి 'రాజ మహేంద్రపురికి నధిపతి యౌ యేటి యనపోత భూపాలు మంత్రియై ప్రాజ్యసంపదల సుక్షేత్రములును బొదలిన దెప్పుడు, 'పెద్దమడికి యందు స్థిరతరారామములును' ఆర్జించిన దెప్పుడు? అనపోతనాయకుడు రాజమహేంద్రవరమున నుండినప్పుడే గదా. అయ్యలమంత్రి ఈతనికి మంత్రిత్వము నెఱపి మడికి సంపాదించిన తర్వాత గదా వీరు మడికివారైనారు. ఈతడు క్రీ. శ. 1353 కు ముందే గతించినట్లు కోరుకొండ ముమ్మడి నాయకుని శాసనముచే తెలియుచున్నది. 1353 కు తర్వాత అనపోతనాయకుడు లేడు. క్రీ. శ. 1347—1353 వఱకు రాజమహేంద్ర పాలకుడు అనపోత నాయకుడు. కాబట్టి ఈ మధ్యకాలమందే అయ్యలమంత్రి మడికిని సంపాదించి యుండవలయును. లేదా ముందే సంపాదించియుండి, తర్వాత గ్రంథరచనా కాలమున, రాజమహేంద్రవరము ప్రాప్తించిన వెనుక వ్రాయుటచేత అట్లు వ్రాసినాడేమో మడికి సింగన. ఈ సమయమే యైయుండిన, ఇంతకును ఆ యెంత్లైనా అయ్యలమంత్రి మంత్రిత్వము? ముందునుండియే యుండ వలయును. 'రాజమహేంద్రపురికి నధిపతి తోయేటి యన పోతభూపాలుని మంత్రి' యనుటచేత ఆరాజు పక్షవృద్ధికి సాయపడి నాటి రాజకీయములలో గొప్ప పాత్రము నిర్వహించి యుండెననుటకు సందియములేదు.

అయ్యల మంత్రికాలము క్రీ. శ. 1353 ముందని తేలుచున్నదిగదా మఱి మడికి సింగన పబ్బినాటికి పోయిన దెప్పుడు? దీనికి తర్వాతనా? తండ్రి గతించిన యనంత రమా? లేక యనపోతనాయకుని మరణానంతరమా? ఇచ్చట రాజాశ్రయములేకపోయినందున పోయియుండునని కొందఱు తలంచినారు. మఱి అంతటి మంత్రికుమారుడు కవిత్వము చెప్పి, పురాణ కాలక్షేపముచేసి ధన మార్జించుటకా? అంతదూరము పోయినాడు. ఆపాటి రాజాశ్రయమున తూర్పున దొరకకపోయినదా? తన పెద్దల నందఱిని రాజామాత్యు లనుగా వర్ణించి, అంతటి తిక్కనసోమయాజిని తన పూర్వు లలో నొకనినిగా పేర్కొని వట్టి కవిమాత్రుడుగా సింగన జీవితము గడపియుండునా? పైగా క్రీ. శ. 1353 కు తర్వాత తండ్రి మరణానంతరము పోయియుండుననుటయు చెల్లదు. ఏలయన బహమనీవారిచేత తెలంగాణము నిత్యోప ద్రవమున నుండిన కాలమది. అల్లాఉద్దీన్ హసన్‌షా తెలంగాణమును క్రీ. శ. 1347—48 లో నొకమారును, 1356—57 లో నొకమారును బలముగా నుపద్రవముపాలు చేసెను. హిందూ రాజ్యములలో నైకమత్యము లేనందున బహమనీ రాజ్యము బలిష్ఠమై కాపయనాయకుడు భగ్నమనో రథుడై క్రీ. శ. 1367 నాటికి గతించెను. ఇట్టి కల్లోల ముల కాలమున జీవిక కొఱకు పోయినవాడుగా నుండడు మడికి సింగన. కాపయనాయకుని యనంతరము పబ్బినాడేమైనది? బహమనీవారికి పోయినదా, రేచెర్ల వెలమవారికి వచ్చినదా? గోలకొండ వఱకును ఓరుగంటి రాజ్యభాగము కాపయ నాయకుని కాలమందే బహమనీవారికి వశమైనందున పబ్బి నాటిపై తెలుగువారి యధికారము 1357 కు తర్వాత సందేహాగ్రస్తము. కావున 1357 కు ముందే సింగన పబ్బి నాటిలో నుండి యుండవలెను గదా. సాక్ష్యము కవలయునా?

ఇందులకు తెలంగాణ చరిత్ర సాయపడుచున్నది. (శ్రీ మల్లంపల్లివారి రచన—తెలుగు సంస్కృతి సం. పు. 288) 'పూర్వము కాకతి భూవరులు పాలించిన రాజ్యములో చాలభాగము అనగా పడమట కౌలస బీదరులు మొదలుకొని తూర్పున బంగాళాఖాతము వఱకును, వ్యాపించిన దేశము కాపయనాయకుని అధికారముక్రిందికి వచ్చినది. ఇంత దేశ మునకు అధిపతి అయినను ముస్లిములను జయించినను ఢిల్లీ సుల్తాను మరల ఎప్పుడు తెలంగణాపై దండెత్తివచ్చునో అన్న చింతయును అతనికి పోలేదు .... ఓరుగల్లు మొదలైన ముఖ్య దుర్గములను మరమ్మతు చేయించి అతడు వానిని కట్టుదిట్టము చేసెను.' తర్వాతి చరిత్ర కాపయనాయకుని సాయముతో గుల్బర్గాలో బహమనీరాజ్య మేర్పడుట, (1347) మహమ్మదియ నాయకుడు కృతఘ్నుడై కౌలస దుర్గమును దాని కణుకువయైన దేశమును అపహరించుట, ఇదంతయు పూర్వోక్తములే. కాపయనాయకుడు చేయునది లేక ఆ దేశమును అతనికిచ్చి సంధి చేసికొనెను. క్రీ. శ. 1351 లో ఢిల్లీలో తుఘ్లకు సుల్తాను చనిపోగా బహమనీ సుల్తాను బలవంతుడై "క్రీ. శ. 1356 చివర భాగమున ఓరుగంటి రాజ్యముపై దండెత్తి దేశము నంతను ధ్వంసము గావించెను. తెలంగాణాలో నాతడు సంవత్సరముపాటు ఉండెను. భువనగిరి దుర్గమును దాని కణకువయైన కోటలను పట్టు

కొనెను. దేవాలయములను కూలద్రోసి వాని స్థానమున మసీదులు కట్టించెను. తెలంగాణా విజయము పూర్తియైన పిదప అల్లాఉద్దీను గుల్బర్గకు మరలిపోయెను.' ఇది క్రీ. శ. 1357 కు ముందే యని తెలియుచున్నది గదా. తర్వాత క్రీ. శ. 1359 లో అల్లాఉద్దీను హసన్‌షా చనిపోవుటయు అతని మొదటి కుమారుడు మహమ్మదుషా రాజ్యమునకు వచ్చుటయు, కాపయనాయకుని కుమారుడు వినాయకదేవుడు మహమ్మదుషా చేత చిక్కి ఘోర దుర్మరణము పాలగుటయు, కాపయనాయకుడు ఓడిపోయి సంధి చేసికొనుటయు— ఇదంతయు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసియున్నారు. ఈ కాలమున బహ్మనీ రాజ్యమునకు గోలకొండ సరిహద్దుగ నేర్పడినది.' (పుట. 291). ఈ సందర్భమున రామగిరి ఏమైనది ? ఎవరి చేతిలోనుండ ఎవరి చేతికి పోయినది ? స్పష్టముగా తెలిసికొనుటకు తగిన యాధారములు దొరకలేదు గాని క్రీ. శ. 1369 నాటికి రేచెర్ల అనపోతానాయకుడు ఓరుగల్లు పాలకుడుగా కనబడుచున్నాడు. రామగిరిలో ముప్పభూపాలకు డింకను నున్నాడా ? కాపయనాయకునికి సాయపడలేదా ? సాయపడియు ప్రయోజనము లేకపోయినదా ? వీనింబట్టి చూడగా ముప్ప భూపాలుడును కాపయనాయకునితోనే సమాప్తి నందియుండవలెను.

మడికిసింగన సబ్బినాటికి పోయిన కాలము ఇప్పుడు సులువుగా తెలియుచున్నది. ముప్పభూపతియు మడికిసింగనయు రాచకార్యములకై క్రీ. శ. 1345 లోనే రామగిరికి పోయి యుందురు. సింగన, తండ్రికి పెద్దకుమారుడు. అయ్యలమంత్రి వయసు తెలియదుగాని ఈ కాలమున నాతడు సజీవుడై యుండి అనపోత నాయకుని మంత్రిగా రాజమహేంద్రవరమున నిలువగా పెద్దకుమారుడీతడు నాటికే ప్రయోజకుడై రామగిరికి పోయియుండును. సింగనయట్టి మంత్రి మాత్రుడా? నియోగి బిడ్డ. మహామాత్యుని కుమారుడు. కవిత్వమీతనికి వినోదకరణము, జీవికార్థము కాదని ముందే చెప్పితిని. మహామాత్యుడుగా నుండక పోవచ్చును. అంతమాత్రమున అమాత్యులలో నొకడుగా నుండకపోడు. 'అతని యాశ్రితులందెల్ల నధికుడనగ జతురుడన ధన్యుడన నడిసన్నవాడ' పైగా 'సుకవివరుడ' మంత్రిగానుండియు కవిగానుండుట విశేషము గదా. మొన్నమొన్నటి వరకును తెనుగు కవులందరును అమాత్యులే, తిక్కనవంటి వారే. బత్రాజులుగారు. శ్రీ నాథభట్టు సుకవి గూడ 'పాకనాటింటివాడు' బెండపూడి అన్నమంత్రికి 'బాంధవుడు' 'విద్యాధికార' నియోగమొనర్చినవాడు.

మరి అట్లైన కందనమంత్రికేల అంకితమిచ్చినాడు, తన ప్రభువునకే అంకితమిచ్చి ఉండరాదా? అను ప్రశ్న రావచ్చును. కందనమంత్రిని సింగన పొగడుటకు కారణము లేకపోలేదు. అతడు తెలంగాణమువాడు. కాపయనాయకుని ఏర్పాటుమీద రాజ్య దీక్షార్థము తీరాంధ్రదేశమునుండి పోయిన వీరికి తెలంగాణము వాడైన కందనమంత్రి సాయము వలదా? అందులకై చేసియుండును. నాటికి ముప్ప భూపాలుడు గతింపలేదు. అట్టి ధ్వని కానరాలేదు. 'అనిలో రాయగజేంద్ర' పద్యమువలన ముప్ప భూపాలుడే ప్రభువు. కందనామాత్యుని కగ్రజుడు కేసనమంత్రి ముప్ప భూపతియొద్ద దండనాయకుడు. కందన మంత్రి మంత్రియే. పైగా కందనను 'నాకు నతి స్నేహ బాంధవుండును, నపూర్వ వచన రచనా బంధుర కావ్యరచనాభిజ్ఞుండును నర్థిజన పారిజాతుండును గావున నమ్మంత్రి యుగంధరుం గృతిపతిం గావించితి' అని వ్రాయుటలో ఎంతో అంతరార్థముండవలెను. కందనయు ముప్ప భూపాలునికి ఆశ్రితుడే. కాబట్టి కాకతీయుల నాటినుండి యున్న ఈ మంత్రి కుటుంబమువారిని గుంటూరు రాజమహేంద్రవరము ప్రాంతములవారు రాజకీయ కారణములచేత గొప్పగా పొగిడిరని విదితమగుచున్నది. (ఇదంతయు నన్నయ నారాయణ భట్టును, కేతన తిక్కనను పొగడుటను స్మృతికి తెచ్చుచున్నది.)

కావున మడికి సింగనయు ముప్ప భూపాలుడును కందనామాత్యుడును మువ్వురును సమకాలికులై ఒక్కచోట, రామగిరి యందుండినప్పుడే పద్మపురాణ భాగవత దశమస్కంధ వాసిష్ఠ రామాయణములు రచితములు. ఈ కాలము క్రీ.శ.1345 నుండి 1369 లోపలనని ఊహ్యాయింపుగా చెప్పినను 1345 మాత్రము గట్టిగా నున్నదిగాని తర్వాతి తారీఖు ఇంకను ముందుగా నుండవచ్చును. ఈ కాలమున వీరివీరి వయసు లెంతెంతయో తెలియదుగదా. క్రీ.శ. 1347 నుండి బహమనీవారి యొత్తిడి ఎక్కుడుగనున్నది. సింగన తాను మొదట పద్మపురాణమును భాగవత దశమస్కంధమును తర్వాత వాసిష్ఠ రామాయణమును వ్రాసితినను చేతను, బహమనీవారి రెండవ దండయాత్ర ఎక్కువగా దేశమును బాధించినందుచేతను కొంత నెమ్మది యుండిన 1345— 1355 ల మధ్యకాలమున నీతని రచన సాగియుండును. ఈతనితండ్రి 1353కు తర్వాత లేడేమో! ఇట్టిదంతయు చూచియే మడికి సింగనకాలము క్రీ.శ.1347గ నేను నిర్ణయించితిని. దానిలో నాకెట్టి తప్పును కనబడుట లేదు. అది పద్మ పురాణోత్తర ఖండ రచనాకాలముగానేల యుండరాదు?

మరి 'ఆకరయుగావళి' ఇత్యాది పద్యము ప్రకారము 1420కి చూచినయెడల క్రీ.శ.1345 నుండి 1420 వరకు డెబ్బది యైదేండ్లగుచున్నవి. శ్రీ శర్మగారు అనపోత భూపాలు

నన్నెచోడుని కవిత్వము

కాలము 1347 నుండి లెక్కవేసి 73 అని వ్రాసినారుగదా. వాసిష్ఠ రామాయణ కాలము ఇంకను తర్వాతగదా. కవియు, మంత్రియు భూపాలుడును ముప్పురును 1345 నుండి 1420 లేక 1425 వరకు జీవించి సుఖించుచుండిరా? వారెప్పుడు జనించిరి? ఏక కాలమున జనించి, జనించిన వెంటనే వీరభద్రునివలె దిగ్విజయము పోయిరా? అంతయు అసంగతము 'ఆకరయు గనల' పద్యము తప్పు, పనికిరాదు. తర్వాత నెవరో చేర్చినట్టిది. అందలి తారీఖు కుదురదు.

ఇన్ని విట్లుండగా తెలియక వెంకటరావుగారు సింగన కాలమును గురించి తప్పు చేయుటయేగాక సబ్బిసాయిర యెచ్చటనున్నదో తెలియక తబ్బిబ్బైనారు. ఈ మడికి సింగన ప్రసక్తి లోనే (భారతి, పుట 43) రెండుచోట్ల సబ్బి అనుటకు బదులు సచ్చి అని వ్రాసుకొన్నారు. సబ్బిగాని సచ్చికాదు. పోనిందు అచ్చు పొరపాటు. కాని ఇది ఎచ్చటనున్నదో తెలిసినట్లులేదు. ఇది గోదావరీ మండలమున నున్నదట! భూగోళ జ్ఞానము బొత్తిగా లేకపోవుటయే ఇందులకు కారణము. విమర్శకుల వ్రాత ఇది 'ఈ ముప్పరాజు గోదావరీ మండలమున సచ్చిసాయిర. మండలము అను సచ్చినాటిని పరిపాలించుచుండెనని పద్మపురాణోత్తర ఖండమునుండి ఈ క్రింది వాక్యములవలన దెలియుచున్నది. ముత్తభూపతి "ముత్తభూపాలుండు ఘనకు సహాయుండు గౌతమీ దక్షిణంబునం బరగు పావనంబగు సచ్చినాటి రాష్ట్రంబున—రామగిరి పట్టణంబునిజ రాజధానిగా రాజ్యంబు సేయుచు."

— ఈ సబ్బినాడును అందలి రామగిరియు తెలంగాణములో నేటి కరీంనగరుజిల్లాలో నున్నది. (అదిలాబాదని పొరబాటున పడియుండును) ఇచ్చటికి మంతెన (మంతెకూటము) సమీపము. దీనికి ఉత్తరమున నున్నది గోదావరి. ఈ భాగమునకు గోదావరి మండలమన్న పేరు ఎప్పుడును లేదు. మన తూర్పు గోదావరి పశ్చిమ గోదావరిజిల్లాలు గోదావరి మండలముగాని సబ్బినాడు గోదావరి మండలమా? అట్లుండినయెడల విమర్శకుడు ప్రమాణము చూపిన ఒప్పుకొనవలసిందే. పాపము, సబ్బి సాయిరము మన రాజమండ్రి నిడుదవోలు ప్రాంత ప్రదేశమని తలచినట్లున్నారు. తొందర! మల్లంపల్లివారి రచనలుకాదుగదా తుదకు, ఆంధ్రకవితరంగిణినిగాని చక్కగా చూచి రాయని యాశ్చర్యము కలుగుచున్నది. అర్థమై యుండదు.

మడికి సింగన తారీఖు క్రీ.శ. 1347 అని నేను వ్రాసినది. ప్రమాదము కాదనియు సప్రమాణమనియు నిరూపించితిని. అతడు తిక్కన పుత్రునికి దౌహిత్రుడని అచ్చుపడినది పొరపాటే, ఒప్పుకొనియెదను. తొందరలో పడినది. కాని తిక్కననుండి వీరి విమర్శలో లెక్కించిన వంశానుక్రమము ప్రకారముకూడ, నాయొక్క తారీఖు సరి. సింగన, తిక్కన కుమారుడైన కొమ్మన కుమార్తెకు మనుమడు. తిక్కనకు తర్వాత నాలగవ తరము వాడు. తరమునకు ఆంగ్ల పద్ధతిని చరిత్రవ్రాయువారు ఇరువది యైదు సంవత్సరములే లెక్కించుకొన్నారు. తిక్కనకాలము, అనగా మనుమసిద్ధి కాలము (చివరి తారీఖు 1261 లేక 1263) (దీనిని గురించి ఈ విమర్శకుల అజ్ఞాన విజృంభణమును క్రింద తిక్కన కాలమును గురించి తర్కించునప్పుడు వ్రాసెదను. దానికి వంద సంవత్సరములు చేర్చిన 1360 క్రీ.శ. అగును. తిక్కన కాలము 1260, కొమ్మనది 1285, ఇల్లాడమంత్రిది 1310, అయ్యలమంత్రి 1335, సింగన 1360. కుమారుల కన్న, కుమార్తెలకు సంతానము త్వరగా కలుగును కావునను, తిక్కన మనుమసిద్ధికన్న పెద్దవాడుగాన (నీ నెవ్వ మామయని యెడు దీనికి') మనుమసిద్ధి తన మరణకాలమున ముప్పది లేక ముప్పది యైదేండ్ల వాడైయుండిన, (ఏలయన అతనిది రణ మరణము), తిక్కనకు ఏబదియైన నాటికుండును. ఇట్లైన మడికి సింగనకును, తరమునకు 25 లెక్క ప్రకారము 1360కి 50 ఏండ్లుండును. కాబట్టి 1345 నాటికి ముప్పది యైదేండ్లవాడై రామగిరికి పోయియుండును. అతని తండ్రి అయ్యల మంత్రి 1335కు ఏబది ఏండ్లవాడు. 1353 (తొయ్యేటి అన పోతనాయుని యవసాన కాలము) నాటికి 68 యేండ్ల వృద్ధుడు, లేదా డెబ్బది ఏండ్లవాడు అచిరకాలములోనే గతించి యుండును. ఇదిసరిగానే కుదురుచున్నదిగదా.

కందనమంత్రి కాలమును నిర్ణయించుచు శ్రీ చాగంటి శేషయ్యగారు (ఆంధ్రకవి తరంగిణి, నాల్గవ సంపుటము, పుట 174) ఇట్లు వ్రాసియున్నారు. "కాపయ నాయకుడు క్రీ. శ. 1345 మొదలు 1367 వరకు రాజ్యముచేసెను. తొయ్యేటి అనపోత భూపాలుడుకూడా నా కాలమందున్నవాడు. సింగన కవి తండ్రియైన అయ్యలమంత్రియు నా కాలములో నున్నవాడు. అయ్యలమంత్రియొక్క జననము 1330 సంవత్సర ప్రాంతమనియు దన ఇరువదవ ఏట మంత్రిత్వము వహించెననియు దలంపవచ్చును. పద్మపురాణము ముగించునాటికి సింగనకవికి నలువది యైదేండ్లుండునని యనుకొందుమేని, అయ్యలమంత్రి 45 సంవత్సరముల వయస్సున అనగా క్రీ.శ. 1375 సంవత్సర ప్రాంతమున సింగనకవి జన్మించి యుండుననియూహింప వలసియున్నది. ఈ యూహ సరియైనదని యే నాయభిప్రాయము. కృతిపతినిబట్టి చూచినను నీ కాలము సరిపోవుచున్నది. గణపతిదేవుడు క్రీ.శ.1260 సంవత్సరమువరకు రాజ్యము చేసినట్లు శాసనములవలన నిర్ధారణ మగుచున్నది. (ఇది సరికాదు. గణపతి చివరి తారీఖు 1269) ఆ కాలమున పప్పయమంత్రి యున్నట్లు పైన వ్రాయబడిన

పద్యములలోనున్నది కదా! గన్నయకు, గండనమంత్రి మనుమనికి మనుమడు. వీరురిరువురి నడుమ నాల్గు తరములున్నవి. తరమునకు ముప్పదేండ్ల వంతున జూచితిమేని, కందనమంత్రి నలువదేండ్ల వయసున క్రీ. శ. 1420వ సంవత్సరములో బ్రహ్మపురాణమును కృతినంది యుండెననుట సమంజసముగనే యున్నది.''

ఈ వ్రాతయంతయు 'ఆకరయుగానల' పద్యమును విశ్వసించి వ్రాసిన వ్రాతగాని వేరుగాదు. అందులకనుగుణముగా చేసికొన్న ఊహా సాధనము. వట్టి చేతులు మూరలు వేయుట. ఇట్టి వ్రాతలనే విశ్వసించి మంచి చరిత్రకారుల రచనలను అర్థముచేసుకొను శక్తిలేక విమర్శకులు దండయాత్ర బయలు దేరినారని ముందే నిరూపించితినిగదా. శేషయ్యగారి వ్రాతను గూర్చి రెండు మాటలు వ్రాసెదను. వీరికి ఏ లెక్కప్రకారము అయ్యలమంత్రి జననము 1330లో కుదిరినదో తెలియలేదు. ఇరువదవయేట నీతనికి మంత్రిత్వము వచ్చినదెట్లు కను గొన్నారు? మరి కందనమంత్రి కాలమును లెక్కించుటలో 1260ని ఏల గ్రహింపవలెను? గణపతియొక్క అవసాన కాలము గద అది. అప్పుడా మొదటి గన్నయ కొలువులో ప్రవేశించి ప్రభుత్వము చేసినది కానేకాదు. ఇంకను చాలాముందు పోవ లెను. గణపతి కాలము క్రీ.శ. 1198— 1269. క్రీ.శ. 1198నే ఏల గ్రహించి లెక్కింపరాదు? తరమునకు ముప్పది వంతున(వీరి లెక్కప్రకారము) నాల్గు తరములకు 120 ఏండ్లు. అనగా 1198+120=1318 అగును. పోనిండు గణపతి రాజ్యకాలము నడుమ 1230నుండి లెక్కించిన 1230+120 =1350 కాని 25 సంవత్సరములుగనే చరిత్రకాల నిర్ణ యము. కావున 1230+100=1330. క్రీ. శ. 1345 నాటికి మంచి నడి వయస్సువాడై యుండుటలో నాశ్చర్యం లేదు. కాని ఎందులకీ బాధ! క్రీ. శ. 1345 నుండి 1355 లేక 1360 వరకు అతడున్నట్లు తెలియుచునే ఉన్నదిగదా. ఏది ఎట్లున్నను కందనామాత్యుడు క్రీ.శ. 1420లో లేడు.

ఇందులకు ప్రబల సహాయకముగా సింగన కవిస్తుతిలో నన్నయ్య, తిక్కనలేగాని ఎఱ్ఱన కానరాడని శ్రీ మల్లంపల్లి మహనీయులు సూచించినది గుర్తింపవలసియున్నది. నాచన సోమనాథునిగాని ఎఱ్ఱననుగాని ఈతడు స్తుతింపలేదు. అందుచే నితడు పదునాల్గవ శతాబ్దివాడుగాని పదునైదవ శతాబ్దివాడు కాడని శ్రీ శర్మగారి యభిప్రాయము. నేనింకను ముందునకు కొని పోయితిని. ఎఱ్ఱనయు నాచన సోమనయు నీత నికి సమకాలికులు. నాటికింకను లబ్ధ ప్రతిష్ఠులు కానందున తన ఈడువారే యైనందునను, శ్రీ వీరేశలింగము పంతులు వారన్నట్లు 'స్వాతిశయ భావము, కలవాడయినందునను వారి పేరెత్తలేదు, నాచన సోమన మొదటి బుక్కరాయలు కాలము వాడు. ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి యాస్థానములోనివాడు.

'కవిద్వయ కాలము' ఒకటి కలదాయని విమర్శకుల ఆక్షేపణ. సింగన, నన్నయ్య తిక్కనలతోనే నిలుపుట కర్థమేమో! మారన మంచనలవలె 'కవిద్వయమును'నే స్తుతించు కాలము వాడనుట తెల్లముగదా. ఎర్రన నాచనసోములుకూడనంతే, కానిచో కవిస్తుతిలో కేతన, మారన, మంచనలు వచ్చిరా. దీనింగూర్చి ముందుమ్మందు.

సింగన 'తొయ్యేటి అనపోత భూపాలునికి ఆశ్రితు'డనుట ఘోర ప్రమాదమట. తండ్రియొక్క ప్రభువు కుమారునికిని ప్రభువే. నాటివాడను నభిప్రాయమున స్థూలము గా వ్రాసిన వ్రాత కింత తీవ్ర విమర్శ వృథాప్రయాస. కారణ విశేషముల చేత ముప్ప భూపాలునితో సబ్బినాటికి పోయినాడుగాని లేకున్న తండ్రివలె ఉండవలసిన వాడేగదా- 'కూనయ ముప్పప్ప పాలక' అను పద్యముచేత 'ఒకప్పుడైనను సింగన, తండ్రి తరువాత తొయ్యేటి అనపోత భూపాలుని యాస్థానమున నున్నవాడన్న మాహకైన నాధారము లేకుండ తానే చెప్పుకున్నాడు'' అని ఆక్షేపము. అదెట్లు సరిపడును? ఆయా గ్రంథముల రచనా కాలమున వారు వారు పోషకులగుదురు. శ్రీనాథుని కాశీ ఖండమున మామిడి సింగనాదులను పేర్కొనెనా? తిక్కన భారతములో మనుమసిద్ధి పేరెత్తెనా? ఊహకైన నాధారము ఎట్లులేదు? తత్పూర్వముండియుండరాదా? పై రచనలవలన పూర్వ చరిత్ర తెలియునా? తండ్రి అనపోత భూపాలునికడ కొలువులోనుండగా నీతడు తండ్రి ప్రభువు మొగమైనను చూచి ఎరుగడా? ఇంట జగడమాడి పారిపోయినాడా? ఏమి వ్రాత, ఏమి 'రిసర్చి', ఏమి పరిశోధన!!! వీరందరున్ను మహావీరుండైన కాపయనాయకుని ఆశ్రిత కోటిలోనివారు. అతని ఏర్పాటుచేత గురజాల ప్రభువుల వంశస్థుడు సబ్బిసాయిరమునకు పోయి నాడుగద. వారందరును ఒక రాజకీయ వర్గమువారైనందు నను తండ్రియొక్క అవసాన దశకాకపోయినను, పెద్ద వయస్సున్న తాను తెలంగాణమున కేగినందునను, ఆ వెనువెంటనే అంతటి కావ్యములు వ్రాసియున్నందునను, 1345కుపూర్వము అనపోత భూపాలునికికూడా ఆశ్రితుడుగా నుండియుండుటలో నాశ్చర్యం లేదు. ఇదియొక తప్పుకాదు, ఘోర ప్రమాదమంతకన్నను కాదు.

తిక్కన కాలము

నా 'నన్నెచోడుని కాలనిర్ణయము' అను ప్రకరణములో ''నిదమిద్ధముగ నొక 'నిర్ణయ పద్ధతి' లేదు'' అని ఏదేదో

వ్రాయుచు ఆక్షేపకులు నన్నయ తిక్కనలను నేను కవిద్వయ మన్నది తప్పన్నారు! 'కవిద్వయ సంప్రదాయ మొకటి యున్నదా' 'ఇదియొక నూతన సృష్టి' పై భాగమునను సరించి నన్నయ తిక్కనలకు ఎఱ్ఱనకు మధ్య చాలాకాలముగాక పోయినను కొంతకాలమైనను గడచియుండవలెను గదా. అట్టి వ్యవధి యున్నదా ?' అని పెద్ద దెబ్బ తీసినట్లు తలచి పిచ్చిపిచ్చిగా వ్రాసినారుగదా. తిక్కన యెఱ్ఱనలకు మధ్య వ్యవధియే లేదట ! కొంత వ్యవధియైన నుండిననే యొక సంప్రదాయ మున్నట్లు లేకపోయిన లేనట్టుట ! పైగా 'నేటి వాఙ్మయచరిత్రల ననుస రించి తిక్కన క్రీ. శ. 1210—1300 మధ్యవాడనియు ఎఱ్ఱన క్రీ. శ. 1280—1340 ప్రాంతమువాడనియు సప్రమాణముగా నిరూపితమైనది. అట్టి యెడల తిక్కన ఎఱ్ఱనల మధ్య కాలవ్యవధి యుండుననుట గంధర్వనగరము వంటిది' అని యొక వ్రాత. అది (గంధర్వ నగరము) తాము నిర్మించుకొన్నదే. ఈ యాధునిక చరిత్రకారులు ఎవరో కారు తామే. ఒక ప్రమాణమైనను చూపకయే సప్రమాణమట ! తమ నిరాధారపు పిచ్చి యూహలు చరిత్ర యెట్లగునో ! ఎవరైన లంగీకరించి యుండిన గదా. 'భారత రచనా కాలము నకు మనుమసిద్ధి లేడు— ముత్తుకూరి కడ క్రీ. శ. 1261లో పాండ్యులతోడి రణరంగమున హతుడయ్యెను.' అని నేను వ్రాసినదానిని ఆక్షేపించి ఇది ఎంతమాత్రము సరిగాదు. మనుమసిద్ధి క్రీ. శ. 1291 వఱకు జీవించి యున్నట్లు శాసన నిదర్శనమున్నది' అని వ్రాసి సర్. వి. రామేశంగారి Andhra Chronology నుండి కొన్ని ఇంగ్లీషుపంక్తు లుదాహరించినారు. అంతయు తప్పు, బొత్తిగా చారిత్రకజ్ఞానము లేని బడిపిల్లల వ్రాతకన్నా నన్యాయము. 'మూడవ మనుమసిద్ధి' యట తిక్కనరాజు, దానిని మించి ఈతడు విజయగండ గోపాలుడట ! అయ్యయ్యో ! ఏమి పాండిత్యము, ఏమి చారి త్రకజ్ఞానము ! తిక్కన ప్రభువు రెండవ మనుమసిద్ధి (సిద్ధి శబ్దము సాధువు, సిద్ధి అసాధువు) గాని మూడవవవాడు కాడు. అట్టివాడు లేడు. రెండవ మనుమసిద్ధి కుమారుఁడు రెండవ తిక్కరాజు (క్రీ. శ. 1278—9 నుండి 1282) ఇతని వెనుక మనమగండ గోపాలుడు క్రీ. శ. 1282—1290 వఱకును, తర్వాత, రాజగండ గోపాల బిరుదాంకుడు రంగనాథుడు క్రీ. శ. 1315 వఱకును పాలించిరి. రెండవ మనుమసిద్ధి వీరగండ గోపాలుడుగాని విజయగండ గోపాలుడు కాడు. ఇటీవల ప్రకటింపబడిన The Early History of the Deccan (యాజ్దానీగారి సంపాదకత్వము—ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వమువారి కొఱకు అక్సుఫర్డువారిచే ప్రకటింప బడినది) అను గ్రంథములో శ్రీయుతులు నేలటూరి వెంకట రమణయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మగారలు కలసి వ్రాసిన కాకతీయ చరిత్రలో నెల్లూరి చోడవంశమును గూర్చి ఇట్లున్నది. (పుట. 603)

"Ganapatis Southern Expedition. The state of affairs in the south underwent a change with the death of Tikka in A. D. 1248. The kingdom of Nellore was plunged into anarchy. Ganapati was soon called upon to intervene and restore peace and order. On the death of Tikka the succession to the throne of Nellore was in dispute. The principal claimants were Tikka's son Manuma Seddi II and a certain Vijaya or Vijaya Ganda-gopala, a prince whose relationship with the Nellore branch of Telugu chola royal family is uncertain, on the death of Tikka Vijaya seized the Chingleput and North Arcot district then included in the kingdom of Nellore leaving only the northern parts of it, comprising the present Nellore and Cuddapah districts in the possession of his rival. To strengthen his position he then entered into an alliance with the kings of Dravida and Karnata ...... Having thus strengthened himself, Vijaya - Ganda - Gopala appears to have made an attempt to extend his authority northwards into the Nellore district.

(సూళ్లూరుపేటలో ఇతని రెండవ సంవత్సరపు శాసనము కలదు)

At the same time a rebellion headed by Padiharis Bayyana and Tikkana (Akkana), broke out in Nellore. against Manuma Siddhi II, who was as a consequence driven from his capital." ఇటు తర్వాత కాకతీయ గణపతి తిక్కన ప్రార్థనమీద నెల్లూరికి వచ్చుట మనుమసిద్ధిని రాజ్యమందు ప్రతిష్ఠితుని చేయుట మున్నగు విషయములు తెలుపబడినవి.

కాబట్టి తిక్కన ప్రభువు రెండవ మనుమసిద్ధిగాని మూడవవాడు కాడు. శ్రీ రామేశంగారు విజయగండ గోపాల వీరగండ గోపాలుర భేదమును గుర్తింపక వ్రాసిన తప్పు చరిత్రను సరిచూచుకొనకయే 'అంధువునంబడు అంధాను గాంధుని' వలె ఇతరులను అనుసరించి ఇట్టి ఘోర ప్రమాదము పాలైనారు. విజయగండ గోపాలునికిని తిక్కనామాత్యు

నికి సంబంధములేదు. ఈ విజయగండ గోపాలుని మనుమసిద్ధి జయించినట్లు నిర్వచనోత్తర రామాయణమునందు తిక్కన వ్రాసియే యున్నాడే చదువుకోలేదు కాబోలు ! పద్యము 39, కృత్యాది. Goli 4-A.

''ద్రవిడోర్వీపతి గర్వమందు నిమిశౌ
ర్యం బొప్ప గర్ణాట ద
ర్ప విఘాతంబు నొనర్చి వైరి మనుజేం
ద్ర శ్రేణికిం గొంగనా
నవనిం బేర్కొనియున్న యట్టి విజయ
క్ష్మాధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళవ మన్మసిద్ధి యని ప్రా
యోటం బ్రాగాశోద్ధతిన్.'

ఈ విజయక్ష్మాధీశ్వరుడే విజయగండ గోపాలుడు. ఇంకను ప్రథమాశ్వాసాంతమందు 'విజయగండ మర్దన డెలమిన్' అనియు, పంచమాశ్వాసాంతమున 'విజయగండ ద్రోహి బాహాసికుర్విన్' అనియు తిక్కన వ్రాసియుండగా ఇట్టటి ఆంధ్రవాఙ్మయ విద్యారత్నము చదువుకొనకపోవుట ఆశ్చర్యమే ! ఇందలి ప్రాయేరు తంజావూరు జిల్లాలో నుండు 'పళైయార్రై' అను ప్రదేశము. నదికాదు. అచ్చట మనుమసిద్ధి విజయము గాంచెను. శత్రువును పట్టుపెట్టుటకు అంత దూరము పోవలసి వచ్చినది. అందుచేతనే 'ద్రవిడోర్వీపతి గర్వమందునను' వలసి కూడ వచ్చినది.

ఇకను ఈ మనుమసిద్ధి మరణకాలమును గురించి చర్చించి నాటి కావ్యముల రచనాకాలములను తర్కించెదను. మనుమసిద్ధి క్రీ. శ. 1261 (లేక కొందఱి మతమున 1263 కు) తర్వాత లేడను విషయము అందఱును ఎఱిగి బడిపిల్లల పుస్తకములకు కూడ ప్రాకినది. మా ఆచార్యులు శ్రీ కె. ఏ. నీలకంఠశాస్త్రిగారు 1929 లో తాము వ్రాసి ప్రకటించిన The Pandyan Kingdom అను పరిశోధక గ్రంథము(పుటలు 167—168) ఇట్లు నిర్ణయించినారు—

"Lastly Sundara Pandya claims to have killed Gandagopala, occupied Kanchipuram, defeated Ganapati, the kakitiya king and performed a virabhisheka in Nellore. This is conformed by some inscriptions (Nos 332, 340, and 361 of 1913) from Chidambaram which contain Tamil verses stating that Sundara Pandya 'Inflicted a severe defeat on the Telungas at Mudugur slaughtering them and their allies, the Aryas, right upto the bank of the Perar and driving the Bana chief into the forest. [ARE, of 1914 part II para 18] All these references are apparently to various occurrence in the course of a single campaign aginst the the northern kings' and if that be so, the reference to Ganapati would mean that campaign was undertaken sometime before A. D. 1260. The enemy against whom the campaign was primarily directed was Gandagopala, a Telugu - Choda ruler who was in possession of Nellore and Kanchipuram. The Bana chieftain and the kakitiya king were perhaps the allies of Gandagopala whom Sundara Pandya did not pursue after they were repulsed in battle. Gandagopala was however 'sent to the other other world,' as an iuscription from Chidambaram records and his territory was annexed to the Pandaya empire and entrusted to his brothers who 'were apparently to rule as feudatories of the Pandya soveriegn.

(ఇచ్చట Foot Note లో నిట్లు వ్రాసినారు '.... వీర గండ గోపాల విపిన దావ దహన .... '**விக்கி யவன் கழற் கண்டகோபாலனை விண்ணுலகிற் போக்கி**' గండగోపాలుని ఊర్ధ్వలోకమునకు పంపి యని స్పష్టముగా నున్నది.)

ఇదంతయు నేను నా 'నన్నిచోడుని కవిత్వము'లో వ్రాసియే యున్నాను. (పుటలు 27—28) మనుమసిద్ధి శాసనములు కూడ ఈ తర్వాత కానరావు.. ఈ విషయమును చరిత్రకారులు చిన్ననాడే గ్రహించినారు.

క్రీ. శే. చిలుకూరి వీరభద్రరావుగారు తమ యాంధ్రుల చరిత్ర (1912 పుట 87) లో నిట్లు వ్రాసియున్నారు. ''క్రీ. శ. 1260 వ సంవత్సరాంతము వఱకు మనుమసిద్ధిరాజు బ్రదికియున్నట్లుగా శాసనములు గానంబడ్డి యుండుటచేత నా సంవత్సరమునకుందరువాతనే కాటమరాజు కథ నిజమైన యెడల మనుమసిద్ధిరాజు మరణము నొంది యుండవలయును.'' నాటికి పాండ్యుల చరిత్ర తెలియదు.

క్రీ. శే. వీరేశలింగము పంతులవారు ఆంధ్రకవుల చరిత్ర (1917 సం. పు. 86) లో నిట్లు వ్రాసియున్నారు— ''1262 సంవత్సరమునకుం బయిని మనుమసిద్ధి శాసనము

లెందును గానరావు. అందుచేత నాతడా తరువాత వల్ప కాలములోనే కాలధర్మము నొందియుండును.''

శ్రీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు తెనుగు సంస్కృతి సంపుటము, పు, 809 లో తిక్కనపై వ్రాయుచు నిట్లు తెలిపినారు—''నెల్లూరి తెలుగు చోళులలో రాణకెక్కిన వాడును, మనుమసిద్ధికి తండ్రియునైన తిక్కరాజు క్రీ. శ. 1248 వరకు అరిభయంకరుడై రాజ్యమేలెననియు, పద భ్రంశము నొందిన రాజులకు సాయముచేసి వారిని తిరిగి సింహాసన ప్రతిష్ఠితులను చేసెననియు శాసనాధారములను బట్టి చెప్పుదురు. ఆ శాసనాధారములను బట్టియే మనుమసిద్ధి తండ్రి తరువాత సింహాసనమెక్కి క్రీ. శ. 1262 ప్రాంతమున దివంగతు డయ్యెననియు ఊహింపబడెను. ఆయన సింహాసన మెక్కుట, తిక్కన మంత్రి పదవిని స్వీకరించుట ఇంచుమించు ఏకకాలికములై యుండును. అప్పటికి (క్రీ. శ. 1248 నాటికి) తిక్కనకు ఎంత తగ్గించి చెప్పినను 35,40 సంవత్సరముల ప్రాయముండ వలెను. అగుచో తిక్కన జనన కాలము క్రీ. శ. 1205—1210 మధ్యకాలము అయి యుండును...''

శ్రీ ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనముగారు తమ ఆంధ్ర సాహిత్య చరిత్రము (పుట 31) లో — 'నెల్లూరి మనుమ సిద్ధిరాజు శాసనములు క్రీ. శ. 1256 — 62 సంవత్సరముల నడుమ కాన్పించు చున్నవి.' అనియు తమ ఆంధ్రుల సంస్కృతి (పుట 235)లో, 'మనుమ సిద్ధిరాజు పాండ్యులతో క్రీ. శ. 1263 ప్రాంతమున ముత్తుకూరి యుద్ధ రంగమున పోరి లోకాంతర గతుడాయెను.'' అనియు వ్రాసి యున్నారు.

శ్రీ శిష్ట్ల రామకృష్ణశాస్త్రిగారు తమ ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సర్వస్వము 1 సంపుటమున, (పు 374) ఇట్లు వ్రాసియున్నారు. 'మనమసిద్ధి శాసనములు క్రీ. శ. 1262 వఱకును, నతని తండ్రియగు తిక్కరాజు శాసన ములు క్రీ. శ. 1240 వఱకును గనిపించుచున్నవి. కాన మనుమసిద్ధి 1240—1262 వఱకు రాజ్యపరిపాలనఁ జేసె నని నిర్ణయింపవచ్చును.' (ఇది మదరాసు విశ్వవిద్యాలయము వారి ప్రచురణ.)

పండిత వతంసులు శ్రీ వేటూరి శివరామశాస్త్రిగారు ఇటీవలి వావిళ్లవారి హరివంశ ముద్రణోపోద్ఘాతములో (పు 6) ''క్రీ. శ. 1256 మొదలుకొని 1260 వఱకును మనుమ సిద్ధి శాసనములు అగపడుచున్నవి. కాటమరాజ మనుమ సిద్ధులు పుల్లరి పోరితములో క్రీ. శ. 1263 న చనిపోయిరి'' అని వ్రాసియున్నారు.

ఈవిధముగా కొద్ది వ్యత్యాసముతోను కొన్ని విషయ ముల భేదముతోను పండితులేమి, పరిశోధకులేమి, మనుమ సిద్ధి మరణకాలము క్రీ. శ. 1263 కు ముందని వ్రాసి యుండగా ఈ విమర్శ రచయిత ఈ గ్రంథములలో నేటిని గాని చూడలేదని తెలియుచున్నది. తుదకు రామేశంగారి మారుమూల తప్పు రచనతో చరిత్రకారుని బెదరించుట హాస్యాస్పదముగా నున్నది.

వీరగండ గోపాల బిరుదాంకితుడైన రెండవ మనుమ సిద్ధి క్రీ. శ. 1960—63 నడుమ రణమరణమందినది స్పష్టముగా నిరూపితమైనందున తిక్కన నిర్వచనోత్తర రామాయణమును కేతన దశకుమార చరిత్రమును అంతకు ముందే, చాల ముందే, గాని తర్వాతికి ఎంతమాత్రము కుదు రదుగదా. అట్లుండగా నీ విమర్శకులు ''నిర్వచనోత్తర రామా యణమునందలి చారిత్రకాంశములనుబట్టి—ఆ కృతి రచనము క్రీ. శ. 1268 ప్రాంతమని చారిత్రకులు నిర్ణయించి యున్నారు'' అని, అందులకు ప్రమాణముగా ''శ్రీ ముట్నూరి వెంకటరామయ్యగారి తెలుగు చోళుల చరిత్ర—ఇది యాంగ్లేయ భాషలో నున్నది. ''History of Telugu Cholas'' అని దానిపేరు.'' అని అధోజ్ఞాపికలో సూచించినారు. శ్రీ ముట్నూరి వెంకటరామయ్యగారిది 'The Early History of the Telugu Cholas'', అచ్చుపడని 'థీసీసు'. మదరాసు విశ్వవిద్యాలయము లైబ్రరీలో నున్నది. పోయి చూచితిని. అందులో నెల్లూరి చోళుల చరిత్ర లేదు. తొమ్మి దవ శతాబ్దముతో నిలిచిపోయినది. పుట 23 లో రచయిత నిర్వచనోత్తర రామాయణమును గురించి ఇట్లు వ్రాసి యున్నారు.—

''The work composed entirely in Telugu verse about the middle of the 13th century A. D., was dedicated to the Telugu Choda king Manumasiddhi II of Nellur.''

అంతేగాని, క్రీ. శ. 1268 తారీఖు నాకు కనబడలేదు. విమర్శ కుడు పుట తెలుపును గాక, ఉన్నయెడల.

ఇప్పుడు ఆక్షేపకుడు పరస్పర విరుద్ధములని యున్న మూడు విషయములలో ఒకటి తేలిపోయినది—నిర్వచ నోత్తర రామాయణము. రెండవది 'కేతన దశకుమార చరిత్ర, క్రీ. శ. 1261 కి ముందే రచితము' అనునది కూడ ప్రత్యక్ష రము సాధువే. ఈ రెంటి పౌర్వాపర్యమును గూర్చి—ఆక్షేప కుని వాక్యములు—''కేతన దశకుమార చరిత్రలో నిర్వచ నోత్తర రామాయణ ప్రస్తావనయే లేదే ! ఇక నిర్వ చనోత్తర

రామాయణమువంటి కృతి నంకితముగా గొన్నచో కేతన వానిని గూర్చి చెప్పియే యుండును గదా—అట్టి దేదియు నాతఁడు స్పష్టపరుపలేదు. 'కృతులు రచింపఁగ సుకవుల కృతులొప్పఁ గొనంగ' అనియు 'లలిత నానా కావ్యములు సెప్పు నుభయ భాషలయందు' అని సామాన్యముగా జెప్పినాడే గాని, ప్రత్యేకించి యొకదానినైన పేర్కొనలేదు.'' అని.

కేతన దశకుమార చరిత్రలో నిర్వచనోత్తర రామాయణ ప్రసక్తి లేనట్లే కాకతి గణపతి ప్రస్తావము. అక్కన బయ్యనల చరిత్రగాని, కాటమరాజాదుల కథలుగాని కానరావు. మనుమసిద్ధి ప్రస్తావ మున్నను ఆతని దిగ్విజయములు కానరావు. అంతమాత్రమున అది ముందు దనుటకు అవకాశము లేదు. తిక్కనకు అంకితమీయబడు గ్రంథమున మనుమసిద్ధి విజయప్రస్తావము అప్రసక్తము. ఆ రాజును గుఱించి కొద్దిగా చెప్పుటయే అందము. కాని 'కృతులు రచింపగ సుకవుల కృతు లొప్పగొనంగ' అనుట కేమర్థము ? ఆ కృతులకు ఆకృతులు లేవా ? పేర్లు చెప్పరాదా ? చాటుమాత్రములా? నిర్వచనోత్తర రామాయణ దశకుమార చరితముల పాటివి కావా ? అట్టి అల్పకృతులనా తిక్కనామాత్యుడు రచించుచును కొనుచును ఉండెను ? నమ్మదగిన వాదమా యిది ? ఆ దశకుమార చరిత్రయందే.

'అభినుతుఁడు మనుమ భూవిభు
సభఁ దెనుఁగున సంస్కృతమునఁ జతురుండై తా
నుభయకవిమిత్ర నామము
త్రిభువనమున నెగడ మంత్రి తిక్కఁడు దాల్చెన్.'

అని యున్నదిగదా, పేళ్లేవీ ? ఇవికూడ చాటుమాత్రములా ? లేకపోయిన క్షుద్రకావ్యములా ? ఉభయకవిమిత్ర బిరుదము నిర్వచనోత్తర రామాయణమున నున్నది. కావున చెప్పుకోదగ్గ ప్రబంధములు నాటికే యుండవలెను గదా. కాని నిర్వచనోత్తర రామాయణమునుండి ఇది తెలియుచున్నది—తత్పూర్వము మనుమసిద్ధి సభలో తిక్కన ఏమి కవిత్వము చెప్పెనో గాని మనుమసిద్ధికి మొదటి అంకితము నిర్వచనమే, ఏలయన రాజే అడిగి వ్రాయించుకొనుటలోనే తెలియుచున్నది. తిక్కనకును ఇది ప్రథమదశ. లేనిచో తన పితామహుని చూచి లోకము తన్ను మన్నించునని యేల చెప్పుకొనును ? పైగా తన సుగుణముల తానే చెప్పుకొని 'సూరుల కివ్విధ మింపు నెంపదే' అని యొక ప్రాథమిక కవి కనుగుణమైన వినయమును చూపుచున్నాడు. ఇవి యన్నియు నటుండ విమర్శకుని అడుగదగిన ప్రశ్న యొకటి కలదు. నిర్వచనోత్తర రామాయణముయొక్క ప్రశంస దశకుమారమున లేదని సంతోషించుచున్నారుగదా మఱి 'దశకుమార చరిత ముందుదై యుండిన యెడల ఆ విషయమును తిక్కన ఏల చెప్పుకొనలేదు ?' అను బదులు ప్రశ్న. ఎదురు చూడలేదు కాబోలు ! అంతటి కావ్యము అంకిత మందినప్పుడు మనుమసిద్ధి వాక్యములుగానే 'కృతు లంకిత మందుటకు వ్రాయుటకును నీవే తగినవాడవు' అను కేతన వాక్యము వంటిది తిక్కన పలికించియే యుండడా ?

కావున పేరు చెప్పినంత మాత్రమున నిచ్చట కాదనరాదు. కృతులు రచించుట ముందును కృతులు కొనుట వెనుకను, కేతన చెప్పిన వరుసలోనే అవి జరిగియుండును. రచించిన కృతి నిర్వచనము, కొన్నది దశకుమారము అని ఏల అన్వయింపరాదో తెలియకున్నది ? కేతన కూడ 'ఉభయ కవిమిత్ర' నామమును చెప్పినందున అది కూడ నిర్వచన రచననే సూచించుచున్నదనుట తెల్లము కాదా ?

మఱియొక విషయము—'అగునన గొమ్మయ తిక్కఁడు జగతి నపూర్వార్థశబ్ద చారుకవితమై నెగడిన, బాణోచ్ఛిష్టం జగత్త్రయమ్మనిన వలుకు సఫలంబయ్యెన్' (1—89) అనియు 'లలిత నానాకావ్యములు సెప్పు నుభయ భాషలయందు' 'పద్యాది త్రివిధకావ్య పారీణునకున్' ఇత్యాది కేతన చెప్పియుండుట చేతను, 'భారవికల్ప' (9—85) 'ఆర్యభోజుండు' 2—20) 'మయూర సన్నిభమహాకవి'' (1—6) అని తిక్కనను పై ముప్వురికి పోల్చుటచేతను 'ఈతని కవనములో భారవి అర్థ గౌరవమును, మయూరుని పరిశ్రమును, భోజుని చదురును గలవు'' అని మా తాతగారు వ్రాసియున్నారు. (చూ. వారి తిక్కనసోమయాజి విజయము). దశకుమారమునకు ముందు అట్టి కావ్యము లేకపోయిన యెడల ఈతడిట్లు వ్రాయుట సొంపారునా ? కావున నిర్వచనమే లట్టి రచన, రాజున కంకితమిచ్చుటచేత నిది మొదటిదనుటలో సందేహములేదు. తత్పూర్వము 'ఉభయ కావ్యప్రౌఢి వాటించు శిల్పమున పారగుడే' కాని ఏకృతియు కొన్నవాడుకాడు. తిక్కన మనుమసిద్ధి వలన :

అందలంబు, గొడుగు, నడపంబు మేల్కట్టు,
చామరములు, జమిలి శంఖములును,
కంబగట్లు, భూమి, కానికగాఁ గఁ బెం
పెసగు రాచపదమ్ము లెల్లఁ బడసె'

అని కేతన వ్రాసియున్నాడు. ఇట్టి సత్కారములు తానందినట్లు తిక్కన నిర్వచనోత్తర రామాయణమున వ్రాసికొనలేదుగదా. కాబట్టి ఎట్లు చూచినను దశకుమార చరిత్రమే తర్వాతిది, ఉత్తర రామాయణమే ముందుది.

నన్నెచోడుని కవిత్వము

ఇదంతయు ఎందులకు వచ్చిన బెడదనగా షష్ఠ్యంత్య ములకు కేతన మార్గదర్శకుడు కాడనియు వీనికొకనియమితమార్గము లేదనుటకు. నిర్వచనమును అంకితమిచ్చుచు. ఒక్క షష్ఠ్యంతమైనను వ్రాయక, భారతమున వ్రాయుట చూడగా ఉభయకవి మిత్రునికి ఆ పద్ధతి చక్కగా నచ్చినదని తేలుచున్నది గదా. అందులోను తర్వాతి యాంధ్ర వాఙ్మయ ప్రపంచమంతయు తిక్కన మార్గమునే అనుసరించియుండగా ఇదియొక నూతన రీతియనుటకు ఏమి సందేహము? ఇదంతయు నా 'నన్నె చోడుని కవిత్వము' అను పుస్తకమున చాల వివరముగానే వ్రాసియున్నాను. కేతన షష్ఠ్యంతములు వ్రాసినను అన్నియు కంద ములు వ్రాయకపోవుటయు, షష్ఠ్యంతాది అంకితకార్యానంతరము కొంత కథ నడిపి ఆశ్వాసము ముగింపక వానితోనే నిలిపి, కథతో ద్వితీయాశ్వాసము మొదలుపెట్టుటయు, మొదలైన పరిణామ దశలోనుండగా తిక్కన మొదటి గ్రంథములో లేని పరిణత మార్గము రెండవదానిలో కనబడుచుండగా, — ఈవిధముగా ఒక క్రమపరిణామము ఈ మూడు గ్రంథములలో కనబడు చుండగా, తర్వాతి ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమంతయు, కేతనను వదలి తిక్కనను అనుసరించియుండగా, ఈ మొండి వాద మెందులకో!

ఇప్పుడు, ఇవి 'క్రీ.శ. 1246కు ముందే ఉచితములు' అనుదానిం గూర్చి నేను నాయుపపత్తిని ఇట్లు వ్రాసి యుంటిని. 'ఈ రెండు గ్రంథములును కాకతి గణపతి (దక్షిణ) దండయాత్రకు ముందువి. గణపతి క్రీ. శ. 1246 ప్రాంతమున కంచివరకు వచ్చెనని నిదర్శనములున్నవి. ఇచ్చట మనకు చరిత్రలేదు. మనము నిర్మించుకొనవలసి యున్నది. చరిత్రకారులలో అభిప్రాయభేదము లగపడుచునే యుండును. నేనును చరిత్రకారుడనే. ఈ యాక్షేపకులు "క్రీ.శ. 1246 లోను మనుమసిద్ధి రాజ్యము పాలించుచున్నాడా అను విషయము గ్రంథకర్త విచారించలేదు. క్రీ. శ. 1246లో మనుమసిద్ధి రాజ్యపాలకుడు కాడు. అతని తండ్రి తిక్కరాజు పాలించుచున్నాడు. మనుమసిద్ధి— తండ్రి మరణానంతరము క్రీ.శ. 1250 సింహాసనము నెక్కెను. ఇదిశాసన ప్రమాణములచే నిర్ధారితమైనది." అని వ్రాసి మరల ఆ సర్.వి.రామేశంగారినే ఉదాహరించి,నారు. దీనిని గురించి,తారీఖులు, నిర్వచనోత్తర రామాయణమునకు దొరకినట్లు,. The History of the Telugu Cholas లో ధొరకలేదా? వేసి రామేశంగారి కన్న ఇతర చరిత్రకారులు కనబడలేదా? పోనిండు, ఆశాసనములనే ఉదహరింపరాదా? నాకుకూడ శాసన ప్రమాణము కలదు.

క్రీ. శ. 1243 — 44 ప్రాంతమున, నెల్లూరు జిల్లా రాపూరు తాలూకాలోనొక మనుమసిద్ధిరాజు శాసనము కలదు." తమిళము, 'మనుమశిత్తరశన్ మహారాజ్యత్తిలే' అని కలదు. ('శకవరషం ఆయిరత్తొరునూట్రు అరు పత్తై ం జావ్ వరుషత్తిల్ ' శక 1165 = 1243 — 44. నెల్లూరు శాసన సంపు. 3. పు 1257, రాపూరు 39) ఈ కాలమునకు తర్వాత తిక్కరాజు శాసనములును అల్లుందిక్క శాసనములును కనబడు చున్నవి. పై సంపుటములోనే (ఉదయగిరి 3.) క్రీ. శ. 1244 — 45లో తిరుకాళత్తి దేవ మహారాజునకు పుణ్యముగాను ఆలు తికరాంజు (అల్లు తిక్కరాజు) తిరుకాల దేవుడికి ఇచ్చిన ధర్మువు.' అని కలదు. ఇందు రాజునకు పూర్తి తెలుగు చోడ బిరుదములు ప్రయుక్తములు. శక. 1167 ఈ అల్లుందిక్కరాజు చోడ తిక్కరాజునకు అల్లుడనియు, ఇతని మామ తిక్క రాజనియు, క్రీ. శ. 1246 — 47లో కాంచీపురమును పాలించు చుండెననియు ఆత్మకూరు శాసనము 7 వలన తెలియుచున్నది. ఇట్లే చాల శాసనములను పరిశీలించి పై నెల్లూరు శాసన సంపాదకులిట్లు వ్రాసిరి.

"The ruling prince from 1243 44 or 1244 45 to 1255-56 (or 1247-48 at all events) seems to have been Allun Tirukkalattideva, but there were in existence, at the sametime his father-in-law also called Tirukala and a second person called Alu Tikkaraju Tirukuladeva or Alu Tikkayadeva. It has already been mentioned that there is a Pallava-descended chief called Allun Tirukkalati or Allun Tikka. He is mentioned in N. 16, dated 1182-83 and also N. 15."

వీనిని బట్టి తిక్కరాజు కాలములో అతని అల్లుడును పాలించుచుండెననియు, చివరి రోజులలో కొంత శాంతిచెడి, వారసులలో చీలిక లేర్పడి విప్లవమునకు దారి తీసినట్లు తోచు చున్నది. క్రీ. శ. 1243 — 44లో మనుమసిద్ధిరాజు కనబడి నందు చేతను, అట్లే క్రీ. శ. 1243 — 44, 1245 — 46 (ఉదయగిరి — 14) లోనూ తిక్కరాజునకు పుణ్యముగా దానములు అల్లుందిక్కరాజు చేసి అధికారము చెలాయించు చున్నందునను, తిక్కరాజు అంతకుముందే గతించి రాజ్యము కొరకు అల్లునికిని కుమారునికిని తగవులు ప్రారంభమైనవని చెప్పుటకు ఎంతైనను అవకాశము కలదు. ఇదివరలో అందరును తలచినట్లు మొదటి తిక్కరాజు క్రీ. శ. 1248 వరకు రాజ్యము పాలింప లేదు. అతని చివరి తారీఖు క్రీ. శ. 1240 — 41. మనుమసిద్ధి మొదటి తారీఖు 1243.

అల్కుందిక్క 245. ఇందులకు ప్రోద్బలముగా రాపూరు శాసన. 20 క్రీ. శ. 1247 — 48 నాటిది అల్లుతిరుకాళ దేవుని తమ్ముడు విజయాదిత్యుడనియును చున్నది. (పుటలు 1231 — 32). ఈ విజయాదిత్యుడే విజయ గండ గోపాలుడు ఏలకారాదు ?

తిక్కన (లేదా) అక్కన బయ్యనలు ఎవరు ?

' గండగోపాల ' బిరుదమును తాల్చువారు ఈ కాలమున చాలామంది కనబడు చున్నారు కాని 'వీరగండ గోపాలుడు' మనుమసిద్ధియే 'విజయగండ గోపాలుడు' అతని ప్రతిస్పర్థియే. అల్లుందిక్కరాజునకును విజయగండ గోపాలునికిని, తిక్కరాజు ' మరుమగన్ ' అని శాసనములలో కలదు. (వీరింగూర్చి ప్రత్యేకముగా వ్రాసెదను.) వీరే తిక్కన లేక అక్కనబయ్యనలని నాయభిప్రాయము. అక్కనబయ్యనలను తిక్కన బయ్యన లనియు పాఠాంతరము కలదు. విజయాదిత్య శబ్దము విజయ, బెజయ., బెజ్య, బయ్యయై ఈ ఇరువురే తర్వాతి కథలలో అక్కన బయ్యనలు ఏలయై యుండరాదు ? తరువాతివారు చేయు పొరపాటులచే అసలు చరిత్ర మరుగు పడుట కెన్నియుదాహరణములు లేవు. అల్లుందిక్కరాజు తర్వాత విజయ గండగోపాలుడు చాలాకాలముండి దాక్షిణాత్యులబలముచే వెల్నూరినిగ్రహించినది తెలియుచునే యున్నది గదా. ఇదంతయు సమన్వయించి ఎంతో పరిశోధన చేయవలసియున్నది. ఇంత చర్చించినయెడల నా 'నన్నెచోడుని కవిత్వము' కొన్నిసంపుటములు పెరిగియుండెడిది. సంగ్రహముగా సూచించితిని. చరిత్ర యెరిగిన పెద్దలు సంతసించినారు.

ఇచ్చట ఒకటి మాత్రము స్పష్టము — మనుమసిద్ధి తండ్రి మొదటి తిక్కరాజు శకము 1165 (1243 — 44) కు ముందే గతించెననియు ఆ వెను వెంటనే మనుమసిద్ధి రాజ్యమునకు రాగా కల్లోలములు బయలుదేరెననియు. కాబట్టి 1246 మనుమసిద్ధి రాజ్యమునకు రాలేదనుటకు అవకాశము లేదు. 1250 వరకు ఎక్కడ నుండి నాడు. నాటి యుద్ధ సంరంభములలో ఊరక యుండుట యెక్కడిది ? గణపతి దండయాత్ర ఎప్పుడు ? నిర్వచనోత్తర రామాయణ దశ కుమారములలో ఎచటను గణపతి ప్రస్తావము లేదు. ద్రవిడోర్వీపతిని అనగా మూడవరాజరాజునుగాని, మూడవ రాజేంద్రుని గాని భంగ పరచి, విజయుని ఇతడున్వయముగానే జయించినట్లే తిక్కన పద్యార్థము. ఇతడు స్వయము మహా యోధుడు. తిక్కన యిట్లు వ్రాసి యున్నాడు :

'నిరుపమ రణకేళీ నిర్దళద్వైరిధాత్రీ
వరతను గళితాసృగ్వారి పూరావగాహా
దరభర పరిఖేల ద్యాతు ధానాంగనా ని
ర్భర మదమధుర స్తోత్ర ప్రసన్నాత్మ చేతన్ '

' తన యాశ్రిత వత్సల వృత్తి యేర్పడన్ ..... గంగయసాహిణింబదము గైకొనబంచె ....' మరియిదంతయు గణపతి సాయము చేసైయుండిన యెడల గణపతి చక్రవర్తికి మిత్రుడనియో, ఆప్తుడనియో, ఒక్కమాటయైనను ఎచ్చటను పిగులనీయ లేదు గదా. పోనిండు తిక్కనామాత్యుడు రాజును గణపతి సాయముచే నుద్ధరించెనని గాని, గణపతికి మిత్రుడని గాని కేతనయు చెప్పడు. ఈ విషయములో మా తాతగారు తమ తిక్కన విజయ మను వ్యాసమున వ్రాసినది చూడదగినది — 'ఈతని నీతి పారగత్వము మనుమసిద్ధి రాజ్యమును కోల్పోయి నప్పుడు ఈయన (తిక్కన) ఓరుగంటి కాకతీయ గణపతి రాజును దర్శించి అతనిచే ఆ వైరుల నణగ ద్రొక్కించి మనుమసిద్ధిని వెండి నిజ సింహాసనాసీనుం గావించుటచే — మిక్కిలి రూఢి కెక్కినది. ఈ వృత్తాంతము ఆంధ్ర దశకుమార చరిత్రములో లేదు. వేరాకరములచే దెలియు చున్నది. ఇది ఆంధ్ర దశకుమార చరిత్రమునకు తర్వాత జరిగియుండ నోపు. అట్లు కానిచో తత్కవికేతన ఆ గ్రంథములో మనుమసిద్ధి మహావల్లభునకు ఈయన కరుణా పాత్రంబని వ్రాయుటకు మారుగా ఆ మహావల్లభుడే ఈయనకుం గరుణా పాత్రంబని వ్రాసి యుండును. 'మనుమసిద్ధి మహీవల్లభ స్థాపనాచార్య' అను నిట్టి తీరున వర్ణించి యుండును '' (పుట 6.)

కాగా, గణపతి సేనాపతి సామంత భోజుడు కాంచీపురమును ముట్టడించి జయించినట్లు క్రీ. శ. 1249 నాటి యొక శాసనమున తెలియుచున్నది. (JA, XXI PP. 122, 197) గణపతి దండయాత్ర క్రీ. శ. 1246కు అని నేను వ్రాసి యుంటిని. ఒకటి, రెండేండ్లైనను ముందు (1249కి ముందు) బయలుదేరియుండు ననుట సంభవమే. అంత ప్రమాదము కాదు. తారీఖు కొంత ముందుకు వచ్చినను ఫర్వాలేదు. ఉజ్జాయింపుగా వ్రాసితిని. కాని నా దృష్టి అదికాదు. గణపతి దండయాత్రకు ముందే ఈ రెండు కావ్యములు రచితములని. మనుమసిద్ధి క్రీ. శ. 1246లో రాజ్యమునకు రాలేదను ఆక్షేపము నిలువదు గదా. నిర్వచనోత్తర రామాయణములోని విజయములకును గణపతి దండయాత్రకును సంబంధము కానరానందు చేతను, విజయ గండ గోపాలుడు తర్వాత కూడా నున్నందు చేతను, ఈ తొలి విజయములు మనుమసిద్ధికి చేకూడినందు వలన అతడు పోయి తమిళ భూపతులను సాయము కూర్చుకొని మరల

నెల్లూరి నాక్రమించి యుండును. ఈ మారు తిక్కన గణపతిని దర్శించి యుండును. ఇదే తర్వాతి రచయితలు వ్రాసిన తిక్కన బయ్యనల కథయై యుండును. ఇదంతయు క్రీ. శ. 1249 కో లేక 1247కో జరిగి యుండును. తర్వాతి యుద్ధ పరంపర లలో విజయము ఇటునటు నుండి తుదకు క్రీ. శ. 1261కి తర్వాత మనుమసిద్ధి రణ మరణముతో శత్రు హస్తగతమై, తిక్కనకి నెల్లూర నిలువ నీడ లేక పోయెను. విషయమిట్లు లోతునకు పోయి చూడవలసి యుండగా 'మొత్తము మీద నీ రెండు గ్రంథముల రచనా కాలము ఏదో స్పష్టముగా నిరూపితము కాలేదు' అన్న విమర్శకుని వాక్యమున కర్థము, వీని కాలమును నిరూపించు శక్తిగాని, చారిత్రక శిక్షణ గాని, అతనికే బొత్తిగా లేవని. నాకాల నిర్ణయమున దొసగులుండిన విజ్ఞులు తెలిపిన నేను శిరసావహింతును.

తిక్కన భారత రచనాకాలము

అక్కన బయ్యనల వలన మొదట రాజ్యము పోయి నప్పుడు సాయము చేయ గలిగిన గణపతియే మత్తకూరికడ పరాజితుడై, మీదు మిక్కిలి రుద్రమదేవిని రాజ్యమందు కుదురు పరచు ప్రయత్నములో నుండి కదలింపరాకయుండి నందు చేతను తిక్కన మనుమసిద్ధి కుమారుని రాజ్యమందు ప్రతిష్ఠింప లేక పోయినాడు. పాండ్యులును పాండ్య సామంతులును కొంత కాలము నెల్లూరిని ఏలిరి. మనుమసిద్ధి కుమారుడు రెండవ తిక్కరాజు వెనువెంటనే రాజ్యమునకు రాలేదు. పాండ్య సామంత వీర రాజేంద్ర చోళుని చివరి శాసనము క్రీ. శ. 1268లో నున్నది. (ఎన్. 89. నెల్లూరి శా. సం.) తర్వాతనొక మహా మండలేశ్వర నాగ దేవరాజు కనబడు చున్నాడు. ఇతడు రుద్ర దేవ మహారాజు సామంతుడని యున్నది. ఈ రుద్రదేవుడు నాటి రుద్రమ దేవియే. రెండవ తిరుకాళ దేవుని శాసనములు 1279 నాటికి గాని కానరావు గదా. మనుమసిద్ధి కుమారునికి కాకతీయులు ఇప్పుడు సాయపడినట్లు కానరారు. శత్రువులేమో! లేనిచో నాగదేవునికెట్లు సాయ పడిరి? వల్లూరి కాయస్థమహీపతి అంబదేవుడు సాయ పడినట్లు కనబడు చున్నది. విజయ గండ గోపాలుడింకను నెల్లూరి ప్రాంతమున నున్నాడు. గూడూరు, చిత్తూరు ప్రాంతములలో నీతని శాసనములు 1276—77 వరకును కనబడు చున్నవి. అంబదేవుని రాజ్యము మీది కీతడు ఈ కాలమున దండెత్తి యున్నాడు. వీని నెల్ల చూడగా కాకతీయుల సాయము నెల్లూరి తెలుగు చోళులకు పోయినది., కాని శత్రువుల బాధ పోలేదు. కాయస్థ అంబదేవుడు మగల నితనిని నిలిపి కొంత కాలము రాజ్యము చేయించి నట్లూ హించుటకు అవకాశమున్నది. తిక్కన శిష్యుడు మారన కాకతి ప్రతాపరుద్రుని సేనాపతి యగు గన్నయ్యకు మార్కండేయ పురాణమంకిత మిచ్చి యున్నాడు. అతనివలన కాకతీయ సాయము వచ్చియుండరాదాయన్నచో ప్రతాప రుద్రుని రాజ్యారోహణము క్రీ. శ. 1295. కాబట్టి గన్నయ కాలము అది మొదలు గదా. రెండవ తిరుకాళరాజు కాలమున మారన ఎచ్చట నుండెనో! ఈ రెండవ తిక్కరాజు మూడు నాలుగేండ్లు పాలించినట్లున్నాడు. తర్వాత మనుమ గంగ గోపాలుడు రాజ్యమునకు వచ్చినాడుగదా. జక్కన చెప్పిన "నెల్లూరి తిరుకాళ మనుజ విభుడు" ఈ 1279 — 1283 నడుమ పాలించిన యతడే. ఈ కాలమున తిక్కన యుండిన యెడల ఆ విషయము దాగి యుండునా. జక్కన చెప్పియే యుండును. కావున క్రీ. శ. 1261 లేక 1263కు తర్వాతి తిక్కన మనుమసిద్ధి నాటి తిక్కనకాడు, అక్కన బయ్యనలను పారద్రోలించి మనుమసిద్ధికి మరల రాజ్యమిప్పింప గలిగిన తిక్కనకాడు; గణపతి ఉండియు అస్తంగత మహిముడు. రుద్రమదేవి వచ్చిన తర్వాత కూడ కాకతీయులు సాయపడనందున రుద్రమ తండ్రితో కలసి పాలనకు ప్రారంభించినది మొదలు నెల్లూరి చోడులను చేయి వదలినదనియే తలంపవలయును. కాబట్టి తిక్కన మనుమసిద్ధి మరణానంతరము అచిర కాలములోనే రాజకీయములను వదలి యజ్ఞ మొనరించి, అది మొదలు హరిహరనాథుని హృదయమున ధ్యానించుచు, వడివడిగా చెప్పుచు భారతమును పదునైదు పర్వములు కుమ్మర గురునాథునిచే వ్రాయించి పూర్తి యొనరించి యుండును. ఇదంతయు రెండవ తిక్కరాజు రాజ్యారోహణమునకు చాల ముందే ఐయుండును.

'నేటి వాఙ్మయ చరిత్రల ననుసరించి తిక్కన క్రీ. శ. 1210—1300 మధ్యవాడు' అని విమర్శకులు వ్రాసినది స్థూల నిర్ణయము. సూక్ష్మ పరిశోధనకు పనికి రాదు. చారిత్రక జ్ఞానము గాని, చరిత్రకారుల రచనలను గ్రహించు శక్తి గాని లేని శుష్కాంధ్ర పండితుని వ్రాత. అట్లే ఎఱ్ఱన కాలము '1280—1340 క్రీ. శ. అని సప్రమాణముగా నిరూపితమైనది' అని వ్రాసినారు. ఇంకను పరిశోధనలు అనుదినమును జరుగుచుండగా, నూతనాంశములు దొరుకు చుండగా, అభిప్రాయములు మార్చుకొనవలసినట్లుండగా తానేదో ముగింపునకు తెచ్చినట్లు విమర్శక విద్యారత్నము భావించుట వింత! 'సప్రమాదముగా' నన్న బాగుండును. వీరి రచన లెంత ప్రమాద భూయిష్ఠములైనవో నేను నా 'నన్నెచోడుని కవిత్వము'లోను, ఆంధ్రపత్రికలోను నిరూపించియే యున్నాను.

ఎఱ్ఱన కాలము

దీనిని నిర్ణయించుటకు మనకు సూటిగా తగులు ప్రమాణములు లేవు. పట్టుమని చెప్పుటకొక మంచి శాసనము లేదు. డొంక తిరుగుడుగా ఊహించుటకు— ఇతడు రచించిన గ్రంథములును వాని యవతారికలును, అందు ప్రస్తావితులైన రాజుల శాసనములును, సమకాలిక వాఙ్మయ రాజకీయ వాతావరణమును మాత్రమే మనకు గల సామగ్రి. వీని ననుసరించి మన పాండిత్య విజృంభణమును ప్రదర్శింప వలసి యున్నది. ఎఱ్ఱన గ్రంథములు నాలుగింటిలో ఏది ముందు ఏది వెనుక అనుదానిని గుఱించిన తర్కమంతయు ఊహలమీదనే ఆధారపడి యున్నది. అట్టి యూహా సౌధమే ఈ యాక్షేపకులు నిర్మించినదికూడ. వీరేశలింగము పంతులు వారిని చాగంటి శేషయ్యగారిని ఉదాహరించి విమర్శకులు' పై వానిని బట్టి ఎఱ్ఱాప్రెగ్గడ కాలము క్రీ. శ. 1280—1350 అని తేలుచున్నది' అని వ్రాయుట తాము తేలిపోవుటయే. పరిశోధన పత్రిక ఫిబ్రవరి మార్చి 1956లో 'ఎఱ్ఱన హరివంశ రచనా కాలము' అని ఈ విమర్శకులు నిర్మించుకొన్న ఆకాశ హర్మ్యమును ఆధారముగా గొని ఈ జూన్ భారతిలో మరల విమర్శ సాగించినారు. ఇదంతయు బుద్బుద తరంగముల వంటి వికారములని నిరూపించుచున్నాను.

చెదలువాడ మల్లన ఎఱ్ఱాప్రెగడ వంశీయుడు గాన అతడు చెప్పినట్లు ఆరణ్య పర్వశేషము తొలికృతియట, హరివంశము చివరిదట. మల్లన చెప్పినది వాని రచనాక్రమమా ? తనకు తోచిన క్రమమా ? రచనాక్రమమని మల్లన నిర్దేశింప లేదు. ఇతని వాక్యము లెట్లు ప్రామాణికములో సకారణముగా నిరూపింప వలసిన బాధ్యత విమర్శకుని యందున్నది. ఎఱ్ఱన వంశీయుడైనంత మాత్రమున ప్రమాణమా ? 'రెడ్డి రాజ్య చరిత్రకారులును హరివంశమే చివరకృతి యని నిర్ధారించి యున్నారు' అని వారిని ఉదాహరించినారు. వారేమియు 'నిర్ధారణ' చేయలేదు. ఎట్టి చర్చయు చేయక వ్రాసినారు. తమ కనుకూలమని వీరు గ్రహించినారు. 'పరిశీలించిన' మల్లయ్యాది ఎఱ్ఱన చెప్పిన వరుసకు విరుద్ధము. మల్లయ్య— మొదట ఆరణ్య పర్వశేషము, తర్వాత రామాయణము, మూడవది నృసింహపురాణము, నాల్గవది హరివంశము— అని వ్రాసినాడు. ఇతని సాక్ష్యము తప్పు. హరివంశమును బట్టి రామాయణ రచన అంతకు ముందుది, నృసింహపురాణమును బట్టి ఆరణ్య పర్వము అంతకు ముందుది. ఈ రెండు ముందా ఆ రెండు ముందా కవి చెప్పలేదు. హరివంశము చివరి గ్రంథమైన యెడల కవి అందేల ఆరణ్య పర్వశేష నృసింహపురాణములను చెప్పలేదు ? అట్టి ప్రశ్నయే నృసింహపురాణమునకు తగులును— ఇందేల హరి వంశాదికములను పేర్కొనలేదు అని. మఱి యెక్కడ మొదలుపెట్టుటయన్న విమర్శకులన్నట్లు హరివంశము అవకాశ మిచ్చుచున్నది.

హరివంశ రచనా కాలమును, శ్రీశైల సోపాన ప్రశంసకును మల్లారెడ్డి మరణమునకు ముందు నెట్ట వచ్చును గాని అంతకును ముందు దొడ్డారెడ్డి జనింపని యొక కాలమునకు నెట్టుట అసాధ్యము, అజ్ఞాన విజృంభణము. దొడ్డారెడ్డి పుట్టినప్పుడు వేమారెడ్డికి వయస్సెంత యుండును. పోనీ, తండ్రి తప్పక జీవించియేగదా యుండవలయును. తండ్రి మరణానంతరము పుట్టి యుండడు గదా ! ! ! హరివంశమున తండ్రి ప్రోలయ్య సజీవుడై యున్నట్లు లేదే. తండ్రి ఇంకను జీవించి యుండి ఒక వైపు సోదరులు జనించుచుండగా ప్రోలయవేముడు, తండ్రికి రెండవ కుమారుడు, తండ్రిని త్రోసి రాజని రాజ్యము చేయ నారంభించెనా ? చిత్రముగానే యున్నది. అన్న మాచయ్యను త్రోసి రాజని యనలేదా యని వాదింతురా ? సందర్భములు వేఱు. రెడ్డిరాజ్య స్థాపకుడు వేమయయే. అన్న మాచయ్యకాడు. క్రీ. శ. 1320 నాటికే రెడ్డి రాజ్యము ప్రారంభమైనదట. ఈ 'ప్రారంభము'న కర్త వేమెమో. 1323 కాకతీయ రాజ్యపతనము. 1324 వఱకు ఉలూఘ్ఖాను స్వాధీనమున దేశ ముండినది. ప్రోలయ వేమారెడ్డి మొదటి శాసనము మల్లవరముది 1325. ఈ శాసనము యొక్క తారీఖును శ్రీ మల్లంపల్లి వారు చక్కగా చర్చించి నిర్ణయించి యున్నారు. (చూ. వారి **Forgotten Chapters of Andhra History** పు. 39—40 **f. n.**) హరివంశ రచనా కాలమున ప్రోలయ వేమయరాజు, తండ్రి లేడు. దొడ్డయ ప్రస్తావము లేదు. కాబట్టి శ్రీ మల్లంపల్లి వారి వ్రాత (రెడ్డి చరిత్ర) సాధువే.

"Errapregada does not mention Dodda in his work Hariwamsa while describing his patron's family the reason for which might be his premature death."

దీనిపై విమర్శకులు ఆక్షేపించినారు. (పై పరిశోధన పత్రిక పు. 8) 'ముందే మరణించి యుండిన తర్వాతి శాసనములలో నాతడెట్లు పేర్కొనబడెనో చరిత్రకారులూహింప లేదు'— అని. శాసనములో పేర్కొ* బడిన మాత్రాన దొడ్డారెడ్డి క్రీ. శ. 1325—1345 నడుమ సజీవుడై యుండెనా ? ఉండినచో నాతడేమి చేయుచుండినాడు ? ఈఉండినగదా చేయుటకు ! లేడు, బొత్తిగా లేడు. ఈ విమర్శకుల కుదయించిన యపభ్రంశ భావము ఆ మహాచరిత్రకారునికి కలుగనందున

ఊహింపలేదు. ఈ స్వల్పమునకు చరిత్ర కారుల వఱకేందు లకు, పండిత వతంసులు శ్రీ వేలూరి శివరామశాస్త్రి వర్యులు వావిళ్లవారి ఇటీవలి హరి వంశముద్రణోపోద్ఘాతమున నిట్లు వ్రాసిరి. చూడుడు— (పుట 10—11)

"క్రీ. శ. 1340 మంచాళ్ల శాసన మందును క్రీ. శ. 1343 ముట్లూరు శాసనము నందును క్రీ. శ. 1345 ఆతుకూరి శాసనమునందును.... శ్లోకములు ప్రోలయ కయిదు గురు కొడుకులని చెప్పుచున్నవి.... మాచవేమదొడ్డ అన్నమల్ల భూవల్లభులని.... .... హరివంశము నాటికి దొడ్డారెడ్డి పుట్టలేదని కొందఱు ఊహించుట లెస్సకాదు. 1325—30 నడుమ నెన్నడో ప్రోలయ చనిపోయెను. అనితల్లి కలువ చేరు శాసనము.

'వరాహ వద్వారిధి వారి మగ్నాం
ధరామశేషాం యవనోదరస్థాం
సముద్ధరన్ ప్రోలయ నాయకేంద్రః
తతః ప్రతిష్ఠాప యతి స్మతద్వత్
సర్గాతిథౌ ప్రోలయ భూమిపాలే
తేషాం వేమ నరేశ్వరః క్షితిభుజాం ధర్మాత్మ నామ
గ్రణీః. . . .'

అని చెప్పుచున్నది. వేమయ విజృంభణమునకు వెనుకనే ప్రోలయ పోయెను. ఇక దొడ్డయ యేడ అన్నయ యేడ మల్లయ యును నేడ ? కావున ఈ దొడ్డయ హరివంశ రచనకు వెనుకనే లేడు. లేని ఈ దొడ్డయ పదునటి శాసనములలోని కెటులు ఎక్కెను? స్మృతి మాత్రఫలమునకు వేమయ చెప్పి వ్రాయించి యుండునని ఊహింప వలయును." ఇచ్చట 'వెనుక' అనగా 'ముందే' 'తత్పూర్వమే' అని యర్థము. హరివంశ రచనకు పూర్వమే దొడ్డయ గతించి యుండునని శ్రీ శాస్త్రిగారు చరిత్రకారుని వాక్యమునే గట్టి పరచినారు.

మంచివారు కాబట్టి శ్రీ శాస్త్రిగారు దీనిని ఇంకను తఱచి ఈ విమర్శకుని అపహాస్యము పాలుచేయలేదు. దొడ్డా రెడ్డి తన సోదరులలో మూడవవాడు గదా, మల్లారెడ్డి కడ గొట్టు కదా. దొడ్డారెడ్డి పుట్టుటకు ముందే మల్లారెడ్డి పుట్టియుండెనా ? అన్న పుట్టకమునుపే తమ్ముడు పుట్టి ఎఱ్ఱనను ఎట్లు 'చేపట్టి' అన్నకు, పెద్దన్నకు, ఇచ్చినాడయ్యా! ఇది యేమి రిసర్చి, ఏమి సిద్ధాంతము. అపభ్రంశమూ కాదు గదా అంతకన్న ఘోరము. అందులోను ఇంతటి విమర్శక విద్యారత్నము లోకము నాక్షేపించుచు తాను వ్రాయుట ! ! ! 'విపరీతపు పులుసు కూర విస్తరి మింగెన్' ఎక్కడనో కథా సరిత్సాగరములోని మూఢుల కథలలో, రాదగినదిగా నున్నది. వీరేమరల, హరివంశ రచనా కాలమున మల్లారెడ్డి యున్నాడని వ్రాసి అతని మీది పద్యములను ఉదాహరించి యున్నారు. (చూ. పరిశోధన పత్రిక 1956 ఫిబ్రవరి) ఎంతటి స్వవచో వ్యాఘాతము ! అన్న పుట్టుటకన్న ముందే తమ్ముడు పుట్టి ఘనుడగుట కన్న వింత తిక్కన కన్నముందే ఎఱ్ఱన ఆరణ్య పర్వశేషమును పూరించుట. ఆ వినోదమును కూడ చూతము.

క్రీ. శ. 1325కు రెడ్డిరాజ్య మేర్పడినది. హరి వంశము నాటికి ఎఱ్ఱన రామాయణ రచనయై పోయినది. మల్లారెడ్డి ఇంకను సజీవుడు. వేమారెడ్డి శ్రీశైల సోపాన ములు నిర్మింపలేదు. ఈ సోపానములు నిర్మాణము శ్రీ మల్లం పల్లి వారు వ్రాసినట్లు క్రీ. శ. 1346 మార్చి నెలకు కొంత ముందు. అంతకు ముందరి శాసనములైన చీమకుర్తి మం చాళ్ల శాసనములు సందేహాస్పదములు, అవిశ్వాస్యములని శ్రీ శర్మగారు నిరూపించియే యున్నారు. కాబట్టి హరివంశ రచన ఇంతకు కొంత ముందు, మల్లారెడ్డి ఎప్పుడు గతించి నను ఈ విషయమునకు బాధకము కాదు.

ఇక రామాయణ రచనయు, అంతకు మునుపు మల్లా రెడ్డి ఎఱ్ఱనను చేపట్టి వేమారెడ్డికి అప్పగించుటయు— ఇంతకు చాల పూర్వమే జరిగియుండ వలయును గాని, ఎంత ముందో తెలియదు గాని నరసింహ పురాణ ఆరణ్య పర్వ రచనలు మాత్రము ఇంతకు తర్వాతివిగాని ముందువి గావు. కారణములు — ఒకటి — ఎఱ్ఱన స్తుతి 'క్రీ. శ. 1400 ప్రాంత మున జక్కన నాటి నుండియే కానవచ్చుచున్నది' అని ఈ విమర్శకులే పరిశోధన పత్రికలో వ్రాసియున్నారు. అందు వలన తత్పూర్వము లేదనియే గదా. సరి ఈ సిద్ధాంతము ప్రకారము తిక్కన కాలముననే 'ఆరణ్య పర్వశేషోన్నయము' నిర్వహింపబడి యుండెనేని మారనగాని మంచనగాని ఇతని పేరెత్త లేదేమి ? మడికి సింగనయు చెప్పడు గదా ! జక్కన వఱకు ఎవరికిని ఎఱ్ఱన మీద గౌరవము లేక పోయినదా ? మారన సమకాలికుడు గదా, చెప్పియుండ వచ్చునే. ఈ ప్రాచీన కవులకంటె కీతడు బాలుడో, తక్కువ రకపు కవియో, లేక నాటికింకను పుట్టలేదో !

రెండు—ఉత్తర హరివంశమును రచించిన వాచన సోముడు తనది తిక్కన భారతమున కనుబంధమని వ్రాసి గౌరవము చూపెను గదా. మఱి ఆతడు ఎఱ్ఱన హరివంశమును తృణీకరించి పోటికి వ్రాసిన వాడేగదా. పోటీయేల యన ఇత డును అదే వ్రాయుట. ఆస్థానములు వేఱుగదా. ఎఱ్ఱనకు రాజాశ్రయము లభింపగా సోమనాథునికి లభింపలేదేమో హరిహర నాథునికిచ్చినాడు. కాని ఇందేదో ధ్వనించుచునే

యున్నది. మారన మంచన, సోమనాథ మడికి సింగనలు తిక్కన సంప్రదాయము వారనియు, ఎఱ్ఱనను లక్ష్యము చేయలేదనియు తెలియుచున్నది గదా. మొల్లకూడ నాచన సోముని చెప్పి ఎఱ్ఱనను చెప్పలేదు గదా. ఇదే కవిద్వయ కాలము, లేక సంప్రదాయము అనరాదా ? జక్కన వఱకు ఎఱ్ఱనకు 'రికగ్నిషన్' లేక పోయినది గదా !

మూడు— 'ప్రబంధ పరమేశ్వర' బిరుదము. రామాయణ హరివంశములకే గాని తర్వాతి వానికి రాజాశ్రయము కానరాదు. ఎట్టి వానికైనను జీవిత ప్రథమదశలో రాజాశ్రయము కావలెను గాని పేరు ప్రసిద్ధికి వచ్చిన తర్వాత స్వాతంత్ర భావమును, రాజసభా ప్రవేశముల మీద విముఖతయు ఆముష్మిక చింతయు కలుగును. ఒక్కొక్కప్పుడు రాజాశ్రయములలో ఆత్మగౌరవ హాని వంటివి ఏర్పడియో, తోచియో కవులు ఇష్ట దైవములకు అంకిత మిచ్చుటయు గలదు. అందులకు పోతన యుదాహరణము. అంకితాదు లెంత రోత పట్టినవో మడికి సింగనయు, మంచనయు చెప్పియేయున్నారు. తన ప్రారంభ దశలోనే, తిక్కన భారతమునకు ముందే, సమకాలికులలో నొక పేరు రాక ముందే, ఈతడు నన్నయ భాగమును పూరించియుండు ననుట ఒప్పదగినది కాదు. ఇతనికి సాహస వర్తనము, అహంభావ సూచకము, నన్నయ యంతటి కవి తానై యుండిన, మఱి తానే ఏల తిక్కనకు పోటీగా విరాట పర్వము నుండి కూడ వ్రాయలేదు ? నాచన సోమునికి పోటీగా హరివంశము వ్రాసిన వాడేగదా. పైగా నిది ఇతని ప్రాథమిక కవిత్వము కాదు. ఒకపాటి ప్రామాణిక పదవినందిన తర్వాతి కాలపు కవిత్వము. తిక్కనాదులు తాక వెఱచిన దానికీతడు పూనుకొనుటయే ఇందులకు తార్కాణము. తిక్కన వదలి నందులకు కారణము పరంపరాగత భీతియే. అనిష్ట భయము. వయసు ముదిరి కూడ ఎఱ్ఱన 'తద్రచనయకా' వ్రాసినాడు గాని గ్రంథమందు తన పేరు పెట్టుకొన లేదు. ఇందుల కంతయు ప్రబల ప్రమాణము 'ప్రబంధ పరమేశ్వర' బిరుదము. ఇది హరివంశమున లేక నృసింహ పురాణమున కనబడుటయు, ఈ బిరుదు భారత శేష రచన చేతనని తన తాత మాటలుగా తానే చెప్పుకొనుట గమనింప దగిన విషయములు.

నాల్గవది, గురువు శంకరస్వామి ప్రస్తావము. ఎవరీ శంకరస్వామి ? హరివంశమందును నృసింహ పురాణమందును ఈయన ప్రస్తావము ఉన్నది. ఆరణ్య పర్వశేషమున గురు స్మరణకు అవకాశము లేదు. అది నన్నయ పేరిట 'తద్రచన యకా' రచితము. ఈ శంకరస్వామి 'విద్యారణ్యుల గురువు విద్యాశంకర తీర్థుడట, విమర్శకుల వ్రాత (పరిశోధన 1956). అట్లైన విద్యాశంకర యని యనక రెండు గ్రంథములలోను శంకరస్వామి యనియే ఎఱ్ఱన ప్రయోగించినాడే ? ఈ శంకర స్వామియే శ్రీనాథుడు శృంగార నైషధమున చెప్పిన శ్రీ శంకరమౌని. ఇతడే పినపాడు తామ్రశాసనమందలి 'ప్రాతం గురుశ్శంకరః' తారీఖుశక 1327 (క్రీ. శ. 1405). ఇంతకాల మీతడు జీవించియుండెనా యందురేమో, నాటికీ ఎనుబది యేండ్ల వృద్ధుడై యుండినను క్రీ. శ. 1325లో జనించి యుండవచ్చును. తన ఇరువదవ యేట కవిత్వము' చెప్పియుండవచ్చును. 'చిన్నారి పొన్నారి చిఱుత కూకటి నాడు' కవిత చెప్పిన శ్రీనాథునికన్న తక్కువవాడా. ఎఱ్ఱన తాత పూర్ణ పురుషాయుష జీవిత ధన్యు' డుండలేదా. వంశపారంపర్యముగా దీర్ఘజీవులై యుండరాదా. పైగా వేమారెడ్డి కనిష్ఠ సోదరుడైన మల్లారెడ్డి ఇతనిని మొదట చేపట్టి అన్నకు సిఫారసు చేయుట చేతను అతనినే ఎక్కువగా ఎఱ్ఱన స్తుతించి యుండుట చేతను ఇరువురును సమవయస్కులైన బాల్య స్నేహితులేమో ! పైగా హరివంశము నాటికి మల్లారెడ్డికి సంతానముండినట్లు కానరాదు. అవివాహితుడో ఇంకను సంతానము కలుగనట్టి వయసో ! ఎఱ్ఱన మొత్తము మీద వేమారెడ్డికన్న చాల చిన్నవాడుగ నుండి యుండును. క్రీ. శ. 1325 నాటికే మల్లారెడ్డి పేరు మల్లవరము శాసనమున నుండుటచేత ఎఱ్ఱన మల్లనలు క్రీ. శ. 1315 ప్రాంతమున జనించియుందురు. శంకరస్వామి వీరికన్న పదేండ్లైనను ముందు జనించి యుండును. లేదా చిన్న వాడైనను పరవాలేదు. ఆతడొక పీఠమున కధిపతిగాన 'పీఠమునకు శిష్యత్వము నెఱపుటగా నెఱ్ఱన వ్రాసియుండవచ్చును. తాను శివ భక్తుడు. 'శంభుదాసుడు.' ఆ కాలమున మఱియొక శంకర స్వామి కానరాడు.

ఐదవది— ప్రోలయ వేమారెడ్డి అనంతరము ఎఱ్ఱన జీవించియే యున్నాడు. అనపోతారెడ్డి కొల్లూరు శాసనములో (క్రీ. శ. 1364) ప్రతి గ్రహీతలలో 'యఱ్ఱయ ప్రగడ గారు' కనబడుచున్నారు. 'ఈ ఎఱ్ఱయప్రెగ్గడగారు శంభు దాసుడేమో యని సందేహము కలుగుచున్నది..... అయిననో ఎఱ్ఱాప్రెగ్గడ అప్పటికి వృద్ధుడై జీవించి యుండవలెను' అని రెడ్డి సంచికలో శ్రీ వఝల అప్పారావుగారు శంకించినది (పుట 57) సరిగానే తోచినది. విమర్శకులు 'పరిశోధన'లో ఎఱ్ఱాప్రెగడ మనుమడుగా నుండునని వ్రాయుచున్నారు. ఇది ప్రబంధ పరమేశ్వర బిరుద ప్రమాణముచేత కుదురదు. (ఆరణ్య పర్వశేష నృసింహ పురాణములలో " చెప్పుకొన్న ఈ బిరుదును

హరి వంశము నాటికి ఈతడు త్యజించినాడా ? అసాధ్యము. హరివంశము 1346 నాటికి కుదిరిన 1356 నాటికి అరణ్య పర్వశేషమును, 1366 నాటికి నృసింహపురాణమును సుసాధ్యములేగదా. 1366—1315—51 ఏండ్ల వయసుండును. నాటికీతని ప్రియమిత్రుడు మల్లారెడ్డి గతించి, ప్రోలయ వేమారెడ్డియు గతించి అనపోతారెడ్డి పాలకుడు. బాలసరస్వతి ఆస్థాన పండితుడు, ధర్మశాసనాదుల రచయిత. కావున ఈ శాసనోక్త ఎఱ్ఱియ ప్రగడగారు, ఎఱ్ఱనకవియే. 'గారు' కూడ మన్నది. కవితలో కూడ నాటికి 'నన్నయభట్ట మహాకవీంద్రు సరస సారస్వతాంశ ప్రశస్తి' దన్ను జెందుటయు' ధీరవిచారుడై 'తత్కవితారీతియు కొంత దోపత్రదచనయకా న్నారణ్య పర్వశేషము పూరించెను. పైగా ఇంత వినయ మెందుల కనగా 'సాధు జనహర్ష సిద్ధిగోరి.' మఱియొక మఱువరానిది కలదు. 'ఏగతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరేగదా. నృసింహ పురాణములో ఇంతకన్న వినయముగా 'రాయంచలు గూఱ్యఁ గ్రౌంచమును నావలఁ గూయు గడంగు భంగి' అని తన్ను క్రౌంచమునకు పోల్చుకొన్నాడు. తిక్కన చివరి దినములలో భారత రచనా కాలమున తండ్రిని స్వప్నమున దర్శించినట్లీతడు తాతను దర్శించినాడు. తండ్రి జీవించియే యున్నాడేమో !

ఆఱవది— కవిద్వయ సంప్రదాయమ్మున్నదా' యనుదానికి కూడ జవాబు. హరివంశములో ఎఱ్ఱిన షష్ఠ్యంతములు వ్రాయలేదు. ఆ కొఱవను నృసింహపురాణమున పూరించినాడు. మారనాదులు వ్రాసియుండగా తొలుత ఈతడు వ్రాయక తర్వాత వ్రాసి తన వినయమును కూడ ప్రకటించుట చేత 'సాధు జనహర్ష సిద్ధి' ఎట్లు ఆపేక్షణీయమాయెనో విదితము. అటు తర్వాతి వారీతని కవిత్రయములో చేర్చుకొనిరి. మొదట కవిద్వయ సంప్రదాయమునకు చెందక తర్వాత చెందినట్లు దీనివలన ఏల చెప్పరాదు ? నృసింహ పురాణము తర్వాతిదనియేల దీనిని బట్టి కూడ అనరాదు ? అది పరిణామ క్రమము కూడ.

ఏడవది— వయసును పాండిత్యమును ముదురుకొలదీయు మన ప్రాచీన ప్రబంధ రచయితలలో నొక వినయము కనబడుటకు మడికి సింగన యొుక యుదాహరణము. ఇతడు తన వాసిష్ఠ రామాయణమున "... తొల్లి హరిభక్తి రసావేశంబున గతి పయ్యాక్షరాభ్యాస చాపలంబునంజేసి. . . . పద్మ పురాణోత్తర ఖండంబును భాగవత దశమస్కంధంబును దెనుంగున రచియించి" అని వ్రాసికొన్నాడు. ఎఱ్ఱనయు. ఈ మాటల వట్లే పునరుక్తివలె అనుకరించినాడు. "కతిపయాక్షర పరిగ్రహ జనితంబైన నైసర్గిక చాపలంబు కతంబున" అని

నైసర్గికతను ఎక్కువగా చేర్చి చెప్పుకొన్నాడు. ఇరువురును ఇంచుమించు సమకాలికులై యుండి అహోబలస్వామికే అంకిత మిచ్చుట చేతను కూడ ఒకరి నొకరు భూషించుకొనుచునో దూషించుకొనుచునో యున్నారనుట నిశ్చయము. సింగన ముందు వాడుగా కనబడుట చేతను, ఎఱ్ఱన పేరెత్తకపోయినందు నను, ఎఱ్ఱన అంత వినయము చూపి సింగన మాటలనే పెంచి చేర్చుకొన్నందు వలనను, ఎఱ్ఱనయే సింగనపై తన గౌరవ మును చూపినాడనుట సమంజసము. సింగనయే పెద్దవాడు.

ఎనిమిదవది— శ్రీనాథుడు కాశీఖండములో ఎఱ్ఱనను 'అధికతర భక్తి సంయుక్తి నాదరిం'చుట చేతను, 'పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని శేవసూక్తివైచిత్రి నొక్కొక్కమాటు' అని నన్నయ తిక్కనలకు లేని 'పరిఢవ' 'శేవా'దులను చెప్పుట చేతను ఒకపాటి సాన్నిహిత్యమును, అందుచే ఆదరమును కలిగి యుండెనేమో ! ఇందులకు తగినట్లు 'శ్రీ పర్వత సోపాన స్థాపిత వేమక్షితీశ సామ్రాజ్యశ్రీ వ్యాపారి ముఖ్యుడు' అవచి తిప్పయకు శ్రీనాథుడు 'బాల సఖుడు'. క్రీ. శ. 1364లో నొక తారీఖు ఎఱ్ఱనకు దొరికియే యున్నది. శ్రీ శంకరవరాని ప్రస్తావము నున్నది. వీనిచేత శ్రీ నాథుడు ఎఱ్ఱాప్రెగడను చెక్కగా ఎఱుగునని తలంపవచ్చును గదా. (ఇంకను వివర ములకు నేను వ్రాసిన ప్రకాశక విజ్ఞప్తి, శృంగార నైషధ సర్వంకష ద్వితీయముద్రణము చూడుడు.)

ఇందువలన తేలినదేమనగా ఈ యాక్షేపకుల సిద్ధాంతము— ఎఱ్ఱన తిక్కనకు సమకాలికుడు, వీరువురికిని నడుమ వ్యవధియే లేదు. కవిద్వయ సంప్రదాయమురేదు. తిక్కనకు ముందే ఎఱ్ఱన అరణ్య పర్వమును పూరించెను— ఇత్యాది రచన యంతయు అప సిద్ధాంత పరంపర, అసంబద్ధధోరణి, బొత్తిగా పరిశోధన మార్గము తెలియని అవకతవక రచన, చెత్త తొట్టెలో వేయవలసినది. తిక్కన గతించిన తర్వాత దాదాపొక శతాబ్దము నకు ఆరణ్యపర్వ శేషపూరణము. రామాయణ, హరివంశముల్ ప్రారంభ కవిత్వముని కాబట్టియే ఆవి లాక్షణికులు ఉదాహరింపలేదు. దీనిని కవితా దృష్టిని పరిశీలించి వీరెరుగుదురుగాక! ప్రబంధ పరమేశ్వర బిరుదముయొక్క ప్రాముఖ్యమును గుర్తింపని పరిశోధక పరమేశ్వరునిదిగదా తుదకు 'గంధర్వ నగరము'. ఎఱ్ఱన ఇంతతర్వాతివాడు కాబట్టియే నన్నయ తిక్కనలకు 'ఆద్యుల' నెనని శ్రీ వేలూరి శివరామశాస్త్రివర్యుల ఉద్ఘాటనను ఇప్పుడైన వీరుగ్రహించిన మంచిది.

ర చ నా స ం ద ర్భ ము

నా రచనలో నేనొక పట్టున చెప్పినది ఇంకొకపట్టున జెప్పలేదట. తర్కించుటలో ఇట్లు కుదురునా, అట్లు కుదురునా యని ప్రసక్తాను ప్రసక్తముగా వ్రాసినవి సిద్ధాంతములా ? వింతయే! అపార్థకల్పనకై దుష్టోదాహరణములిచ్చుట విమర్శ యా? చదువరులకే వదలుచున్నాడను. 'శ్రీనాథుడుగాని, తర్వాతి వారుగాని' అన్న వాక్యములో కొరవిగోపరాజెట్లు చేరునో? ఇతడు శ్రీనాథుడును కాడు, తర్వాతివాడును కాడు. సమకాలికుడు. తర్వాతివారు అష్టాదశ వర్ణనలను పేర్కొనుట నా అర్వాచీన సిద్ధాంతమునకే అనుకూలము. అష్టాదశ వర్ణనలతో వ్రాయు చున్నామని చెప్పి వ్రాయుట ఒక కాలమున. తర్వాత నది తగ్గిపోయినది. తొలుత లేదు. అట్టి సంధికాలము వాడు నన్నెచోడుడని నా యభిప్రాయము. పుర వర్ణనతో ప్రబంధ ప్రారంభము ఒక పద్ధతిగా మొదట లేక తర్వాత పరిపాటిగా కుదిరిపోయినది. నిర్వచనోత్తర రామాయణ కేయూరబాహు చరిత్రములు ప్రబంధమార్గమునకు మునుపటివి. అవి ప్రబంధమార్గమును అనుసరించినవా! ఆశ్చర్యమే!

శై వ మ త ము

శైవమును గూర్చి నాకు విశేషముగాకాదుగదా ఒకపాటి కూడా తెలియనిమాట వాస్తవమేగాని స్థూలముగా తోచినది వ్రాసితిని. మత విషయములందు నిష్ణాతులైనవారు వ్రాయ దగినది ఎంతైనను కలదు. ఈతడు 'లింగధారి' కాడంటిని. లింగధారులు ఆరాధ్య బ్రాహ్మణులు మాత్రమేనా? లింగమును ధరించువారు బ్రాహ్మణేతరులలో ఎందరో గలరు. "శివ కవులలో చేరడు". "ఆంధ్ర సాహిత్య ప్రపంచమందంతటను వ్యాప్తమై యుండగా, విశ్వవిద్యాలయములలో ఎమ్. ఏ. ఆనర్సు తరగతులు చదువు విద్యార్థులకుకూడ— తెలిసియుండగా ప్రస్తుత గ్రంథకర్తకు తెలియకపోవుట శోచనీయము" అని ఘూటైన విమర్శ. శోచనీయులు పాపము ఆ విద్యార్థులు. ఈ విమర్శకులవంటి వారి రచనలు చదివి, ఇట్టి యప సిద్ధాంతములను విశ్వసించి చెడిపోవుచున్నారు. పూర్వ సిద్ధాంతమునే నేను కాదంటిని. ఆ మాత్రము ఎరుగరా ఈ విమర్శకులు. కుతర్కమిది. ఈ కవి శివకవికాడనుట కొక ఉదాహరణమిచ్చి ఇంతటితో ఈ వ్రాతను నిలిపెదను—

కొలని గణపతిదేవుడు తన శివయోగ సారములో నన్నిచోడునివలెనే వినాయకుడు దక్షక్రతు నాశకుడని చెప్పే యున్నాడు.

క........యకదక్షక్రతు నాశను బ్రహ్మముఖ (?)
ద్ధతు విఘ్నప్రతి, ఘాతకు(నిం) గణపతిం గృపామతి
గొలుతున్.

(కాకతీయ సంచిక) కావున నన్నెచోడుని కథనమునే అనుసరించె

వని స్పష్టము. ఇష్టదేవతా ప్రార్థనానంతరమితడు 'శివకవీశ్వర తతిదలతున్' అని కొందరు సంస్కృత కవులను చెప్పి

"వీరి నెల్లను సంస్కృత విమలబాణు
లని ప్రశంసించి మరియును నంధ్రకావ్య
పదము దీర్చిన నన్నయభట్టుగారి
నుభయకవి మిత్రు నెఱ్ఱన నభినుతించి.
అనమ శివభక్తి రసమా
ననునిం బాల్కురికి సోమనాథుని గవిరా
జ సమున్నత. యశుసద్యః
ప్రసాదు (నల) చక్రపాణి రంగన దలతున్."

అని వ్రాసి 'భద్రంబగు మాసమితికి.......' ఇత్యాది వ్రాసినాడు. నన్నెచోడుడు శివకవి యైనచో వీరిలో ఏడీ? వినాయకుని ఈ క్రొత్త కథను చెప్పినందుచేత నన్నెచోడుని చెప్పకపోవుట బాధించుచున్నది. పట్టి యాచారము పాటించుటగా కవి ఏదో వ్రాసినాడా? ఆచారమైనచో చెప్పవలసినదే. మరి పండితారాధ్యుని చెప్పలేదేయని యందురేని అతని నెవరును మహాకవులలో చేర్చలేదు. ఆచార్యునిగా గ్రహించినారు. పైగా శివతత్వసారము శతకమనిగదా ప్రచారమందున్నది.

ఇట్లే గణపతి శివ దాక్షాయణుల పుత్రుడని చెప్పుచు శివలీలా విలాసకర్తయైన నిశ్శంక కొమ్మన కొండంత గ్రంథము వ్రాసినాడు గదా. దానిని గురించి వ్రాయుచు ఈ విమర్శకులే 'శివలీలా విలాసమున గణపతి జననము నన్నెచోడదేవుని కుమార సంభవము నందలి గణాధిపతి జననమువలెనే వర్ణింపబడియున్నది. ....కొమ్మన నన్నిచోడునినుండి ఈ విషయమును గ్రహించి యున్నాడు.' అని రెడ్డి సంచికలో (పుట 374) వ్రాసియున్నారు. మరి కొలని గణపతిదేవుడును అంతేగదా. వీరెవరును నన్నెచోడుని ఏల స్మరింపరు? దక యాగ కథను వర్ణించుట' 'తప్పక శివ కవి సంప్రదాయమే' యైన యెడల సోమనాథుని కథ వేరుగా నున్నది. కథలో మార్పులు పరవాలేదా? కాబట్టి పూర్వ కవులే నన్నెచోడుని శివకవిగా గుర్తింపనప్పుడు మనమా గుర్తించువారము!

నన్నెచోడుని కుమార సంభవము ఒక సముద్రము. దానిని ఏబదియారేండ్లుగ మహాపండితులు మధించుచుండగా నేనేపాటి. ఏదో తోచినది వ్రాసితిని. లోకమునకు ఉపయోగపడు నక్షరమొక్కటి ఉండినను నాకు సంతోషమే. కాని నా చారిత్రక సిద్ధాంతములవిూది ఈ విమర్శకుల వారి యాక్షేపములు పరిహాస నీయములనియు, వీరికే చరిత్ర, బొత్తిగా, బడిపిల్లల పాటికూడ రాదనియు, చారిత్రక మార్గమే కాదుగదా, ఇటీవలి పెద్దల రచనలుకూడా వీరు చదువుకొనలేదని, పెద్దలుచూపి కూడ తమ ఘోర ప్రమాదములు దిద్దుకొనక తమ పిచ్చి వ్రాతలే పరమ సిద్ధాంతములని భావించుచున్నారని నిరూపించితిని. శైవ మతమును గురించి చక్కగా ఎరిగిన పెద్దలు వివరింతురేని శిరసావహింతును.

నన్నెచోడుని కాలనిర్ణయమును 'ప్రస్తుత గ్రంథ కర్త......ఇదివరకు సందిగ్ధముగా నున్నవానిని అయోమయముగా ఒనర్చియున్నాడు' అని విమర్శకులు వ్రాసినారు. వీరికే అయోమయమైనది. శాసనాది సాక్ష్యములచే నొక కవి కాలము కుదురనప్పుడు ఇదేగదా మార్గము. వాఙ్మయ చరిత్ర ననుసరించి నిర్ణయించితిని. క్రమ పరిణామమును చారిత్రికమార్గమును ఎరిగినవారికి ఇందు ఎట్టిలోపమును కనబడదు. ప్రబంధ మార్గము ననుసరించుట చేతను, చక్కగా సర్వాంగములతో పెంపొందింన కృత్యాదిని వ్రాయుటచేతను నన్నెచోడుడు తిక్కనకు కొంత తర్వాతివాడేగాని ముందు వాడగుటకు బొత్తిగా అవకాశములేదు. నా రచనలో చిన్నచిన్న పొరబాట్లు తారీఖుల లోగాని, విషయములలోగాని, తుదకు అచ్చులోగాని ఉండినన్న అవి ఈ నిర్ణయమును మాత్రము ఏమాత్రము కదలింప లేవని దృఢముగా చెప్పగలము.



'ప్రేమిస్తున్నాను కాబోలు...'

వీ రా జీ

ఆవేళ నిన్నోసారి చూశాక
  ఇవేళ అలా వెళ్తే
  చురుకైన నా సముద్రం
  బద్ధకంగా అగుపించింది నాకు
    నేన్నిన్ను ప్రేమిస్తున్నాను కాబోలు...!

నువ్ చురుక్‌నచూసి గిరిక్‌న
వెళ్లిపోయాక అలా ఆశగాచూస్తే
ఎత్తుగా హాయిగా మెత్తగా ఊదాగా
అగుపించే నా ఆకాశం హాయిగా అగుపించనేలేదు
    నేన్నిన్ను ప్రేమిస్తున్నాను కాబోలు!

సందడిగా సర్దాగా సర్‌స్రున
అటూ యిటూ దూసుకుంటూ
రాసుకుంటూ పోయే సాయంకాల
నగర సంచలనం నన్నొంటరిగా ఒదిలేసింది
    నేన్నిన్నే ప్రేమిస్తున్నాను కాబోలు!

ఇవాళ పార్కులో వారగా మూలగా
పచ్చికలో దాక్కున్న నా గడ్డిబంతిపువ్వు
కిసుక్కున నన్ను చూసి నవ్వనేలేదు
అలిగింది అటు తిరిగింది మూతి ముడిచింది
    నేన్నిన్ను ప్రేమిస్తున్నానని కాబోలు!

'ప్రేమిస్తున్నాను కాబోలు...'

ఇలా లోకంలో అందరి గడియారాలు
క్షణక్షణానికి గంతులేస్తోవుంటే
నా గడియారం యుగానికేనా క్షణం కదల్డంలేదు
నా ఎద క్షణక్షణానికి కాగిపోసాగింది వేగిపోసాగింది!

నేన్నిన్ను నే న్నిన్నే
నిన్నే ప్రేమిస్తున్నాను కాబోలు
నాలో ఒంటరితనం
ఒంటరితనమే కాపురం చేస్తోంది!



తేజో రేఖలు

శ్రీ సంజీవదేవ్

పూవులు రంగుకూ రూపానికీ తావికీ సజీవ మూర్తులు. దళాలతో రచించిన మూగ కవితలు పూవులు. తావినే ప్రధానంగా కలిగున్న పూవులు కొన్ని అయితే రంగునే ప్రధానంగా కలిగున్న పూవులు మరి కొన్ని. ఇక కొద్ది పూవు లుంటవి తావిలోనూ రంగులోనూకూడా ప్రాధాన్యం కలవి.

ఆకుపచ్చలో తప్ప పూవులు అన్ని రంగుల్లోనూ ఉంటవి. ఆకుపచ్చ అనేది ప్రత్యేకించి ఆకుల రంగు కావటంతో పూవులలో ఆ రంగు అరుదు. ఆకులు సూర్యరస్మిని గ్రహించటానికి ఉపయోగించే క్లోరోఫిల్ రసాయనం ఆకుపచ్చలో వుండటం వల్ల ఆ రంగు ప్రత్యేకం ఆకుల వరకే పరిమితం అయి వుంది. సాధారణంగా సంపెంగపూలు ఆకుపచ్చగా ఉంటవి కాని అవి బాగా వికసించేప్పటికి ఆ ఆకుపచ్చ ఆకుపచ్చ రంగు కంటే పసుపు రంగుకే దాపులో ఉంటుంది.

మందారం ఎరుపు, చేమంతి పసుపు, ప్రభాత శోభలు నీలం, మల్లెలు తెలుపు; తామరలుచాలా రంగులలో ఉంటవి; తెల్ల తామర, నీలి తామర, ఎర్రతామర, పసుపు తామర మొదలైనవి. సంపెంగలూ, మల్లెలు, మృదువైన రంగూ, ఘాటైన తావీ కలిగుంటవి; మందారానికి ఘాటైన రంగు ఉంటుంది. కాని తావి ఉండదు.

పూవులను చూడటం అంటే మేఘాల లోకాల నుంచి భూమి మీదకు తెచ్చి నాటిన ఇంద్ర ధనుస్సును చూడటమే!

*   *   *   *

ప్రేమకూ కామానికీ మధ్య సరిహద్దు గీత గీయటం అంత సులభం కాదు. ప్రేమ మానసిక మనీ, కామం మాంసల మనీ, ప్రేమ మనోశాంతినిస్తే కామం అశాంతిని రేకెత్తిస్తుందనీ మాటల్లో నిర్వచించటం సులభమే కాని వాస్తవ జీవితంలో మాత్రం ఈ నిర్వచనాలు తమ నిర్ణయాన్ని కోల్పోతవి. ప్రేమా కామం రెండూ తమ అంచులను ఒక దానితో మరొకటి కలిపే ఉంటవి. విశ్వ విఖ్యాత మనస్తాత్వికుడైన సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం మాతృప్రేమ మీద కూడా అధోచేతనలో దాగివున్న కామవాంఛ తన ఛాయలను వేస్తుందని. కాని మరో విఖ్యాత మనస్తాత్వికుడైన డాక్టర్ సి. జి. యుంగ్ (Jung) ఫ్రాయిడ్ కనుగొన్న ఈ గుప్త కామవాంఛా సిద్ధాంతం నిజమైంది కాదని సిద్ధాంతీకరించాడు.

ప్లెటోనిక్ ప్రేమ అనేది ప్రియుతమ యొక్క శరీర స్పర్శతో అవసరం లేని ఒక విశుద్ధ ప్రేమగా పరిగణించబడుతూ వచ్చింది. కాని పరిశీలించి చూస్తే ప్లెటోనిక్ ప్రేమ అనేది తన సరిహద్దుల్ని అతిక్రమిస్తే ఆలింగన చుంబనాదులు మొదలైన కోమల శృంగార చేష్టలలోకి దారి తీస్తుంది. తరువాత అదే లైంగిక సమ్మిలనంలోకి కూడా పరిణమించవచ్చు. అప్పుడప్పుడు వరసా వావీ లేని వారితో కూడా గాఢ ప్రేమ ఏర్పడి ప్రణయంలోకి మారటం కూడాకద్దు. దీన్నే విజ్ఞానంలో incestuous love (వరసలేనిప్రేమ) అంటారు.

ప్రేమ అనేది ఒకటే., అది ప్రవహించే కాలవల ఆకారాల బట్టి దాని రూపు మారుతూంటుంది. ఇంద్రియానుభూతి వైపుకు ప్రవహించి నప్పుడు కామం అవుతుంది. అతీంద్రియ సత్తా వైపుకు ప్రవహించి నప్పుడు భక్తి అవుతుంది.

*   *   *   *

" విషయ వస్తువుకు సంబంధించి నంతవరకు శిల్పకళ కంటే చిత్ర కళ చాలా వైశాల్యాన్ని కలిగి ఉంటుంది. కాని కవిత్వంతో పోలిస్తే మాత్రం చిత్ర కళా పరిధి చాలా పరిమితం " అంటాడు జపాను కళావేత్త సీ — ఇచీ — టాకీ. అనగా శిల్ప కళ రూపొందించే విషయ వస్తువు చిత్రకళ చిత్రించే దాని కంటే చాలా పరిమితం. ప్రకృతి లోని అతి సున్నితమైన వాతావరణపు స్థాయీలను చిత్రించ గలదు చిత్ర కళ., కాని శిల్ప కళ వాటిని సృష్టించ జాలదు. రంగుకు సంబంధించిన సూక్ష్మమైన ఛాయలు కూడా చిత్రకళకు అందుబాటులో ఉంటవి కాని శిల్ప కళకు అవి అందవు.

శిల్ప కళ విఫలం అయిన చోట చిత్ర కళ సఫలం అవుతుంది. చిత్రకళ విఫలత చెందిన చోట కవిత్వం సఫలత

చెందుతుంది. చిత్ర కళ ప్రధానంగా బాహ్యజగత్తులోని దృశ్య రూపాలను చిత్రించే కళ. నేడు ఎంతో నైరూప్య చిత్రణ అవబడేవి కూడా కవిత్వం అభివ్యక్త పరచే నైరూప్య భావాలనూ, అతి సూక్ష్మమైన అనుభూతులనూ అభివ్యక్తపరచ జాలదు. కారణం, భావనా, అనుభూతి కూడా రూపంతో కంటే పదంతోనే ఎక్కువ సామీప్యాన్ని కలిగి ఉంటవి. పదాన్ని బయటి సహాయం ఏమీ లేకుండా, లోపలి నుంచే ఉత్పత్తి చేయొచ్చు. కాని రూపాన్ని ఉత్పత్తి చేయటానికి బయటిదైనా ఒక భౌతిక మాధ్యమం అవసరం. కనుక పదం అనేది రూపాని కంటే ఎక్కువ సూక్ష్మమైన మాధ్యమం. అందుకనే ఆలోచనకూ అనుభూతికీ చెందిన అదృశ్య జగత్తును అభివ్యక్తి పరచటానికి చిత్ర కళ కంటే కవిత్వం అధిక శక్తివంతమైంది. కవిత్వం చిత్ర కళ వలె దృశ్య కళా కాదు. సంగీతం వలె శ్రవ్య కళా కాదు. అదో ప్రత్యేక ఇంద్రియానికి చెందిన కళ. ఏశబ్దమూ చేయకుండా కవిత్వాన్ని పౌపంగా చదువుకోవచ్చు.

కవిత్వం అనేది నాదంలేని సంగీతం, రంగులేని చిత్రం రూపం లేని శిల్పం. శిల్పాన్ని చేతితో స్పృశించవచ్చు, కంటితో చూడవచ్చు, చిత్రాన్ని కంటితో చూడవచ్చు మాత్రమే, ఇక కవిత్వాన్ని చేతితో తాకనూలేం, కంటితో చూడనూలేం. వినకుండా సంగీతాన్ని ఆనందించలేం. కాని కవిత్వాన్ని వినకుండా కూడ ఆనందించగలం. కవిత్వాన్ని ముక్కుతో ఆఘ్రాణించలేం, నాలుకతో రుచి చూడలేం. అందుకే కవిత్వం అనేది శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది ఇంద్రియానుభూతు లన్నిటికీ అతీతమైంది ! కవిత్వం అతీంద్రియం. అయితే ప్రతి కళా కూడ— శిల్పం, చిత్రం, సంగీతం, నాట్యం, సాహిత్యం— దేని ప్రత్యేక స్థానంలో అదే గొప్పది.

* * * *

ఆత్మ విశ్లేషణ (self-analysis) అనేది మన జీవన లక్ష్యాన్ని అందుకోవటంలో ఉపకరించే ఉత్తమ సాధనాలలో ఒకటి. మన బాహ్య జీవితంలోని అనంత దూరాలను తిలకించే దూరదర్శిని ఆత్మవిశ్లేషణ, మన అంతర్ జీవితంలోని అతి సూక్ష్మ విశేషాలను పరిశీలించే సూక్ష్మదర్శిని ఆత్మవిశ్లేషణ. మనను మనం ఎప్పుడైతే స్వయంగా విశ్లేషించి చూచుకొంటామో అప్పుడు మన జీవితం స్ఫటికం వలె పారదర్శకమై అందులో ఉండే సూక్ష్మాతి సూక్ష్మలోపం కూడ మనకు గోచరిస్తుంది.

ఆత్మ విశ్లేషణ లేనపుడు అంతర్‌దృష్టి నశిస్తుంది. అంతర్‌దృష్టి నశించినపుడు మన స్వీయ జీవితాల్లోని చీకటి గుణాలను మనం కనిపెట్టజాలం. ఆత్మవిశ్లేషణ లోపించినపుడు మన స్వీయ జీవితాల్లోని మంచిని మాత్రమే మనం చూడగలం కాని చెడును చూడజాలం. అటువంటి స్థితిలో మంచిని మనలో చూస్తాం, చెడును ఇతర్లలో చూస్తాం.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ మొదలైన అన్ని కోశాలకూ సంబంధించిన జీవితాన్నంతా విశుద్ధపరచే అగ్నిపరీక్ష ఆత్మవిశ్లేషణ. ఆత్మవిశ్లేషణ ఉంటే వ్యక్తి జీవితంలో ఆపదే ఉండదు, వ్యక్తి జీవితంలో ఆపద లేనప్పుడు జాతిజీవితంలో కూడ అంతే.

* * * *

వినిపించే రాగాలకంటే వినిపించని రాగాలు అధిక మధురతరం అని గానం చేశాడు కీట్సు కవి. అదేవిధంగా చిత్రించిన చిత్రాలకంటే చిత్రించని చిత్రాలు అధిక రమ్యతరం. అందుకే స్వర్గీయ నికొలస్ రోరిక్ అంటూండేవారు, "The best painting is that which has not yet been painted ఇంత వరకూ చిత్రించబడని చిత్రం ఏదైతే ఉన్నదో అదే ఉత్తమ చిత్రమట !

ఇదే సత్యం జీవితంలో కూడ సమానంగా వర్తిస్తుంది. అభివ్యక్తమైన జీవితాని కంటే అవ్యక్తమైన జీవితం ఎంతో అధిక మనోహరంగా ఉంటుంది. మరణానికీ జననానికీ మధ్య అవ్యక్తంగా ఉన్న జీవితం జననానికీ మరణానికీ మధ్య జీవిస్తున్న జీవితానికంటే ఎంతో ఎక్కువ జీవవంతమైనది. జననానికీ మరణానికీ మధ్య ఉన్న జీవితానికీ, మరణానికీ జననానికీ మధ్య ఉన్న జీవితానికీ ఎంతో తారతమ్యం ఉన్నది. ఒకటి జననాంతర మరణ పూర్వపుది అయితే రెండోది మరణాంతర జనన పూర్వపుది. ఒకటి అభివ్యక్తం, రెండవది అవ్యక్తం.

అభివ్యక్త జీవితం వినిపించే రాగం లాంటిదీ, కనుపించే చిత్రం లాంటిదీ. అవ్యక్త జీవితం వినిపించని రాగం లాంటిదీ, కనుపించని చిత్రం లాంటిదీ !

* * * *

సుఖ శాంతుల్లో ఉండే ధనహీనులనూ, విద్యాహీనులనూ చూచి ఆపదల్లోనూ బాధల్లోనూ ఉన్న ధనికులూ, విద్యావంతులూ అసూయ చెందుతారు. కాని ధనహీనులూ, విద్యాహీనులూ మాత్రం ధనవంతుల పట్లా, విద్యావంతుల పట్లా ఎల్లప్పుడూ అసూయ చెందుతారు. ఒకరికి మరియొకరి యందుండే ఉభయ వైఖరులూ ఉభయుల జీవితాలకూ అంతగా ఆరోగ్య ప్రదమైనవి కావు. జీవితంలో ధనమూ విద్యా మాత్రమే సర్వస్వం కావు, అంతకు మించిన సన్నిత విషయాలు, అంతకు మించిన ఆనందకర విషయాలు, అంతకు మించిన కాంతిమయ విషయాలు ఇంకా కొన్ని ఉన్నవి.

గ్రహసంబంధములు

శ్రీ దివాకరుని వెంకటసుబ్బారావు

జ్యోతిష శాస్త్రమందు 12 రాసులు 7 గ్రహములు, 2 ఛాయాగ్రహములు గలవని ఎల్లరకు తెలిసిన విషయమే. వివిధరాసులందు గ్రహముల యుతిచే గాని, స్థితిచేగాని, వివిధ రాసులను అందున్న గ్రహములను ఇతర గ్రహములు వీక్షించుటచేగాని ప్రాప్తించు జాతకఫలముల నరయు సూత్రములు పరాశరహోర మొదలగు శాస్త్ర గ్రంథములందు చెప్పబడినవి. రాసులు, గ్రహములు కొన్ని శుభులని, కొన్ని పాపులని పేర్కొనబడి యున్నవి. ఇవి నైసర్గిక శుభాశుభత్వము; ఆధిపత్య స్థితులచే శుభాశుభములు మార్పు నొందుచున్నవి. గ్రహములకు మిత్రత్వ, సమత్వ, శత్రుత్వములు, అధిమిత్ర, మిత్ర, సమ, శత్రు, అధిశత్రు సంబంధములు తమ తమ స్థితులచే నేర్పడుచున్నవి. ఈవిధముగా రాసులందు గూడ కొంత మార్పు గలుగుచున్నది. కేంద్రములు, కోణములు శుభమని, ద్వితీయ లాభముల ప్రాముఖ్యత తక్కువని, పాప స్థానములు (3, 6, 8, 12) పాపమని, అందు నైసర్గిక శుభుల స్థితి చేతను, పాపుల స్థితిచేతను, ఆధిపత్య శుభులస్థితి చేతను, ఆధిపత్య పాపుల స్థితిచేతను, మిత్రత్వాది భేదముల నొందిన గ్రహ సంబంధముల చేతను ఫలములు అనేక మార్పుల నొందుచున్నవి. ఇదిగాక ఉపచయముల (3, 6, 10, 11) కారకత్వము కొంత మార్పు తెచ్చుచున్నది. శుభత్వములు, పాపత్వములు సమానముగావు. ఇందుగూడ భేదమున్నది. చర, స్థిర, ద్విస్వభావాది రాసుల గుణములు అగ్నితత్వ, భూతత్వ, వాయుతత్వ, జల తత్వాది గ్రహముల, రాసుల భేదములు స్త్రీ పురుష విభాగములు మొదలుగాగల అనంతములైన మార్పులకు లోనై ఫలములు జాతకుల కనుభవనీయ మగుచున్నవి. ఇట్లనేక విధముల మార్పుచెందు రాసుల, గ్రహముల నాధారము జేసికొని సూక్ష్మబుద్ధితో శాస్త్ర రహస్యముల గుర్తించిన గాని జాతకముల నన్వయింప సాధ్యపడదు. గాన అన్ని విభాగములందు అత్యంత జ్ఞానము, అనుభవము యవసరమని యెఱుగుటయే కాక గ్రహ సంబంధ విషయములలో సంపూర్ణ జ్ఞాన మున్నగాని ఫలము లనుభవనీయములుగావు. గాన గ్రహ సంబంధ విషయములను ఈ వ్యాసమునందు ఋషి సాంప్రదాయానుసారమున పాఠకులకు సులభగ్రాహ్యమగు నటుల విశదీకరించుచున్నాను.

గ్రహ సంబంధములు 3 విధములు. దృష్టి, ఆచ్ఛాదన, యుతి. ఈ సంబంధములందు అనేక భిన్నాభిప్రాయములున్నవి. ఈ హేతువుచే ఫలభాగము పలువురచే పలు విధముల అన్వయింపబడిననూ నిజరూపము దాల్చుటలేదు. వీని నిజ రూపము నెరుగుటకు వివిధాభిప్రాయముల సమగ్రముగా పరిశీలించి, అందలి వివరముల గ్రహించి, అనుభవములో ఫలప్రద మగుచున్న విధానమును గుర్తెరుగుట ముఖ్యము గాన వివిధాభిప్రాయములను, సారాంశములను దెలుపుచున్నాను.

1. పరాశర మతము—

హోరాశాస్త్రే భిన్నదృష్టిః ఖేటానాంచ పరస్పరమ్।
త్రిదశేచ, త్రికోణేచ, చతురస్రేచ, సప్తమే॥

శని ర్దేవగురు ర్భౌమః పరేచ క్షమితేక్షితాః।
పదార్థం త్రిపదం పూర్ణం వదంతి గణకాజనాః॥

శనిః పాదం త్రికోణేషు చతురస్రే ద్విపాదకం।
త్రిపాదం సప్తమే విప్రః త్రిదశే పూర్ణమేవహి॥

చతురశ్రే గురుః పాదం సప్తమేచ ద్విపాదకం।
త్రిపాదం త్రిదశే విప్రః పూర్ణం పశ్యతి కోణభే॥

సప్తమే పాద మేకంచ ద్విపాదం త్రిదశే ద్విజ।
త్రిపాదంచ త్రికోణేషు భౌమః పూర్ణం చతురస్రగే॥

అన్యేషాం త్రిదశే పాదం ద్విపాదంచ త్రికోణగే।
చతురస్రే త్రిపాదంచ పూర్ణం పశ్యతి సప్తమే॥

పై వచనముల ననుసరించి ప్రతి గ్రహమునకు 3, 4 5, 7, 8, 9,10 రాసులను అందున్న గ్రహములను జూచు శక్తి గలదని స్పష్టమగుచున్నది. శని తా నున్న స్థానము

నుండి 3, 7, 10 స్థానములను, గురుడు తానున్న స్థానము నుండి 5, 7, 9 స్థానములను, కుజుడు తానున్న స్థానము నుండి 4, 7, 8 స్థానములను జూడగలుగుచున్నారు. సప్తమము పోను మిగిలినవి అధిదృష్టులు. సామాన్యాభిప్రాయము ననుసరించి మిగిలిన రవి, చంద్ర, బుధ, శుక్రులు తామున్న స్థానములనుండి 7 వ స్థానమును అందున్న గ్రహములను జూచుచున్నారు. ఈ యభిప్రాయమందలి నిజస్థితి ఏది ? వీక్షణములన్నియూ సమాన బలము గలవా ? లేక వానియందు భేదము లున్నవా ? పై జెప్పబడిన శని, గురు, కుజుల సప్తమ వీక్షణము సమానబలము గలదా ? అధిదృష్టులు రవి, చంద్ర, బుధ, శుక్రులకు లేవా ? ఉన్నచో వాని బలములందున్న భేదమేమి ? యను హంశముల పరిశీలించిన ఋషిప్రోక్తమగు పై వచనములు సర్వ సందేహముల దీర్పగలవు.

వృశ్చికమును; వృశ్చికము, ధనస్సును; ధనస్సు, మకరమును; మకరము, కుంభమును; కుంభము, మీనమును; మీనము, మేషమును చూచుటలేదు. దీనిని పరిశీలించిన, చరరాసులు తమ ప్రక్కనున్న స్థిర రాసిని తప్ప ఇతర స్థిరరాసులను, స్థిర రాసులు తమ ప్రక్కనున్న చరరాసులను తప్ప ఇతర చర రాసులను, ద్విస్వభావరాసులు ఇతర ద్విస్వభావ రాసులను చూచునని గ్రహింపవలెను. ఈ రాసులందున్న గ్రహములకు గూడ పై నుదహరింపబడిన విధమున దృష్టు లేర్పడునని నిర్ధారణ చేయబడినది. అనగా

మేషము—సింహ, వృశ్చిక, కుంభములను
వృషభము—కర్కాట, తుల, మకరములను
మిధునము—కన్య, ధనస్సు, మీనములను

బలనిర్ణయము

గ్రహములు	బల నిర్ణయము.			
	పాద	అర్ధ	త్రిపాద	పూర్ణ
కుజుడు	7 స్థానము	3, 10 స్థానములు	5, 9 స్థానములు	4, 8 స్థానములు
గురుడు	4, 8 స్థానములు	7 వ స్థానము	3, 10 స్థానములు	5, 9 స్థానములు
శని	5, 9 స్థానములు	4, 8 స్థానములు	7 వ స్థానము	3, 10 స్థానములు
రవి, చంద్ర, బుధ శుక్రులు	3, 10 స్థానములు	5, 9 స్థానములు	4, 8 స్థానములు	7 వ స్థానములవు

పై నుదహరింపబడిన బలములతో వీక్షించుచున్నారు.

ద్వితీయ, ద్వాదశ స్థానములకు అందున్న గ్రహములకు కూడ దృష్టి గలదని పరాశరమతము. ఛాయా గ్రహములందు రాహువు పాద దృష్టితో 4, 8 స్థానములను, అర్ధ దృష్టితో 3, 10 స్థానములను, పూర్ణదృష్టితో 5, 7, 9 స్థానములను వీక్షింపగలడు. ఇతనికి త్రిపాద దృష్టి లేదనుట విశదము. కేతు విషయము పేర్కొనబడక పోయినను ఇతని దృష్టులు రాహుదృష్టివలె నుండునని భావము.

2. జైమిని మహర్షి మతము—

"అభిపశ్యంతి ఋక్షాణి, పర్శ్వభేచ, తన్నిష్టశ్చ, తద్వత్" ప్రతి రాసి తన ఎదుటి రాసిని చూచును. మేషము, వృశ్చికమును; వృషభము, తులను; మిధునము, కన్యను; కర్కాటము, కుంభమును; సింహము, మకరమును; కన్య, ధనస్సును; తుల, వృషభమును; వృశ్చికము, మేషమును; ధనస్సు, మీనమును; మకరము, సింహమును; కుంభము, కర్కాటమును; మీనము, కన్యను జూచునని భావము. తరువాత మేషము, వృషభమును; వృషభము, మిధునమును; మిధునము, కర్కాటమును; కర్కాటము, సింహమును; సింహము, కన్యను; కన్య, తులను; తుల,

కర్కాటము—వృశ్చిక, కుంభ, వృషభములను
సింహము—తుల, మకర, మేషములను
కన్య—ధను, మీన, మిధునములను
తుల—కుంభ, వృషభ, సింహములను
వృశ్చికము—మకర, మేష, కర్కాటములను
ధనస్సు—మీన, మిధున, కన్యలను
మకరము—వృషభ, సింహ, వృశ్చికములను
కుంభము—మేష, కర్కాట, తులలను
మీనము—మిధున, కన్య, ధనస్సులను వీక్షింపగలవు.

పై హంశముల పరిశీలించిన ఈ మత ప్రకారముగా 3, 4 5, 6, 7, 8, 9, 10, 11 దృష్టులు అంగీకరింపబడినవి.

ప్రతి గ్రహమునకు 2, 4, 5, 11 స్థానములందున్న గ్రహములు అర్గళాకారకులు. ఇందు కేతువును గణింపరాదు. కేతువునకు 9 యందున్న గ్రహము అర్గళాకారకుడు. నైసర్గిక శుభులు పై అర్గళలకు కారకులైన శుభఫలములు ప్రాప్తించును. నైసర్గిక పాపులున్న పాపములు, అవరోధములు ప్రాప్తించును. తృతీయమందు రెండు లేక ఎక్కువ గ్రహము లున్న అర్గళ ప్రాప్తించునని చెప్పబడినది. 2, 4, 5, 11

లందున్న గ్రహములచే ప్రాప్తించు అర్గళలు 3, 9, 10, 12 లందున్న గ్రహములచే పరిష్కరింపబడును. కేతునకు మాత్రము 9 యందున్న గ్రహముచే ప్రాప్తించు అర్గళ 5 నందున్న గ్రహముచే పరిష్కరింపబడును.

4 యందున్న గ్రహముచే ప్రాప్తించుఅర్గళ			10 యందున్న గ్రహము చేతను		
2	,,	,,	12	,,	,,
11	,,	,,	3	,,	,,
5	,,	,,	9	,,	,,
కేతునకు 9	,,	,,	5	,,	,, పరిష్కరింపబడును.

3 నందున్న పాపులచే ప్రాప్తించుపాపార్గళలు పరిష్కరింపబడవు. అర్గళాకారకుడైన గ్రహముకన్న పరిష్కరించు గ్రహము బలహీనుడైన అట్టి అర్గళలు పరిష్కరింపబడవు. పై సిద్ధాంతరీత్యా 180, 300, 240, 120 భాగలు దృష్టుల ఫలములు గ్రహముల బలములమీద సాధారపడి యుండునని, 60 భాగల దృష్టి పాపుడైన, పాపఫలమని; శభుడైన శుభఫలమని విశదమగుచున్నది. అనగా 30, 90, 120, 300 భాగల దృష్టులు శుభదృష్టులని కొంతవరకు భావింపవచ్చును.

3. వేంకటేశ్వర దైవజ్ఞ మతము :

పశ్యత్యసౌ భానుసుత స్తృతీయం
మానంచ పూర్ణం చతుర స్రమారః
జీవ స్త్రికోణం మదనంచ సర్వే
పశ్యంతి దృష్ట్యైచ రణాభివృద్ధాః.

కుజుడు 4, 8 స్థానములను అందున్న గ్రహములను, గురుడు 5, 9 స్థానములను అందున్న గ్రహములను, శని 3, 10 స్థానములను అందున్న గ్రహములను, సర్వ గ్రహములు సప్తమమును పూర్ణముగా జూతురని, సర్వ గ్రహములు పాద దృష్టిచే 3, 10 లను, అర్ధ దృష్టిచే 5, 9 లను, త్రిపాద దృష్టిచే 4, 8 లను, సప్తమమును పూర్ణ దృష్టిచేతను చూచెదరు. కుజునకు త్రిపాద దృష్టి, గురునకు అర్ధ దృష్టి, శనికి పాధ దృష్టి పూర్ణదృష్టులని తమ యభిప్రాయమును వెల్లడించియున్నారు.

4. కాళిదాసు మతము :

పూర్ణం పశ్యతి భానుజః స్త్రిదశమే చేత్పాదదృష్ట్యేతరే
జీవోధీ నవమేర్ధతో తదితరే భౌమ శ్చతుర్దేష్టమే
సర్వేపాద విహీనయాఖిలదృశోపశ్యంతి సర్వేస్తభం
విత్తాయ వ్యయవైరిణో నదదృశుః ఖేటస్థిత స్థానతః

శని 3, 10 స్థానములను పూర్ణముగాను, ఇతరు లందరు పాదదృష్టిచేతను, గురుడు 5, 9 స్థానములను పూర్ణముగాను, ఇతరులందరు అర్ధదృష్టి చేతను, కుజుడు 4, 8 స్థానములను పూర్ణముగాను, ఇతరులందరు ముప్పాతిక దృష్టిచేతను జూతురు. 1, 2, 6, 11, 12 స్థానములందు ఎవ్వరికి దృష్టి లేదని భావము.

గ్రహములు	2	3	4	6	7	8	9
రవి	$\frac{1}{4}$	$\frac{3}{4}$	$\frac{1}{2}$	1	$\frac{3}{4}$	$\frac{1}{2}$	$\frac{1}{4}$
చంద్ర	,,	,,	,,	,,	,,	,,	,,
కుజ	$\frac{1}{4}$	1	$\frac{1}{2}$	,,	1	,,	,,
బుధ	,,	$\frac{3}{4}$	,,	,,	$\frac{3}{4}$	$\frac{1}{2}$	,,
గురు	,,	,,	1	,,	,,	1	,,
శుక్ర	,,	,,	$\frac{1}{2}$	,,	,,	$\frac{1}{2}$	,,
శని	1	,,	,,	,,	,,	,,	1

2—60 భాగల దృష్టి, 3—90 భాగల దృష్టి, 4—120 భాగల దృష్టి, 6—180 భాగల దృష్టి, 7—210 భాగల దృష్టి, 8—240 భాగల దృష్టి, 9—270 భాగం దృష్టి.

5. వరాహమిహిరుని మతము :

త్రిదశ త్రికోణ చతురశ్ర సప్తమా
నవలోకయంతి చరణాభివృద్ధితః
రవి జామరేభ్య రుధిరాః పరేచమే
క్రమశో భవంతి కిలవీక్షణోధికాః

సర్వ గ్రహములు 3, 10 స్థానములను పాద దృష్టితోను, 5, 9 స్థానములను అందున్న గ్రహములను అర్ధ దృష్టిచేతను, 4, 8 స్థానములను అందున్న గ్రహములను త్రిపాదదృష్టి చేతను, సప్తమమును అందున్న గ్రహములను సంపూర్ణ దృష్టిచేతను చూచుచున్నారు. ఎంతమాత్రపు దృష్టిచే జాతునో అంతమాత్రపు ఫలమునే ఇత్తురు. ఇందు కుజ, గురు, శనుల సప్తమ దృష్టి వారి అధిదృష్టులగు 4, 8—5. 9 – 3, 10 లంత బలము గలది గాదని భావము. ఇతర గ్రహముల సప్తమదృష్టి సంపూర్ణ బలము గలదని గ్రహింపవలెను.

6. లఘు జాతకమందు :

దశమ తృతీయా నవమం పంచమ చతురష్టమాన్ కళత్రంచ
పశ్యంతి పాద వృద్ధ్యా ఫలాని చైవం ప్రయచ్ఛంతి.

3, 10 5, 9 4, 8 దృష్టులు క్రమముగా పాద వృద్ధి గలవని సప్తమదృష్టి పూర్ణ బలము గలదని యభిప్రాయము. అదేవిధమున ఫలముల బలము లుండును.

7. యవనేశ్వరులు :

ద్వ్యాపశ్చవా షష్ఠమథ ద్వితీయం సంస్థాన రాశేః పరిహృత్యరాశిం
శేష్యా గ్రహాః పశ్యతి సర్వకాల మిష్ట్వేషు చైతాం విహతోదృగిష్టి.
జామిత్ర భే దృష్టిఫలం సమగ్రం స్వపాదహీనం చతురశ్రయోశ్చ
త్రికోణయో దృష్టిఫలార్థ మాహు ర్దుశ్చిక్య సంజ్ఞే దశమేచ పాదం.

తామున్న రాసినుండి 2, 6, 11, 12 రాసులను తప్ప ఇతర రాసులను అందున్న గ్రహములు చూచుచో దృష్టికి తగిన ఫలము లొసగును. 7 ను పూర్ణదృష్టితోను, 4, 8 లను త్రిపాద దృష్టితోను, 5, 9 లను అర్ధదృష్టితోను, 3, 10 లను పాదదృష్టితో చూచును.

8. మాధవాచార్యులు :

సౌరిస్తృతీయ దశమౌ గురుః స్త్రికోణం కుజస్తు చతురశ్రం
పశ్యతి సమగ్ర మితరే చరణ వృద్ధ్యాథ సప్తమం సర్వే.

శని 3, 10 లను, గురుడు 5, 9 లను, కుజుడు 4, 8 లను చూతురు. ఇది అధిదృష్టి. ఇతర గ్రహములు వీనిని చరణ వృద్ధితో చూతురు. సర్వ గ్రహములు 7 ను పూర్ణదృష్టితో చూతురు.

9. గార్గి :

దుశ్చిక్య స్వగతాన్ సౌరి స్త్రి కోణస్థాన్ బృహస్పతిః
చతురష్టమగాన్ భౌమర్కేన్దో సప్తమ సంస్థితాన్
భవంతి వీక్షణే నిత్య ముక్తాధిక ఫలాగ్రహాః.

శని 3, ను అందున్నగ్రహములను, గురుడు 5, 9 లను, అందున్నగ్రహములను, కుజుడు 4, 8 లను అందున్నగ్రహములను, మిగిలినవారు 7 నందున్న గ్రహములను చూతురు. ఈ దృష్టుల ననుసరించి ఫలముల నిత్తురు.

అన్ని గ్రహములకు సప్తమమందు పూర్ణదృష్టి గలదని చెప్పి మరల రవి, చంద్ర, బుధ, శుక్రులనకు సప్తమమందు పూర్ణదృష్టి గల దనుటలోని విశేషార్థము సర్వ మతములవారు ఇతర గ్రహములకంటె రవి, చంద్ర, బుధ శుక్రులు అధిక ఫలప్రదులని భావించియున్నారు. ఇది నైసర్గికదృష్టి ఫలమని, స్థానబలము గలిగిన విశేష దృష్టుల ఫలములు ఎక్కువ బలము గలవని సర్వఋషి భావము. స్థానబలము గురు, బుధులకు లగ్నమందు, శుక్ర, చంద్రులకు చతుర్థమందు, శనికి సప్తమమందు, రవి, కుజులకు దశమమందు గలుగును. గాన లగ్నమందున్న గురుని 5,9 స్థాన దృష్టులు సప్తమమందున్న శని 3, 10 స్థాన దృష్టులు దశమమందున్న కుజుని 4, 8 స్థాన దృష్టులు, లగ్నమందున్న బుధుని సప్తమ దృష్టి, చతుర్థమందున్న శుక్రుని సప్తమదృష్టి, దశమమందున్న రవి సప్తమ దృష్టి ఎక్కువ బలముగలవని గ్రహింపవలెను.

10. కల్యాణవర్మ మతము :

సంపశ్యంతి స్థానా త్సదోగ్రహాశ్చ రణవృద్ధి తస్సర్వే
త్రిదశ త్రికోణ చతురశ్ర సప్తమానాం ఫలం క్రమేణైవ
పూర్ణంపశ్యతి రవిజ స్తృతీయ దశమం త్రికోణమపి జీవః
చతురశ్రం భూమిసుతో వ్యానంచ సితార్క శశి బుధాః క్రమశః.

సర్వ గ్రహములు తామున్న స్థానమునుండి 3, 10 స్థానముల పాదదృష్టిచేతను 5, 9 స్థానముల అర్ధదృష్టిచేతను 4, 8 స్థానముల త్రిపాదదృష్టిచేతను సప్తమ స్థానమును పూర్ణదృష్టిచేతను జూచుచున్నారు. ఈ క్రమమున ఫలములు ప్రాప్తించుచున్నవి.

పాదదృష్టియందు శని, అర్ధదృష్టియందు గురుడు, త్రిపాదదృష్టియందు కుజుడు సప్తమమునను రవి, చంద్ర బుధ, శుక్రులు సంపూర్ణదృష్టిచే చూచుచున్నారు. అనగా కుజ, గురు, శనుల సప్తమ దృష్టి ఇతర గ్రహముల సప్తమ దృష్టి ఇంత బలముగలది గాదు.

11. జాతక నారాయణీయము :

ఇందు ప్రతి గ్రహము తామున్న రాశినుండి 3, 10 స్థానములను పాదదృష్టి చేతను, 5, 9 స్థానములను అర్ధ దృష్టి చేతను, 4, 8 స్థానములను త్రిపాద దృష్టిచేతను, సప్తమమును పూర్ణదృష్టి చేతను వీక్షింప పాద, అర్ధ, త్రిపాద, పూర్ణఫలముల నిచ్చుచున్నారని చెప్పియున్నారు. కుజ, గురు, శనుల అధిదృష్టులగు 4, 8, 5, 9, 3, 10 సంపూర్ణ బలము గలవని యన్నారు. అనగా సప్తమదృష్టి కంటె ఎక్కువ బలమని భావము.

12. మంత్రేశ్వరుడు :

శౌర్యాజ్ఞే రవిజో గురు ర్స్గురుసుతో భౌమశ్చ
తుర్థాష్టహా
పూర్ణం పశ్యంతి సప్తమంచ సకలాస్త్వేష్వం ధివ్వ
ధ్యధాక్రమాత్.

శని 3, 10 స్థానములను, గురుడు 5, 9 స్థానములను కుజుడు 4, 8 స్థానములను పూర్ణ దృష్టితో చూచుచున్నారు. అన్ని గ్రహములు పాదదృష్టితో 3, 10 స్థానములను, అర్థ దృష్టితో 5, 9 స్థానములను, త్రిపాద దృష్టితో 4, 8 స్థానములను, పూర్ణదృష్టితో 7 వ స్థానమును చూచును.

13. వైద్యనాథ దీక్షితులు :

పాదేక్షణం భవతి సోదరమాన్య రాశ్యో,
రర్ధం త్రికోణ యుగళే ఖిలఖేచరాణాం
పాదోన దృష్టి నిచయ శ్చతురస్ర యుగ్మే,
సంపూర్ణదృక్బల మనంగగృహే వదంతి.

సర్వ గ్రహములకు 3, 10 స్థానములందు పాద దృష్టి యును, 5, 9 స్థానములందు అర్థదృష్టియును, 4, 8 స్థానములందు త్రిపాదదృష్టియును, సప్తమమందు సంపూర్ణ దృష్టి యుండును.

14. మహాదేవుడు :

తృతీయ దశమౌ నవమపంచమౌ చతుర్థా
ష్టమౌ సప్తమం పాదర్ధి వృత్యో గ్రహాః పశ్యంతి.

సర్వ గ్రహములు 3, 10 స్థానములను పాదదృష్టి తోను, 5, 9 స్థానములను అర్ధ దృష్టితోను, 4, 8 స్థాన ములను త్రిపాద దృష్టితోను, 7 వ స్థానమును పూర్ణదృష్టి చేతను చూచుచుండురు.

తృతీయ దశమౌ శని స్త్రికోణం గుర శ్చతురస్రం
భౌమశ్చ విశేషతః పూర్ణం పశ్యంతి.

3, 10 స్థానములకు శని, 5, 9 స్థానములకు గురుడు, 4, 8 స్థానములకు కుజుడు విశేషదృష్టి గలిగి పూర్ణదృష్టిచే చూచుచున్నారు.

15. శ్రీపతి పద్ధతి రీత్యా :

కుజ విశేష దృష్టికి 15 షష్ట్యంశలు, గురుని విశేష దృష్టికి—30 షష్ట్యంశలు, శని విశేష దృష్టికి 45 షష్ట్యంశలు నిర్ణయము చేయబడినవి. అనగా కుజ విశేష దృష్టి పాదబలమని, గురుని దృష్టి అర్ధబలమని, శనిదృష్టి త్రిపాదబలమని సప్తమదృష్టి సర్వ గ్రహములకు పూర్ణబల మని భావము. ఈ బలములు శుభములు. ప్రతి గ్రహమునకు తానున్న భాగమునుండి ముందు 30 భాగలలో నున్న గ్రహము లను వెనుక 60 భాగలలో నున్న గ్రహములను చూచు శక్తి లేదు. దృష్టి కేంద్రము 30 భాగల నుండి ప్రారంభమై 300 భాగలతో పూర్తియగును. 60 భాగల దృష్టికి పాద బలము, 90 భాగల దృష్టికి త్రిపాద బలము, 120 భాగల దృష్టికి అర్ధబలము, 150 భాగల దృష్టికి బలము లేదని, 180 భాగల దృష్టికి పూర్ణ బలమని, అచటనుండి క్రమ ముగా గ్రహములు బలహీనత నొంది 300 భాగ వద్ద బల శూన్యత నొందును. శుభదృష్టి ధనమని, పాపదృష్టి ఋణ మని చెప్పబడినది. ఇది నైసర్గిక శుభ పాపముల నాధారము చేసికొని చెప్పిన మతము. గ్రహముల షడ్బల సాధనయందు ద్రిక్బల సాధనా ప్రకరణమున ఈ విధాన వివరములు గాన నగును.

16. తాజక మతము :

2 వ స్థానదృష్టి		30 భాగలు		శుభదృష్టి—శుభము
3 వ స్థానదృష్టి		60 భాగలు		మిత్రదృష్టి—శుభము
4	,,	90	,,	శత్రుదృష్టి — పాపము ఆటంకములు గలుగును.
5	,,	120	,,	మిత్రదృష్టి—శుభము
6	,,	150	,,	శత్రుదృష్టి —పాపము, అపకారహేతువు.
7	,,	180	,,	
8	,,	210	,,	
9	,,	240	,,	మిత్రదృష్టి శుభము
10	,,	270	,,	శత్రుదృష్టి — పాపము, ఆటంకములు గలుగును.
11	,,	300	,,	మిత్రదృష్టి—శుభము.
12	,,	330	,,	శుభదృష్టి—శుభము

5, 9 దృష్టులు త్రిపాద బలములని, 3, 10 దృష్టులు అర్ధబలములని, 2, 11 దృష్టులు 1/6 వంతు బలము గలవని, సప్తమదృష్టి శుభులకు శుభమని, పాపులకు పాపమని చెప్పబడి నది. లగ్న, దశమములను—రవి, చంద్ర, కుజ, గురులు శుభ దృష్టిచే వీక్షించిన శుభఫలములు ప్రాప్తి ంచును

17. మరియొక మతమున :

సర్వ గ్రహములు తామున్న రాసిని 3, 10 స్థానము లను పాదదృష్టితోను, 5, 9 స్థానములను అర్ధదృష్టితోను 4, 8 స్థానములను త్రిపాదదృష్టితోను సప్తమమును పూర్ణ దృష్టితోను చూచుచున్నారు. కుజ, గురు, శనులు తమ అధి దృష్టులను 4, 8; 5, 9; 3, 10 లతో ఆయా స్థానములను

పూర్ణదృష్టితో చూచుచున్నారు. శుభుల పరస్పర దృష్టి, చంద్ర, గురుల సప్తమ దృష్టి శుభమని, గ్రహములు తమ స్వక్షేత్ర, మూల త్రికోణ, ఉచ్ఛస్థానముల వీక్షించు దృష్టులు శుభమని, అధిదృష్టులచే యోగకారకులగు పాపులు (కుజ, శనులు) తమ మిత్ర గ్రహముల వీక్షించుట ఉత్తమ ఫలమని ఆధిపత్య పాపియైనను, దుస్థానగతుడైనను గురుదృష్టి సర్వదా శుభమని చెప్పబడినది.

18. పాశ్చాత్య సిద్ధాంతము :

ఈ క్రింది భాగల దృష్టులు ఆమోదింపబడినవి. ఇవి గ్రహస్థానము నుండియని గమనింపవలెను. 30 భాగల దృష్టి కొంతవరకు శుభము; 60 భాగల దృష్టి—శుభము; 45 భాగల దృష్టి—పాపము; 90 భాగల దృష్టి పాపము; 120 భాగల దృష్టి శుభము; 135 భాగల దృష్టి పాపము; 150 భాగల దృష్టి గ్రహముల శుభాశుభత్వముల మీద నాధారపడి యుండును. 180 భాగల దృష్టి పాపము; 210 భాగల దృష్టి శుభము; 225 భాగల దృష్టి పాపము; 240 భాగల దృష్టి శుభము; 270 భాగల దృష్టి పాపము; 315 భాగల దృష్టి పాపము; 330 భాగల దృష్టి గ్రహముల శుభాశుభత్వములమీద నాధారపడియుండును.

19. జాతక చంద్రిక :

పశ్యంతి సప్తమా స్సర్వే శని, జీవ, కుజాః పునః
విశేషతశ్చ త్రిదశ త్రికోణ చతురశ్రగాన్
పాద దృష్టిర్బలీ మందః అర్ధదృష్టిర్బలీ గురుః
త్రిపాదో బలవ్యా భౌమః సంపూర్ణే సకంగ్రహే.

సర్వ గ్రహములకు 3, 4, 5, 7, 8, 9, 10 దృష్టులు గలవని, అందు 3, 10 స్థానముల దృష్టి పాదదృష్టి యని, 5, 9 స్థానముల దృష్టి అర్ధదృష్టి యని, 4, 8 స్థానముల దృష్టి త్రిపాద దృష్టి యని, 7 వ స్థాన దృష్టి పూర్ణ దృష్టి యని చెప్పబడినది. పాదదృష్టియందు శని, అర్ధ దృష్టియందు గురుడు, త్రిపాద దృష్టియందు కుజుడు, సప్తమ దృష్టియందు సర్వ గ్రహములు పూర్ణ బలులని, అత్యంత సామర్థ్యము గలిగి యుండురని భావము.

సారాంశము—సర్వ మతములందు 60, 90, 120, 180, 210, 240, 270, 300 భాగల దృష్టులు ఆమోదింపబడినవి. 30, 330 భాగల దృష్టులు ఆచ్ఛాదనలని ఇవి కొన్ని గ్రహములకు మాత్రమే కలవని చెప్పబడి యున్నది. పాశ్చాత్యులు వీనిని కూడ సర్వ గ్రహములకు గల దృష్టులని భావించియున్నారు. 150 భాగల దృష్టి షష్టాష్టకదృష్టి: 210 భాగల దృష్టికూడ నిట్టిదేగాన షష్టాష్టకములు ఆమోదములు. గాని ఇందు మేష, కన్యలకు వృషభ, ధనస్సులకు తులా, మీనములకు కటక, కుంభములకు సింహ, మకరములకు మిధున, వృశ్చికములకు అందున్న గ్రహములకు వర్తింపవని ఋషుల అభిప్రాయము. ఈ స్థానగతులైన గ్రహములు వారి దశాంతర్దశలలో శుభఫలముల నీయగలరని చెప్పబడినది. అనగా మేష, వృశ్చికములకు వృషభ, తులలకు కర్కాట, ధనస్సులకు సింహ, మీనములకు కన్య, కుంభములకు తుల, వృషభములకు వృశ్చిక, మేషములకు ధను, కర్కాటములకు మకర, మిధునములకు కుంభ, కన్యలకు మీన, సింహములకు అందున్న గ్రహములకు షష్టాష్టక దోషములు గలవు. ఈ స్థితుల నొందిన గ్రహములు తమ దశాంతర్దశలలో అశుభములను, ఆటంకములను, మరణమును చేయగలవని గ్రహింపవలెను. పై వివరముల చూచిన మేష, మిధున, సింహ, తుల, ధను, కుంభములందున్న గ్రహములకు 210 భాగలందున్న గ్రహములు పాపఫల మిత్తురని తెలియుచున్నది. వృషభ, కర్కాట, కన్య, వృశ్చిక, మకర, మీనములందున్న గ్రహములకు 150 భాగలందున్నవారు పాపఫలము నిత్తురని విశదము. బేసి రాసులందున్న గ్రహములకు 8 వ స్థానమందున్నవారు సరిరాసులందున్న గ్రహములకు 6 వ స్థానమం దున్నవారు పాప ఫలముల నిత్తురు. ఇది అనుభవమునకు సరిగా నున్నది.

ద్వితీయ స్థానదృష్టి	30 భాగలు—శుభులకు శుభము, పాపులకు కొంత శుభము.
తృతీయ స్థానదృష్టి	60 భాగలు—శుభము.
చతుర్థ స్థానదృష్టి	90 భాగలు—గురు, చంద్రులకు శుభము—ఇతరులకు అశుభము.
పంచమ స్థానదృష్టి	120 భాగలు—శుభము.
సప్తమ స్థానదృష్టి	180 భాగలు—శుభులకు శుభము పాపులకు పాపము. ఇందు శుభ పాప నిర్ణయము నైసర్గికముచే నుండును. నైసర్గిక శుభులు ఆధిపత్య శుభులైన అత్యంత శుభము. వారు ఆధిపత్య పాపులైన నైసర్గిక పాపులు ఆధిపత్య శుభులైన ఫలములు సమానము. నైసర్గిక పాపులు ఆధిపత్య పాపులైన అత్యంత పాపము.
అష్టమ దృష్టి	210భాగలు—షష్టాష్టకదృష్టులు.
షష్టదృష్టి	150 భాగలు—పై జెప్పబడిన ఫలముల నిచ్చును.

నవమదృష్టి	240 భాగలు—120 భాగలదృష్టి వలె నుండును.
దశమదృష్టి	270 భాగలు—90 భాగల దృష్టి వలె నుండును.
ఏకాదశదృష్టి	300 భాగలు—శుభము.
ద్వాదశదృష్టి	330 భాగలు—శుభులకు శుభము, పాపులకు కొంత శుభము.

అధిదృష్టులు గల కుజ గురు, శనులకు సప్తమ దృష్టి, అధిదృష్టులంత బలమైనవిగావు. పాపులగు కుజ, శనులు యోగకారకులైన ఈ దృష్టులు శుభము. సర్వ గ్రహములు అధిదృష్టులచేగాని, సామాన్య దృష్టులచే గాని తమ స్వక్షేత్ర ఉచ్ఛక్షేత్ర, మూల త్రికోణక్షేత్ర భాగలను వీక్షించుట బలము. శుభాశుభత్వ ఫలములు పీఠికయందలి వారి శుభాశుభత్వములమీద నాధారపడియుండును.

దృష్టి పరిమితి— మేషమందున్న గురుడు, సింహ మందున్న రవిని పంచమదృష్టిచే చూచుచున్నాడని సర్వ సామాన్య అభిప్రాయము. ఇది సరికాదు. దృష్టులు రాసుల మీద గాక గ్రహముల మధ్య నుండు దూరముల మీద నాధార పడి యుండును గాన గ్రహస్ఫుటము లేని జాతకముల ఫల ముల నన్వయించుట సరియగు మార్గము కాదు. గురుడు మేష 2 వ భాగయందు, రవి సింహ 26 వ భాగయందున్న వారి మధ్య దూరము 144 భాగ లుండును. పాశ్చాత్య సిద్ధాంత రీత్యా ఇది పాపదృష్టి. ఋషి సాంప్రదాయరీత్యా ఇది దృష్టిగా పరిగణింపబడదు. ఏలన గురునకు దృష్టి 8 భాగలకు మించి లేదు. గాన మేష 2 వ భాగయందున్న గురుడు సింహమందు 10 భాగలలో నున్న గ్రహములను మాత్రము వీక్షింప గలడు. అపుడుగాని గురుదృష్టిచే ప్రాప్తింపవలసిన శుభ ఫలములు చేకూరవు. గాన గ్రహ దృష్టుల పరిమితి నెరు గుట ముఖ్యము. 60, 300 భాగల దృష్టికి 7 భాగలు వ్యవధి; 90, 120, 240 భాగల దృష్టికి—8 భాగల వ్యవధి; 150, 210 భాగల దృష్టికి—2 భాగలు వ్యవధి; 180 భాగల దృష్టియందు రవికి — 12 భాగలు, చంద్రునకు —10 భాగలు, శేషించిన గ్రహములకు 8 భాగలు వ్యవధి. పై జెప్పబడిన విధమున దృష్టిఫలముల నెరుగవలెను.

సుతమదన నవాంశే పూర్ణదృష్టిం తమస్య,
యుగళ దశమ గేహే చార్ధ దృష్టిం వదంతి,
సహజరిపు విపన్యన్ పాదదృష్టిం మునీంద్రాః
నిజభవన ముపేతో లోచనాంధః ప్రదిష్టః.

రాహువు 5, 7, 9 అను పూర్ణ దృష్టితోను, 2, 10 లను అర్ధదృష్టితోను, 3, 6 లను పాదదృష్టితోను, స్వక్షేత్ర మందున్న రాహువు చూచును.

రాహుకేతులు పాద దృష్టితో 4, 8 స్థానములను, అర్ధ దృష్టితో 3, 10 స్థానములను, పూర్ణదృష్టితో 5, 7, 9 స్థానములను వీక్షింపగలరు. వీరలకు త్రిపాదదృష్టి లేదు. ఈ దృష్టుల పరిమితి చెప్పబడి యుండలేదు. గాన వీరి దృష్టు లకు పరిమితి లేదని గ్రహింపవలెను. ఋషి సాంప్రదాయాను సారము ఈ ఛాయలకు దృష్టులు లేవని గ్రహింపవలెను. ఇవి రెండు బిందువులుగాని గ్రహములు కావు.

అచ్ఛాదన—పరాశర మతానుసారమున గ్రహములు ద్వితీయ ద్వాదశ స్థానములను అచ్ఛాదింపగలవని యున్నది. జైమినీ సిద్ధాంత ప్రకారము 2, 12 స్థానములందున్న గ్రహములు అర్గళాకారకులు, జాతక నారాయణీయమందు పూర్ణచంద్ర, గురు, శని, కేతులకు అచ్ఛాదన కలదని వీరు తామున్న స్థానము నుండి 2, 12 భావములను అచ్ఛాదింతురని, గురుడు పాప యుతు డైనపుడు ద్వాదశమును మాత్రమే అచ్ఛాదింపగలడని చెప్పబడినది. మరియొకరు పూర్ణచంద్ర, శని, కేతులు తామున్న స్థానమునకు 2, 12 స్థానములను అచ్ఛాదింతురని, గురుడు, తానున్న రాశికి 3, 11 స్థానముల నాచ్ఛాదించునని, రవి, బుధ, శుక్ర, రాహులు తామున్న రాశికి ముందు రాసుల నాచ్ఛాదింతురని చెప్పియున్నారు. తాజకమందు 2, 12 స్థాన దృష్టులు ఆమోదింపబడినవి. పాశ్చాత్యులు 2, 12 స్థానము లకు దృష్టి యున్నదని చెప్పియున్నారు. గాన గ్రహముల కాచ్ఛాదన యున్నదని స్పష్టమగుచున్నది. ఇందలి భిన్నాభి ప్రాయములకు హేతువు గానరాదు. 2, 12 స్థాన ఆచ్ఛాద నలు సర్వ గ్రహముల కున్నవని భావించి 30 భాగల దృష్టి శుభులకు శుభమని, పాపులకు వారి ఆధిపత్య స్థితులచేతను, పాపత్వ పరిమాణముచేతను శుభాశుభముల నిర్ణయించుట ముఖ్యము. ఇట్లే ద్వాదశస్థాన అచ్ఛాదన గూడ నిర్ణయింప వలెను. రాహు, కేతువులు వక్రగతు లగుటచే వారి 300, 330 భాగల దృష్టులు బలీయములని గ్రహించుట ధర్మము. ఇతర గ్రహములు వక్రించినపుడు గూడ ఈవిధముననే చూడ వలెను. అచ్ఛాదనలకు అవధిలేదు. నిర్ణీత దూరమందుండినగాని అచ్ఛాదనా ఫలములు ప్రాప్తింపవు.

యుతి—గ్రహముల యుతి పరిమితియందు గూఢ భిన్నాభిప్రాయములున్నవి. పరాశర మతానుసారము రవికి 12 భాగల వెనుక నుండి ప్రారంభమగు యుతి యందు 17 భాగలు దాటు వరకు గలదని, చంద్రునకు 8 భాగల వెనుక నుండి ప్రారంభమై ముందు 12 భాగలు దాటు వరకు గల దని, ఇతర గ్రహములకు 6 భాగల వెనుకనుండి ప్రారంభమై 8 భాగలు ముందు వరకు నుండునని చెప్పబడినది. కాళిదాసు

గ్రహసంబంధములు

సర్వ గ్రహములకు 12 భాగల వెనుక నుండి యుతి ప్రారంభమై 12 భాగలు ముందుబాగమున దాటువరకు యున్నదని చెప్పినారు. పాశ్చాత్య సిద్ధాంతరీత్యా యుతి 7 భాగలు మాత్రము అవధి గలదని యున్నది. అనుభవములో ఈ సిద్ధాంతములు సరిపోవుటలేదు. యుతి ఫలముల నరయుటకు పరాశర మతానుసారమున త్రైరాసిక పద్ధతి నవలంభించినగాని యథార్థస్థితి నెరుగజాలము.

గ్రహములకు సమ్మోహ, సమయ, కోశ,, సన్నిపాత, సమాగమములను సంబంధము లున్నవి. సమ్మోహ మనగా గ్రహములు కాంతి విహీనమగుట, సమయ మనగా ఎదురంపడుట, కోశమనగా సహవాసము, సన్నిపాత మనగా ఎదిరించుట, సమాగమ మనగా యుతి. 4 లేక 5 గ్రహములు ఒక రాసి యందు చేరిన సంవర్త మనబడును. వారితో రాహుగాని, కేతువుగాని చేరిన సమ్మోహ మనబడును. గురు శనుల కలయిక కోశము. సమ్మోహ, కోశములు ఉపద్రవకరములని శాస్త్ర వచనము. "సమ్మోహ కోశౌ భయదౌ ప్రజానాం."

గ్రహముల సహజదృష్టి స్థితి—గ్రహములు ఊర్ధ్వ, అధోముఖ, ప్రాంచ్య, సమదృష్టులు గలవని శాస్త్రములందు చెప్పబడి యున్నది. ఈ హంశముల గమనించుట ముఖ్యము. ఏలన భచక్రము వలయాకారము గలిగియున్నది. గ్రహములు అష్టదిక్కులందు యున్నవి. భచక్ర భ్రమణమందు ఊర్ధ్వ అధోముఖ, ప్రాంచ్య, సమదృష్టుల కిరణ ప్రసారమందు భేదములు గల్గును. రవి, కుజులు ఊర్ధ్వదృష్టి గలవారు. శని, రాహు, కేతులు అధోదృష్టి గలవారు. చంద్ర, గురులు సమదృష్టి గలవారు. బుధ, శుక్రులు ప్రాంచ్య దృష్టి గలవారు (ప్రక్క దృష్టి).

పరస్పరాను సంబంధములు—పై నుదహరింపబడిన సంబంధములు గాక వేరొక రీతిని గూడ గ్రహసంబంధము లేర్పడుచున్నవి. ఉదాహరణ జాతకమును పరిశీలింతము.

శుక్ర—14		బుధ—4 రవి—12	
లగ్నము			
శని—7			
			గురు—2

ఇందు రవి, బుధులకు యుతి గలిగినది. గురుని పూర్ణ దృష్టి బుధునిమీద యున్నది. గాని, రవిమీద లేదు. రవి, బుధుల యుతిచే, బుధునిమీద పడిన గురుదృష్టి ఫలములు రవికి కూడ ప్రాప్తించుచున్నవి. గురుడు పంచమ దృష్టిచే శనిని చూచుచున్నాడు. శని తృతీయ దృష్టిచే శుక్రుని చూచుచున్నాడు. గురుదృష్టి శుక్రునకు లేదు. ఏలన వీరి మధ్యదూరము 192 భాగ లున్నది. గురు, శనులకు, శని శుక్రులకు పరస్పర దృష్టి యున్నందున గురుదృష్టి నొందిన శని, శుక్రుని వీక్షించుటచే, గురుదృష్టి ఫలములు శుక్రునకు ప్రాప్తించును. శుక్రుడు రవి, బుధులను తృతీయ దృష్టిచే చూచుట, శని, రవి, బుధులను పంచమ దృష్టిచే చూచుచున్నందున, గురుదృష్టి శని, శుక్ర, రవి, బుధులకు ప్రాప్తించినది. ఈవిధమున గురు, శని, శుక్ర, రవి బుధులకు అన్యోన్య సంబంధ మేర్పడినది. గాన 2, 4, 8, 12 భావముల ఫలముల విచారించునపుడు పై జెప్పబడిన దృష్టి ఫల తారతమ్యతల మనసునం దుంచుకొని వీరల దృష్టి ఫలములు ఈ నాల్గు భావముల నున్నవని గ్రహించి ఫల నిర్ణయము చేయవలెను. ద్వితీయమునకు ఎక్కువ శుభత్వము ప్రాప్తించుట, అష్టమమునకు కొంత పాప మేర్పడుట, అట్టే పాపము దృష్టి ఫలములచే తగ్గిపోవుటయే గాక కొంతవరకు శుభ మేర్పడుట గమనింపవలెను. ఇది క్రమమార్గము. జాతకములం దేర్పడిన గ్రహసంబంధముల సూక్ష్మబుద్ధితో విచారించిన గాని ఫలములు అనుభవమునకు రావు.

గ్రహ సంబంధ ఫలములు :

గ్రహ సంబంధ ఫలముల విచారించునపుడు దృష్టులు, ఆచ్ఛాదనలు, యుతి రాసులకు గాదని గ్రహములకున్న మధ్య దూరముల మీద నాధారపడి యుండునని గమనింపవలెను. సర్వ గ్రహములకు భావములందు ఆరోహణ, అవరోహణ లున్నవి. ఆరోహణయందున్న గ్రహము క్రమముగా ఇతర గ్రహములను గాని, భావ మధ్యమును గాని సమీపించునపుడు ఆ గ్రహబలము క్రమముగా వృద్ధినొంది, అవరోహణయందు సంధిని సమీపించునపుడు క్రమముగా బలహీనమగును. శుభుల యుతి, 30 భాగల దృష్టి శుభఫలముల నిచ్చును. వివిధ గ్రహము లొసగు సంబంధఫలము లీ క్రింది విధముగ నుండును :—

రవి—రవి చంద్రుల యుతి గాని, 30 భాగల దృష్టి గాని శుభక్షేత్రములం దేర్పడిన సర్వ విధముల శుభము. 60, 120, 240, 300 భాగల దృష్టి శుభము. అశుభదృష్టులగు 90, 180, 270 భాగల దృష్టులు అశుభము. 150, 210 భాగల దృష్టులు షష్టాష్టకమందు పేర్కొనబడిన వివరానుసారముగా ప్రాప్తించును. రవి మందుడు, బుధుడు శీఘ్ర

గ్రహము. మందుడు ముందు, శీఘ్రగ్రహము వెనుకనున్నను శుభము. గాన రవికిముందు భాగలందు బుధుడున్న ఫలములు తక్కువ. రవికి 3 భాగలందున్న బుధుడు అస్తంగత్వము నొంది పాపఫలముల నిచ్చును, రవిబుధుల ఏకభాగ స్థితి వారున్న రాసులపై నాధారపడియుండును. శుభ స్థానములైన శుభము. లేదా అశుభము. శుభదృష్టులకు 30 భాగల దృష్టి శుభము. రవికుజుల యుతి ఆరోగ్య భంగమేగాక ఇతర విషయములందు కూడ అంత శుభమని చెప్పరాదు. 60 భాగల, 300 భాగల దృష్టి శుభము. అశుభ దృష్టి పాపము. రవి గురుల శుభ దృష్టులు శుభము. పాప దృష్టులు పాపము. యుతి అదృష్ట హేతువు. రవి శుక్రుల యుతిగాని, 30, 300 భాగల దృష్టిగాని శుభము. రవి శనుల శుభదృష్టులు శుభము. యుతి, 30,90, 180, 270 భాగల దృష్టులు మిశ్రమఫలము నొసగును. శుభాధిపత్యము గలిగి యుతి గలుగుట కొంతవరకు శుభము.

రవి బుధుల మధ్య దూరము 28 భాగలు మించదు. రవి శుక్రులకు మధ్యదూరము 48 భాగలు మించదు.

చంద్రుడు—చంద్ర కుజుల కోణదృష్టి శుభము. యుతి అంత మంచిదికాదు. తొందరపాటు, అనారోగ్యములకు హేతువు. ఆచ్ఛాదన, కేంద్రదృష్టులు పాపము. చంద్రబుధుల యుతి చాలామంచిది. ఆచ్ఛాదన శుభద్రుష్టులు శుభము. పాప దృష్టులు పాపము చంద్ర గురులయుతి ఆర్థిక వృద్ధి నొసగును. ఆచ్ఛాదన, శుభద్రుష్టులు అత్యంత శుభము. పాపదృష్టిచే ధనము నష్ట మగును. చంద్రశుక్రుల యుతి లలితకళాదులకు శుభము. ఆచ్ఛాదన, శుభదృష్టులు అత్యంతఫలప్రదములు. అశుభదృష్టులు గృహ సౌఖ్యములకు పాపము. చంద్ర శనుల శుభ దృష్టి శుభము. అశుభదృష్టి, యుతి, ఆటంకములనిచ్చును. మనోవ్యధకు హేతువగును.

కుజుడు—కుజబుధుల శుభదృష్టి, యుతి, ఆచ్ఛాదన శుభ క్షేత్ర శుభభావములందైన అత్యంత శుభముకాని తొందరపాటు, విచక్షణలేక కార్యముల సలుపుట జరుగును. పాపదృష్టి దుర్వృత్తులకు మూలమగును. కుజగురుల యుతి ఆర్థిక నష్టమునకు హేతువు. ఆచ్ఛాదన, శుభదృష్టి శుభము. అశుభదృష్టి వలన ధననష్టము, సాంఘిక, ఆచార వ్యవహారములందు పాపము. కుజశుక్రుల యుతి, ఆచ్ఛాదన, కొంతవరకు శుభమేగాని దురలవాట్లకు కారణము. శుభదృష్టి ధన, సంసార భావములకు శుభము. అశుభదృష్టి పాపము. జలరాసులందు కలుగరాదు. కుజశనుల శుభదృష్టి శుభము. ఆచ్ఛాదన, పాప దృష్టులు సప్తమ భావమునకు, ఆరోగ్యమునకు నష్టము. యుతి అత్యంత

బుధుడు—బుధ గురుల యుతి, ఆచ్ఛాదన,శుభదృష్టి,శుభము. అశుభదృష్టి మనోవేదన గలిగించును. బుధశుక్రుల యుతి, ఆచ్ఛాదన, శుభదృష్టి ఆర్థిక వృద్ధి నిచ్చును. అశుభదృష్టి వలన ధన నష్టము, స్త్రీమూలక కష్టములు ప్రాప్తించును. వీరిర్వుర మధ్యదూరము 76 భాగల మించదు. గాన అశుభ దృష్టి 45 భాగల దృష్టియని గ్రహింపవలెను. బుధశనుల ఆచ్ఛాదన, శుభదృష్టి శుభము. పాపదృష్టులు సర్వకష్టములనిచ్చును. యుతి అంత మంచిదికాదు.

గురుడు—గురుశుక్రుల యుతి,ఆచ్ఛాదన,శుభదృష్టి,శుభము. కేంద్రదృష్టులంత పాపము కాదు. ఇతర పాపదృష్ట్య లత్యంత ఖేదహేతువులు. ఇందు భిన్నాభిప్రాయములున్నవి. గాని అశుభ దృష్టులు ఆర్థిక, సంసార, కష్టముల నొసగును. గురు శనుల యుతి, ఆచ్ఛాదన, శుభ దృష్టి, అత్యంత ఫలప్రదములు. పాపదృష్టి పాపము.

శుక్రుడు—శని,శుక్రులశుభదృష్టి శుభము. యుతి, ఆచ్ఛాదన, అశుభదృష్టులు పాపము. యుతిచే ఆశాభంగములు, గౌరవ నష్టము ప్రాప్తించును.

ఇతర వివరములు రాబోవు వ్యాసములందు ప్రకటింప బడును.

దివాకర సిద్ధాంతము

సూర్యకాంతిని భూమ్యాది గ్రహములు గ్రహించుచున్నవి. సూర్యగోళము సప్తగ్రహములచే చుట్టబడియున్నదని విజ్ఞానశాస్త్రవేత్తలు నిరూపించియున్నారు. ఈ గ్రహములు పుట్టుట, పెరుగుట, చచ్చుటకు కారణభూతులు. ఈ విధముగనే గర్భస్థమగు పిండము సప్తధాతువులచే చుట్టబడియుండుట ఎరిగిన విషయము. సూర్యకిరణములు కోట్లకొలదిగనుండు జీవాణువుల గలిగియున్నవి. ఈ జీవాణు సంయోగమే పిండోత్పత్తికి, అహంకారాది శక్తులకు కారణ భూతము. భూమియందలి ఆకర్షణ శక్తి వీనికి మూలము. సూర్యుడు చైతన్యాత్మకము. చంద్రుడు శక్త్యాత్మకము వీని సంయోగమువలన పిండోత్పత్తి గలుగుచున్నది. పిండముసు గర్భము ధరించి, భరించి పోషించుట జననాంతరము-చైతన్యాత్మకశక్తి దానిని వృద్ధి పొందించుట, లయించుట జరుగుచున్నవి. రజోరేతస్సుల సంయోగకమైన సృష్టిప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన,మను పంచ వాయువులగు పంచ ప్రాణములచే భరించుచున్నది. ఈ పంచ ప్రాణములకు పంచ భూతములగు పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, ఆధారములు. పంచ భూతాత్మకమగు శరీరము. పంచభూతములు

తత్వముల గలిగి సప్తగ్రహ లక్షణ సంబంధములచే సృష్టి కలాపముల నిర్వర్తించుచున్నదని తెలియుచున్నది.

భచక్రము ద్వాదశ భాగములై కాలపురుషుని అంగ ములగుచున్నది. సప్తధాతువులు సప్తగ్రహములై తమ కర్తవ్యముల నిర్వర్తించుచున్నవి. ద్వాదశ రాసులు, సప్తగ్రహములు, ఛాయాగ్రహములు వేర్వేరు కాంతులు గలిగియున్నవి. మేషము రక్తవర్ణము, (Red) వృషభము శ్వేతవర్ణము (గౌరవర్ణము White) మిధునము ఆకుపచ్చ (శ్యామలవర్ణము, green శుకకాంతి) కర్కాటము శ్వేతరక్తవర్ణము (పాటలవర్ణము Pink) సింహము ఎరుపు (పాండువర్ణము, Pale white), కన్య చిత్రవర్ణము (Piebold) తుల నీలవర్ణమని, నలుపని భిన్నాభిప్రాయములున్నవిగాని నలుపని భావింపవలయును (Black), వృశ్చికము బంగారువర్ణము (కాంచనవర్ణము Golden Colour), ధనస్సు ఎరుపు (పింగళ వర్ణము కపిలవర్ణము, yellow Brown), మకరము శుక్ల కపిలవర్ణము, (Variegated), కుంభము నలుపుకూడిన తెలుపు (Dark Brown), మీనము స్వచ్ఛ వర్ణము (Golden).

రవి రక్తసహిత శ్యామవర్ణము (Black + Red/Dark Brown) చంద్రుడు గౌరశ్వేతము (White + yellow), కుజుడు రక్తగౌరవర్ణము (White + Red/Reddis pale Red), బుధుడు దూర్వాశ్యామల వర్ణము (Green) గురుడు గౌరవర్ణము, బంగారువన్నె (తప్త కాంచనము, Yellowih) శుక్రుడు తెలుపు వర్ణము (White), శని నల్లనికాంతి, నీల వర్ణము (Dark Blue) రాహువు మిక్కిలి నల్లని వర్ణము (Pitch Dark), కేతువు విచిత్రకాంతి (Variegated).

సూర్యుడు స్వయంప్రకాశముగల గ్రహము. ఇతర గ్రహములు, భూమి సూర్యకాంతిని పొంది ప్రకాశవంతులగుచున్నవి. సూర్యుడు భూమికి 93 మిలియన్ల మైళ్ల దూరమున నున్నాడు. భూమి వ్యాసము 7,800 మైళ్ళు. సూర్యుని వ్యాసము 8,58,000 మైళ్ళు. అనగా భూమికన్నా 110 రెట్లు. చంద్రుడు భూమి అత్యంత సమీపమునున్న గ్రహములు. వీని మధ్యదూరము 2,38,000 మైళ్ళు. ఇది 2,2,000 నుండి 2,53,000 మైళ్ల వరకు మారుచుండును. చంద్రుని వ్యాసము 2200 మైళ్లు. కుజునకు సూర్యునకు మధ్యదూరము 141 మిలియను మైళ్లు. ఇతని వ్యాసము 4200 మైళ్లు, భూమికి కుజునకు మధ్య దూరము 34,000,000 మైళ్లనుండి 247,000, 000 మైళ్లలోపుగా నుండును. బుధుడు సూర్యునికి అత్యంత సమీపగ్రహము. సూర్యునకు 36 మిలియనుల దూరమందున్నాడు. ఇతని వ్యాసము 3200 మైళ్లు. బుధ సూర్యుల మధ్యదూరము 29 నుండి 43 విలియనుల మైళ్లవరకు మార్పునొందుచుండును. బుధునకు భూమికిగల మధ్య దూరము 49,100,000 మైళ్లనుండి 136,900,000 మైళ్ల వరకు మార్పునొందుచుండును. గురుడు సూర్యునకు 500 మిలియనుల మైళ్ల దూరమందున్నాడు. ఇతని వ్యాసము 88,000 మైళ్లు. భూమినుండి గురునకుగల మధ్య దూరము 362,000,000 మైళ్లనుండి 597,000,000 మైళ్ల వరకు మార్పునొందుచుండును. శుక్రుడు సూర్యునికి 67 మిలియనుల మైళ్ల దూరమందున్నాడు. ఇతని వ్యాసము 7600 మైళ్ళు. భూమికి శుక్రునకుగల మధ్యదూరము 25,700,000 మైళ్ల నుండి 160,900,000 మైళ్ల లోపున మారుచుండును. శని సూర్యునికి 887, మిలియను మైళ్లు. శనికి భూమికి గల మధ్యదూరము 773,000,000 మైళ్లనుండి 1,023,000,000 మైళ్లవరకూ మారుచుండును. బుధునకు సూర్యునిచుట్టు తిరుగుటకు 88 రోజులు, శుక్రునకు 225 రోజులు, భూమికి 365 రోజులు, కుజునకు 1.88 సంవత్సరములు, గురునకు 11.86 సంవత్సరములు, శనికి 29.46 సంవత్సరములు, చంద్రునకు 27 దినముల 7 గంటలు, 43 నిమిషములు పట్టును. సూర్యుడు తూర్పుదిక్కునకు, చంద్రుడు వాయవ్య మూలకు, కుజుడు దక్షిణమునకు, బుధుడు ఉత్తరమునకు, గురుడు ఈశాన్య మూలకు శుక్రుడు ఆగ్నేయ మూలకు, శని పడమర దిక్కునకు వాహువు నైరృతి మూలకు, అధిపతులని చెప్పబడినది.

గ్రహము	భూమినుండి దూరం మైళ్లలో సగటున	వ్యాసార్థము మైళ్లలో	పరిమాణము	భ్రమణ కాలము	పరిభ్రమణ కాలము	కాంతివర్ణము
భూమి,	0	4000	26 × 10/10 సి మైళ్లు	1 రోజు	365¼ రో	
చంద్రుడు	2,39,000	1,100	భూమిలో 1/64 వంతు	27.3 రో	27.3 రో	గౌరి శ్వేతవర్ణము
శుక్రుడు	2,57,00,000	3,850	భూమికి సమానము		225	తెలుపు వర్ణము
కుజుడు	4,86,00,000	2,100	భూమిలో 1/7 వంతు	24.6 గం	1.88 సం	రక్తగౌరవర్ణము
బుధుడు	5,69,00,000	1,500	భూమిలో 1/19 వంతు	88 రో.	88 రో.	ఆకుపచ్చ వర్ణము
రవి	9,28,00,000	4,32.000	భూమికంటె 13 లక్షలుఎక్కువ	25.4 రో		రక్తశ్యామవర్ణము
గురుడు	39,05,00,000	43,370	భూమికంటె 1280 రె. ఎక్కువ	9.9 గం.	11.86సం	తప్తకాంచన వర్ణము
శని	79,24,00,000	35,750	భూమికంటె 716 రె. ఎక్కువ	10.2 గం.	29.5 సం	నీల వర్ణము

ఆకాశ కక్ష్యయందు అన్ని గ్రహములకన్న పైభాగమున శని, తరువాత వరుసగా గురుడు, కుజుడు, రవి, శుక్రుడు, బుధుడు, చంద్రుడు ఉన్నారు. పై జెప్పబడిన విషయముల నాధారము జేసికొని హెూరా శాస్త్రము నన్వయించుటకు అనేక సులభమార్గము లున్నవి. స్థూలముగా ఈ విధానమును ఉదాహరణ జాతకరూపమున చెప్పుచున్నాను.


లగ్నము—కర్కాటము 10 భాగలు, రవి—తులయందు 8 భాగలు, చంద్రుడు కుంభమందు 12 భాగలు, కుజుడు—మిధునమందు 14 భాగలు, బుధుడు తులయందు 7 భాగలు, గురుడు—మేషమందు 13 భాగలు (వక్రి), శుక్రుడు—వృశ్చిక మందు 10 భాగలు, శని—వృశ్చికమందు 23 భాగలు, రాహువు——వృషభమందు 9 భాగలు, కేతువు—వృశ్చికమందు—9 భాగలు.

రవి, బుధుల యుతి, శుక్ర, కేతుల యుతి.

	గురు—13	రాహు—9	కుజుడు—14
చంద్ర—12			లగ్నము 10
	కేతు—9 శుక్ర—10 శని—23	బుధ—7 రవి—8	

ఈ జాతకునకు శని మహర్దశ, శుక్రాంతర, శని విదశ యందు దశమభావ ఫలములు.

దశమ భావమునకు శుక్ర షష్టాష్టక పాపదృష్టి, శని దశమ భావమునకు 140 భాగల దూరమందున్నాడు. దశమ భావమందు షష్ట, భాగ్యాధిపతియగు గురుని 5 భాగల అవరోహస్థితి. దశమభావమునకు, గురునకు, రవి, బుధులు సప్తమదృష్టి. దశమభావమునకు చంద్రుని తృతీయదృష్టి, రాహు ఆచ్ఛాదన, కుజుని 300 భాగల దృష్టి గలవు. లగ్నము నుండి దశమ భావము 268 భాగల దూరమందున్నది. లగ్నము శ్వేతరక్త వర్ణము గలది. దశమభావము రక్తవర్ణము. దృష్టిగల గ్రహములు రవి రక్త శ్యామవర్ణుడు, కుజుడు రక్త గౌరవర్ణుడు, శుక్రుడు స్వచ్ఛవర్ణుడు, శని నలుపు **(Deep Blue)** వర్ణము గలవాడు, కేతు చిత్రవర్ణుడు, చంద్రుడు గౌరవర్ణుడు, గురువు తప్తకాంచన వర్ణుడు, రాహువు నలుపురంగు గలవాడు. బుధుడు ఆకుపచ్చ వర్ణము గలవాడు. ఈ వర్ణముల ప్రభావము రక్తవర్ణముగల దశమ భావమును మార్పు నొందించుట విశదము.




పై జెప్పబడిన గ్రహకాంతులు (గురు, రాహు, కుజులు తప్ప) లగ్నమునుండి ప్రతిబింబించి దశమ భావము మీద పడుచుండుట, ఆయా కాంతులు నేరుగా దశమభావము మీద పడుట గమనింపవలెను. దశమ భావమునకు నవగ్రహ కాంతుల ఫలములు ప్రాప్తించినవి. ఇందు రవి, బుధ, శుక్ర, శని, కేతుల దృష్టులు పాపమని, రాహుదృష్టి కొంత శుభమని, చంద్ర, కుజుల దృష్టులు శుభమని, గురు యుతి గూడ శుభమని తెలియనగును. దశావిదశానాథులగు శని, శుక్రుల దృష్టులు పాపము. పై సిద్ధాంత ప్రకారము తెలుపు+నీలము Dark Blue) పాటల వర్ణముతో కలిపి ప్రతిఫలించు కాంతి దశమ భావకాంతియగు ఎరుపురంగు వర్ణమును, కాంతిని మార్పు నొందింపగలదు. అట్టి మార్పుచే రక్తవర్ణకాంతి నలుపుగా కొంతవరకు మారుచున్నది. ఇతర కాంతులతో సమన్వయముచేసి రక్తవర్ణముమీద నేర్పడు వివిధ కాంతుల బలాబలముల నిర్ణయించిన శనిదశా శుక్రాంతరమందు దశమభావ వర్ణము కాంతివిహీనమగునని గ్రహింపగలము. ఆ క్షీణత శని వర్ణ ప్రధానముచే ప్రాప్తించుట గాననగును. గాన శని మహర్దశ, శుక్రాంతర, శనిభుక్తియందు దశమ భావమునకు కాంతి తగ్గి, పాపఫలము ప్రాప్తించుట విశదము. ఈ ఫలము ప్రాప్తింపక తప్పదు. ఇందు గ్రహముల దూరములు, దిక్కులు, దృష్టి వివరములు, గమనించి వలయాకార రూపమగు భచక్రమునకు కాంతుల రూపమును ప్రసరింప చేయుట ముఖ్యము. ఈ ప్రయోగ మూలమున ఫలముల నెరుగగలము. ఇట్టి పరిశీలనకు తగు అవకాశములు, ఖగోళ, జ్యోతిష, విజ్ఞానశాస్త్ర ప్రవీణుల సహకారము లభించినగాని వలయునన్ని ప్రయోగముల జరిపి వివిధ గ్రహ, భావ సంబంధ ముల ఫలముల గ్రహింప నలవిగాదు.

సర్వ గ్రహములు భూమినుండి ఎంత దూరమునమన్నవో తెలిపియున్నాను. వారి భ్రమణమందు ఏర్పడు మార్పులు కూడ తెలిపియున్నాను. గ్రహములు వక్రగతి గలిగియున్నవని తెలిసిన విషయము. అన్ని గ్రహములు క్రమముగు వర్తులాకార మున లేవు. వీరి భ్రమణ కక్ష్య వర్తులాకారమున నుండదు. వీని ఆకారమూ, కక్ష్యరీతి నారింజపండు లేదా అండాకార మని చెప్పవచ్చును. ఇట్టి ఆకారమునకు రెండు కేంద్రము

గ్రహసంబంధములు

లుండును. పై కేంద్రముపై భ్రమణముచెందు సమయమున భూమి పైభాగ కేంద్రమునకు దగ్గరగా నుండి తన కాంతి ప్రభావమును భూమికి ఎక్కువగా కలుగునట్లు చేయును. వక్రించిన గ్రహకాంతుల ఫలములు ఈ వేళల భూమికి ఎక్కువగా ప్రాప్తించును. ఈ హేతువుచే వక్రీబలీ యని శాస్త్రప్రమాణము. వక్రమందున్న గ్రహములు ఉచ్ఛ ఫలము లిచ్చునని, ఉచ్ఛయందుండి వక్రించిన పాప ఫలములు ప్రాప్తించునని, నీచయందుండి వక్రించిన శుభఫలములు ప్రాప్తించునని, రాశియందు ఉచ్ఛలో నుండి వక్రించి, నవాంశయందు నీచ నొందిన అధిక శుభఫలములు ప్రాప్తించునని, అస్తంగత్వము నొందిన గ్రహములు ఫలశూన్యులని చెప్పబడియున్నది. పై విషయముల ననుసరించి ఈ చెప్పబడిన వివిధ ఫలములు సహేతుకములని గ్రహింపనగును. ఈవిధముగా గ్రహములనుండి భూమికి ప్రాప్తించు కాంతుల బలాబలములు విశదము. కుజుడు వక్రించి భూమికి సమీపమున నుండగా ఇతనిచే ప్రాప్తించు అధిక కాంతిశక్తివలన ఉద్రేకము లెక్కువై ప్రమాదములకు దారితీయుచున్నవి. గాన గ్రహభ్రమణ సామీప్య, దూరముల కాంతి ప్రభావములు భూమి పొందుచూ వివిధ మార్పులకు లోనగుచున్నది. గ్రహము భూమికి దూరముగా నున్నపుడు గ్రహ కిరణ కాంతిప్రభావము తక్కువగుటచే ఆగ్రహ మొసగు ఫలములు తక్కువని తెలియవగును. ఈ విధముననే మానవ జాతకములందు ఫలముల నరయువలెను.

శని భూమికి దగ్గరగా నున్నప్పుడు 773 మిలియను మైళ్ల దూరమున నుండును. దూరముగా నున్నప్పుడు 1023 మిలియను మైళ్ల దూరమున నుండును. అనగా ఈ గ్రహ కక్ష్య వలయ పరిధి 250 మిలియను మైళని తెలియుచున్నది. ఇట్లే ఇతర గ్రహముల కక్ష్యల పరిధులు తెలియనగును.



ఆకాశ కక్ష్యయందు శని చారమున భూమికి అధిక దూరస్థానమునుండి భూమి వరకూ గల దూరమును 360 భాగలకు సరియగునట్లు చేయబడినది. దీని ననుసరించి శని భ్రమణమందు భూమికి ఆయా దినములకు గల దూరమును భాగల రూపమున తెలియనగును. ఇట్లే ఇతర గ్రహములు కూడ నున్నవని ఏర్పరచి దూర నిర్ణయము చేయనగును.

ఈ సిద్ధాంతమును జూన్ నెలలో భారతియందు ప్రచురింపబడిన 101 మహారాజయోగ జాతకములందు అన్వయింపగా ఫలములు ఈ క్రింది విధముగా నున్నవి. ప్రాపంచిక జీవితమందు అభివృద్ధి నొందుచూ ప్రజాదరణ మన్ననను పొందినవారల జాతకములయందు శుక్రకాంతి ప్రాధాన్యము వహించినది. తిరుగుబాటులచే ఉన్నత స్థానము ఆక్రమించిన వారల జాతకములందు కుజ ప్రభావ మెక్కువగా కన్పించుచున్నది. సహజరీతి గౌరవ స్థానముల నొందిన జాతకులకు గురుని కాంతిప్రభావము ప్రాధాన్యత వహించినది. గురు, శుక్రుల కాంతి ప్రభావము ఆధిక్యత వహించిన జాతకులు శ్రీఘకాలములో ప్రజల మన్ననలకు పాత్రులై అత్యున్నత స్థానముల నలంకరించిరి. బుధుని కాంతి ప్రభావముచే మేధావంతులైరి. వీరలలో కొందరు వ్యాపారదక్షులైరి. సినిమారంగములందు ఉన్నతస్థాయి నొందిన జాతకులకు బుధ గురు, శుక్ర కాంతులు ప్రధానములైనవి. గ్రంథకర్తలై అనేక పుస్తకముల ప్రచురించి, గౌరవము నొందిన వారలకు శుక్ర కాంతి ఎక్కువగను, గురుకాంతి ప్రభావము కొంతవరకును ప్రాప్తించినది. గణిత అర్థిక శాస్త్రవేత్తలకు కుజ, బుధ కాంతులు ముఖ్యమైనవి. ఈ క్రింది విధముగా వివరము లున్నవి.

1. సేనాధిపతులై రాజ్యమేలిన వారలకు కుజుడు 290 నుండి 350 భాగలందున్నాడు.

2. ప్రజాభిమానములు పొందిన నాయకులకు శుక్రుడు 325 నుండి 340 భాగలందున్నాడు.

3. సహజస్థితిలో ఉన్నత పదవీ ప్రాప్తి నొందిన వారలకు గురుడు 252 నుండి 320 భాగలందున్నాడు.

4. అత్యాశాపరులకు శుక్రుడు 340 భాగల నుండి 360 వరకున్నాడు.

5. యుద్ధవీరులకు కుజుడు 330 నుండి 360 వరకున్నాడు.

6. మేధావులకు బుధుడు 280 నుండి 340 వరకున్నాడు.

7. ప్రఖ్యాత కళాకారులకు శుక్రుడు 250 పైన, గురుడు 260 పైన, కుజుడు 300 పైన సామాన్యముగ కన్పించుచున్నారు.

8. సప్తమ భావము వృద్ధి నొందిన వారలకు శుక్రుడు 300 భాగలపై నున్నాడు.

9. ప్రఖ్యాత రచయితలకు శుక్రుడు 300 పైన, కుజుడు 310 పైన, గురుడు 210 పైన యున్నారు.

10. గణిత, ఆర్థిక శాస్త్రవేత్తలకు బుధుడు 280 పైన, కుజుడు 210 పైన యున్నారు.

11. వ్యాపారదక్షులకు బుధుడు 290 పైన, గురుడు 260 పైన యున్నారు.

12. సూక్ష్మ శాస్త్రవేత్తలకు గురు, బుధ, రవుల ప్రాధాన్యత కన్పించుచున్నది.

పై చెప్పబడిన భాగలు జాతకములందరి గ్రహ భాగలు కావు. గ్రహకాంతి కిరణ భాగలు ఆయా స్థానములకు ప్రాప్తించినవని ఎరుగవలెను.

శీఘ్రగమనము గల గ్రహకాంతి త్వరలో మార్పు నొందును గాన ఆ కాంతి ప్రభావము నిర్ణయించునపుడు జాగ్రత వహింపవలయును. ఈ గ్రహము లొసగు ఫలములు శీఘ్ర మార్పుల నొందుచుండును. మందగమనము గల గ్రహకాంతి ఫలములు అధికకాల ముండును. ఇది గోచార సిద్ధాంత ప్రమాణము. ఈ అంశముల పరిశీలన కాంతిఫల రీత్యా ఫల నిర్ణయమునకు ప్రధానము.

ఆంధ్రదేశమందున్న విశ్వవిద్యాలయములు ఈ పరిశీలనలకు తగు సౌకర్యము లొసగి, జ్యోతిషశాస్త్ర సూక్ష్మముల గ్రహించు నవకాశము కల్పించి ఈ శాస్త్రమును, మానవ కోటిని ఉద్ధరింతురని ఆశించుచున్నాను. ఈ సిద్ధాంత భావముల సంపూర్ణముగా వ్యాసరూపమున దెలుప నలవిగానందున స్థూలముగా ఉదాహరణ రూపమున దెలిపియున్నాను. అవకాశములు గలిగినవారు పరిశోధనల జరిపి ఫలముల నరయగలరు. త్వరలో ద్వాదశ రాశులకు నవగ్రహ సంయుక్త వీక్షణలచే ప్రాపించు ఫలముల దెలుపగలనను.



స్త్రీ

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

సామాన్యుడు :-

స్త్రీ

సుమనస్సుందర గాత్రీ!
బేలలోకంతో క్రీడించి, లాలించే
మెత్తని శరత్పూర్ణిమ రాత్రీ!
స్త్రీ, స్త్రీ, స్త్రీ

క్రొన్నెలలో-
పడుచు పదును వెన్నెలలో
వల్లరిలో-
నవమృదుతను వల్లరిలో
విరులలో-
మెత్తగా, మత్తుగా కళ్ళనిచుంబించే చల్లని ఇరులలో
అంతటా నీ సౌందర్యమే
ఎల్లెడా నీ లావణ్యమే
పురుషత్వమే ఈ నీ సౌందర్య పరిష్వంగంలో
పరవశిస్తోంది, వసిస్తోంది, నశిస్తోంది-

నీ సౌందర్యస్యందన చక్రవలయంలో
ఈ సృష్టిఅంతా ఇరుకొని యుగ మహా
ప్రస్థానం కేసి ప్రయాణిస్తోంది, ప్రయాణిస్తోంది-

రామాయణ, భారత మహారణజ్వాలల్ని రగిల్చిన
రాగజ్వాలా—నీలోనే, నీతోనే
పరవశిస్తోంది, వసిస్తోంది. ప్రయాణిస్తోంది ఈ సృష్టి-

నీవా, మత్తుగా విచ్చుకొన్న
        ధవళ రోచిస్సుందర సుగంధిల కేతకీ ప్రతానివి—
నీవా, క్రొత్తగా విరిసికొని
        కామదావాంతో ప్రజ్వలించే రక్తానల నేత్రానివి—
నిన్ను నమ్మిన మనసుకు—
        నీ చల్లని కాటుక కంటిరెప్పల నీలినీడల్లో
        చరిస్తుంది వికస్వర స్వర్గం!
నిన్ను నమ్మని దురుసుకు—
        నీ ఎర్రనికంటి మంటల్లోంచి, మండే చూపుల్లోంచి
        మొలుస్తుంది. దారుణ నరకదుర్గం!
        స్త్రీ, స్త్రీ, స్త్రీ

ఒక మహాగాయక కలకంఠం బిగుసుకొన్న గడియలు విడి
అమృత సంగీత రసలోకాలు విరిస్తే—
ఒక కవికుమారుని కలం చెరలువిడి, పదునువడి
కవితా ప్రాంగణంలో మరొక క్రొత్తదీపం వెలిగిస్తే—
ఒక చిత్రకారుని కుంచె పరుగులిడి, బెదురుచెడి
రంగుల, హారంగుల కొత్తకాంతి లోకాలు తెరిస్తే—

కారణం:

లేత నీరెండ కొనలవంటి సన్నని నీ వ్రేళ్ల కొనలు
ఆ కంఠానికి గడియలు తీశాయి—
తన గుండెల్లో చిందులాడే మైత్రిని నీ నవ్వు వెలుగుల గిలిగింతలు
ఆ కలానికి ఊపిరిపోశాయి—
మనస్సును ప్రతినిముషం రగిల్చికాల్చే నీ కళ్ల తెలుపు నీలి తళతళలు
ఆ కుంచెకి రంగులు కురిశాయి—

స్త్రీ, స్త్రీ, స్త్రీ

౪


అసామాన్యుడు :-

నీ అందాన్ని దూసి
నీ నెత్తురినీ, కొత్త ఊపిరినీ పోసి
నీ అమృత హృదయాన్నివంచి ఈ లోకాన్ని పెంచే
చల్లని ధాత్రివి, చల్లని ధాత్రివి.
స్త్రీ, స్త్రీ, స్త్రీ

జ్ఞాని :-

నా నేత్రానికి మాత్రం నువ్వు
పువ్వులో, నవ్వులో
మెరపులో, ఒరపులో
జనంలో, వనంలో
సత్త్వంలో, తత్త్వంలో

దీప్తిమంతమై అంతటా వెలిగే
దివ్య తేజోగాత్రి గాయత్రివి-



ప్రజలు ప్రభుత్వం

శ్రీ జాన్ స్ట్రాచీ

ప్రజాప్రభుత్వ సంస్థలద్వారా పశ్చిమ రాజ్యాలలోని శ్రామికులు పొందిన సౌకర్యాలను గురించి నేనింత గట్టిగా చెప్పడానికి కారణం, కమ్యూనిస్టులు ఈ సౌకర్యాలను గురించి నొక్కి చెబుతూ ఉండడమే : ఈ ఆర్థికసౌకర్యాలే సర్వము కాదు. పశ్చిమరాజ్యాలలోని శ్రామికులు ఇప్పుడు ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్నప్పటికి వారుమాత్రం ఎక్కువ కూలివచ్చే కూలివారుగానే ఉన్నారు. అని ప్రతికూలులైన విమర్శకులు అనవచ్చు. ఈ శ్రామికులు నిజమైన స్వేచ్ఛను పొందలేదని లెనిన్ చెప్పేదానిని పునరుద్ఘాటించవచ్చు. ఈ విమర్శలో కొంత నిజం ఉంది. పశ్చిమరాజ్యాలలో కొన్ని వర్గాలవారు తమ సంఖ్య కుమించిన పలుకుబడిని ప్రభుత్వంలో కలిగి ఉన్నారు. ఈ స్థితి మా దేశంలో అమెరికాలోకంటే కొంచెం ఎక్కువగా ఉన్నది. మా దేశంలోనేకాక, కొంచెం ఎక్కువ తక్కువగా పశ్చిమరాజ్యాలన్నింటిలో ఈ స్థితి ఉన్నది.

ఈ సందర్భంలో రెండు అంశాలను ఆలోచించవలసియున్నది. శ్రామికులు ఈ ప్రజాప్రభుత్వ సంస్థలను ముఖ్యంగా తమ ఆర్థిక స్థితిని పెంపొందించుకొనడానికి ఉపయోగించుకున్నారు. ఈ స్థితి ఎప్పుడైతే అభివృద్ధి చెందిందో అప్పుడే ఈ సంస్థలను ఇంకా ఎక్కువగా ఉపయోగించుకొనగలుగుతారు. ఆ తర్వాత వారికి ఇంకా ఎక్కువ స్వేచ్ఛ లభిస్తుంది. ఆ స్వేచ్ఛవల్లవారికి ఆర్థిక ప్రయోజనాలు ఇంకా ఎక్కువ అవుతాయి. ఇలా స్వేచ్ఛను పురస్కరించుకుని ఆర్థిక ప్రయోజనాలు, ఆర్థిక ప్రయోజనాలవల్ల స్వేచ్ఛ, ఇలా ఒకదాని కొకటి తోడ్పడుతూ ఉంటాయి. ఇది ఆర్థిక పునాదికి, రాజకీయ సౌధానికి జరిగే గతితార్కిక క్రీడ అనేదానిని కమ్యూనిస్టులు గ్రహించవలసి ఉన్నది. పశ్చిమరాజ్యాలలోని శ్రామికులు నెమ్మదిగా, ఎగుడు దిగుడుగా కొన్ని కొన్ని ఆటంకాలతో ఆర్థిక అభివృద్ధిని స్వేచ్ఛను ఎక్కువగా అనుభవిస్తున్నారు. ఈ విషయం నేను నిరూపిస్తాను. తమదేశాల పరిపాలనలో వారికి నానాటికి ఎక్కువ ప్రాధాన్యత వస్తున్నది.

నేననే ప్రజాప్రభుత్వం అందరూ అనుకున్నట్లుగా కాకుండా ఈ మధ్యనే వచ్చింది. "ప్రపంచంలో పెద్దకాలంగా ఉంటూవున్న ప్రజాప్రభుత్వాలలో ఒకటి" అని బ్రిటన్‌ను గురించి అంటూ ఉంటారు. చట్ట ప్రకారం పరిపాలన, కొంత వాక్స్వతంత్ర్యం మొదలైనవి బ్రిటన్‌లో చాలాకాలంగా ఉంటూ ఉన్నవి. కాని వయోజన వోటింగ్ హక్కు అనేటటువంటిది ఏర్పడి, ప్రజలు తమ ఇష్టంవచ్చిన ప్రభుత్వాన్ని ఏర్పరుచుకొనగలిగే నిజమైన ప్రభుత్వం ఈ మధ్యనే వచ్చినది. నిజానికి ఇది నా రాజకీయ జీవితకాలంలోనే సుస్థిరంగా ఏర్పడింది. బ్రిటిష్ జనాభాలో సగానికి సగమంది అయిన స్త్రీలకు ఓటింగ్ హక్కు 1918 సంవత్సరములోనే వచ్చింది. అప్పుడు జరిగిన ఎలక్షను నాకు బాగా గుర్తు. మరీ యువతులైనవారికి 1929 లో మాత్రమే ఓటింగు హక్కు వచ్చింది. అప్పుడే నేను పార్లమెంటుకు ఎన్నికైనాను. బ్రిటిష్ ట్రేడ్ యూనియన్‌లు గత ఇరవై సంవత్సరాలలోనే బలపడినవి. నేను చెప్పే ప్రజాప్రభుత్వం బ్రిటన్‌లోకూడా ఈ మధ్యనే వచ్చింది. దాని పరిపూర్ణ ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రసరిస్తున్నది. దీని ఫలితాలు చివరికి ఎలా పరిణమిస్తుంచగలవో నేను చెప్పలేను. కాని ఒకటి మట్టుకు నిజం. అవి బ్రహ్మాండంగా మాత్రం ఉండబోతాయి. ప్రస్తుతం బ్రిటన్‌లో ఉండే ప్రజాప్రభుత్వ సంస్థలు ఇలాగే నిలబడివుంటే (వాటిని అలాగే ఉంచాలని బ్రిటిష్‌ప్రజలు కృతనిశ్చయులై ఉన్నారు) ఈ శతాబ్దం ఆఖరికి బ్రిటిష్ సంఘస్వరూపం పూర్తిగా మారిపోతుంది. జాతీయ జీవితరంగంలో ప్రతి విషయంలోను శ్రామికులు, అనాటికానాటికి తమ ప్రాబల్యాన్ని పెంచుకుంటారు. వచ్చే 40 సంవత్సరాలలోనూ శ్రామికుల ఇచ్ఛానుసారంగా బ్రిటిష్‌సంఘ స్వరూపమే మారిపోతుంది.

ప్రజా ప్రభుత్వమువల్ల వచ్చిన ఆర్థిక ఫలితాలను పరిశీలించడంద్వారా శ్రామికులు ఆ ప్రభుత్వ విధానాని స్వీయాభివృద్ధికి ఎలా వినియోగించుకున్నదీ గమనించాము.

ప్రజలు - ప్రభుత్వం

వారికి వచ్చిన ఆర్థిక సౌకర్యాలు చాలా ప్రధానమైనవని నా అభిప్రాయం. ఏదైనా లేమి సమయంలోకన్నా కలిమి ఉన్నప్పుడే ప్రజలు ఎక్కువ స్వేచ్ఛా జీవులవుతారు. ఈ విషయం ఎందుకు చెబుతున్నానంటే పశ్చిమరాజ్యాలలో శ్రామికులకు వచ్చిన ఆర్థిక సౌకర్యాలను ఈసడించడం పరిపాటి అయిపోయింది. "టి.వి. స్వేచ్ఛ" అని "మోటారుకారు స్వేచ్ఛ" అని, "బట్టలు ఉతికే మెషీను స్వేచ్ఛ" అని అంటూ ఉంటారు. శ్రామికులు ఉపయోగించే ఈ యంత్ర పరికరాలను హేళనచేయడం రివాజు అయింది. ఈ సంపదతో ఉన్న సంపన్న సమాజాన్ని మొరటైన వికృతమైన సమాజమని వర్ణిస్తున్నారు.

ఈ దృక్పథాన్ని చూస్తే నాకు అసహ్యం. టి.వి. సెట్లు అన్నా, మోటారుకారు అన్నా, గుడ్డలు ఉతికే మెషీను అన్నా, పశ్చిమదేశాల వారి ఇండ్లల్లో ఉండే ఇలాంటి ఇతర పరికరాలు అన్నా నాకు ఇష్టం. పశ్చిమదేశాలలో జీవన ప్రమాణము ఎక్కువగావడానికి ఇతర విషయాలతోపాటు పైన వివరించిన యంత్ర పరికరాలుకూడా మూలమని చెప్పవచ్చు. వీటితోపాటు, నివాస యోగ్యమైన మంచి ఇండ్లు, ఎక్కువ విరామం, పిల్లలకు మంచి చదువు వగైరాలు ఉంటున్నాయి. అలాంటివి ఉండాలని నేను కోరుతున్నాను. మీరు మాత్రం కావాలనరా? నిజానికి ఇవన్నీ ప్రతి శ్రామిక కుటుంబానికి చాలా అవసరము. కేవలము ఆర్థిక సౌఖ్యాన్ని గురించే అనుకుంటూ ఉండడం ఉత్తమ వ్యాసంగం కాదని అనే దానిమీద మనము ఒప్పుకోవచ్చు. ప్రజాప్రభుత్వము కేవలము టి. వి. సెట్లను, మోటారు కార్లను, చివరకు మంచి ఇండ్లను మాత్రమే సాధించినట్లయితే దాని ప్రభావము పరిమితమని చెప్పవచ్చు. ఆర్థిక సౌకర్యాలు లభించినమీదట ప్రతి ఒక్కరు వాటిని విచక్షణతో వినియోగించడం నేర్చుకోవాలి. ఇది అసలు సంపాదించడంకంటె కష్టమైన పని. ఆర్థికసంపదవల్ల వచ్చిన స్వేచ్ఛను మానవుడు సత్పురుషుడుగా పెరగడానికి వినియోగించుకోవడమే, సంపద సద్వినియోగమే ఆశయమై ఉండాలి. అందుకనే పశ్చిమ రాజ్యాలలోని శ్రామికులు ప్రజాప్రభుత్వ సంస్థలద్వారా తమ ఆర్థిక సంపత్తిని అభివృద్ధి చేసుకొనే ప్రయత్నానికి అవే సంస్థలద్వారా తమ స్వేచ్ఛను విస్తరింపజేసుకొనడానికి చేసే ప్రయత్నాల మధ్య గతితార్కిక తగవు జరుగుతూ ఉందని నేను అన్నాను.

కమ్యూనిస్టు దృక్పథంగల కొంతమంది శ్రామికుల స్థితి నిజంగా మెరుగుపడలేదని ఇంకా వాదిస్తూ ఉంటారు. ఇప్పటికి ఎనిమిదేండ్లనాడు (1955 లో) కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో ఉన్న ఫ్రెంచి ట్రేడ్ యూనియన్‌లు శ్రామికుల ఆర్థిక స్థితి నానాటికి దిగజారిపోతుందనే మార్క్సు సిద్ధాంతాన్ని గురించి చర్చించారు. అయితే అది ఎంతవరకు నిజమూ అన్నది గ్రహించక, గుర్తించక ఆ సిద్ధాంతం నిజమని చెప్పేశారు. ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఫ్రెంచి శ్రామికులు ఎక్కువగా పాల్గొనేటట్లు చేయడానికి మార్గమేమిటని కూడా చర్చించారు. కాని శ్రామికుల స్థితి నానాటికి దిగజారిపోతుందనే మార్క్సు సిద్ధాంతమే నిజమైతే, శ్రామికుల వేతనాలు అధికం చేయాలని, వారికి విరామం ఎక్కువ ఉండాలని, వారి పరిస్థితి బాగుపడాలి అనేది ఎలా సాధ్యమవుతుంది ? తేల్చలేని ఈ సమస్యను తేల్చడానికి వారు అన్నివిధాలా చర్చ చేశారు. తమ ట్రేడ్ యూనియన్ ఉద్యమంవల్ల ఫ్రెంచి పనివారల స్థితి అభివృద్ధి చెందుచున్నదనే కనీస సత్యాన్ని వారు గుర్తించడానికి సాహసించలేకపోతున్నారు. దానిని గుర్తించినట్లయితే మార్క్సు సిద్ధాంతం తప్పు అని గుర్తించడం అవుతుంది.

దీనినే సిద్ధాంత అంధకారం అని నేనంటాను. ఆర్థిక, రాజకీయ సిద్ధాంతానికి నేను ప్రతికూలుణ్ణి కాదు. మన సంఘం నడవడానికి ఏది ఉత్తమమైన పద్ధతి అన్నది తేల్చుకోడానికి ఉత్తమమైన సిద్ధాంతాలను ప్రతిపాదించడం అవసరము. లేకపోతే మన సంఘాన్ని బాగుపరచడానికి, సరిదిద్దడానికి వీలులేదు. మహా ఉజ్జ్వలమైన సిద్ధాంతాలు కూడా మనకు నిత్యమూ కనపడే సంఘటనలకు కారణమేమిటని ఊహించుటలో సృష్టించినవే. వాటికి, ఈ సంఘటనలకు అతకనప్పుడు, ఆ మరుక్షణమే వాటికి స్వస్తి చెప్పాలి. కమ్యూనిస్టులు కనక ఈ చిన్న సూత్రాన్ని అంగీకరించినట్లయితే ప్రపంచానికి సముద్రమంత బాధ తప్పేది. కాని వారు, వారిలాంటివారు తమ సిద్ధాంతానికి అలాగే అంటిపెట్టుకుని ఉంటారు. కమ్యూనిస్టులు ఈ సిద్ధాంత అంధకారంలో పడి కొన్ని సమయాలలో కళ్లముందు జరిగే దానినే కాదంటారు. దీని ఫలితాలు వారికీ మనకూ కూడా ప్రమాదిస్తున్నాయి. పశ్చిమ రాజ్యాలలో శ్రామికుల స్థితి నానాటికి మెరుగు అవుతూవుంటే, వీరు మాత్రం నానాటికి దిగజారుతున్నదని ప్రచారం చేయడం దీనికి పెద్ద తార్కాణం.

పశ్చిమ రాజ్యాలలో శ్రామికులు తమ జీవన ప్రమాణాన్ని అభివృద్ధి చేసుకొనడానికి ప్రజాప్రభుత్వ సంస్థలను ఎలా వినియోగించుకొన్నదీ వివరించదలచాను. అలా జీవన ప్రమాణాన్ని అభివృద్ధిచేసుకున్నమీదట దానిని పురస్కరించుకొని ప్రజాప్రభుత్వ సంస్థలను ఎలా బలపరిచిందీ తర్వాత తెలియజెప్పుతాను. కొన్ని సంవత్సరాల కొకసారి ఒక అభ్యర్థిని వదలి మరొక అభ్యర్థికి ఓటు చేయడం అనే దానికి, ఎక్కువ వేత

నాలు సంపాదించడానికి, తక్కువ కాలం పనిచేయడానికి మరితర జీవిత సదుపాయాలకి గల సంబంధం దానికది ప్రత్యక్షంగా కనబడదు. అయినా కొంతకాలానికి అలాంటి సంబంధం ఉన్నట్టు తేలుతుంది. ప్రజాప్రభుత్వం ప్రజల స్థితిని ఏవిధంగా బాగుచేసినదీ—బాగుచేస్తూన్నదీ తెలుసుకోవాలంటే, పశ్చిమ రాజ్యాలలో ప్రజాప్రభుత్వ సంస్థల పుట్టుక— పరిణామం గురించి తెలుసుకోవాలి. ఇవంటే నమ్మకంలేని లెనిన్, వాటి చరిత్రను చక్కగా చెప్పాడు. state and Revolution అనే తన గ్రంథంలో లెనిన్ ఇలా వ్రాశారు : బూర్జువా ప్రజా ప్రభుత్వంలో ప్రతి నాలుగైదు సంవత్సరాలకి ఎన్నికలు జరుగుతాయని, ఆ ఎన్నికలలో పాలక వర్గానికి చెందిన వారిలో ఎవ్వరినో ఎన్నుకొనడం అనేదే జరుగుతుందని ఆయన వర్ణించారు. 19 వ శతాబ్దంలో జరిగిన బ్రిటిష్ ఎన్నికకు ఈయన వర్ణన చెల్లుతుంది. అప్పుడు బ్రిటిష్ శ్రామికులు రెండు పాలక పార్టీలవారినే ఎన్నుకోవలసి ఉన్నది. కన్సర్వేటివ్‌లు, వీరు భూస్వాములు. రెండు లిబరల్స్. వీరు వస్తువులు తయారుచేసే వర్గాలవారు. మార్క్స్ లెనిన్ ఈ విషయం తెలిపినప్పుడు ప్రజా ప్రభుత్వం అనేది వట్టి బూటకం—మోసం అని తేల్చేశామని అనుకున్నారు. కన్సర్వేటివ్‌ను ఎన్నుకున్నా—లిబరల్‌ను ఎన్నుకున్నా తమకు ఒరిగే దేమిటని అన్నారు. ఈ రెండు పక్షాలవారు ఒకేవిధంగా శ్రామికులను ఉపయోగించుకుంటారని మార్క్స్—లెనిన్ అన్నారు.

కాని సరసంగా కనిపించే ఈ సిద్ధాంతం తప్పు అని తేలింది. ప్రజాప్రభుత్వ నిర్వాహణ విధానంలో మార్క్స్—లెనిన్‌లకు అభిరుచి లేదు. అందువల్ల శ్రామికులకు ఓటు హక్కు రాగానే, దానిని తమ అవసరాలపట్ల పాలకులు శ్రద్ధవహించేటట్లుగా వినియోగిస్తారనేది మార్క్స్, లెనిన్‌లు మర్చిపోయారు. పాలకవర్గంలో ఎవ్వరు అధికారంలో ఉంటే తమకు మంచిదని తమ ఓట్ల ద్వారా నిర్ణయించడం మొదలెట్టారో, ఈ పాలకవర్గాలు రెండూ శ్రామికుల ఓట్లు సంపాదించడానికి ఒకరితో ఒకరు పోటీలు పడడం సాగించారు. బ్రిటన్‌లో జరిగినది ఇది. బ్రిటిష్ శ్రామికులలో చాలా మందికి 1867 సంస్కరణల చట్టం అనుసరించి మొదటిసారిగా ఓటు వచ్చింది. అదే కాలంలో ట్రేడ్ యూనియన్‌లు ఏర్పరచుకోవాలని, ప్రజాప్రభుత్వంలో మరో ప్రాథమిక హక్కుకు తీవ్రమైన ఆందోళన సాగింది. 1824 నుండి ట్రేడ్‌యూనియన్‌లు న్యాయసమ్మతమైనవిగా గుర్తించబడినవి. 1860 లో ఇవి బలీయమై యజమానులను ఇరుకులో పెట్టడం సాగించాయి. అప్పుడు వెంటనే కొన్ని చట్టాలు చేయడం, కొన్ని దర్యాప్తు సంఘాలు వేయడం మొదలైనవి అప్పుడున్న లిబరల్ పక్ష ప్రభుత్వం చేసింది. వీటివల్ల ట్రేడ్ యూనియన్ కార్యకలాపాన్ని అణచి, యూనియన్‌ల ద్వారా రాయబారాలు రాజీలు సాగించే అవకాశం అంతరించిపోయేట్టుగా కనిపించింది. అయితే 1874 లో జనరల్ ఎన్నికలు జరగనున్నవి. ఆ సమయం చూచుకొని రాయబారాలు జరిపే హక్కును సంపాదించుకోడానికి బ్రిటిష్ యూనియన్‌లన్నీ పెద్ద పెట్టున ప్రయత్నం చేశాయి. ఆ ప్రయత్నంలో వారు కృతకృత్యులైనారు. అధికారంలో ప్రవేశించడానికి తహతహ లాడుతున్న కన్సర్వేటివ్ పక్షం, తమను కనుక ఎన్నుకునేటట్లయితే ట్రేడ్ యూనియన్ హక్కులు న్యాయసమ్మతం చేయగలమని వాగ్దానం చేశారు. దానితో వారు ఎన్నికైనారు. ట్రేడ్ యూనియనిజాన్ని చట్టం ద్వారా న్యాయసమ్మతం చేశారు. ఆ చట్టాన్నే 1875 The cross Acts అంటారు. అయితే ఇంతటితో ఇది ఆగలేదు. 1901 లో యజమానుల లాయర్లు ట్రేడ్ యూనియనులకు ఒక ఎదురు ఎత్తు ఎత్తారు. సమ్మె మూలాన వచ్చిన నష్టాన్ని అంతా యూనియనుల నుంచి జరిమానా ద్వారా వసూలు చేయాలన్నారు. దీనినే Taff Vale తీర్పు అంటారు. దీనివల్ల సమ్మె అనేది అసాధ్యమైంది. దీనిని మార్చడానికి ట్రేడ్ యూనియన్‌లు తమ ఓటింగ్ హక్కును మరల ప్రయోగించాయి. ఈ పర్యాయము తమ ఓట్లను లిబరల్స్‌కు ఇచ్చాయి. అంతేగాకుండా లేబరుపార్టీ అనే తమ పార్టీని కూడా పెట్టుకున్నారు. చివరకు 1906 Tarde union Act అనే దాని ద్వారా Taff Vale తీర్పును తుడిచివేశారు. అయినప్పటికి పోరాటం సాగుతూనే ఉంది. 1909 లో Osborn తీర్పు అనేది వచ్చింది. దానివల్ల ట్రేడ్ యూనియన్లకు రాజకీయ వ్యాసంగం నిషిద్ధమైపోయింది. దీనిని ట్రేడ్‌యూనియన్ తిరిగి తమ ఓట్లద్వారా రద్దు చేయించగలిగారు. 1913 లో ఈ తీర్పును తుడిచివేశారు. నా రాజకీయ జీవిత కాలంలోనే 1926 సర్వ వ్యాపిత సమ్మె తర్వాత టోరీ ప్రభుత్వం ట్రేడ్ యూనియన్‌ల రాజకీయ వ్యాసంగాన్ని పరిమితిచేస్తూ చట్టాన్ని చేసింది. దీనిని 1945 లో లేబరుపక్షం అసాధారణ విజయంవల్ల ఈ చట్టాన్ని రద్దుచేసింది. అధికారానికి రాగానే వారు ఓంప్రథమంగా తీసుకున్న చర్యే ఇది.

బ్రిటిష్ పారిశ్రామికుల స్థితి కడుపు నిండీ నిండని స్థితిని అధిగమించి పై స్థాయికి వెళ్లుటలో వారికి రాజకీయ ప్రజాస్వామ్యానికి మధ్య జరిగిన "ఆటను" చక్కగా

చిత్రిస్తుంది కాబట్టి బ్రిటన్‌లో గత నూరేళ్ల చరిత్రను సంక్షిప్తంగా వర్ణించాను. ప్రజా ప్రభుత్వం తాను సాధించినది ఈవిధంగా సాధించింది. ఇతర పశ్చిమ రాజ్యాలలో ఇలాగే జరిగింది. అయితే అది జరిగిన కాలము, సన్నివేశాలు భేదంగా ఉన్నాయి. కాని అంతిమ ఫలితం మాత్రం సర్వత్రా ఒకటే. తమ ఓట్ల ద్వారా శ్రామికులు తమ బత్తెములను, పని పరిస్థితులను మార్చగలిగే సంస్థలను ఏర్పాటు చేసుకోగలిగారు. దీనిని సాధించుకొనడానికి వారు చాలాకాలం చాలా పోట్లాడవలసి వచ్చింది.

వీరి పోరాట పద్ధతి అన్నిచోట్ల దాదాపు ఒకేవిధంగా నడిచింది. మొదటలో పై తరగతులలోనే ట్రేడ్ యూనియన్ స్థాపించుకొనే హక్కును ఇస్తామనే తెగను బలపరచి, ఆ హక్కుకు వ్యతిరేకులైన వారిని వ్యతిరేకించారు. కాని ఒక సమయం వచ్చేసరికి ఈ ఎత్తు పని చేయలేదు. అందుకని తమ పార్టీనే ఒక దానిని స్థాపించి, దానిని ఆర్థికంగా బలపరచారు. అమెరికాలో మాత్రం కేవలం ఇలా జరగలేదు. వారు రిపబ్లిక్—డెమొక్రాటిక్ పరీక్షలతో తమ కెవరైతే ఎక్కువ ప్రయోజనాలు కలిగిస్తారని తోచిన వారిని బలపరుస్తూ వచ్చారు. 1932 సంవత్సరం దాకా ఇలాగే జరిగింది. రూజ్వెల్ట్ ప్రభుత్వంవచ్చి "న్యూడీల్" ఏర్పడినప్పటినుంచి అమెరికా ట్రేడ్ యూనియన్‌లు డెమొక్రాటిక్ పక్షంతో చేతులు కలిపాయి. కాలం గడిచిన తర్వాత డెమొక్రాటిక్ పక్షం అమెరికా శ్రామికుల పక్షంగా పరిణమించవచ్చును. పశ్చిమ యూరపులో సోషల్ డెమొక్రాటిక్ పార్టీల పుట్టుక పరిణామం వేరైనప్పటికి, అక్కడి శ్రామికుల పార్టీలలాగే అమెరికా డెమొక్రాటిక్ పార్టీ కూడా శ్రామికుల పార్టీ అవుతుంది.

ట్రేడ్ యూనియనులు స్వేచ్ఛతో పటుత్వంగా వ్యవహరించే హక్కును సంపాదించగలగడమేకాక, ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించగల—తొలగించగల హక్కు వచ్చేసరికి, ఐహిక—ఆముష్మిక స్వేచ్ఛ కూడా సాధించుకో గలుగుతారు.

అమెరికానుంచి మరొక ఉదాహరణను ఇస్తాను. అమెరికా జనాభాలో పది వంతులుగావున్న నీగ్రోలకు సమానత్వమనే భయంకర సమస్యను చూడండి. దక్షిణ అమెరికాలో వున్న వర్ణ విచక్షణ సమస్యను చూపెడుతూ కమ్యూనిస్టులు ప్రజా ప్రభుత్వాన్ని పట్టి బూటకం నాటకం అంటున్నారు. కాని అక్కడ సమానత్వానికి జరిగే పోరాటాన్ని చూస్తే కమ్యూనిస్టుల వాదం ఓటిదైపోతుంది. నేడు ఏ నాగరిక సంఘంలోనైనా ఓటింగ్ హక్కు లేకపోతేనేతప్ప, ఒక తెగ ప్రజను విచక్షణతో చూడడానికి సాధ్యంకాదు. సిద్ధాంత రీత్యాకాక, ఆచరణలో (నీగ్రోలకు) ఓటింగ్ హక్కు లేకుండా చేయడంవల్ల నాలుగైదు రాష్ట్రాలలో అమానుషమైన ఈ జాతి విచక్షణ కార్యక్రమం సాగుతోంది. దౌర్జన్య చర్యల మూలాన, లేక ఓటర్లపైన భరించలేనంత పన్నులు విధించి ఈ రాష్ట్రాలలో నీగ్రోలకు ఓటింగ్ హక్కు లేకుండా చేస్తున్నారు. అలా చేయడం మూలాన చట్ట రీత్యా ఉండే సమానత్వం, ఇతర స్వేచ్ఛలు లేకుండా పోతున్నవి.

ఈ రాష్ట్రాలలో నీగ్రోలకు ఓటింగ్ హక్కు ఉంటే తెల్లవారు విచక్షణా విధానాన్ని అనుసరించ లేకపోయేవారు. దక్షిణ రాష్ట్రాలలో కూడా నీగ్రోలు ఓటింగ్ హక్కును సంపాదించుకొనడంవల్ల ఈ విషయం రుజావు అవుతున్నది. నీగ్రోలపట్ల ఫెడరల్ ప్రభుత్వం తన విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చడం మొదలు పెట్టింది. ఆ ప్రభుత్వ ఆసరావల్ల దక్షిణ రాష్ట్రాలలో నీగ్రోలు తమ ఓటింగ్ హక్కును ప్రయోగించడం మొదలు పెట్టారు. ఈవిధంగా వీరు వ్యవహరించడంవల్ల దక్షిణ రాష్ట్రాలలో ఒకదాని తర్వాత ఒకటి వర్ణ విచక్షణా విధానానికి స్వస్తి చెప్పడం జరుగుతుంది.

ఇదంతా నీగ్రోలు అపూర్వమైన నిబ్బరంతోను, ధైర్యంతోను పోరాడితేనేతప్ప సాధ్యంకాదు. ట్రేడ్ యూనియన్ హక్కుకోసం బ్రిటిష్ శ్రామికులు ఎన్నో కష్టాలను ఓర్చి, ఎంతోకాలం పోట్లాడినట్టే నీగ్రోలు తమ హక్కులకోసం పోట్లాడవలసి ఉంటుంది. దానికి ఉపక్రమించడం జరిగింది. నీగ్రోలు తమ ఓట్ల ప్రయోగంవల్ల ప్రభుత్వాన్ని తొలగించడానికి తోడ్పడలేని స్థితి అమెరికాలో ఒక చిన్న ప్రాంతంలోనే ఉన్నది. కొద్ది సంవత్సరాలలో ఈ వర్ణ విచక్షణవున్న ప్రాంతాలను తమ చేజిక్కించుకోగలమని అమెరికా నీగ్రోల నాయకుడు డాక్టర్ మార్టిన్ లూథర్‌కింగ్ నాతో చెప్పాడు. అన్నిటికీ ఓటింగ్ హక్కు అనేది కీలకమని, ముందుగా దాని సాధించాలని, ఎంచి, తమ శక్తినంతను ఆ హక్కు సంపాదన కోసం అమెరికా నీగ్రోలు కేంద్రీకరిస్తున్నారు.

(సశేషం)

ఉదబిందువులు

శ్రీ త్రిపురనేని వెంకటేశ్వరరావు

భారతి గత సంచికలో శ్రీ జి. వి. కృష్ణరావుగారి రచన 'ఉదబిందువుల'పై వెలువడిన సమీక్ష చదివినమీదట, అందుకలిగిన అపార్థంపట్ల మిన్నకుండక వ్రాయవలసి వస్తున్నది.

పద్య విభాగముతప్ప విడచి, నాటికా కథానికా సాహితీ విభాగములపై సాగిన ఆ సమీక్షలో 'సాహిత్య భవితవ్య' వ్యాస పరామర్శమే ప్రధానమైనది. అందులోనూ కొంగ్రొత్తలను సైతము చెప్పుతున్న గాఢమైన శాస్త్ర విషయాలనుగాక, నేటి సామాజిక పరిణామ రీతులను సాహిత్యముమీద- తత్ప్రభావ ప్రసరణము వివేచించిన భాగమొక్కటే చర్చించబడింది. కావ్యానుభూతి స్వరూపము నిరూపించి, నిశ్చయించినమీదట, తదనుభూతికి ఆటంకకరములైన పరిస్థితులు నేటి సమాజంలో ఇలా నెలకొంటున్నవని చూపించడం, ఆ వ్యాసంలో పథకం. కాని భారతి సమీక్ష కావ్య నిర్మాణా స్వాదనల స్వరూప నిర్ణయం జోలికి పోకుండానే నేటి పరిస్థితులను, భవితవ్యాన్ని గూర్చి వాఖ్యానించింది. కావ్యానుభూతి సమాధ్యవస్థ కాకున్నచో తదవస్థాపాదకతకు భంజకాలైన కారణాలను ఎన్నికచేసి పేర్కొనడం ఆవశ్యంకాదు. యోగీశ్వరుడన్న శివుని సమాధ్యవస్థ మన్మథుని మోహరింపు ముందు భంగమయింది.

తీవ్ర వేగముతో స్థితిగతులు మారుతున్నందున రచయితలకు విస్పష్టదృష్టి లోపిస్తున్నదని, భౌతిక భోగలాలస పెచ్చరిల్లి ప్రజానీకం కావ్యాస్వాదనకు దూరమవుతున్నదని, ప్రభుత్వాలు రచయితలను, లలిత కళాస్రష్టలను పూర్తిగా అనుశాసిస్తున్నవని గ్రంథకర్త అంటుంటే సమీక్ష ఆమోదిస్తోంది. 'నేటి పరిస్థితుల గూర్చిన పై పరామర్శ న్యాయంగానే ఉంది' అని సమీక్ష అన్నది. కాని, ఆ పరిస్థితుల పర్యవసానంగా 'సమాధ్యవస్థాపాదకాలైన కృతులకు అవకాశం తక్కువ' అని గ్రంథకర్తలు నిగమనం చేయగా, సమీక్ష కది నిరాశ, నిస్పృహగా గోచరించి విభేదించింది.. కారణాలను అంగీకరించి కార్యాన్ని, ఫలితాన్ని అంగీకరించలేకపోయిన విచిత్రస్థితి ఈ సమీక్షకు ఏర్పడింది.

ఆ వైపరీత్యం అలా ఉండగా, సాహిత్య భవితవ్యాన్ని గ్రంథకర్త నిరాశామయంగా దర్శిస్తున్నారని సమీక్ష అనడం మరొక వింత. ఇటీవల రచనలను ఆశావాదం క్రిందికో నిరాశావాదం క్రిందికో జమకట్టడం ఆనవాయితీ అయింది. అయితే యీ జమకట్టడం అవిచక్షితంగా ఉంటున్నది. ట్రాజెడీ అయితే చాలు నిరాశావాదంగా నమోదు చేయబడుతోంది. ట్రాజెడీకి గల కారణాలు మానవకృతాలు అని, వాటిని సవరించుకొనే అధికారం మానవుని కున్నట్టు అనుకోనిస్తున్నంతసేపూ అది నిరాశావాదం కాదని గమనించడంలేదు. ఆశావాదము పేర కామన్నదంతా మన మేలు కొరకే, అంతా సలక్షణంగా సాగిపోతున్నదనే ధోరణికి వశంవదమై అవిచారపరత్వంతో పురుషప్రయత్నంయొక్క అక్కరను నొక్కి చెప్పలేక పోవడం కానవస్తోంది. ప్రస్తుతం యీ సమీక్ష స్థితి యిట్టిదే.

"దీనినిబట్టి అగ్రగామి దేశాలలో గాని, వెనుకబడిన దేశాలలో గాని ఉత్తమకృతులు వెలువడటానికి బొత్తిగా అవకాశాలు లేవని భావించరాదు, సత్కావ్యావిర్భూతికి అవకాశాలు తక్కువని చెప్పటమే ప్రకృత తాత్పర్యం" ఇలా జాగ్రత్తపడుతున్నా రచయితకు నైరాశ్యాన్ని అంటగట్ట తలపడం సులువయింది.

సత్కావ్యావిర్భూతికి అవకాశాలను కుదించే భౌతిక భోగలాలసకు, అధికారవ్యామోహానికి, ప్రభుత్వానుశాసనానికి, విస్పష్టమైన ధార్మికదృష్టి రూపు గొనమికి విశేషమైన కారణంగా సాంకేతికవిద్యా విజృంభణాన్ని గ్రంథకర్త చెప్పి ఉన్నారు. ఈ 'టెక్నాక్రసీ' కి లొంగిపోవడం రచయిత మతం కాదని ప్రతివాక్యం ద్యోతకం చేస్తోంది. ఈ సాంకేతిక వ్యవహారమంతా మానవుని సృష్టిగాని; దైవకృతమనో, ప్రకృతివైపరీత్యమనో వగవలేదు. సృష్టికర్త అయిన మానవుడు తలచుకొంటే తన సృష్టికి తాను లొంగిపోనవసరంలేదు. కాని కారణాన్ని తెలుసుకోక విహ్వలిస్తున్నాడు, అంటున్నారు గ్రంథకర్త.

"ప్రబల భయదమ్ము యక్ష రూపమ్ము వ్రాసి
యరసి చిత్రకారుడు తానె యడలునట్లు
ఆత్మకల్పిత సంసారమందు బోధ
విరహితుండు సమ్మోహియై విహ్వలించు."

ఈ మాధ్యమిక వింశతి పద్యం నేటి ప్రపంచ స్థితిని చక్కగా చెపుతోంది. ఈ ఉదబిందువులలోనిదే. ఈ విషయం అకళించుకోలేక, "స్థితిగతులు ఇంత త్వరితంగా మారుతున్నప్పుడు .... ఈ యిరుపక్షాలూ (రచయిత, పాఠకుడు) విభ్రాంతాలై ప్రతిదీ తాత్కాలికమనీ భావించవా ?" అని రచయిత అడుగుతుంటే, సమీక్ష "అలా అయితే మంచిదే— అదే ప్రతీత్య సముత్పాద దృష్టి. అటువంటి దృష్టి కలుగుతూ విభ్రాంతులౌతున్న మనుష్యుల్లోనే అమూర్త ప్రపంచాన్ని గురించీ, చతుష్కోటి వినిర్ముక్తమైన తత్వాన్ని గురించీ జిజ్ఞాసా, అన్వేషణా యితోధికంగా వృద్ధిచెందుతుంది" అని ఫర్వా చెపుతున్నది.

ప్రతిదీ తాత్కాలికమైనదే అన్న భావం కలగడానికి, ఆ తాత్కాలికం వెనక ఏదో, స్థిరమైనదో ఇంకొకటో సొంచి ఉన్నదన్న స్ఫూర్తి కల్గడం, తదన్వేషణకు సిద్ధికి ఎంతో దవ్వు. ఉన్నదంతా క్షణికమేనని అవగతం అవుతోందంటే క్షణికం వెనుక, పరమార్థం దానంతటదే గోచరిస్తుంది లెమ్మనడమేమిటి ? క్షణికమే సత్ అని కలుగుతుండగా, దాని వెనుక చూడనేల ? యత్‌సత్ తత్‌క్షణికమనే పరమ భావం కల్గడమే నేటి పరిణామ తీవ్రతయొక్క ఫలితం అని రచయిత ఆక్రోశం. ఈ పరిణామ తీవ్రత ఉన్నంతవరకూ ఈ భ్రాంతి కలుగుతోనే ఉంటుందని, కారణం నివరింపబడక కార్యం నివరింపబడదని, కారణం నివగించడానికి పురుష ప్రయత్నం అవసరమని రచయిత విశ్వాసం. సమీక్షలో దానంతటి కదే పోతుందనే బండ నమ్మకం, పురుష ప్రయత్నంతో అవసరంలేని మొండి నమ్మకం ఉంది.

అలాగే ప్రజానీకం భౌతిక భోగలాలస మవుతున్నది అని రచయిత వాపోతుంటే, సమీక్ష "అవనీయండి ? కామిగాక మోక్షగామి కాడు. ఇలాంటి పరిస్థితులలోనే ఉత్తమ సాహిత్య సృష్టికీ, ద్రష్టతత్త్వజ్ఞుడూ అయిన రచయితకూ అవకాశం ఎక్కువగా లభిస్తుంది" అని చలమ్ము చేస్తున్నది. ఇంకా "షేక్స్‌పియర్‌నాటి ఆంగ్ల ప్రజానీకం, పెద్దననాటి ఆంధ్ర ప్రజ, కాళిదాసునాటి మనుష్యులూ భోగలాలసులే ననే మాట మరచిపోతే ఎట్లా ?" అని ఎదురు ప్రశ్నిస్తోంది.

మోక్షార్థులుగా మానవులంతా మారడానికి కాముకత్వాన్ని విబంధిస్తున్నది సమీక్ష. 'కామిగాక మోక్షగామి కాడు' అన్నది లోకప్రసిద్ధమైన ఒకానొక ఛలోక్తి. ఛలోక్తిని పరమ ప్రమాణంగా ఒక వాదన్ని నిర్మిస్తున్నది సమీక్ష. కాముకత్వం పూర్వాశ్రమంగా వెలయించుకోలేక ఆజన్మ బ్రహ్మచర్యావలంబకులైన శంకర వివేకానందుల మాట ఏమిటి ? కట్టు తిరుగుటోతు తనాప్నంతా మోక్షార్థిత్వ పర్యవసాయిగా ప్రోత్సహించవలసి యున్నదన్నమాట. వేమన్న, శీలాశుకుల పరిణామం 'కామిగాక మోక్షకామిగాడు' అన్న నిబంధనను సమర్థిస్తుందా ? ఈ భోగలాలస పరమార్థదృష్టిగా దానంతటి కదే పండుతుందని కిమ్మనకుండా ఊరుకోవడం ఆశావాదమా ? ఈ దారి మళ్లించాలనే చిత్రాన్ని చూపితే నిరాశావాద మవుతున్నదా ?

షేక్స్‌పియర్, పెద్దన, కాళిదాసులనాటి జనులు భోగలాలసు లంటున్నారు. అదే అప్ప టిప్పటి పరిస్థితులలోని తుల్యాంశం అని అంటున్నారు. అయితే అంతంతటి కావ్యావిర్భావతి జరగడం లేదుగదా ! దానికేమిగాని, సున్నితాలైన మానసికానుభూతులను లెక్కచేసుకోని భోగలాలస మాత్రం నాటిది కాదనవచ్చు. నేటి వణిక్ప్రపంచంలో సాహిత్యాస్వాదనా బుద్ధి ఎక్కడున్నది ? శ్రీనాథునినాటి నౌకా వ్యాపారి అవచితిప్పడు నే డెవ్వడున్నాడు ? పెద్దన్నకు పల్లకీ బోయీతనం నెరపిన కృష్ణరాయునికీ సాహిత్య అకాడమీ బహుమానా లిచ్చే రాజకీయులకూ దృష్టిలో పోలిక ఉన్నదా ? పెద్దన కాళిదాసాదుల కృతులవల్లనో, వాళ్లను కట్టుకోవడం వల్లనో నాటి రాజ్యాధికారాన్ని బలపరచుకోడాన్ని లక్ష్యించినారనగలమా? అకాడమీ నిర్మాతలైన రాజకీయులకు అట్టి దృష్టి లేకున్నదా ? నాటివారు భోగలాలసులే నేమోగాని, ఆ భోగలాలస లలితకళాస్వాదనా మాధురలాలసను పెంచి పోషించుకొన్నట్టిది. నేటిది మాత్రము అలా కానరావడంలేదు. మహా అయితే నేటి భోగలాలస ఉద్రేకతను (Sensation) కోరుతున్నది. ఈ స్థితినుండి మళ్లించాలని రచయిత, అదే పర్యవసిస్తుందని సమీక్ష, అంటున్నారు.

* * *

కృష్ణరావుగారు మాధ్యమికవాదులైనందున ఈ పరిణామ ప్రవాహానికి ఆక్షేపణ చెప్పరాదని సమీక్ష పెద్దపెట్టున చెప్తుతున్నది. ఇదంతా క్షణికవాదమన్నది మాధ్యమిక మతాంశ మ్మాగమన్న భ్రాంతివల్ల జరిగినట్టిది గాని తెలిసికొని చేసింది కాదు. క్షణికవాదమూ బౌద్ధులదే గాని శూన్యవాద శాఖలోనిది కాదు. బ్రహ్మసూత్ర భాష్యం చూచినా క్షణికవాదాన్ని మాధ్యమికుల తలకు చుట్టడం సంభవించదు. అది సౌత్రాంతికులదీ, విజ్ఞానవాదులిదీను. మాధ్యమికులు క్షణికవాద నిరాసకులు. చంద్రకీర్తి క్షణికవాద ఖండనం ప్రసిద్ధము.

ఇక మాధ్యమికము క్షణికవాదముతోను, శాశ్వతత్వముతోను సమానంగా విభేదిస్తుంది. గతి స్థితులను, స్థిరక్షరాలను సముదాయిలోనే కాదంటుంది. ఆ రెండింటి తత్వాల్ని శూన్యమని నిరూపిస్తుంది. 'యత్‌సత్ తత్‌క్షణికం' అని సమీక్ష

ఉదహరించినట్లు అనడానికి సత్, అసత్, సదసత్, సదసదను భయము అన్న నాల్గు కోటిలలోనూ ఇటు వ్యవహారజగత్తు గానీ, అటు పరమార్థస్థితిగాని ఒదగదని చెప్పే శూన్యవాదము వకు వీలేలేదు.

అలాగే ప్రతీత్య సముత్పాదవాదమంటే క్షణికవాద మనుకొన్న సందర్భము మరొక్కటి. 'ప్రతిదీ తాత్కాలిక మన్న' భావం కలగడమంటే—అదే ప్రతీత్య సముత్పాదదృష్టి అన్నది సమీక్ష. తెలియని విషయం జోలికి పోతే వచ్చే ప్రమాదమే ఇంత. ప్రతీత్య సముత్పాదమంటే కార్యకారణత్వాన్ని (Causality) గూర్చిన బౌద్ధ సిద్ధాంతము. కార్య కారణత్వం పారమార్థికమైనది కాదు, వ్యవహారంలోనూ అసందిగ్ధమైనది కాదు, అని చెప్పడానికి వెలువడింది. హేతు ప్రత్యయా లుండడాన్నిబట్టి కార్యం ఉంటుంది గాని ఒకదాని నుంచి ఒకటి కలగడంలేదు. 'ఉభయతటమందు జాతిలేదు.' కార్యకారణ భావంలో సడలింపును చెప్పే యీ వాదాన్ని క్షణిక వాదంగా పొరబడి విమర్శ సాగింది.

కార్యకారణత్వంలో సడలింపు చెప్పిన శూన్యవాదం ఏ ఒక దృష్టిని working Hypothesis గా మాత్రమే గ్రైకొనమంటుంది. అవసరం కలుగగానే మార్పుకో వీలయ్యేందుకు వలసిన నిర్లిప్తతతోనే ఆ దృష్టిని కల్గివుండమంటుంది. గాఢ దృష్టి కూడదంటుంది. సమాహిత ద్రవణీయదృష్టి మాత్రమే వలసినది.

ఈ పొరపాటు అభిప్రాయాలు అలా ఉంచి, క్షణికవాదులైనా కృష్ణారావుగారు కోరినట్లు సమాజంలో నిలుకడ బ్రదుకు విలువలు కావలెనని కోరకూడదా అని ప్రశ్న వేసుకొందాము. క్షణికవాదము సైతము నిర్వాణాన్ని అనగా పరమార్థ స్థితి నొకానొక దానిని చెప్పుతుంది. పరమార్థం కూడా క్షణికం కాదు. క్షణ ప్రవాహ భంగమే అది. నిర్వాణమ్ శాంతమ్. ఇంక నిలుకడ నెందుకు కోరకూడదు. క్షణికతను చెప్పేవారికి విలువలతో నిమిత్తంలేదన్న భావం సమీక్షలో ఉంది. పారమార్థికంలేని చార్వాకానికి సైతం విలువలు ఉన్నాయి. వ్యావహారిక జగత్తును మిథ్య అన్న అద్వైతం జీవన్ముక్తులకు లోకసంగ్రహం చెప్పివుంది. తాత్త్వికార్థాల ఆనుపానులు ప్రాథమిక రూపంలోనైనా తెలియని స్థితికి యీ సమీక్ష చక్కని ఉదహరణ.

'చేసుకొన్న కర్మ' అనే కథ కూడా హిందూ వేదాంతం యొక్క దుర్వినియోగాన్ని చిత్రించేదిగానే సమీక్షించబడింది. అది వాస్తవంలో మార్క్సిస్టు వర్గ కలహ సిద్ధాంతాన్ని ఆర్థిక నియతిని అసమగ్రాలని చెప్పే కథ. కాని అదే మార్క్సిస్టు దృష్టితోనే వ్రాయబడిందని నిర్ధారించబడింది.

అలాగే 'మాయ' ను- గూర్చి, చిత్తచక్ర నిరోధాన్ని గూర్చి పాసగనిమాట లున్నాయి. ఆకలికి అలమటించేవారు కావ్యనిర్మాణాస్వాదనలకు అనర్హులు, అశక్తులు అని నేడు వ్రాస్తే, అది 1938 లో భిక్షాపాత్రలోని మార్క్సిస్టు దృష్టికి ఎంతదూరం అని ఆశ్చర్యార్థకం వేసింది. కాని, నేడే అదే వ్యాసంలో భౌతిక భోగలాలస కావ్యనిర్మాణాస్వాదనలకు తావులేకుండ చేస్తోందని వ్రాస్తే, యీ రెండు భావాలు పరస్పర విరుద్ధాలుగా ఉన్నాయనో, లేక యీ రెండింటికీ మధ్యమ స్థితిని రచయిత చెప్తున్నాడనో చెప్పలేకపోయింది సమీక్ష. పైగా భౌతిక భోగలాలస ఉత్తమకృతుల ఆవిర్భావానికి చక్కని ఉపాధి అన్నది రచయిత దృష్టిలో అటు ఆకలి—ఇటు భౌతిక భోగపర్వతం రెండూ లలితకళాభ్యుదయానికి వ్యాఘాతాలే, వైపరీత్యాలే.

గ్రంథకర్త అభిప్రాయంతో సమీక్ష ఏకీభవించాలని కాదు గాని, గాఢమైన తాత్త్వికార్థాన్ని పొదవుకొన్న ఇలాంటి గ్రంథాలను సమీక్షించేప్పుడు, అంతకు చలిన సమీక్ష వెలయిస్తేనే ఉపయోగముంది.

సమాధానం

1. నేటి పరిస్థితుల్లోనేకాదు, చరిత్రలో ఇప్పటిదాకా ఏ యుగంలోనూ 'సమాధ్యవస్థాపాదకాలైన' కృతులను ఇవ్వ గలిగినవారు వ్రేళ్లమీద లెక్కింప దగినవారే. ఒక రచయిత (కేవలం విమర్శకుడు కాదు) సమకాలీన పరిస్థితులను సమీక్షిస్తూ ''అబ్బా, ఈ పరిస్థితుల్లో ఉత్తమ రచనలు చెయ్యడం కష్టం'' అంటే దాన్ని ఏ విధంగా అర్థంచేసుకోవాలి? అది పరిస్థితులను నిగమనం' చెయ్యటమేకాదు, ఆ పరిస్థితుల్ని చూచి రచయిత అధైర్యపడినట్లుగాకూడ ధ్వని. కాబట్టి ఆ 'నిగమనం' అంగీక రించినా, ఆ రచయితమీద గౌరవమూ సదభిప్రాయమూ ఉండటంవల్లే ఆ రచయితకు ఆత్మవిశ్వాసం కలిగించేందుకు, రచయిత నుద్దేశిస్తూ సమీక్ష చివరిభాగం వ్రాయబడింది. ఇది 'పురుష ప్రయత్నంయొక్క అక్కరను నొక్కిచెప్పటం' కాక మరేమిటి? పై లేఖ ఉద్దేశం రచయితలో నిస్పృహలేదని లోకానికి తెలియజెయ్యడమే. అయితే, అందుకు సంతోషం.

2. 'యత్ సత్ తత్ క్షణికమ్' అనే వ్యాక్యాన్ని ఉదహరించినంత మాత్రాన సమీక్ష 'క్షణికవాదం' మీద ఆధారపడిందనీ, క్షణికవాదం మాధ్యమిక వాదంలో అంతర్భాగమనీ, భ్రాంతిపడటం జరిగిందనీ అనుకోవడం కేవలం ఊహాగానం. ''విలువలూ అభిప్రాయాలూ త్వరితంగా మారుతూ ప్రతిదీ తాత్కాలికమన్న భ్రాంతి సర్వసామాన్యంగా అందరికీ కలుగు

తున్నదా సమాజంలో ?— అలా అయితే మంచిదే, అదే ప్రతీత్య సముత్పాద దృష్టి……'' సమీక్షలోని పై వాక్యంలో 'ప్రతిదీ' అంటే విలువలూ అభిప్రాయాలూ అనే అన్వయం సుస్పష్టం. విలువలూ అభిప్రాయాలూ కార్యకారణత్వానికి సంబంధించినవి. పారమార్థికమైనవికావు. అందువల్ల అవి **Working hypothesis** గా మాత్రమే తీసుకోవాలి. మార్చుకునేందుకు వీలైన నిర్లిప్తతను వాటిపట్ల కలిగిఉండాలి. ఇదేనా ప్రతీత్యసముత్పాద దృష్టి? అయితే ఈ భావాన్ని 'తాత్కాలికము' అని ఒకముక్కలో చెబితే (ఆ చెప్పటంకూడా రచయిత వాక్యాన్ని ఉల్లంఘించే ఉద్దేశంతో) వాటిల్లిన ప్రమాదం ఏమీలేదు. వ్రాసింది సమీక్షగాని దర్శన గ్రంథంకాదు గద!

3. కృష్ణారావుగారే కాదు, ఎవరైనాసరే వ్యక్తిగతంగానూ సమాజంలోనూ 'నిలుకడ, బ్రదుకు విలువలు' ఉండాలనే కోరుతారు. అది సహజమే. కాని రచయితగా 'సమాజంలో నిలుకడ, బ్రదుకు విలువలు ఉంటేనేగాని వీల్లేదు నాకు' అని నిబంధన పెట్టడం అది రచయిత నిస్పృహను తెలుపుతుంది. అంతేకాదు, విలువలయొక్క స్వరూపం, ప్రమాణం గోచరం కావడం, కాకపోవడం అనేది వ్యక్తిగతమైన సాధననుబట్టి లోకాన్ని చూచేదృష్టి వైశిష్ట్యాన్నిబట్టి భేదిస్తుంది. నిస్పృహలో ఒకరికి లోకంపోకడ అంతా కలుషితంగా, ప్రయోజన శూన్యంగా కనిపించవచ్చు. ఆ నిస్పృహను అధిగమించడానికి పుస్తక పాండిత్యం చాలదు. అంతర్దృష్టి, ఆత్మ పరీక్షా అవసరం. (ఒక్కసారి పాస్టర్‌నాక్‌లాగా సమాజం పోకడ విపరీతమై రచయిత జీవితమే ముక్కలు కావచ్చు. కాని 'జివాగో' వంటి ఉత్తమ కృతి రాకపోదు) తేలేదేమిటంటే రచయిత అంతర్ముఖుడై తనలో సహనమూ, క్షమా, నిర్లిప్తతా కలిగి ఉండే స్థాయికి పెరిగితేగాని అతనికి లోకంపోకడలోని మంచీచెడూ, దాని పరమార్థం అవగాహనకాదు. కామాదులను నియమించుకునే ఆత్మ సంస్కారం ఒక మెట్టు, కాని ఆ స్థాయికి వెళ్ళి ఆగితే చాలదు. ఇతరులలో కామాది ప్రవృత్తులను అర్థంచేసుకుని సహించి, క్షమించే ఔన్నత్యం కావాలి. రచయిత లోకాన్ని సన్మార్గంలో పెట్టాలి అనుకుంటే ధర్మనిర్ణేతగాకాదు, ఋషిగా, యోగిగా రచన సాగించవలసి ఉంటుంది. యోగికి ధర్మనిర్ణేతకూ చాల భేదం. కేవలం ధర్మనిర్ణేతగా, సంస్కర్తగా సాగించే రచన ఉత్తమ సాహిత్యం (సమాధ్యవస్థా ప్రతిపాదకమైనది) కాజాలదు.

4. బ్రదుకు విలువలూ, వ్యవస్థా ధర్మము వీటితో సంబంధంలేని, వీటికి అతీతమైన నిశ్చలతత్త్వాన్ని (ప్రదర్శనం ప్రకారమైతేనేం?) కాదనటంలేదు సమీక్ష.

5. 'కామిగాక మోక్షగామికాడు' ఛలోక్తికాదు. అది యోగి వాక్కు. **'The fool, if he persists in his folly, will become wise' (William Blake)**

వైవిధ్యం కల ప్రవృత్తిలో ఒక్కొక్క రకం మనుష్యులకు ఒక్క మోక్షమార్గం ఉంటుంది. శంకరాచార్యులు, వివేకానందుడు కొన్నివందల ఏళ్ళకొక్కసారి అపురూపము మానవజాతిలో ప్రభవించే అసాధారణ వ్యక్తులు. వారి జీవితచరిత్రలు అద్దంగా పట్టుకుని ముక్కికి ముక్కిగా జీవితాలను దిద్దుకోబోవటం మూర్ఖత్వం. ఎవరి శక్తియుక్తులెటువంటివో, పరిస్థితులెటువంటివో అనుగుణంగా సాధన చెయ్యటమే వివేకం.

6. ''చేసుకున్న కర్మ'' అనే కథ రచయిత ఉద్దేశం మనస్సులో ఉంచుకుని వ్రాసినా, అది ప్రతిపాదిస్తున్న అర్థం శీర్షికద్వారానేకాదు. కథ ముగింపుద్వారాకూడా స్పష్టంగా ఉంది అవిచేతగాని తనానికి, పురుషకారంలో నమ్మకంలేని మనస్తత్వానికి కర్మ సిద్ధాంతాన్ని వ్యాఖ్యానంగా ఉపయోగించుకోవటం రాఘవులో ఉన్న విశ్వాసం, పాలేరుతనం, ఊతగా చేసుకుని ఆర్థిక పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోవలసిన రైతు వెంకయ్య భీరువై పొలాన్నీ ఎడ్లనీ అమ్మేశాడు. ఏమంటే 'కర్మ' అంటాడు అతని భార్యా, రాఘవులూ చిలుక పలుకులా 'కర్మ' అంటారు రాఘవులు నిష్క్రమణతో కథ ముగిసింది. రచయిత ఉద్దేశం కథలో అభివ్యక్తం కాకపోవడము దురదృష్టము.

7. పోతే, పై లేఖలో పాఠకునికి కలిగిన సందేహాలు చాలావరకు రచయితకూ, పాఠకలోకానికీ మధ్యగల భేదాన్ని విస్మరించటంవల్ల కలిగాయి. భోగలాలసుడూ, ఆధివ్యాధిపీడితుడూ ఉత్తమ రచయిత ఎన్నడూ కాలేడు! కాని అలాంటివాడు పాఠకుడు కావటానికి అభ్యంతరములేదు. పాఠకునిలోని కామ, క్రోధ, లోభ, మోహాది గుణాల్ని వీణా తంత్రులగా మీటుతూ అతణ్ణి సమాధ్యవస్థకు తీసుకుపోగల శక్తి ద్రష్ట అయిన రచయితకు ఉంటుంది. ఈ భావమే సమీక్షలో చెప్పబడింది. ఈ ప్రబోధము కృష్ణారావుగారికే కాని పాఠకులకు కాదు!

8. గ్రంథసమీక్షలో జిజ్ఞాసువుల ఆసక్తిని రేకెత్తించే విషయాలు ఉండవచ్చు. ఫలితంగా వచ్చే ప్రశ్నలకూ, సందేహాలకూ సమాధానం ఇవ్వటానికి అభ్యంతరంలేదు. కాని జిజ్ఞాస చేసేవారు సదస్సు మర్యాదను పాటించాలి. మర్యాదకి భిన్నమైన వాక్యాలు దొర్లటం సంస్కార లోపమే అవుతుంది ఈ విషయం పాఠకులు గుర్తిస్తారని మనవి.

—ఆర్. ఎస్. సుదర్శనం.

శ్రీ సాంఖ్యాయనశర్మ సాహితీ సేవ

శ్రీ నిడుదవోలు వేంకటరావు

తెలుగు ప్రపంచమున, "ఆంధ్రభీష్ములు" అని, మహోపాధ్యాయులని ప్రఖ్యాతిజెందిన అచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారినాటి వారికి పండితులు గాకపోయినను, నాల్గు దశాబ్దుల క్రిందట బహు ప్రసిద్ధి పడసినవారని క్రీ.శ. 1923వ సంవత్సరమున నాంధ్రపత్రిక సంవత్సరాది సంచిక తెలుపుచున్నది. అందు చిత్రపటముల వివరణమున నిట్లుగలదు.

"ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారు. వీరు కల్పలతాధిపతులు. సంస్కృతాంధ్రాంగ్ల భాషాకోవిదులు. ఆంధ్ర విమర్శకులగు విద్వాంసులలో నగ్రగణ్యులు. అతి స్వతంత్రము అనితర సాధారణమునగు మేధా సంపత్తి గలవారు"

సాంఖ్యాయనశర్మ కవి— పండితుడు— విమర్శకుడు— పత్రికా సంపాదకుడు—పద్యగద్య కావ్య రచయిత— మహావక్త— గొప్ప వైజ్ఞానికవేత్తయునై, నవ్యాంధ్ర సాహితి, సంస్కృతుల యుజ్జీవనమునకు బహుముఖముగా తోడ్పడిన ప్రతిభాశాలి. అసంఖ్యాకములగు వివిధ విషయ పరిజ్ఞానమునుబట్టి శర్మగారిని విజ్ఞాన సర్వస్వమని యన్నవారున్నారు.

అట్టి సాంఖ్యాయనశర్మ జీవిత విశేషము దెలిపి యా వెనుక సాహితీ సేవనుగూర్చి తెలిపెదను.

శర్మగారి పూర్వులు గోదావరి మండలమున నాచంట గ్రామమునుండి విశాఖపట్టణ మండలమున, నప్పటి మేరంగి జమీందారుల యాహ్వానమున— నా మండలమున స్థిరనివాస మేర్పరుచుకొనిరి. వీరార్వేల నియోగిశాఖా బ్రాహ్మణులు— సాంఖ్యాయన గోత్రులు— తల్లి నరసమ్మ తండ్రి బాపిరాజు. జననము క్రీ.శ. 25—10—1864 నకు సరియగు రక్తాక్షి సంవత్సర ఆశ్వయుజ బహుళపంచమీ బుధవారము— వీరు, బాల్యమునుండి బహు కుశాగ్ర బుద్ధులు. క్రీ.శ. 1878లో, మిడిల్‌స్కూలు పరీక్షలో చెన్నరాజధాని కంతకును ప్రథములుగ నుత్తీర్ణులైరి. ఆ వెనుక మరి కొన్నేండ్లకు రెండవ తరగతి న్యాయవాది పట్టమునందిరి. కొంతకాలము మేరంగి ఎస్టేటు దివానుగానుండి ఆ వెనుక పార్వతీపురమున న్యాయవాదియై నేబది యారేండ్ల కాలమవిచ్ఛిన్నముగా నాంధ్ర సారస్వత సేవ నొనరించి, తే 3—8—1933 నకు సరియగు నాంగీరస శ్రావణ బహుళ విదియా బుధవారము కీర్తిశేషుడయ్యెను.

సాంఖ్యాయనశర్మగారు, స్వయంకృషిచేతనే సంస్కృతాంధ్రభాషా పండితులైరి. కవిత్వము వారికి బాల్యముననే యలవడినను నిరువదేండ్లయిన తర్వాతగాని వా రందు రచన సాగింపలేదు.

క్రీ. శ. 1885 లో శర్మగారి కవితాశక్తి నెఱుఁగఁగొరి వారి మిత్రులు శతఘంట కవనమునకు ప్రోత్సహించిరి. వారందఱును, తరువాతి ప్రసిద్ధులే. హరికథాపితామహుడు అజ్జాడాది భట్ల నారాయణదాసు—ప్రసిద్ధ పండితులు మేడేపల్లి వెంకట రమణాచార్యులు—ప్రథమాంధ్ర పుస్తక భాండాగార సంస్థాపకులు సుందరము పంతులుగారు మొదలగువారు. ఆ పద్యము లన్నియు లభింపలేదు. లభించినవానిలో గొన్నిటి నుదాహరించుచున్నాను.

ఆంజనేయ వర్ణన—

క. తరుణారుణ కిరణుం గని
పరిపక్వ ఫలంబటంచు బట్ట దివురు నీ
కరయుగ్మ దరణి కులోద్భవు
చరణాంబుజసేవ పవన జన్మ తగునయా.

ఇనుడు—రాజు—

మ. ఒకవేళన్ కడు తీవ్రతన్ వెలయు వేఱొక్కప్పు
డింతేని సా

త్త్వైకతన్ చల్లదనంబు నూపి యనురక్తిం జూచి లోకంబు కొం
డొకచో నెప్పుడు కాల భేదముల సూర్యుంబోలె భాసిల్లుటన్
ప్రకటంబై 'యిన' నామ మొప్పెసగు భద్రంబై మహీజానికిన్.

జ్యోత్స్నాభిసారిక—
చ. మలయజముల్ మృణాలములు మల్లికలున్ విరహానలంబువే
దొలఁగక మున్నె పూనియవి ద్రోయకపై బయలు వూక్తి కావళుల్
మెలపున దాల్చి—తెల్లనగు మేలిమి వల్వ ధరించి పండు వె
న్నెలఁ బతిఁ జేరఁగాఁ జనియె నెయ్యమునన్ దరళాక్షి యొంటిగన్.

సుధానిధి—

ఇది ప్రాచీన సంప్రదాయానుసారమగు పద్యకావ్యము.[1] అట్లని యిది ప్రబంధరీతిని కవి సమయ వర్ణనలతో గూడినది కాదు. కళాపూర్ణోదయమువలె, కథాకల్పనలతో సహజ ప్రకృతి వర్ణనలతో నుండును. ఇందలి రచనయు సరసముగను జాతీయమునై సహృదయాహ్లాదకరముగ నుండును. మచ్చునకు రెండు పద్యములు—

వాల్మీకి వ్యాసస్తుతి—
ఉ. పట్టినదెల్ల పైఁడియగు భంగిని, పల్కిన పల్కుపద్యమై
యుట్టిపడంగ, చెప్పినదె యొప్పిన వేదముగాఁగ, సత్కథల్
కొట్టిన పిండిగాఁ గవితఁ గూర్చిన ధన్యుల లోక మాన్యులన్
పుట్టనుఁ దిప్పనుం బొడమి పూజ్యతఁ గాంచినవారి నెంచెదన్.

కొండయేఱు—
చ. తరువులు బెల్లగించి తమ దారిని వచ్చు సమస్తజీవులం
బొరిగొని నీచమార్గమున భోరున వార్చుచుఁ బొంగి పాఱుని
ర్ఝరిణులమీద నల్కగదురం దల్క్రిందుగఁ ద్రోయుచుం ధరా
ధరము దధిఁబడం దఱుము, దక్కునె ప్రేమలు దుష్టవృత్తిచేన్.

నవ్యకవితకు నాంది ప్రస్తావన గావించినవారు సాంఖ్యాయనశర్మగారే యని చెప్ప నొప్పును—పైని యుదాహరించిన సుధానిధిలో క్రీ. శ. 1896 లోనే, కవి యైనవాడు, కవి తను నూతన మార్గమున నడిపింపవలెనని యిటు వ్రాసి యున్నారు.

మ. కవియై యెవ్వడు నవ్య కావ్య రచనా కౌతూహలం బాత్మలో
జివురింపం దన యూహశక్తిఁ గవితాసీమంతినిన్ నూత్న మా
ర్గ విహారం బొనరింపనీక కడు నిర్బంధించెడున్ కట్టుబా
ట్లు విడం జాలక నట్టివాని గతి చాలుం జాలు—సంరోధమే—

ఇం దీనాటి నవ్యకవుల స్వేచ్ఛాగానములు—ప్రణయ భావ విహారము లానాడే సూచితములైనవి—

నూతన భావములతో వివిధ విషయములను గూర్చి— వివిధ శీర్షికలలో, ముక్తకములైన రచనలు శర్మగారు 'ఆంధ్ర పద్యావళి' అను పేర ప్రకటించిరి. ఇది సుధానిధి వ్రాసిన యాఱేండ్లకు క్రీ.శ. 1892 లో ప్రచురితమైనది.

ఇది నేటి తెలుగుభాషలో నవ్యకవితా ప్రథమ గ్రంథమని చెప్పవచ్చును. (The first book of Modern Telugu Poetry)

ఇందు దాదాభాయి నౌరోజీ పార్లమెంటు సభ్యత్వము, ఈశ్వర విషయము, చెంగలువ—రవివర్మ చిత్రములు మొదలగు శీర్షికలలో పద్యములు గలవు—రవివర్మ చిత్రములా కాలమున నాంధ్రదేశమున నత్యంత ప్రచారము గాంచినవి. ఆ చిత్రములను గూర్చి యిటీవల కీర్తిశేషులు కవిభూషణ సెట్టి లక్ష్మీనరసింహముగారు చిత్రమాలికలను పేర వ్రాసిరి. కాని ఆ చిత్రములను గూర్చి వ్రాసిన వారిలో సాంఖ్యాయన శర్మగారే ప్రథములు. ఇందుండి యొక పద్యము

క. చెంగలువా ? చంద్రుని బా
యం గలవా ? తెల్లవార నర్కుని నిటు చూ
డం గలవా ? మ్మోమిటు ద్రి
ప్పం గలవా ? విరహమునను వడి రాగలవా ?

---

1. సుధానిధిలో యవతారిక కొంతభాగము, విశాఖ పట్టణమున కవితాసమితివారు వెలువరించిన 'వైశాఖి' యందు ప్రకటితమైనది.

శ్రీ సాంఖ్యాయనశర్మ సాహితీసేవ

నా ట క ర చ న

సంస్కృత నాటకాంధ్రీకరణము ముమ్మరముగా సాగుచున్న క్రీ. శ. 1880—90 ప్రాంతములలో, శర్మగారు, కాళిదాసు విక్రమోర్వశీయమును—భవభూతి యుత్తరరామ చరిత్రమును తెలుగులోని కనువదించిరి. విక్రమోర్వశీయము సంస్కృతమున, శ్లోకము ననుసరించి, పద్యము—గద్యభాగమునకు వచనముగా నాంధ్రీకరించినను, శర్మగా రుత్తరరామ చరిత్రము మాత్రము సంపూర్ణముగా వచనముగానే తెలుగు చేసిరి. ఈ యనువాదమున భవభూతి మూలమున చూపిన, రచనా విశేషములన్నియు తెనుగున, విశదముగా గ్రహింపదగిన రీతి నున్నవి. ఛందోబద్ధము లైనపుడు తెనుగున యతిప్రాసాది నిర్బంధముచే, శ్లోకముల యాంధ్రీకరణమున, నర్థభావము లొక్కొక్కప్పుడు విస్పష్టము కాజాలవు—శర్మగా రిది కని పెట్టి మూలార్థమును సుంతయైన విడువక, సుగ్రాహ్యమైన శైలిలో రచించిరి. వారి వచన రచనా నైపుణ్యమున కిది గీటురాయి.

ఆంధ్రీకరణములే గాక స్వతంత్ర నాటక రచనలను శర్మగారు కావించిరి. వానిలో మొదటిది 'మనోరమ.'

ఇది క్రీ.శ. 1894లో రచితమై ముద్రితమైనది. తెనుగులో సాంఘిక నాటకములలో మొదటిది. దీనికిముందు కీ.శే. వావిలాల వాసుదేవశాస్త్రిగారి నందకరాజ్యము గలదు గాని, అదియంతయు గీత పద్యమయము. అంతేగాక ఇతివృత్తము నియోగి వైదిక కక్షలకు సంబంధించినది. మనోరమ నాటకము నాటక లక్షణముల ననుసరించి ఉన్నది.— పేరునకు మాత్రమేగాక ఇందలి రచనయు మనోరమమే.

పార్థపరాజయము-ఉత్సృష్టికాంకము

తెలుగున నుపరూపక భేదమగు—ఉత్సృష్టికాంకము సాంఖ్యాయనశర్మగారు తప్ప వేరెవ్వరు రచింపలేదు. "ఉత్సృష్టికలు అనగా ఉత్క్రమణీయమైన సృష్టి జీవనములేదా ప్రాణములు గలవారు ప్రాణములు పోవునా అన్నంతగా దుఃఖించుచున్న స్త్రీలచే అంకము అనగా చిహ్నితమైనది' అని యర్థము. ఇది కరుణరస ప్రధానమై ప్రఖ్యాతా ప్రఖ్యాత వస్తువుతో కూడుకొనియుండును. ఈ పార్థ పరాజయ కథ ఉత్తర హరివంశమునుండి గ్రహింపబడినది. ఇది యముద్రితము.

అవదాత కలభకము

ఇది బౌద్ధవాఙ్మయమునకు సంబంధించిన నాటిక— "తెల్ల యేనుగుపిల్ల" అని తెలుగు పేరు.

నాటక కళోద్ధరణము

సాంఖ్యాయనశర్మగా రిట్లు నాటక రచన సేయుటయే గాక నాటక కళోద్ధరణకు కూడ పాటుపడిరి. ఆంధ్ర నాటక పరిషత్తును స్థాపించినవారిలో శర్మగారు ప్రథమగణ్యులు. మఱియు వారే క్రీ. శ. 1929 లో తెనాలిలో ఆంధ్ర నాటక కళాపరిషత్తు ప్రథమ వారికోత్సవము జరిగినపుడు దాని కధ్యక్షులై యమూల్యమైన యుపన్యాసము నొసగిరి— ఆనాడు శ్రీ సాంఖ్యాయనశర్మగారిని నాట్య కళోద్ధారకునిగా చక్రావధానుల మాణిక్యశర్మ మున్నగు కవీశ్వరులు పద్యములతో ప్రశంసించిరి. తే 20—6—1929 దిని—ప్రథమ వార్షికోత్సవమునకు, శ్రీ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు ప్రత్యేకాహ్వానముపై వచ్చిరి. అప్పటి ఛాయా చిత్రము—సురభి నాట్యకళామండలి సంపుటిలో ప్రకటితమైనది.

సాంఖ్యాయనశర్మగారు ప్రత్యేకముగా రచించిన విమర్శన గ్రంథము—నాటక సర్వస్వము—

ఇది భరత నాట్యశాస్త్రము ననుసరించి *రచింపబడినది. భరత నాట్యశాస్త్రమును వచనరూపముగా నాంధ్రీకరించుటలో తొలివారు శర్మగారే—లక్ష్యములకు నిచ్చిన శ్లోకములకు పద్యములు వ్రాసినను, తక్కినవి వచనముగానే రచియించి యున్నారు—ఇది యముద్రితము—నాట్య శాస్త్రాంధ్రీకరణములు వెలువడుచున్న యిక్కాలమున పై గ్రంథ మావశ్యకముగా వెలుగులోనికి రాదగినది.

ఇక భాషా సాహితీ విమర్శనములు, శర్మగారి యధ్యక్షోపన్యాసములయందు సంగ్రహింపబడియున్నవి. వానిలో పేర్కొనదగినవి మూడు—

1. 1920 నందూరున జరిగిన ఆంధ్ర సారస్వత మహాసభాధ్యక్షోపన్యాసము.

ఇందు భాషా విషయము—తెలుగు—తెనుగు శబ్ద వ్యుత్పత్తి—ఆంధ్రశబ్ద ప్రాచీనత మున్నగు విషయములు విమర్శితములైనవి.

2. 1923—విజయనగర కవిమండలి పంచమ వార్షికోత్సవము.

ఈ యధ్యక్షోపన్యాసము సాహిత్య విమర్శ ప్రధానముగా కలది. కవిత, శిల్పము, చిత్రలేఖనము వీని పరస్పర తత్త్వమిందు విశదీకరింపబడినది. కొందఱు విమర్శకుల ననుసరించి పై మూడును "లలితకళలు". శర్మగారి యభిప్రాయము ననుసరించి యివి మనోజ్ఞ కళలు.

3. 1924 ఆంధ్రసాహిత్య పరిషత్త్రయోదశ వార్షికోత్సవ సభ—తణుకు.

ఇది శర్మగారి యధ్యక్షోపన్యాసములలో మకుటాయమాన మైనది. ఇందు తెలుగునకు ప్రాకృతమునకు గల సంబంధము—తత్సమ—తద్భవ దేశ్య నిరూపణము—సాహిత్య విమర్శ యద్భుతముగా జేయబడి యున్నవి.

ఇంకను, నాట్యకళా పరిష దధ్యక్షోపన్యాసమున మెట్రిక్యులేషను వసతిగృహ వార్షికోపన్యాసమున, సాహిత్య విమర్శనాంశములు గలవు. వీని నన్నింటిని గ్రంథరూపమున బ్రకటించిన, శర్మగారి సాహితీ విమర్శనా పాటవము వెల్లడి కాగలదు.

ప్రాస్తావికరచనలు - చాటువులు

సాంఖ్యాయనశర్మగారు చాటువులను ప్రాస్తావిక రచనలను వెలయించిరి. వానిలో 'సంఘ సంస్కరణ స్మరణము' 'దేశాభిమానులగు నాగరికులు'—మున్నగునవి ముఖ్యములు. భారతి రజతోత్సవ సందర్భమున (1949) శతావధానులు వేలూరి శివరామశాస్త్రులుగారు, చదివిన సీసపద్య పాదము,

"పాయిజామా మాని పంచెను గట్టువా
డుండునా దొరలలో నొక్కడైన"

అనునది శర్మగారి "దేశాభిమానులైన నాగరికులు" అను రచనలోనిది.

"ఆటవెలుదులున్న తేటగీతములున్న
మనసు గరగిపోవు మంచు పగిది
ఆట లేక తేట పాటయు లేకున్న
వెలుదులున్న జాలు వేవరాలు."

ఈ చాటువును ప్రచారమును బడసినది.

చ. మన సెటులుండనీ పయికి మాటల చేతల చేత లోక రం
జన మొనరింపుచున్ తనదు స్వల్పపు దోషము నైన దాచుచున్
జనులను మోసపుచ్చి యొరు చాడ్పున నేర్పరి దాఁ దటస్థుఁడై
తనపని చక్కబెట్టుకొను దాల్చును పిమ్మట మౌన ముద్రయున్.

ఇదియును పండితామోదము బడసినది. ఇట్టి రచనలు వీరివి చాల గలవు.

ఆంధ్రదేశ పత్రికా వాఙ్మయమున శర్మగారికొక స్థానమున్నది. పత్రికలు విశేషముగాలేని కాలమున తన పదునేడవయేట క్రీ.శ. 1881 లో "సుజనప్రమోదిని" అను పత్రికను, ప్రారంభించి, రెండేళ్లు నడపి నారన్నచో, శర్మగారు బాల్యము నుండి నూతనోద్యమములయందెంత యభినివేశము గలవారో తెలియగలదు. ఈ పత్రికను నా కాలమున "ఆంధ్రభాషా సంజీవని" అను పత్రిక చాలా ప్రశంసించినది. రాజకీయ విషయములకు తొలుత ప్రాధాన్యమిచ్చిన పత్రిక ఇదియే. దీనికి ముందు పత్రికలన్నియు సాహిత్య విషయకములుగా నుండెడివి.

ఇక సాంఖ్యాయనశర్మగారి యశోలత కాలవాలమైనది. కల్పలత అను మాసపత్రిక— దీనిని గూర్చి కొంచెము వివరములు దెలుపుచున్నాను.

ఆంధ్రపత్రికలలో నా కాలమున 'కల్పలత' కెట్టి గౌరవముండెడిదో, ఆనాటి ప్రసిద్ధ పత్రికయగు "అముద్రిత గ్రంథ చింతామణి" ప్రకటించిన ఈ క్రింది విమర్శనమును జూచిన తెలియగలదు.

కల్పలత పత్రికా విమర్శనము

"విశాఖ పట్టణమున మహారాజశ్రీ ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారిచేఁ బ్రకటింపబడు కల్పలతయను మాసపత్రికా సంచికా పంచకమును నంచితముగాఁ దిలకించితిమి. పూర్వము బందరునందుఁ బ్రకటింపఁ బడుచుండిన పురుషార్థ ప్రదాయినివలె నిదియు బురుషార్థ ప్రదాయినియై యున్నది. ప్రతినెల కిందు 10 విషయములకుఁ దగ్గక 20 విషయములకు మించక కనబడుచున్నవి. అయిన నందలి "ఆర్య గృహము" అను వ్యాసము నిప్పటి నవనాగరికులు ముఖ్యముగఁ జదువఁ దగినది. నిరుపయోగములైనట్టియు నిర్గంధ కుసుమ పరంపర గలిగినట్టియు బుష్పలతలఁ బుష్పించునట్టి లతామతల్లిక లిపుడీ దేశములో నుండు గృహముల నలంకరించి యుంటంగని వీరి వ్యాసము రచించియుందురు. నిజమే— ఈ నూతన పద్ధతి "నాగదాడి" వలె బెంపుజెందునని తోచుచున్నది. గాని పెంపుఁ జెందునని ప్రకృతమునఁ దోఁపదు. ఇదియే "కాలవక్రత"—

ఇక నిందలి "విజ్ఞానవల్లిక" అను శీర్షికా గర్భస్థములగు 1. సూర్యపాకము. 2. మెరుపు దీపములు 3. భూగోళము 4. ఏకచక్రశకటము 5. సూర్యునివలననే చంద్రకాంతి 6. గుర్రములనెక్కి బంతియాడుట (పోలో) 7. గాలి పరపులు 8. కీలు పనులు 9. శస్త్ర వైద్యము 10. నల్ల మెరుపులు 11. సముద్రపు మేఘము 12. ఖనిజ తత్వము 13. ప్రతి సూర్యులు 14. గ్రహణముల వలన సూచింపబడు భూపకంపములు 15. ధూమకేతువులు అనునీ పదునైదు విషయములను మన పూర్వకవులు గురుతెరుగుదురని వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారు ప్రకటించినట్టి ప్రాచీన గ్రంథస్థ పద్యములను గని

శ్రీ సాంఖ్యాయనశర్మ సాహితీసేవ

వారి పాండితీ మహిమకు వింతపడుచున్నాము. "బిలియర్డ్సు" అను నాటను మన వారెరుంగుటకుం గల ప్రమాణ పద్య రత్నావళి ప్రకటింపం గొంత ఉపయోగమని ఎంచుచున్నారము. వీరి విమర్శనముల సొడ్డులు దివ్యముగా నున్నవి. అనేక విషయ ములు వీరికిం బాండిత్యమున్నట్లుగా వీరి పత్రిక చెప్పకచెప్పు చున్నది. పత్రిక యొక్క రూపురేఖా విలాసములు మనోహర ములు. అక్షరము లక్షర సరములంబోలియున్నవి. కాగితములు ధావళ్యతను వహించియున్నవి. చెన్నపురి పత్రికల చెన్నుమీరినది. ఇంతటి సంపద గలిగిన పత్రికయయ్యును సంవత్సరపుం జందా రు 1—8—0 మాత్రమే గాన నందరుం దెప్పించు కొని విషయములం జదివి యానందింతురుగాత."

(అముద్రితగ్రంథ చింతామణి మాసపత్రిక — సం. 17. ఫిబ్రవరి 1904. సం.2 పుట 8.)

పైని ఉదహరించిన యంశములనుబట్టి ఈ పత్రికా స్వరూపమేగాక, ఇందలి విషయ విశిష్టతయు గోచరించును— ఇచ్చట చిత్రమేమనగా, పత్రికయంతయు సంపాదక రచితమే. ఒరుల వ్యాసములుగాని పద్యములుగాని యందుండవు.

వైజ్ఞానిక విషయములతోపాటు భాషా, లిపి, సాహిత్య సారస్వత విషయములను గూర్చి ఇందు వ్యాసములుండెడివి. విజ్ఞానచంద్రికా మండలివారు, విద్వత్పరీక్షలనుబెట్టి యందుత్తీర్ణులైనవారికి ప్రథమ, ద్వితీయ బహుమానము లిచ్చు పద్ధతిని నెలకొల్పుటకు ముందుగానే, సాంఖ్యాయనశర్మగారు, కల్పలత మూలమున పరీక్షల నెలకొల్పి విజయ బహూకృతులకు మార్గదర్శకులైరి.

కల్పలతలో 20 ప్రశ్నలిచ్చి, వాని కన్నింటికి సంపూర్ణముగా నుత్తరములు వ్రాసినవారి కేబదిరూపాయలు, కొన్ని వ్రాసినవారికి ముప్పది రూపాయలు, ఇట్లు బహుమతు లేర్పరచి పరీక్షలు నెలకొల్పిరి. ఆపరీక్షలలో తొలిసారి ప్రథమశ్రేణిలోనెగ్గిన వారు కీ. శే. విమర్శాదర్శక నడకుదిటి వీరరాజుగారు. రెండవసారి, ఒకరికొకరికి తెలియకుండానే—ప్రథమ, ద్వితీయ బహుమానము లందినవారు ఓలేటి పార్వతీశము, బాలాంత్రపు వెంకటరావు గార్లు. వీరు వేర్వేరుగా నుత్తరములం బంపిన తరువాత వీరిద్దరిని నొకటిగా, "వేంకట పార్వతీశ్వర కవులు" అని నామకరణము చేసినవారు సాంఖ్యాయనశర్మగారే.

ఈ పత్రికను, 1921లో తిరిగి రెండేండ్లు ప్రకటించిరి. అందు అమూల్య విషయములు చాలగలవు. అందొక్క విషయము నీవరకు సారస్వత లోక మెరుగని దానిని తెలుపు చున్నాను.

హర్ష నైషధము నొక్క శ్రీనాథ మహాకవితప్ప, తక్కిన కవు లెవ్వరును నాంధ్రీకరించినట్లు తెలియరాలేదు. ఎడపాటి ఎఱ్ఱన కుమారనైషధ మున్నను నది ఎంతటివరకున్నదో తెలియుటకది పూర్తిగ లభ్యముకాలేదు. గాని సాంఖ్యాయనశర్మగారు విశాఖపట్టణ మండలమున బొబ్బిలిదరి వెంగాపురమను నగ్రహారమున ముక్కువెల్లి వెంకయకవి సంపూర్ణముగ హర్షనైషధము నాంధ్రీకరించె నని యందుండి పద్యములనుదాహరించి యున్నారు.

(3 సం. 4 వ సంచిక).

అణుయుగమును పేరందిన నేటి వైజ్ఞానిక ప్రపంచమున విశేషములను నరువది ఏండ్ల క్రిందటనే— సాంఖ్యాయన శర్మగారాంధ్రలోకమున కెరుకపరచిరి.

ముఖ్యముగా గమనింపదగినది సాంఖ్యాయనశర్మగారి వచన రచన. అతి గహనములైన నూతన వైజ్ఞానిక విషయములనీనాడు, అర్థముకాని, సాంకేతిక పదజాలముచేతగాని, అనువుగాని వ్యవహారిక భాషలోకాని చెప్పుట పరిపాటియైనది. కాని శర్మగారి శైలి, తేటమాటలతో నుండి, అర్థము స్పష్టముగా గోచరింపజేయును— వైజ్ఞానిక శాస్త్రీయ గ్రంథ రచనకు వీరి శైలి యాదర్శము.

డార్విను పరిణామ వాదమును మొదట తెలుగులో ప్రవేశపెట్టినవారు సాంఖ్యాయనశర్మగారే— సంఘ సంస్కరణ స్మరణములో—

సీ. నెలతలు చంటిబిడ్డలకు పాల్గుడుపుటే
ప్రకృతి ధర్మంబని పలుకరాదు
ప్రకృతి శాస్త్రజ్ఞులౌ పండితుల్ 'డార్విను'
మున్నగు వారలు కొన్నిచోట్ల"

అని ప్రసిద్ధ పాశ్చాత్య వైజ్ఞానికవేత్తలం ప్రశంసించినారు.

ఆంధ్రదేశమున పూర్వము, మహామహోపాధ్యాయ పరవస్తు రంగాచార్యులుగారును, మహామహోపాధ్యాయకొక్కొండ వేంకటరత్నము పంతులుగారు మహావక్తలుగా ప్రసిద్ధి కెక్కిన వారు. ఈ మహోపాధ్యాయుడు వారితో సమానుడే. శర్మగారికి "ఆకారసదృశ ప్రజ్ఞా" అనునట్లాకారమునకు దగిన ప్రజ్ఞ, ప్రజ్ఞకు దగిన వాక్చాతుర్యము నుండెడివి. వీనికితోడు సమయ స్ఫూర్తి, పరేంగిత జ్ఞానము వీరికి గలిగియుండెడిది. వీరి ఉపన్యాసములలో తెలుగు జాతీయములు సామెతలు — విశేషముగా ప్రయుక్తములగుచుండెడివి. కావుననే వీరి యుపన్యాసములు పండితపామర జనాకర్షముగ నుండెడివి. సమయోచితమును సరసమునగు హాస్యము వీరి వక్తృత్వమునకు వన్నె పెట్టినది.

ఈ నడుమ ప్రకటింపబడిన "ఆంధ్ర సంపుటి"* యందు సంభాషణ చతురతలో నగ్రస్థానము సాంఖ్యాయనశర్మగారికీయ బడినది. ఆ చమత్కారములు దేశ మెల్లెడల వ్యాప్తిలో నున్నవి.

* The Andhra Souviner by K. Eswara Dutt Andhra Celebrities. Page, 160

కలగూరగంప :

లేపాక్షి క్షేత్ర విచిత్రాలు

శ్రీ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

అనంతపురంజిల్లా హిందూపురం తాలూకాలో ఉన్న లేపాక్షి క్షేత్రము అతి చిత్రమైనది. ఆ ఊరికి దక్షిణాన ఉన్న గుట్టను కూర్మశైలమంటారు. ఆ గుట్టమీద అచ్యుతరాయల కాలమునాటి విరుపణ్ణ నాయకుడు రాజధనము వెచ్చించి—రామదాసుకు చాలాముందే—వీరభద్రాలయము కట్టించినాడు. అచ్యుతరాయలు విజయనగరానికి రమ్మని తాకీదు పంపగా, రాజు విధించే శిక్ష తానే చేసుకోవాలని కళ్లు తీయించుకున్నాడట. ఆలయ నిర్మాణము మూడింట ఒక వంతు ఆగిపోవడము ఇందువల్లనే నంటారు.

లేపాక్షి అనే పేరు ఎలాగ పుట్టినదో తెలియరాదు. ఎన్నో వ్యాఖ్యానాలు ఉన్నాయిగాని నమ్మకము కలిగించే వ్యాఖ్యానము ఇంకా దొరకలేదు. వీరభద్రాలయము కట్టడానికిముందే లేపాక్షి గ్రామ ముండినది. గ్రామానికి చెరువూ, దాని కట్టపైన శివాలయమూ ఉన్నాయి. కూర్మశైలముమీద విరుపణ్ణ మూడు ఆలయాలు కట్టించాడు. అంతకుముందు ఆ గుట్టమీద పెద్దబండమీద శిల్పు లెవరో భిక్షాటన శివుని రూపము అర్ధ శిల్పముగా చెక్కినారు. విరుపణ్ణకుముందే ఎవరో ఒక చిన్న దేవాలయము (ఈ శివుని చిత్రము వెనుక గోడమీద ఉండేటట్లుగా) కట్టించినారు కాబోలు, దాని ద్వారబంధమును మార్చి, విరుపణ్ణ ఆలయమును, శిఖరమును కట్టించినట్లు కానవస్తుంది. ఈ పాపనాశేశ్వరాలయము పశ్చిమముఖము. దీని కెదురుగా 20 గజముల దూరములో రఘునాథేశ్వరాలయము తూర్పు ముఖముగా ఉన్నది. దానికి ప్రత్యేకముగా అర్ధ మండపము—స్తంభాలతో ఉన్నది. ఈ రెండింటికీ నడుమ, పాపనాశేశ్వరాలయానికి చేరువగా, ఉత్తర ముఖమయ్యేటట్లు, వీరభద్రాలయము నిర్మించినాడు విరుపణ్ణ. జైన దేవాలయాలు ఉత్తరముఖంగా నిర్మించడము సంప్రదాయము. వీరశైవ విజృంభణా కాలములో జైన దేవాలయాలను శైవు లాక్రమించి తీర్థంకర విగ్రహాలను తీసి, వీరభద్రుని ప్రతిష్ఠించేవారు. (అమరాపురములో అలాంటి దేవళము ఉన్నది.) ఆ అలవాటునే పాడగించి వీరభద్రాలయాలను ఉత్తర ముఖంగా కట్టినారు కాబోలు తరువాతివారు. కూర్మశైలముమీద ఈ ఆలయాలకు దక్షిణంగా పెద్ద పెద్ద బండలున్నాయి. ఆ కాలపు సంప్రదాయాన్నిబట్టి, (చందవోలూ చుండీ గ్రామాలలోని శివాలయములలో వలె) పాపనాశేశ్వరాలయము పశ్చిమోత్తరపు కొనా, రఘునాథేశ్వరాలయము ఈశాన్యపు కొనా దగ్గర చేరేటట్లు దీర్ఘ చతురస్రముగా అర్ధ మండపము (మూసిన మండపము) ఉత్తరము వైపున కట్టి ఉండవలసినది. విరుపణ్ణ అట్లు చేయక, ఉత్తరము వైపే వీరభద్రాలయానికి మాత్రము పెద్ద అర్ధమండపముగా కనబడేటట్లు పాపనాశేశ్వర వీరభద్రాలయాలమా వాటి వెనుక బండల క్రింది కాళీలనూ ఇముడ్చుకున్న అర్ధ మండపము కట్టించాడు. రఘునాథేశ్వరాలయపు అర్ధమండపము ఈ పెద్ద అర్ధ మండపములోనికి పశ్చిమమువైపు తెరుచుకుంటోంది. దీని వెలి గోడలు— చుండి కలికేశ్వరాలయములో వలెనే—అర్ధ శిల్పముతో నింపబడినవి. కాకతీయ—హొయసల—దేవళాలకు వలెనే ఈ మండపము చూరు చుట్టూ రాతి పలకలతోనే వంపుటంచు ఏర్పాటు చేశారు. ముఖ మండపము అనే అన్ని వైపులా తెరచిన స్తంభాల మండపము దీనికి ముందు, ఒక గజము దిగువ మట్టములో ఉన్నది. దీని వెడల్పు ఎక్కువా, పొడవు తక్కువానూ. అయితే ఎత్తైన స్తంభాలుండడమువల్ల దేవాలయంలో బాగా తెరపి ఉన్న భాగమిదే అయింది.

దేవాలయాలకు కల్యాణ మండపాలుండడము మన మెరుగుదుము. ఈ ఆలయములో కల్యాణ మండపము (అసంపూర్ణమైతేనేమి ?) ఉన్నదీ, లతా మండపమున్నది. పాతికకు మించిన శిలా స్తంభాలు, నాలుగు వైపులా లతలను చెక్కినట్టివి, చేరి లతా మండప మేర్పరచినవి. ఇలాంటి

మండపము ఇతరచోట్ల సామాన్యముగా కానరాదు. నాలుగు కాళ్ల మండపము విజయనగరపు ఆలయాలలో దేవాలయానికి బయట కానవస్తుంది. ఈ ఆలయంలో ప్రాకారములో పైపున పశ్చిమ భాగంలో ఉన్నది.

శిల్పాలంకారముల—ముఖ్యముగా చెట్లను పెకలించబోయే ఏనుగులను — పరిశీలిస్తే శ్రీశైల దేవాలయ ప్రాకార శిల్పాల పోలిక చాలా కనబడుతుంది. పంచముఖ బ్రహ్మ ఇక్కడి ప్రత్యేకత. శిల్పరూపాలు—స్తంభాలకు చేరా చెక్కినవి, ఇంచుమించు నాలుగైదు అడుగులవి ఇక్కడ కానవస్తాయి. రెడ్డిరాజులు కోరుకొండ, దక్షారామము, పలివెల దేవాలయములోని స్తంభాలలో తమ శిల్పాకృతులను చెక్కించినారు. తాడిపత్రి రామలింగేశ్వరాలయపు గోపురముమీద శిల్పి విగ్రహమూ, తిమ్మరుసు విగ్రహమూ ఉన్నాయి. అయితే, మండప స్తంభాలకు చేరా చెక్కించిన విగ్రహాలు ఇంత పెద్దవి ఇతరచోట్ల కానరావు. ఈ ఉదాహరణమును చూచి అహోబల దేవాలయ మండపములో తిరుమల దేవరాయలూ, సోమపాలెము చాపడిలో పెద్ది నాయకుడూ పెద్ద విగ్రహాలు చెక్కించారూ, మధుర మీనాక్షి దేవళములో తిరుమల నాయకుడు ఈ అలవాటును బ్రహ్మాండంగా పెంచాడు. లేపాక్షి ఆలయములోని నాగలింగమంతటిదీ, లేపాక్షి నంది యంతటిదీ భారతదేశములో మరి లేవు.

అజంతా తరువాత లేపాక్షి మండపాలలో కప్పుల మీద చిత్రించిన రూపాలంతటి బృహద్రూపాలు మరి లేవు. లేపాక్షి అర్ధ మండపములో కప్పుమీది వీరభద్రు డంతటి పెద్ద వర్ణ చిత్రము భారత దేశములో మరిలేదు. కళాకారులు జైనులే లయినా, శిల్పమూ చిత్రకళా బృహద్రూపాల నందు కోడము విజయనగర కళా ప్రభావమే.

కళాకారులు జైనులంటినా? అవును, అలాగే కనబడుతున్నది. లేపాక్షి వర్ణ చిత్రకారులు వర్ణ లేపములో, విన్యాసాలలో, నిశాలాంకములలో, దీర్ఘ చిత్రాలలో, వస్త్రాలంకార సామగ్రులలో జైన చిత్ర కళా సంప్రదాయాల్నే పాటించారు. శిల్పులు దేవతల వాహనాల్ని జైన తీర్థంకరుల చిహ్నాల సైజులో చెక్కారు. స్త్రీల నగ్నత్వము చాలా అరుదు లేపాక్షిలో. పెనుకొండ పెద్ద జైన విద్యాస్థానము. ఈనాటికీ రెండు జైనాలయాలు—పూజ జరుగుతూన్నట్టివి—ఉన్నాయి అక్కడ. విరుపణ్ణ పెనుగొండ నాయంకరము పొందినవాడు. కళాకారులు అక్కడివారే కావడము వింతకాదు. లేపాక్షిలో శిల్పమూ చిత్ర కళా నవ సంప్రదాయాలతోనే నడచినవి. మూడు కాళ్ల భృంగీ, ఆరు చేతుల స్నానశివుడూ అవునే తార్కాణ.

లేపాక్షి వర్ణ చిత్రాలలో ఆనాటి ఆచారాలు బింబించాయి. అవి కేవలము సంప్రదాయక చిత్రాలేకావు. సమకాలిక చిత్రాలని కూడా అనవచ్చును. స్త్రీల పాపిటసరములూ,శిరోజములలో విడిపూవులూ, రెండు పొరల పైటలూ, కైవార హస్తములూ, ఉద్యోగుల, నాయకులూ—, శిల్పులూ—, చిత్రకారులూ—, ఉష్ణీషాలూ, దుస్తులూ ఆనాటివే.

విరుపణ్ణ తండ్రిపేరు నంది లక్కిసెట్టి. లేపాక్షిలో ఒక రాతి గుట్టను 30 అడుగుల పొడవూ, 18 అడుగుల ఎత్తూ గల 'నంది'ని గా చెక్కించినాడు విరుపణ్ణ. ఆతని సోదరుడు వీరణ్ణ గౌరవనహళ్లిలో 'లక్ష్మీ' ఆలయము కట్టించినాడు. విరుపణ్ణ వీరభద్రాలయ అర్ధ మండపము ఈశాన్య మూల తన కులమునకు మూల పురుషుడైన కుబేరుని కొడుకు కోడండ్రను—రంభా నలకూబరులను చెక్కించినాడు. రంభ నట్టువరాలు దుస్తులతో మన్నది. నలకూబరుడు విష్ణు ధర్మోత్తరములో చెప్పినట్లు కోరలతో ఉన్నాడు. ఇంతటి సుందర దంపతులు శిల్పములో అరుదు.

లేపాక్షిలో వాస్తు, శిల్ప, కవితా, ఆలేఖ్య, సంగీత' నాట్య, కళల హాళ్లీసకము కలదు. ఈ సమృద్ధి ఇంకొక క్షేత్రములో లేదు.

గాలిబ్ దాంపత్య జీవితం

శ్రీ సదాశివ,

ఉర్దూ కవుల్లో విలక్షణ ప్రతిభాశాలి మిర్జా అసదుల్లా ఖాన్‌గాలిబ్. అతడు క్రీ.శ.1869వ సంవత్సరంలో మరణించాడు. క్రీ.శ. 1969వ సంవత్సరలంలో దేశమంతటా అతని శత వర్ధంతి జరిపే సన్నాహాలు సాగుతున్నవి. ఉర్దూ సారస్వతంలో గాలిబ్‌కు జరిగిన ప్రాచుర్యం ఇంకే కవికి జరుగలేదు. అతని కవితా ప్రాశస్త్యాన్ని, వచన రచనా వైశిష్ట్యాన్ని విద్వాంసులు వివిధ దృష్టి కోణాల్తో పరిశీలించి ప్రస్తుతిస్తున్నారు. అతని జీవితానికి సంబంధించిన అనేక విషయాల్ని - పరిశోధించి ఎవరికి తోచిన విధంగ వారు వివరిస్తున్నారు. అతని దాంపత్య జీవితాన్ని గురించి పలువురు పలు రకాల అభిప్రాయాల్ని ప్రకటిస్తున్నారు.

అతడు తన దాంపత్య జీవితంపట్ల అనురక్తుడా విరక్తుడా అనేది ప్రశ్న — అనురక్తుడని సమకాలిక రచయిత లన్నారు. విరక్తుడయినట్లు అతని వ్రాతలు బుజావు చేస్తున్నాయి.

గాలిబ్ జీవిత చరిత్రను "యాద్‌గారె—గాలిబ్" అనే పేర వ్రాసిన ఖాజా అల్తాఫ్‌హుస్సేన్‌హాలీ ఉర్దూలోని నవ్య కవితకు మూల పురుషుడు. గాలిబ్ శిష్యుడు. అతడు, "పరిహాస ప్రవృత్తిగల ఆ మహాకవి వ్రాతల్ని చూచి అతనికి తన భార్యయెడ అయిష్ట భావం ఉండిఉంటుందని ఎవరైనా అనుకోవచ్చు. కాని నిజానికి ఆ దంపతులు చాలా అన్యోన్యానురాగం కలవారు. ఒకరి సుఖంకోసం ఒకరు ప్రయత్నించేవారు." అని వ్రాసినాడు.

'ఆబె హయాత్' అనే ఉర్దూ సాహిత్య చరిత్ర వ్రాసిన మొహమ్మద్ హుస్సేన్ ఆజాద్‌కూడా అలాగే అభిప్రాయపడ్డాడు.

గాలిబ్‌ను దర్శించిన ఆనాటి విద్వాంసులు తమ మిత్రులకు వ్రాసుకున్న జాబుల్లోను అలాటి భావాన్నే ప్రకటించారు.

కాని, గాలిబ్ తన మిత్రులకు, శిష్యులకు వ్రాసిన ఉత్తరాల్లోను, అక్కడక్కడ తన కవితలోను తద్వ్యతిరేకమైన సూచనలు చేసినాడు.

ఉమ్రావ్‌సింగ్ గాలిబ్ శిష్యుడు. అతని కళత్రం మరణించింది. మళ్లీ పెళ్లిచేసుకున్నాడు. ద్వితీయ కళత్రంకూడ మరణించింది. ఆ సంగతి వేరొక శిష్యుని లేఖవలన గ్రహించి ఆ శిష్యునికి గాలిబ్ ఇలా వ్రాశాడు : "ఉమ్రావ్‌సింగ్ అదృష్టం చూస్తే నాకు అసూయ కలుగుతున్నది. అరవయ్యేళ్లనుంచి నా మెడకు పడిన గడియ విడివడనే లేదు. అతనికి అప్పటికప్పుడే రెండుసార్లు విముక్తి లభించింది."

ఏభయ్యేళ్లు ఢిల్లీలో ఉన్నా గాలిబ్ సొంత ఇల్లు కట్టించుకోలేదు. కొననూ లేదు. మాటి మాటికి మారుస్తూ ఎప్పుడూ అద్దె ఇళ్లల్లోనే ఉండేవాడు. ఒక తడవ క్రొత్త యిల్లొకటి చూచి వచ్చాడు. భార్యను కూడ వెళ్లి చూచిరమ్మన్నాడు. ఆమెకా ఇల్లు నచ్చలేదు. "ఏందుకు?" అంటే, "అందులో భూతమున్నదట!" అన్నదామె. గాలిబ్ నవ్వి, "నువ్వుండగా వేరే భూతమా!" అన్నాడట. ఈ కథ హాలీ చెప్పినది.

"ఎగురక ముందే బంధింప బడినాను" అని ఒక కవితలో అన్నాడు.

"ఇల్లు పొందించుకోవాలని అభిలషిస్తే అదేమో ఆడిపై కూర్చున్నది" అని ఇంకొక కవితలో అన్నాడు.

"ఇవన్నీ దాంపత్య జీవితంపట్ల ఉన్న విరక్తిని వెల్లడి చేయటం లేదా?" అని అంటారు కొందరు.

"ఇదంతా కవిత్వం— పరాచికం— యదార్థమని ఎలా అనుకోగలం?" అని మరికొందరు అంటారు.

నిజానికి గాలిబుదంతా పరాచికమే— ఎంతటి విషాద వృత్తాంతాన్నయినా, ఎట్టి గంభీర విషయాన్నయినా పరిహాస రూపంలో ప్రకటించే స్వభావం అతనిది. అతడ జీవించిన కాలమే ఒడుదుడుకులతో కూడినది. అతని జీవితమంతా అవకతవకగా గడిచినది. అయినా ఐహిక కష్టాల్ని హసన్ముఖుడై సహించే నిబ్బరం కనుక అయ్యో అనిపించే మాటేదీ అతడనలేదు. ఔరా అనిపించేటట్లే అన్నాడు ఏదన్నా.

తనను గురించి తాను తెల్పుకున్నది సత్యమని సమ్మతించ దగినది కాదు. కల్పన అని ఖండించవలసినదీ కాదు.

కాబట్టి అతనికి బాగా సన్నిహితులైన వాళ్లు, అతని దాంపత్య జీవితాన్ని చూచిన వాళ్లు చెప్పే మాటల్ని గురించి ఆలోచించవలె.

అలాటి వ్యక్తి ఒకర్తు క్రీ.శ. 1945 వరకు జీవించి ఉన్నది. అప్పటికామె తొంభయ్యేళ్ల వృద్ధ— "లోహారూ" జమీందారుల ఇంట పుట్టి గాలిబ్ కుటుంబంలో మెట్టిన ఆమెపేరు మోజమ్ జమానీ బేగమ్. వ్యవహార నామం బిగ్గా బేగమ్.

గాలిబ్‌ను గురించి ప్రశ్నించే జిజ్ఞాసువులకా వృద్ధురాలు తెరచాటున కూర్చుండి పరిశుద్ధమైన వాగ్ధారతో ఉపన్యాస ధోరణిలో తానెరిగిన సంగతులు వివరించి చెప్పేంది.

గాలిబ్‌కు సంతతి లేదు. కలుగలేదని కాదు. ఏడుగురు పిల్లలు కలిగి ఏడాది రెండేళ్లు మాత్రమే బ్రదికి ఇహలోకయాత్ర చాలించి వెళ్లారు. వృద్ధాప్యంలో తన భార్య అక్క కొడుకును పెంచుకున్నాడు గాలిబ్. అతనిపేరు జైన్ లా బుద్దీన్ ఆరిఫ్— ఆరిఫ్ ప్రయోజకుడైన యువకుడు. గాలిబ్ శైలిలో కవిత వ్రాయగల నేర్పరి. కాని ఇద్దరు పిల్లలు కలిగిన తరువాత అతని భార్యా అతడూ ఒక సంవత్సరం తేడాతో మరణించారు. ఆరిఫ్ మరణం గాలిబ్ హృదయానికి అశనిపాతమయింది. అప్పుడతడు "మర్సియా ఆరిఫ్" అనుపేర వ్రాసిన ఒక చిన్న కావ్యం ఉర్దూ విషాద కావ్యాలకు కన్నాకు— ఎన్నడూ అన్నిటికీ నవ్వే అతని హృదయం ఆరిఫ్ మరణానికి ఒక్కసారి ఏడ్చింది కావ్యరూపంలో—

తరువాత ఆరిఫ్ కొడుకులిద్దరిని అతి గారాబంగా పెంచుకున్నారు గాలిబ్ దంపతులు. పెద్దవాడు బాఖిరలీఖాన్, చిన్నవాడు హుసేనలీఖాన్— "లోహారూ" జమీందారులింటి ఆడబడుచుతో బాఖిరలీఖాన్ వివాహం అతి వైభవంగా జరిపించాడు గాలిబ్. ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు కలిగే వరకు జీవించాడు— ఆ బాఖిరలీఖాన్ భార్యే బిగ్గా బేగమ్.

ఆమె ఆ ఇంట అడుగు పెట్టునప్పటికి గాలిబ్ దంపతులు అరవయ్యవపడిలో ఉన్నారు. అప్పుడు వాళ్లిద్దరి మధ్య రవరవలే

ఉండినవి. "ఈ ముసలాయన మతిపోతుంది. ప్రతిదానికీ పరాచికమే" అని విసుక్కునేది ఉమ్రావుబేగమ్.

"ఈమె ఇంటిని ఫతేపూరి మసీదు చేసింది. నాప్రాణం కడబట్టింది. మూసా సోదరి ఈమె" అని గొణుక్కునే వాడు గాలిబ్.

యౌవనంలో వాళ్లిద్దరికి అనురాగం ఉండే ఉంటుంది. ఆమె ఒక సంపన్న కుటుంబంలో జన్మించిన సుందరి. అతడూ ఒక నవాబు కుటుంబానికి చెందినవాడే. ఆకర్షకమైన ఆకృతి, అంగ సౌష్టవమూ కలవాడు. ఆమెకు పదకొండు, అతనికి పద మూడు వయసులో పెళ్లయింది.

కాని ఈ అనురాగం చాలాకాలం నిల్వలేదు. దానికి కారణాలు అనేకమైనవి.

ఉమ్రావు బేగమ్ తండ్రి మిర్జా ఇలాహిబఖ్ష "లోహారూ" జమీందారు. వయసులో ఉండగా ఐహిక భోగాలన్నీ అనుభ వించి వార్ధక్యంలో ఈశ్వరాయత్త చిత్తుడైనవాడు.

ఉమ్రావుబేగమ్ చిన్ననాటినుండి సదాచార సంపన్న. రోజాలు నమాజులూ విధిగా పాటించే సాధుశీల. కాని అభిజాత్యా భిమానం అణచుకోలేని అబల.

మిర్జా అసదుల్లా బేగ్ ఖాన్ గాలిబ్ తండ్రి తాతలు నవాబులు— పైగా యోధులు. కాని అతనికి మాత్రం వారి ప్రయోజకత్వం అబ్బలేదు. అందుకతడు ప్రయత్నమూ చేయలేదు. పనికిమాలిన కవిత్వాన్ని పట్టుక ప్రాకులాడినాడు. ఆదాయమార్గం అన్వేషింపలేదు. పైతృకమైన ఆస్తి పేచీల్లో పడిపోయింది. జీవికకు ఉపాయం దొరకలేదు. రోజా నమాజుల వైపు మనసెప్పుడూ మళ్లలేదు. పడుచునాళ్లలో అలవా టయిన త్రాగుడు మరణించేదాకా వదలలేదు. జైలులోపడ్డా జూదమాడుట మానలేదు. తలకుమించిన అప్పులవలన అతడు పలుతడవలు అవమానంపాలు కావలసి వచ్చింది. అన్నిటికి మించి అతడొక అమ్మాయిని ప్రేమించాడు యౌవనంలో. (ఈ ప్రేమ విషయం ఎంతవరకు నిజమో చెప్పలేము. వార్ధక్యంలో వ్రాసిన కొన్ని ఉత్తరాల్లో ఇలాటి సూచనలు చేసినాడు. అదీ కవిత్వమే అంటారు కొందరు.)

ఇవన్నీ వారి రవరవలకు కారణాలు.

"బేగమ్! ఒకమాట చెబుతాను విను" అనే వాడతడు అనురాగంతో

"నేను వినను" అనేదామె కట్టె విరచినట్టు—

బయట వర్షం కురుస్తోంది. భార్య గదిలోకి వచ్చాడు గాలిబ్. అక్కడే బిగ్గా బేగమ్ కూర్చుండి ఉన్నది.

"చూడు బేగమ్! ఈ వర్షం ఎంత ఆనందకరంగా ఉన్నది. నువ్వూ నేనూ హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు— మధ్యన ఈ అమ్మాయెందుకు?" అన్నాడు.

బిగ్గా బేగమ్ సిగ్గుపడి తలవంచుకొని బయటికి నడిచింది.

"ఆగుపిల్లా. ఈ ముసలాయన మతిపోయింది. నువ్వేమీ అనుకోకు." అని వారించింది ఉమ్రావుబేగమ్. అయినా ఆమె వెళ్లిపోయింది.

గాలిబ్ గాబరాపడి పోయాడు. "బయట వర్షం— చీకటి పురుగూ పుట్రా మసలవచ్చు. ఈ మాత్రం మాటకే కోడలు కోప్పడింది" అని సణుక్కుంటూ ఆమెను అన్వేషించ సాగాడు.

అతని పరాచికం ఆమెకు అసహ్యం. ఆమె కోపం అతనికి పరాచికం.

అయినా ఒకరినొకరు ఆదరించుకునేవారు. పగలంతా బయటి గదిలో మిత్రులతో శిష్యులతో సాహిత్యగోష్ఠి, జర పుతూనో, ఉత్తరాలు వ్రాస్తూనో గడిపినా రెండు తడవలైనా లోపలింటికి వెళ్లి వచ్చేవాడు గాలిబ్. మరీ వృద్ధుడైన తర్వాత క్రమ వ్రతంతో ఒకసారి వెళ్లివచ్చేవాడు.

ఆమె అతనికి కావలసినవన్నీ స్వయంగా అమర్చేది. ఆహార విషయంలో ఔషధాల విషయంలో శ్రద్ధ చూపేది. అన్నివిధాల ఆమెను సుఖపెట్టాలని అతడు ప్రయత్నించే వాడు. అతన్ని సుఖపెట్టాలని ఆమె అభిలషించేది. వాళ్లిద్దరి స్వభావాల్లో ఏ విధమైన సామ్యం లేకున్నా తమ వంశమర్యాద పాటించే విషయంలో మాత్రం సామ్యం ఉండేది. భార్యభర్తనూ భర్త భార్యనూ సుఖపెట్టే ప్రయత్నంచేయటం ఆ వంశ మర్యాదలో ఒక అంశం.

బిగ్గా బేగమ్ పెద్ద కుమార్తె సుల్తానీబేగమ్‌ను గాలిబ్ ఎన్నడూ విడిచి ఉండేవాడు కాడు. ఆమెను ''జీవన్ బేగ్'' అని పిలుచుకునేవాడు ప్రేమతో. అప్పటికామె నాలుగేళ్ల పిల్ల.

దీర్ఘకాలం వ్యాధితో తీసుకున్న తర్వాత 15వ ఫిబ్రవరి 1869న అతని పరిస్థితి విషమించింది. జీవన్‌ను స్మరిస్తూ స్పృహతప్పిపడిపోయాడు. ఆమెవచ్చి అతని చెవిదగ్గర వంగి ''దాదాజాన్'' అని పిలువగా ఒకసారి కళ్లు తెరిచి ఆమెనుమాత్రం చూచి మళ్లీ మూసుకున్నాడు— ఆ కళ్లు ఇక తెరువలేదు—

గాలిబ్ మరణించిన తర్వాత ఉమ్రావుబేగమ్ అనుభవించిన కష్టానికి అంతులేదు. డెబ్బయ్యేళ్ల వృద్ధ విధవ. సంతానమూలేదు. ఆధారమూ లేదు.

భర్తకిచ్చిన భరణంలో తనకు కొంత ఇప్పించవలసినదని ఆంగ్లప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్నది. ఆమె ఆఫీసుకు వెళ్లి స్వయంగా గ్రహించే పక్షంలో నెలకు పదిరూపాయలీయటానికి ప్రభుత్వం అంగీకరించింది. కాని ఆఫీసుకు వెళ్లటం ఆమెకు సమ్మతంకాలేదు.

ఆ ఆశ వదులుకొని ఉమ్రావుబేగమ్ రామపూర్ నవాబుకొక అర్జీ పంపుకున్నది. కాని అక్కడనుండి జవాబే రాలేదు— భర్త సంవత్సరీకంనాడు సరిగా అదే రోజున ఆమె పరమపదించినది.

ఎన్ని కష్టాలనుభవించినా అరవయ్యేళ్లవరకు ఒక మహాకవికి సహధర్మచారిణి అయినందున ఆమె ధన్యురాలు.

అద్దంకి అమ్మిరాజప్రధాని - కాలము

శ్రీ వి, రాజగోపాలరావు

శ్రీ కొమండూరి రామానుజాచార్యులు 64 జులై నెల భారతిలో వ్రాసిన 'అద్దంకి అమ్మిరాజ ప్రధాని, అను వ్యాసము మరియొక అజ్ఞాతకవిని ఉద్ధరించినది. అందు వారు కవికాల నిర్ణయ చర్చ యొనర్చుచు నా కవి క్రీ. శ. 16 వ శతాబ్దపు టుత్తరభాగమువాడు కావలయు ననిరి. కావ్య గర్భమున నింతకన్న నాధారము లెవ్వియు కన్పింప లేదనిరి. ఆ వ్యాసమునందే వా రుదహరించిన 'కాసీ తా జతురాననుండ గుటకున్' అను పద్యములోని 'దివ్య ప్రబంధాను సంధానంబు' నకు, ఆముక్తమాల్యదలోని 'అనిష్టానిధి గేహసీమ' అను పద్యములోని 'దివ్య ప్రబంధాను సంధాన (ధ్యానమున) కు పోలిక గలదు. చిత్ర సేనుని వృత్తాంతము (మాలదాసరి కథ వలె) కావ్యేతి వృత్తమున కతుకలే దనిరి. ఆముక్తమాల్యదచే నీ కవి శైలి ప్రభావితమై యుండునేమో! 'అరయన్‌రీతు లలంక్రియ ధ్వనులు' అను పద్యభావము శ్రీ కృష్ణదేవరాయల పరిపాలనా కాలముననను, అటుపిమ్మటను వెలసిన ప్రబంధ కవులు కవిత్వ లక్షణములను గూర్చి వర్ణించు పద్యభావముల వలెనే యున్నది.

కావున ఆయా కారణములచే నీ కవి శ్రీ ఆచార్యులవా రూహించినట్లు 16 వ శతాబ్దపు టుత్తరభాగమున గాని 17 వ శతాబ్ద ప్రారంభమున గాని విలసిల్లినా డనవచ్చును. కావ్యగర్భమును పరిశీలించిన మరేవైన ఆధారములు దొరకునేమో! మఱియు నీ వ్యాసకర్త 'తిరుమల పెదసింగనార్యుడు చతుర్వాటికా రఘునాధుని సేవించెన' ని యుదహరించినారు. ఆ గ్రామ మెచ్చట నున్నదో తెలియదనినారు. ఆ చతుర్వాటికి నేడు ఒంగోలు పట్టణమునకు సమీపస్థమగు చదలవాడ గ్రామము. అందు శ్రీ రామాలయము గలదు. రఘునాధుని అనుగ్రహముననే నరసింహగురుడు రహస్యార్థ ప్రవీణుడైనది. నరసింహగురుని సంతతి వారికా గ్రామమున స్థానికాచార్య మర్యాద యుండినది. దానికిగాను తద్వంశీయులకు సుమారు ఏబది యెకరముల భూమి సర్వ మాన్యముగా నుండినది. నేడు కథావశిష్టమైనది. సకల వసతులతో నొప్పారు నా యాలయమున నాయా పర్వదినములలో నేత్రపర్వముగా నుత్సవములు జరుగుచున్నవి. శ్రీరామ వసంత నవరాత్రము లసంఖ్యాక జనుల నాకర్షించుచున్నవి. చదలవాడ తిరునాళ్ల ఒంగోలు ప్రాంతమున ప్రసిద్ధిగాంచిన తిరునాళ్లలో నొకటి. భగవద్భక్తుల కాణాచియై నాట్యకళల కాలవాలమై విలసిల్లిన యీ గ్రామము కొంత చరిత్ర గల గ్రామము. కవిత్రయములో నొకడగు వ్రేరన యింటిపేరు చదలవాడ వారని కదా జనశ్రుతి! కొంతకాల మిచ్చోట నా ప్రబంధ పరమేశ్వరుడు వసించెనేమో!

లేఖలు

ప్రౌఢకవి మల్లన

భారతి సంపాదకులకు,

ఆర్యా!

రుక్మాంగద చరిత్రలో ప్రౌఢకవి మల్లన్న క్రీ.శ. 1430 ప్రాంతమందలి 'నాచన సోముని— సన్నుతిఁ జేసి'నాడు. కాని, పోతన— శ్రీనాథ కవులను పేర్కొనలేదు.

కథలో తన సమకాలికులైన కొందరు బ్రాహ్మణుల పేర్లు పేర్కొన్నట్లు క్రింది సీస పద్యము వ్యంజకము చేయుచున్నది.

—ధర్మాంగదుఁ బ
ట్టము గట్టవలయు ....
(అని)..................
—విప్రోత్తములఁ బిల్వఁ బం
పుటయును,
హోతభీమేశుఁ డచ్యుతశర్మ యెఱ్ఱావ
ధాని యజ్ఞేశుఁ డాధాన యాజి,
చల్లవల్లభు డగ్రచర్చ గోవిందుండు
భట్టమే భభుడు దర్భల ముకుందుఁ,
ఊశ్వరభట్లు బ్రహ్మేంద్ర యోఝులు క్రమ
దాడి మాధవుఁ డు జంధ్యాల పెద్ద
భాస్కరోఝులు చక్రపాణి చతుర్వేది
శొంఠి కృష్ణుఁడు మల్లు సోమయాజి
వామదేవుండు నరసింహ వాజపేయు
లాదికేశుండు వడ్డి దామోదరుండు
పట్టవర్ధన యెల్లన్న పల్లమంచి
యాదియగు విప్రు లేతెంచిరచటికపుడు.
(ఆ. 5— 189)

జంధ్యాలవారు, శొంఠివారు, దర్భలవారు, వడ్డివారు, మల్లువారు మొదలైన బ్రాహ్మణ వంశములలోనపై పేర్లు గల వ్యక్తులు కలరేమో? దయచేసి తద్వంశజులు తెలుప వేడెద. వీలున్నచో కాలాదులుకూడా తెలుప గోరెద.

(ఉలవపాడు) దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి.

నన్నెచోడుని కవిత్వం

ఆర్యా,

కడచిన నెల భారతియందు పై శీర్షిక గల వ్యాసమునకు ఈ క్రింది సవరణలను, వివరములను ప్రకటింపగోరెదను—

పుట 44. పంక్తి. Manumasiddhi vijayaganda Gopala died అను వాక్యమున కెదురుగ "1291 A. D." అని చదువవలెను.

పుట 46—మొదటి కాలము—33, 34 పంక్తులు. ముద్రణలో "ఇచట వీరన్న యనగా తిక్కన పిల్లలమఱ్ఱి పిన వీరభద్రుఁడు యుత్తర రామాయణమును కథను పురవర్ణనతో ప్రారంభించినాడు."

ఈ వాక్యము నిట్లు చదువవలయును—

ఇచట వీరన్న యనగా పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు. తిక్కన యుత్తర రామాయణమున కథను పురవర్ణనతో ప్రారంభించినాడు.

పుట. 46. రెండవ కాలము. 37 పంక్తి.

ఇంతకు నీ 'లింగధారి' శబ్దము పూర్వమున్నట్లు తోచదు. దీనికి వివరణ

"లింగధారి కన్న దొంగలు లేరయా
విశ్వదాభిరామ వినురవేమ" [1]అని వేమన పద్యములలో

1. దీని యంతరార్థము వేమన ధోరణిని బట్టియే గ్రహింపనగును.

మున్నది—ఇక నీ లింగధారి శబ్దమును నాధునిక కాలములో వాడినవారు మహాకవులు దాసు శ్రీరామ కవీంద్రులు—వారి 'తెలుగునాడు'' లో నుండి యీ పద ప్రయోగమునకై పద్యముల నుదాహరించుచున్నారు.

ఆంధ్ర సాంఘికేతి వృత్తమునకు సంబంధించిన యీ ప్రశస్త కృతి నినాటి సాహితీ విమర్శకులు చక్కగా చదువలేదు. ఇందును శ్రీరాము కవీంద్రులు—ప్రధాన శీర్షికలో లింగధారులనక శైవులనియే వాడిరి.

ఉ. తల్లికి భారమా శిశువు ? తామరతూటికి పువ్వు భారమా
విల్లొక భారమా కడిది వీరున, కొంకెకు గూరు భారమా
వల్లికి భారమా ఫలము? బఱ్ఱెకుఁ గొమ్ములు భారమా మతుల్
చెల్లును లింగధారులకు లింగపు గాయలు భారమా2 ఏహిన్.
పుట. 34

చ. మొగమున భూతి రేఖలవి మూడు గణంతల రెండు దీర్చి వా
సిగ బలుజందె పోగులను జేర్చిన మున్న నిలక్క లింగకా
య గవఁజడున్ గవంబడ దొయారముగంజర లింగమందు రీ
జగమున లింగధారి మతశాబకుడాడు నియోగి బాలుతోన్.
పుట. 36.

చ. వలపులు లెస్స, కూడని వివాదలు లేశము గానరావు, కా
ఎలసిన యంత భక్తిగలవా ఓయంసన్ భయమే కొఱంత భ
ర్తలయెడ లింగధారి వనితాతతి కయ్యదివారి పుణ్యమో
చెలువల దోషమో? తలప స్వీకృత లింగ శిలా మహత్త్వమో.3
38.

(హైదరాబాదు) నిడుదవోలు వేంకటరావు

యతికి గతి యేమి?

భారతి సంపాదకులకు,

ఆర్యా,

ఆంధ్ర పంచ కావ్యములలో నొకటిగా ప్రశస్తి వహించినదియు,— రామరాజభూషణ బిరుదాంకి రామఁ డగు— భట్టుమూర్తి కవిచే 'ప్రబంధ రత్నమణి హారహీరమణిగ రచింపఁబడిన వసుచరిత్ర ప్రథమాశ్వాసమందలి. —(ప. 110)

అమరుందత్పురి చెంతకాంత కనకాబ్జాలంబరోలంబకు క్తిమతీ వాహిని సారసారణులు తత్కేదారకోదార— సస్యము ముక్కారును బండ చేయు దివివారల్ వీటి సత్రాన్న భాగము లాసింతురు తచురాలయ సదీఖ్యాతిన్ విడంబించున్''

పై పద్య మూడవపాదమున—యతి యెట్లు సరిపోయినదో తెలియదు—ఈ వసుచరిత్రము నిప్పటి కనేక పర్యాయములు—నిర్దుష్టముగా సంస్కరింపబడి సోమనాథకవినుండి, 'శ్రీ నిడుదవోలు వెంకటరావుగారివరకు ననేక నూత్న నూత్నములైన విశేషములతో ముద్రింపఁబడినది. కాని యెవ్వరీ విషయమును గుర్తించినట్లు తోచదు. వసుచరిత్ర విమర్శకులును—దీనిపై ప్రస్తావన యెత్తలేదు. పై పండితులు విమర్శకులు—దీనిని దోషము లేదని తలంచిరో? కవికృత దోషము మనకే అని మానిరో? తెలియదు— దోషరహితముగు పక్షమున— దాని లక్షణమును— సప్రమాణమున తెలియఁ జేయగలందులకు— పండిత— విమర్శక లోకమును వినయాంజలితో ప్రార్థించుచున్నాఁడను—

(కనిగిరి) కోమాండూరి రామానుజాచార్యులు

---

2. కీర్తిశేషులు కొమ్మరాజు లక్ష్మణరావుగా రారాధ్యులు— వారు సంస్కారప్రియులు శైవము లింగమును ధరించువారు. దీనిని చూచి కొందరాయన నిట్లు ప్రశ్నించిరట—ఏమండీ మీరు సంస్కారప్రియులు గదా. ఈ శరీరము లింగము ధరించుట మీకు భారముగా లేదా ! అని ప్రశ్నించిరట. తత్క్షణమే వారు—అయ్యా, ఈ శరీరమున—లోపల బనియను, దానిపై షర్టు, దానిపై వేస్టు కోటు, దానిపై కోటు, మాటు, మెజోడుబూటు, తలపై పాగా—యింత భారము భరింపగా లేనిది యీ చిన్న లింగమును మాత్రము భరింపలేదా ? అని.

3. ఈ తెలుగునాడు పద్యము లన్నియు కీర్తిశేషులు శతావధానులు చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారికి కంఠస్థము లన్నచో నిందలి కవితా వైశద్యమును గూర్చి నే వేఱుగా చెప్ప నవసరములేదు.

గ్రంథ విమర్శలు

ఉత్తర నైషధము

కవయిత్రి: దర్భా భాస్కరమ్మ, వెల : 2.00, ప్రాప్తిస్థానము : దర్భా భాస్కరమ్మ, శ్రీకృష్ణనగరము, గుంటూరు—2

పద్య కవిత్వము పట్ల వలపు ఇంకి పోవుచున్న రోజులివి. నియమబద్ధమగు పద్యకవిత్వము వలన ఒఱగునదేమియు లేదను రాద్ధాంతములు చెలరేగు కాలమిది. ఛందోవైశిష్ట్యమును కూలంకషముగా గ్రహించిన వారు విమర్శకులు కాక పోవుటచే పద్యకవిత్వ మనుచితమను పొలికేకలు విన్పించుచున్నవి. అదియును గాక "నవ్యత" యనునది సాహిత్యము ఛందోరహిత మయిన నాడే జనించు పదార్థమని పలువురి నమ్మిక. ఈ ఛందస్సు ఎక్కడిది ? ఈ ప్రశ్నకు సమాధానము భాషా పరిణామములోనే యున్నది. ఒక భాష యున్నది. దానిలో హ్రస్వములయిన, దీర్ఘములయిన — ఛందః పరిభాషలో లఘువులయిన, గురువులయిన— అక్షరములు గల శబ్దములున్నవి. అట్టి శబ్దముల కలయిక వలన మధురమయిన నాదము పుట్టును. ఈ నాదమును కొన్ని కొన్ని ప్రమాణములతో, కొన్నికొన్ని పరిణామములతో విభజించికొని పోవగా భిన్నభిన్న జాత్యుపజాతి వృత్తాదు లేర్పడినవి. ఈ నాదమును ఎన్ని విధములుగా నయినా విభజింప వచ్చును గదా ? యను నొక శంక కలుగ వచ్చును. నిజమే. ఆ నాద విభజనమునకు అంతములేదు. అందుచేతనే కొన్ని చోట్ల ఛందస్సులను సృష్టింప వచ్చునని ప్రాచీన శాస్త్రకారులు నమ్మిరి. కేవలమది నమ్మికయే కాదు. యథార్థము కూడ. ఈ ఛందో రహస్యమును ఎఱుగుటకు సంగీత కళా రహస్యములు తెలియవలయును. అదియు, ఇదియు తెలియని నాడు ఏదియు తెలియదు. అట్లే యతి, ప్రాసలు కూడ మానవుడేర్పఱచుకొనినవే. కారణమవి రెండును భాషా పరిణామములో సిద్ధమయినవే. సామాన్యుల సంభాషణములందు, లోకోక్తులలో అక్షరమైత్రి గల వాక్యములుండుట వింతగాదు. మఱియొకటి. భావతీక్ష్ణతతో తన సుఖదుఃఖానుభవములను మానవుడు తెలియజేయునాడు దానిలో లయ యుండక తప్పదు. వాల్మీకి శోకము శ్లోకమయిన గాథయే దీనికి తార్కాణము. తాత్పర్యమేమనగా ఛందశ్శాస్త్రము భాషా పరిణామము నుండి సహజముగా వెలువడినట్టిదనియే. బుద్ధిబల సంపన్నుడగు మానవుడు లయకు శాస్త్ర స్వరూపము కల్పించెను. ఛందస్సును ఎవరో ఎవరి నెత్తిపైనో రుద్దినది గాదు. అది మానవుడు సాధించిన సిద్ధులలో ఒకటి. దానిని నమ్ముట తొత్తరికము గాదు. లయకు తలయూచు గుణము మానవునిలో ఉన్నంత కాలము ఏదో యొక్క ఛందస్సును— అది ప్రాతది గావచ్చు—కొత్తది గావచ్చు— కవులు స్వీకరింపక తప్పదు. క్షేమేంద్రాదులు వృత్తౌచిత్యములను చక్కగా వివరించిరి. రసానుగుణములయిన ఛందస్సును, రాగములను భారతీయ మేధావులు కనుగొనిరి. ఒకటి మాత్రము నిజము. ఛందస్సును కావ్యశిల్ప ప్రతిబంధకముగా ఒనర్చిన "మహాకవులు" కలరు. వారికి పెద్దపీట వేసిన వారెవ్వరు లేరు. శక్తి చాలక, మితియెఱుగక ఎవరైన లక్షణమును చెఱచినచో అది వారి దోసమే యగును గాని దానిది గాదు. లక్షణము సమగ్రముగాదందురు ! మార్పులు చేసికొనవచ్చును. లక్షణమునందు మార్పులు చేసికొనుట వేఱు. లక్షణమును చికిలి నవ్వుతో తొలగదోయుట వేఱు.

అట్లే అలంకార శాస్త్రమును గూర్చి నాలుగుముక్కలు చెప్పవచ్చు. మానవుడు తాను చెప్పదలచుకొన్న తలపులను అందముగా చెప్పవలయు ననుకొనిన నాడే అలంకార శాస్త్రము పుట్టినది. అందముగా చెప్పుటకు అనేక మార్గములున్నవి. ఒక్కొక్క మార్గము ఒక్కొక్క అలంకారము. దాని ప్రయోజనము ఆనందమును పెంచుట. హృదయమును నమ్మక, బుద్ధి బలమునకు దాసులై, తర్కమును శరణాగతి శాస్త్రముగా పూజించి ప్రాచీనులు అలంకారములను పెంచిరి. ఈ పెంపకముతో ఆనందమును చేకూర్చ వలసిన అలంకారమునకు చమత్కారము మాత్రమే లక్ష్య మయినది. దానికి తోడా శాస్త్రము పట్ల మరులు పెంచుకొనిన పండితులు ముందువచ్చిన చెవులను గాక వెనుక వచ్చిన కొమ్ములను చూచి మెచ్చిరి. ఎన్నో కారణములు ఏకముకాగా "నవీనులకు" అలంకార శాస్త్రము పట్ల రోయింపు కల్గినది. ఈ రోయింపును కట్టమంచి రామలింగారెడ్డిగారు వాడి పలుకులలో పాడిరి. ఆ పాట పల్లవిని అందఱు అందుకొన్నారు. పాడగాపాడగా తుదకది పాచి పట్టినది. అన్ని చోట్ల వలెనే సాహిత్య సంప్రదాయములందును గుణాగుణములను సమీక్షించి దోషములను పరిహరించుట మంచిదే. సంప్రదాయ పరిణామము వేఱు. సంప్రదాయ విచ్ఛేదము వేఱు. ఎందుల కెక్కని "నవ్యత" పేర సంప్రదాయ విచ్ఛేద మొనర్చుట విప్లవకమే. రాజకీయములు, తాత్కాలిక ప్రయోజనములు, మఠాలు— మున్నగు వానిని అతిక్రమించి సాహిత్యమును తాత్త్వికముగా పరీక్షించు తెలివిడి కలిగిన తెలుగువారు చాల మంది లేక పోవుట దురదృష్టము. కావుననే ఈ నాడు తెలుగు మాగాణములో ఎన్నో సుద్దులు వినబడుచున్నవి.

పద్య రచనము ప్రాబడుచున్న ఈ రోజులలో ఒక పద్య కావ్యమును— అందును ఒక స్త్రీ— రచించుట విశేషము. ఇతిహాస కథావస్తువుతో కావ్యము రచించుటయు ఒక సాహసమే. అట్టి కావ్యము ఉత్తర నైషధము. ఆ కవయిత్రి దర్భా భాస్కరమ్మగారు. దమయంతీ ద్వితీయ స్వయంవరము, బాహుక విదర్భాగమనము, నలదమయంతుల పునస్సమాగమము —ఉత్తర నైషధము నందలి ముఖ్య ఘట్టములు. ఈ కావ్యమున రెండాశ్వాసములు కలవు. ప్రథమాశ్వాసములో దమయంతీ ద్వితీయ స్వయంవర వార్త విన్న నలుని ఆవేదనము సమృద్ధిగా వర్ణింప బడినది. ద్వితీయాశ్వాసములో దమయంతి దుఃఖము, నల దమయంతుల పునస్సంయోగము చెప్పబడినవి. అనగా ప్రథమాశ్వాసము భావప్రధానమై, ఆత్మాశ్రయ కవితా పద్ధతితో కూడినది. ద్వితీయాశ్వాసము కథాకథనము గలట్టిది. "కలిధాటి తొలంగు ప్రవృత్తి"తో "దీప్తివెలుంగ" కావ్య మొనర్తునని భాస్కరమ్మగారు ప్రతిన చేసిరి. "ఈ కావ్య కన్యముగ్ధ" యని వారి యభిప్రాయము. ఇది నిజమే. ఉత్తర నైషధము వేంకటేశ్వర స్వామి కంకిత మయినది.

ఉత్తర నైషధమునకు పీఠిక వ్రాసిన వారన్నట్లు ఈ కావ్య రచనము భాస్కరమ్మగారి ప్రథమ ప్రయత్నము కాబోలు ! అనుపదమున ఇందు పలుచదనము కన్పించుచున్నది. కవిత్వమనగా కేవల పద్యనిర్మాణము గాదు. భావయిత్రీ కారయిత్రీ శక్తులు రసపర్యవసాయులై మేళగింప దగిన రమ్యసృష్టి అది. నలమహారాజు ఈ కావ్యమున అచ్చముగా భావకవివలె ఆక్రోశించును. ప్రథమాశ్వాసమందలి "పసిఁడి శలాకవో" "ప్రకటిత భావరాజ్ఞివయి" "నా యింటి దీప్తివై" "నా భావ సౌధమునం గట !" అనుపద్యము లిందులకు తార్కాణములు. గంభీర ప్రవృత్తిని, రాజ జన్మౌచిత్యమును గాలికి వదలి నలుడాడిన పలుకు లివి వినుడు.

"అడవిలో నొంటిగా వీడు పతని గూర్చి
చేడె ! నీ కేల ఈ లీలఁ జింత యనుచు
వడుగు నీ ప్రియు భాషణ లాలకించి
కళినుఁడంచును దలఁతువా కమలనేత్ర"

దమయంతి పలుకు లొక కొంత సహజములయి యున్నవి. భాస్కరమ్మ గారి పద్యరచనము సరళము. భావ తీక్ష్ణత, భాషాబలము ఆ సారళ్యమునకు, ఆ శయ్యకు తోడుకాగా వారు మఱొక మనోహర కావ్యము రచింప గలరని నమ్మిక ఈ కావ్యము పఠించిన సహృదయులకు కల్గును. "పెండ్లాము పెండ్లి గొడవ" "అసలగు చంద్రకాంతి" "రతనాల మహలు" మున్నగు పలుకుబడు లీ కావ్యమున చోటు చేసికొనుట ఏమంత సొగసుగా లేదు.

నవత

త్రైమాసిక పత్రిక, ద్వితీయ సంచిక. ప్రధాన సంపాదకులు— శ్రీశ్రీ. ప్రచురణ : సెవెన్‌స్టార్స్ సిండికేట్, విద్యానగర్, హైదరాబాదు—7

సాహితీ ప్రపంచములో నూతన భావములు, ఆ భావములకు ప్రతీకలయిన నూతనోద్యమములు బయలు దేరవలయుననుట వివాదాంశము కానేకాదు. కాని నూతన భావోద్యమముల పేరిట సాహితీ మూలచ్ఛేదము పనికి రాదు. ఎన్ని నూతన సాహితీ ప్రక్రియలు ఆవిష్కరింప బడిన అంతగా మేలు చేకూరును. నూతన ప్రక్రియలు, కవితా రామణీయకము —ఈ రెంటికిని తుల్య ప్రాధాన్యమే యున్నది. ఒక్కొక్కసారి కవితా సౌందర్యము ప్రక్రియను మించి పోవుటయు కద్దు. అంతమాత్రమున అది ఆనందదాయకము కాక పోదు. కాని కవితా రామణీయకమును త్రోసి రాజనిన ప్రక్రియ నీరసముగా నుండుటయే గాక, సాహిత్య లోకములో శాశ్వత స్థానము సంపాదించికొనఁ జాలదు. నవ్యత కొరకు తపస్సు చేయువారు ఈ సూక్ష్మ రహస్యమును గుర్తించుట మేలు. కవితా శక్తి శూన్యములయిన ప్రక్రియలకీ శతాబ్దిలో ఏగతులు గల్గినవో సాహితీ వ్యవసాయము చేసిన వారు, చేయుచున్న వారెఱిగినదే. అదియును గాక ఒక ప్రక్రియ వచ్చిన వారు మెచ్చిన వారు మఱొక ప్రక్రియను వలచు వారిపయి దుమ్మెత్తి పోయుట అది మంచిపోకడ కాదన్నవారి కన్నులలో కూడ దానిని కొంత చల్లుట తెలుగు వారికి క్రొత్తలు గావు. కావుననే నవ్యాంధ్ర సాహితీ ప్రపంచములో ఎంతో అల్లరి ఆగడము బయలు దేరినవి. అందుచేత ఉత్తమ సంకల్ప బలముతో ఎవరైన నూతన భావములు వెదవెట్టుటకు పూనుకొన్నచో ఉపకారము చేసిన వారగుదురు. కొన్ని యేండ్ల క్రిందట మూగ నోము పట్టిన అభ్యుదయ కవితా ప్రథమాచార్యుడు శ్రీరంగము శ్రీనివాసరావుగారు ప్రధాన సంపాదకులుగా "అభ్యుదయ కవితకి, ఆధునిక ప్రక్రియలకి" అంకిత మయిన "నవత" యను త్రైమాసిక పత్రిక ప్రారంభమగుట ఎంతేని ముదావహము. ఇది ద్వితీయ సంచిక. ప్రథమ సంచిక "సాహిత్య లోకంలో గొప్ప సంచలనం కలిగించిం"దని "మా మాట"లో "నక్షత్ర సప్తకం" మనలో మాటగా పేర్కొన్నది. "మన ప్రధాన సంపాదకులు చెప్పినట్లు An exploration into the possibilities of language జరుగుతుంది. సతతం మార్పును కోరే నవకవితలో సహజంగా ప్రయోగాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే నవకవితలో "నవత" ఎక్కువ ఉండటం, కవితకంటె ఎక్కువ ఉండటం ఆశ్చర్యకరం గాదు" అనియు నక్షత్ర సప్తకము చెప్పినది. ఒకటి రెండు సంచికలను బట్టి నికరముగా పత్రిక వెలకట్ట జాలము.

"నవత"లో బాలగంగాధర తిలక్, బైరాగి మున్నగు వారు వ్రాసిన వచన గేయములున్నవి. కె. వి. రమణారెడ్డిగారు సాహిత్య చరిత్రకు మహోపకారముగా "అభ్యుదయ కావ్య సూచిక" ఏర్పరచిరి. "వచన గేయం ఒక ఉద్యమం" అను వ్యాసమును కుందుర్తి వారు రచించిరి. "బాధ కవిత్వానికి పర్యాయ పదం" అని శ్రీ. శ్రీ రచించిన వ్యాసము దీనిలో పునర్ముద్రిత మయినది. పుస్తక సమీక్ష యున్నది. మొత్తము మీద వచన గేయములే ముప్పాతికపాలీ సంచికలో కలవు. వచన గేయము

గ్రంథ విమర్శలు

లలో కొన్నిటిలో పూర్వాశ్రమ వాసనలు పోలేదు. బైరాగి రచించిన గేయములో ఊహ వైచిత్రి యున్నది. "సంఘం" రచించిన గేయము బహువూనార్హమై సొగసులు పోయినది. రమణారెడ్డిగారు సంకలనము బహూపకారకమయినట్టిది.

కుందుర్తి వారి వ్యాసము ముందు వెనుకలు చూచి వ్రాసినట్టిది గాదు. వారు వెలువరించిన తలపులు ఆంధ్ర సాహిత్య పరిణామమును సాకల్యముగా సమీక్షించినవియు గావు. అభ్యుదయ కవులకు నచ్చలేదేమో— నచ్చవు కూడా— కాని కృష్ణమాచార్యులు, తాళ్లపాక కవులు వచనగేయ ఫణితిలో విన్నపములు వ్రాయలేదా ? అనేక కారణములనుబట్టి ఒక్కొక్క ప్రక్రియ ఒక్కొక్కనాడు బహుళముగా స్వీకరింపబడును. భిన్న ప్రక్రియలు సమకాలికములై యుండును. ఏ ప్రక్రియయు మఱొక ప్రక్రియ మరణించిన తర్వాత తదవశేషముల నుండి ఆంధ్ర సాహిత్య పరిణామములో ఆవిర్భవింప లేదు— నాకు తెలిసినంత వఱకు. ఇది ప్రాచీన సాహిత్యమును గుఱించి చెప్పిన మాట. నవీన సాహిత్యమున కనేక దోహదములు కలవు. కుందుర్తి వారి వ్యాసములో ఉత్సాహశక్తి యున్నంతగా క్రియాశక్తి లేదు. అట్లు గానిచో "భారత కవుల ధర్మదీక్ష, శివకవుల ఆవేశం, కాల్పనికోద్యమపు ఆత్మాశ్రయ పద్ధతి కలిసి నేటి వచన గేయ మయింది" అని వ్రాయరు. ఛందస్సును గూర్చి వారు వ్రాసిన మాటలు క్రొత్తవేమియు గావు. ముప్పది యేండ్ల నుండి అభ్యుదయ కవిత్వము వ్రాయుచున్నారనుకొనువారు చాటునట్టివే. వానికి సమాధానము లేక పోలేదు. కుందుర్తి వారు చూపిన విశేషమంతయు రాళ్లపల్లివారు శివభారత పీఠికలో వ్రాసిన వాక్యములను సందర్భభిన్నక్రమముగా నుదాహరించుట. రాళ్లపల్లి యనంతకృష్ణ శర్మ గారికి ఛందస్సుపై మమకారము లేదని కుందుర్తి వారు తలంచుచున్నారు. అది పొరపాటు. శివభారత పీఠికలో రాళ్లపల్లి వారు వ్రాసిన మాటలివి. "ఇందలి (శివభారత మందలి) ఛందస్సు నాఁటి నుండి నేఁటి దాఁక తెలుఁగు వాఁటిలో మెదిపి నిలిపినదే. అందును తిక్కనకు ప్రీతి పాత్రములగు చంపకాది చతుష్టయము కందగీతములు, ఆటవెలఁది— ఇవి మాత్రమే వీరు గ్రహించిరి. క్రొత్త క్రొత్త మార్గములలో నడకలలో పద్యములను ప్రయోగించు పరీక్షా దృష్టి వీరికి లేదు. ఉన్నవి, వాడుక పడినవి చాలునను వినయము వీరికిఁ గలదు. కావ్యమందలి రసభావ సిద్ధికి ఛందస్సుకూడ ముఖ్యమైన సాధనమను కొందఱి సిద్ధాంతమున వీరికి నమ్మిక లేదని తలఁచెదను. నా మట్టుకు నాకు లేదు." ఇట చివరి మాటలలో నుపయోగించిన "ఛందస్సు" అనగా— శర్మగారి యభిప్రాయము ప్రకారము— "ఉండియు వాడుక పడని" ఛందస్సు అని మాత్రమే. వాడుక పడని భిన్నచ్ఛందః ప్రయోగముల వలన లేని రసభావ సిద్ధి చేకూడదనియే శర్మగారి తలంపు. అనంతకృష్ణ శర్మగారు "వేమన" యుపన్యాసములలో ఛందస్సును గూర్చియేమనినారో కుందుర్తి వారు పరిశీలింప వలసి యున్నది. అందాక ఎందులకు ? శర్మగారి "శ్రీ శాలివాహన గాథా సప్తశతీసారము" "ఉన్నవి, వాడుకపడిన" ఛందస్సులలోనే యున్నది గదా ? బాహ్యసౌందర్యము మాత్రమే మిగిలి, అంతస్సౌందర్యము కృశించి పోయిన కవిత ఛందస్సు నాశ్రయించినను వచనగేయములలో నున్నను—తెలుగునాట కావలసినంత యున్నది. ఛందస్సువలన పద్యములకు వచ్చిన కీడు ఛందస్సు లేకయే వచన గేయములకు వచ్చినది. "భారతంలోని కవితా రీతికి, వచనగేయంలోని కవితారీతికి జాగ్రత్తగా చూస్తే చాలా పోలికలుంటాయి" యని కుందుర్తివా రన్నారు. అనగావారు వర్ణించిన "కృత్రిమమూ, మృతప్రాయమైన ఒక వికార రూపాన్ని" ఆశ్రయించి భారతకవులు వచనగేయ గుణమును నెలకొల్పిరన్నమాట. సమర్థులైన కవు లేమయినను చేయగలరు. అసమర్థులగువారి విఫల ప్రయత్నముల వలననే ఛందస్సు కావ్యకళా సౌందర్యమునకు ధూమకేతు వయినది. కావున మూలకారణము ఛందస్సుగాదు. మఱి కవి యంతశ్శక్తి. ఈ శక్తి శూన్యమయిననాడు కావ్యకళకు మాఱుగా క్రవ్యాదకళ ఆవిర్భవించును. వచనగేయములలో ఇంతవఱకు వెలుగు చూసిన వానిలో ఏపాటి కళ యున్నదో కుందుర్తివారికి తెలియునని వారి వ్యాసమే చెప్పుచున్నది.

"ప్రజాజీవితాలను సర్వ సమగ్రంగా చిత్రింప ప్రయత్నించడం ఆధునిక కవితా లక్షణం. అందుకే వచనగేయాన్ని ఆశ్రయించవలసి వచ్చింది." అని ఏమేమియో కుందుర్తి వారు వ్రాసిరి. కాటూరు, తుమ్మల, జాషువా, ఏటుకూరు, దువ్వూరు మున్నగు కవులు సంప్రదాయచ్ఛందస్సులో ఆధునిక జీవితమును వర్తింపలేదా ? వారి ప్రయత్నములు విఫలము లయినవా ? తుమ్మలవారు వ్రాసిన "వరినాటు", "సంక్రాంతి ముచ్చట్లు" మున్నగునవి సంప్రదాయచ్ఛందస్సులో నున్నవే. ఆయన సంప్రదాయ చ్ఛందస్సునకే వచన గేయ గుణమును కల్పించిరి. అనగా భారతకవులు చేసిన పనివే ఆధునిక జీవనమును వర్ణించుచు తుమ్మలవారు చేసిరన్న మాట. నగరములను వర్ణించుటలో ప్రాచీనుల పద్ధతి వేఱు. నవీనుల పద్ధతి, లక్ష్యము వేఱు. ప్రాచీనుల పద్ధతిలో నవీన నగర వర్ణనములు చేయవలసిన యక్కఱ యేమి ? చేయుమనినవా రెవరు ? చేయబూనినవా రెవరు ? కవికి కావలసినవి భావయిత్రీ కారయిత్రీ శక్తులు. ఉత్తమకవి దేశకాలోచితముగా వర్ణనలు చేయును. ఆ శక్తిద్వయము, ఈ యౌచిత్యము నున్నవాడు కుందుర్తివా రన్న "వికారము" రాదు. కుందుర్తివారి విమర్శకు పాత్రములగువారు ఔచిత్యము తప్పువారే. అట్టివారిని ప్రమాణీకరించినవా రెవరు ? వచన గేయ లక్ష్యములను కుందుర్తివారు శుద్ధముగా నిర్వచించిరి. ఏ కవియైన వస్తువునుబట్టి అవసరమైన, తనకు నచ్చిన సాధనమును చేపట్టి సాహితీ వ్యవసాయము చేయును. కవితా గుణాగుణములను పరిశీలించునపుడు "ఈ సాధనమే యుండవలయు" నని చర్చ చేయుట తగదు. సూత్రములు నిర్మించుట తగదు. కవి చెప్పిన దానియందలి "నవత" ముఖ్యము. నూతన ప్రయోగములు చేయరాదని నా సిద్ధాంతముగాదు.

ప్రాచీనాలంకారికులు అనర్థక వ్యర్థ నియమములతో సాహిత్యమును బంధించిరి. అభ్యుదయ కవితాశాస్త్ర ప్రవర్తకులును ఆ బాటనే పోవుచున్నారు. రెండు తెగలవారు తాము పట్టిన కుందేటికి కాళ్లు మూడే యని యనువారే.

ఈ సంచికకు బాలగంగాధర తిలక్ రచించిన "నవత—కవిత" తిలకప్రాయమై అందగించుచున్నది. దానిలో ప్రాత తలపులే క్రొత్త బాణిలో నున్నవి. ఆయన వ్రాసిన యీ భరత వాక్యములు చదువుడు.

> "కవిత్వం అంతరాంతర జ్యోతిస్సీమల్ని బహిర్గతం చేయాలి
>
> విస్తరించాలి చైతన్య పరిధి
>
> అగ్ని జల్లినా, అమృతం కురిసినా
>
> అందం, ఆనందం దాని పరమావధి."

ఈ సూత్రము క్రొత్తది కాకపోయినప్పటికిని, దానిని "నవత" పత్రిక అనుసరించినచో తెలుగువారి గుండెలను దోచుకొనగలదు. వేచియుందము.

——శాక్యసింహ.

రాత్రి

హైదరాబాదు అమరసాహితీ వారు ప్రచురించిన పదిహేనుగురు నవీన కవుల వచన పద్యాల సంకలనం. వెల.1.50.

ఈ రచనలు అభ్యుదయ కవితలని, ప్రకాశకులా కవులా ఆశయము. కూలీలూ, ఫ్యాక్టరీలు సమ్మెలూ శ్రామికుల తిరుగుబాట్లూ, స్వాతంత్ర్య నినాదాల యెడ సానుభూతి చూపించే రచనలూ, భూస్వాములమీదనో పాలకులమీదనో యుద్ధము ప్రకటించి జరిపినవారి వీర మరణాలూ వర్ణించే రచనలు అభ్యుదయ కవిత్వములుగా తండోపతండాలు వచ్చాయి. వీటిలో శక్తి తక్కువా ఆదర్శ ప్రచారము ఎక్కువా అవడము వల్ల కాబోలు వీటికి 'ప్రచార కవిత్వము' అనే నింద వచ్చిపడింది. సమాజములో దిద్దుకోవలసిన ఆచారాలూ ఆశయాలూ ఎప్పుడూ ఉంటాయి. వాటిని సంస్కరించే ఉద్దేశంతో కవిత్వము వ్రాసేటప్పుడు రచయిత తీసుకోవలసిన తొలి జాగ్రత్త తన రచనని కవిత్వముగా తీర్చడము. చదువరికి అనుభవాన్నిచ్చేదే కవిత్వము.నా బాధనీ ఉత్క్రోషాన్ని నేనెంతగా బయట పెట్టినా చదువరులు కూడా బాధపడ గలిగేటట్టు నేను రచిస్తే తప్ప, వారు నా బాధను నా ప్రత్యేక దర్శనంగానే ఆలోకిస్తారు. అప్పుడు నా రచన నినాద రచనే అయిపోతుంది. నా బాధను చదువరులలో రేకెత్తించే రచన చేస్తే ఆ బాధా ఫలితము వారి సంస్కారమౌతుంది. అది అభ్యుదయ రచన అవుతుంది. 'రాత్రి' అనే ఈ సంకలనంలో అభ్యుదయ రచన చాలా ఉంది.

రచయితలలో చాలామంది 'రాత్రి' ని సామగ్రిగా స్వీకరించారు. కారణం 'పాపాలు పండిన పూర్ణ గర్భిణి, రహస్యాన్ని విని పించే'ది రాత్రి కనక. మానవుడు సాధించిన సమస్తం, బూదియై గాలికెగసిపోతున్న రాత్రి' అన్నారు కమ్మిశెట్టి వెంకటేశ్వర రావుగారు. మనిషిలోని మంచితనం అలిసిపోయి, రాక్షసత్వం జూలుదులిపి కాలు దువ్వుతోంద'న్నారు వరవరరావు గారు. 'మానం హూనం జేసుగ గడించిన ఆదాయం పంపక' మయే రాత్రి అంటున్నారు విజయలక్ష్మిగారు. 'రాత్రిలోని రహస్యం అందరికీ తెలుసు' 'తెల్లవారినా నగరంలో అందరూ నిద్రే పోతున్నారు' అంటున్నారితరులు. ఈ సంకలనానికి 'రాత్రి' అని పేరిచ్చిన సంపాదకులు శిల్పేనంటాను.

'స్వాతంత్ర్యానికి పూర్వం నివురుగప్పిన నిప్పులా వున్న మతవాద మితవాద ప్రతీప శక్తుల వెయ్యి పడగల నాగులు, బాగా పుంజుకుని పదవుల్లో దూరి కాలకూట విషం కక్కుతున్నాయి' అని విజయలక్ష్మిగారూ, 'రాత్రంతా.. పోలీసు అధికారితో చీట్లు పేకాడిన ఎం.ఎల్.ఏ. 'విద్యార్థులు—క్రమశిక ణ' విషయంలో చేసిన రేడియో ప్రసంగం.. అన్ని కేంద్రాలు ప్రొద్దున్నే 'రిలే చేసాయి' అని వరవరరావు గారూ, 'ఊసరవిల్లి చందంగా రూపులు మార్చుకుంటోంది ప్రపంచ'.మని మాల్యశ్రీ, అన్యాయాల్ని వాచ్యంగా— ప్రచారసమంగా—వర్ణించారు. వాచ్యములే అయినా లాడ్జింగులోని అభాగినులు 'అమ్మలేని వాళ్లు దిక్కులేనివాళ్లూ, కుక్కబతుకు వాళ్లూ, కట్నం డబ్బులు పిగలక పెళ్లి గాక, ఉద్రేకం పట్టలేకవూళ్లకెక్కినాళ్లూ, ఎదిగినదానికి పెళ్లని తల పెట్టని దౌర్భాగ్యుల చెల్లెళ్లూ, అత్తా మామల పోరుకు, అయ్యగార్ల పొగరుకూ, తాళలేక నుయ్యి గొయ్యి చేత గాక, కడుపు కొరకు పడువృత్తి చేబట్టిన కోడళ్లూ' అంటూ వ్రాస్తే చదువర్ల విషాదానుభవానికే తద్వారా వారుద్యమించగల కల్మషక్షాళణానికీ దారి తీస్తుంది. కేవల వాచ్యంగా లోపాలు ఏకరువు పెట్టితే అది వెక్కిరింతగా తయారౌతుంది. వెక్కిరింతవల్ల కోపమూ ఉడుకుమోతు తనమూ కాక సంస్కార శక్తి కలగదు.

నిష్కృతి లేని బాధలు వర్ణించి కవులు సాధించగలట్టిదీ లేదు. "లేని తీరంకోసం అహర్నిశలు ప్రయాణించి మునిగి పోయిన యుగాల భగ్న నౌకల్ని, 'విషసర్పం కౌగిట్లో నలుగుతున్న సంపెంగ తీగనీ, 'రేపు ఇల్లు చేరుకుంటాడనే ఆశలేని' కార్మికుణ్నీ, 'ఎన్ని జీవ సంస్కారాలలోని, నిత్యచైతన్య మహాసాగర తరంగాలు, ప్రపంచపు బండకు కొట్టుకొని తునాతునకలై పగిలి పోయాయో' అంటూ నైష్ఫల్య సమాధి దగ్గర పరిదేవనము చేసి లాభమేమిటి? "ఏదో చెయ్యాలని ఉబలాటపడటం ఏమీ చెయ్యలేక వూసూరుమనటం. ఇదే బతుకు తాత్పర్యమనిపిస్తోంది" అనుకున్న తర్వాత ఇక మిగిలేదేదీ లేదు. ఈ ప్రపంచకం ఇంతే, కంటికి అంది నోటికి అందని భోజనం" అనుకునే వారికి "పదనేస్తం తలవంచుకు వెళ్లిపోదాం, మన గమ్యం మన తీరం మృత్యువు. ఈ లోకం మనపాలిటి శత్రువు" అని

గ్రంథ విమర్శలు

అంతము వైపు నడచి పోవడమే మిగులు. ఇవి అభ్యుదయాభిప్రాయాలు కావు. 'నాకైతే ప్రేతాసనంపై మహంకాళి సేవించే రక్తధార' అన్నా, నిరాశకు ఎగుకీది "వర్గవైషమ్యం సమసిపోయి, నూతన సమాజం వెల్లివిరుస్తోంది" అని కలలుగన్నా, 'అనృతాన్ని సజీవసమాధి చెయ్యటానికి ఒక పునాది రాయిగా మారాను' అనో 'ఈ వా రాశి ఏ నాడో చెలియలి కట్ట దాటుతుంది' అనో ఆశావాది పలుకులు చెప్పాలి గాని 'నా కొద్దీ పైశాచిక నరజన్మం' అన్నతరవాత మరి అవతల వేరేమి ఉండగలదూ? "పరుగులెత్తే రైలు బండి ఉత్సాహం చూసి" వెల్లబారి మైలురాయిగా నిల్చోవడమే. 'కాలిన జీవితాలు కదలిన హృదయాలు (అ) నాగరిక సంఘవిమర్శ, అణగారినవారి ఉత్కర్శ,' ఇదీ అభ్యుదయ కవిత్వపు త్రోవ. అణగారిన జీవనం అన్నార్తుని రోదనం కన్నీటిలోని కాక కలిగిన వాళ్లు చేసే ధోకా' ఇదీ ఆ కవిత్వానికి ఛందస్సు. "ఆశతో ప్రజ్వరిల్లే జ్వాల ప్రాస ఆ గణాలలో". మంచి వాని కంఠం కంచయి మోగాలి. మంచి వాని కష్టం కనకమయి పండాలి. అభ్యుదయ కవి 'భావికాంతికి వర్తమానంలో ఒత్తిగా మారి తన జీవనరసామృతాన్ని చమురుగా వెచ్చించాలి! అప్పుడు 'రాత్రి' ఉషస్సుగా రూపొందుతుంది.

వచన కవిత్వం వచనమై పోకూడదు. ఛందోబందోబస్తులు లేకపోవడము రచనను ఝురీసమానంగా శక్తివంతంగా నడపడానికి కాని వచన వాక్యాలతో రచన చేసే విచ్చలవిడిని చేకూర్చడానికి కాదు. నృత్య ప్రదర్శనలో మామూలు నడక ప్రవేశిస్తే వెగటనిపించదూ? వచనకవులు తమ రచనను మళ్లీ మళ్లీ చదువుకుని మెరుగులు దిద్దాలి. వ్యాసాల్లో వ్రాసే వాక్యాల్లాంటివి వినబడితే చదువరి అక్కడ ఆగి రచనవైపు చూస్తాడు. ఈ సంకలనంలోని వచన పద్యాలలో వచనపు తునకలు పెక్కులు చెదరి చెదరి పడ్డాయి. అవి లోపించి పోవాలి.

మొత్తానికీ సంపుటము వచన ఖండ కావ్యాల సంపుటమే, వచనాల సంపుటము కాదు. దిద్ది తీర్చినట్లే రచనలే ఉన్నాయి దీనిలో, అనేసిన కోపతాపాలు కావు. తొలి దశలో వచ్చినవచన కసరత్తుల స్వేదతాపాలు దిగిపోయి అభ్యుదయ కవి ఇందులో కవితా రచనకు ఉపక్రమించాడు. ఆతని వంగడము వృద్ధియగును గాక.

—శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

బాత్ ఏక్ రాత్ కీ

(కథలు. రచన : కె. వి. ఎస్. అచ్యుతవల్లి. ప్రచురణ: దేశికవితా మండలి, విజయవాడ—2. పుటలు : 211. వెల: రూ. 3.

వార మాస పత్రికల్లో ప్రచురించిన కథలు పదింటిని రచయిత్రి పుస్తకంగా వేయించుకొన్నారు. ఆడవాళ్ల అనేక గుణగణముంచీ వ్రాయ గలుగుతారు అనే మాటకు ఒక రకం సమర్థన ఈ కథలు. స్త్రీ అద్దంముందు నిల్చుని తన ప్రతిబింబాన్ని చూచి అందం దిద్దుకుంటూనే గదిలో వెనకాల ఉన్న పురుషుడు తన వైపు చూచి మెచ్చుకుంటూ ఉన్నాడా లేడా అనే విషయం అద్దంలో కనిపించే అతని ప్రతిబింబం ద్వారా గమనిస్తూ ఉంటుంది. ఇది అవతలి వాళ్లని నేరుగా చూచే విధానానికీ, లేక తన ప్రతిబింబం తను చూచుకునే విధానానికీ భిన్నం. ఒకవిధంగా స్త్రీకి ప్రత్యేకం. 'బాత్ ఏక్ రాత్ కీ' అనే కథా, 'శాంత' 'సంకల్ప—వికల్పాలు' 'అరిటాకు' అనే కథలూ పై రకం దృష్టికి నిదర్శనాలు. 'బాత్ ఏక్ రాత్‌కీ' కామెడీ. 'శాంత' ట్రాజెడీ. మిగతా రెండు కథలూ ఏమీ కావు. ఈ నాల్గు కథల్లో దేనికీ యాథార్థ్యంతో సంబంధంలేదు. 'గన్తవ్యం' 'నీడ బారిన మొక్క', 'ఇంటిదీపం' అనే మూడు కథలు సాంఘికమైన పరిస్థితులూ, వ్యక్తి జీవితం మీద వాటి ప్రభావమూ చిత్రించే ప్రయత్నం. మొదటి కథ ముగింపు అర్థం పర్థం లేకుండా ఉంది. మిగతా రెండు కథలూ ఫరవాలేదనిపిస్తున్నాయి. సంపుటిలో యీరెండు కథలే తృప్తికరంగా ఉన్నాయనీ చెప్పాలి. 'నీలి' అనే కథ డాఫ్నే డూ మారియర్ వ్రాసిన 'రెబెకా' నవలలోని కథ దిగుమతి. కాని ఆ సంగతి చెప్పుకోవాలనిపించలేదు రచయిత్రికి! పోతే 'నిదుర లేవని దేవుడా!', 'కృష్ణసుందరి' అనే కథలు అర్థం కాని తాత్త్విక‌ విషయాలను గూర్చి అయోమయంగా వ్రాయటం.

"అబద్ధం కథ! నిజం జీవితం! అబద్ధం నలుపు! జీవితం తెలుపు! సగం అబద్ధం సగం నిజం కలిస్తే జీవిత కథలూ, కథల్లాంటి జీవితాలూ అవుతాయి" అని రచయిత్రి ఒక కథలో వెలిబుచ్చిన అభిప్రాయం. అలానే ఉన్నాయి పై కథలు.

మనిషి - మిథ్య

(నవల. రచన : ఆదివిష్ణు. ప్రచురణ : ప్రేమచంద్ పబ్లికేషన్స్, కొత్తపేట, విజయవాడ—1. పుటలు: 294. వెల: రూ 5—00)

ఆంధ్ర వార పత్రిక పోటీలో బహుమతి పొంది, ధారావాహికంగా వెలువడిన నవల యిది. శంకరం అనే యువకుడు కథా నాయకుడు. అతని కుటుంబానికీ, స్నేహితులకూ సంబంధించిన కథలు గుది గ్రుచ్చటంతో ఏర్పడినదే కథా సంవిధానము. కథలు ఒక్కొక్కటీ దేనికదిగా ఉన్నా, వాటిని గ్రుచ్చిన సూత్రం మానవ నైజాన్ని గూర్చి శంకరం చూపే కౌతూహలం. అందువల్ల అతనికి గోచరమయ్యే సత్యం: తెల్లనివన్నీ పాలుకాదు, నల్లనివన్నీ నీళ్లు కాదు! శంకరం స్నేహితుడు రంగారావు—అతను చాల అదృష్టవంతుడుగా పైకి కనిపిస్తాడు. అతని భార్య సుజాతకూ, అతనికీ గల కలుపుగోలుతనం కనులపండువుగా, స్వర్గతుల్యంగా కనిపిస్తుంది. కాని తీరా చూస్తే,

'వాళ్ళ. అన్యోన్యాను రాగాల్లో తేలిపోవడం లేదనీ, అనుక్షణం ఒకరిమీద ఒకరు ద్వేషం, పగ, ఈర్ష్యల్తో సతమతమై పోతున్నారనీ' గ్రహింపుకు వస్తుంది. ఇది ఒక కథ. శంకరం అన్నయ్య నిరంజనం—అతనూ చాల అదృష్టవంతుడే: ప్రేమించిన అమ్మాయిని, ధనవంతురాల్ని వివాహం చేసుకున్నాడు. మామగారి కంపెనీలో బ్రాంచి మేనేజరుగా ఉంటున్నాడు. కాని అతనికి మనశ్శాంతి లేదు. తన ప్రయోజకత్వం మామగారి ప్రాపకం వల్ల మాటుపడిపోయిందనీ, తన ఆత్మ గౌరవాన్ని అవతలి వాళ్ళు లెక్క చెయ్యటంలేదనీ అతని బాధ. ఇది రెండో కథ. శంకరంతో ఆఫీసులో పని చేస్తున్న ముఖ్య స్నేహితులు—వాసుదేవరావు, లక్ష్మీపతి, ప్రసాదరావు. వీరుకాక కుసుమ అనే టైపిస్టుగర్ల్. వీళ్ల నలుగురి కథలూ నాలుగు విధాలు. తీరా చూస్తే కుసుమ శంకరానికి బంధువర్గంలోని అమ్మాయే కాదు, సొంత చెల్లెలు కూడా కావటం; వాసుదేవరావు ఒక అద్భుత కథకు (Melodrama) హీరో అయి పోవటం. లక్ష్మీపతి అజ్ఞాతవాసం చేస్తున్న ఒక ధనవంతుడి కొడుకై శంకరం చెల్లెలు సుశీలను వివాహం చేసుకోవాలనుకోవడం—ఇది ఆయా వ్యక్తుల వెనకాలవున్న 'మిస్టరీ' స్వరూపం. ఈ అద్భుత కథలమధ్య ప్రసాదరావు మేనత్త కూతుర్ని 'వూ' (Woo) చెయ్యడ మొక 'కామిక్ రిలీఫ్.' అన్నింటి కంటె మనస్సును ఆకట్టే కథ వృద్ధుడు జానకిరామయ్యది. కాని ఆయనకూ ఒక అద్భుతమైన జీవిత రహస్యం అంటగట్టి, కుసుమను ఆయన కూతుర్ని చెయ్యటం కేవలం రచయిత చాపల్యం అనాలి. 'జీవితాన్ని అంటి పెట్టుకుని కథ నడుస్తుంది.' అంటూ కథని గూర్చి తన అభిప్రాయం చెప్పుకొన్న రచయిత పై చెప్పిన 'మిస్టరీ'లను ప్రవేశ పెట్టడం చూస్తే రచయితపై సినిమా కథల ప్రభావ ప్రాబల్యం గోచరిస్తోంది. పాత్రల్ని సహజంగా చిత్రించటంలో రచయితకు ప్రతిభ ఉన్నప్పుడు, అభూత కల్పనలు, అద్భుత రహస్యాలు జోలి ఎందుకు? ప్రతి మనిషికీ ఏదో 'మిస్టరీ' ఉంటుంది అనే ఊహకి కళ్ళెంవేసి అదుపులో ఉంచుకోవాలిగాని, దాన్ని యిలా సినిమా గాలికి వదిలిపెట్టడంవల్ల చక్కని నవల చివరలో బోల్తా కొట్టేసింది. అసలీ మిగతా కథల జోలికి పోకుండా రంగారావు, సుజాతల కథనీ, నిరంజన పాత్రనీ పూర్తిగా తీర్చి దిద్దిఉంటే నవల గొప్పగా ఉండేది! అప్పుడు మనిషి మిథ్యాకాదు. మిస్టరీనుకాదు అని తేలివుండేది.

పాత్ర-చిత్రణంలో కథా కథనంలో రచయిత కున్న నేర్పు మెచ్చుకోదగ్గది. దాన్ని లక్ష్యశుద్ధితో ఉపయోగించుకుంటే ముందు ముందు చక్కని నవలలు వ్రాయవచ్చు అనే విషయం ఈ నవల నిరూపిస్తున్నది.

—ఆర్. ఎస్.

సూర్యముఖి

రచన : స్ఫూర్తిశ్రీ, ప్రతులకు : టి. భాస్కరరావు, ఏ.సి.కాలేజి, గుంటూరు. వెల 1.25. నాలుగు గేయ నాటికల సంపుట మిది.

"పువ్వు పువ్వును లేపి
నవ్వులను నేర్పినది
తోట తోటంతయును
పాటగా మ్రోగినది"

"ఎవరే ఆ పుణ్యశాలి
వైవాహిక పుష్పమాలి
విస్ఫారిత నేత్రకేళి
విజయోత్సవ కళాహేళి!"

భావగర్భితముగా నడిచిన ఈ గేయ నాటిక సూర్యముఖిలో కాశీరత్నము, సన్నజాజి, మల్లి మొదలైన పాత్రల సృష్టిలో ప్రకృతిలోని సుకుమారత్వము ప్రస్ఫుటిస్తున్నది.

రస సూక్తములోని బ్రహ్మ సరస్వతి సంవాదము కళాత్మకమై గాన సుధ లొల్కుతున్నది.

"చిరునవ్వుల చిందులలో
జీవమెత్తు సౌందర్యము
గడ్డిపూల కదలికలో
కనిపించును చైతన్యము."

"చిగురు మొగ్గల సిగ్గు తేలిన
తొగరు కరముల తొలి మరీచివి
కలువ మొగమున చెలువు నింపిన
చలువ కళలకు నెలవు నీవే"

మానవుడు దీపశిఖను సంబోధిస్తాడు. వెలుగును అన్వేషించే మానవుని పరివేదన పరిదేవనా మేళవించిన నాటిక దీపశిఖ.

"సువర్ణ ద్వారం"లో స్త్రీకంఠము, పురుష కంఠము విన్పిస్తాయి. "Golden Threshold" ఆధారంగా తీసుకుని రచించిన రూపకమిది.

యక్షగానాలు, బుర్ర కథలు, హరి కథలు ప్రచారంలో ఉన్నంతగా ఆధునిక సాహిత్యంలో కన్పించే గేయ నాటికలు పుంజుకోక పోవడానికి కారణాలు అనేకాలు. ముఖ్యమైనది భాష. ఆ దృష్టితో చూచినపుడు ఈ నాటికలు సామాన్య జనానికి అందుబాటులో లేవు. కానీ ఒక విశిష్టమైన శైలితో—ఉన్నతమైన భావాలతో, పటుత్వమైన భాషతో కూర్చబడినవి.

గ్రంథ విమర్శలు

వేమభూపాలుడు

రచన : భాషా భూషణ బాదూరు రామానుజులురెడ్డి, గాంధీరోడ్డు, తిరుత్తణి, చెంగల్పట్టు జిల్లా. వెల 1.25. ప్రోలయ వేమారెడ్డి, అనవేమారెడ్డి, కాటయవేమారెడ్డి, అల్లాడ వేమారెడ్డి, జీవిత చరిత్రలలో ప్రధాన ఘట్టములను ఎన్నుకుని కావ్యంగా మలిచినారు.

"శిల్పులొనరించు నూతన సృష్టికొగ్గి
ప్రతి శిలయు వాడు జీవ భావంబునొందె"

"అతడు గెల్చిన, జలదుర్గ తతుల హేమ
ధామములు క్రొత్త మబ్బులై తొంగలింప"

"నాట్య సంగీతములు మహానంద మొంది
దేహములు దాల్చి వీథుల దిరుగ దొడగె"

"కమ్మ కస్తూరి కడలెల్ల గలపినట్లు
వేడ్క జవ్వాది పెట్లంబు విప్పినట్లు"

లలితమైన పదాలతో తెనుగు తియ్యందనాలను పంచు చున్న తేట గీతి పద్యాలన్నీ చదువదగినవి.

ప్రత్యేకించి వేమ భూపాలుర కళాభిరుచి సాహిత్యాభిమాన మును వ్యక్తీకరించే ఘట్టములందు కవిగారు ప్రత్యేక శ్రద్ధ చూపెట్టినట్లు ద్యోతకమవుతున్నది.

ప్రాచీన కవులపట్ల వారికి ఉన్న భక్తి శ్రద్ధలు గమ నార్హములు.

"బ్రహ్మ తేజంబు పండిన భవ్యమూర్తి
తెనుగు దేశాన నవతరించిన శివుండు
శ్రవణములనున్న పోగులు చవుకళింప
సత్కవీంద్రుడు.................."

తెనుగు రుచులు విభిన్నములైనట్లే కావ్య రచనలో సహితము వివిధ ఛందో రీతులత్యంత సహజములు. రమణీయ ములు. వాంఛనీయములు. ఈ కావ్యమునందు తేట గీతి పద్యా లతోపాటు వివిధ వృత్తముల మేళవించి యుండిన రచనా వైభవ మునకు పరిపూర్ణత సిద్ధించి యుండెడిది.

కథా కథనమునందు నివ్యశిల్పము గోచరించినప్పటికీ విస్తరించదగిన ఘట్టములు కొన్ని క్లుప్తీకరించ బడినవి.

కవిగారు శ్రమ అనుకోక వేమ భూపాలుర విపుల చరిత్రముల నింకా సేకరించి కళాత్మకమైన ఘట్టములతో పాటు వారి పరిపాలనా వైభవాన్ని చిత్రీకరిస్తూ ఈ కావ్యాన్నే విస్తరించి వ్రాస్తే బాగుండును.

మహామరకతము

(శ్రీ కాకతీయ గణపతిదేవ చక్రవర్తి విజయయాత్ర)
కృతికర్త : ముదిగొండ వీరభద్రమూర్తి, ప్రకాశకులు : సాహితీ సమితి, రేపల్లె, వెల 2.00. గణపతిదేవుడు పాండ్యరాజును ఓడించి ఆయన ధరించియుండిన పచ్చను గ్రహించినందువ ఈ కావ్యమునకు "మహా మరకతము" అన్న నామము సార్థక మైనది. ప్రాచీన సాంప్రదాయ బద్ధమైన ఈ కవిత గణనీయ మై మన ప్రబంధ వాఙ్మయమును జ్ఞప్తికి తెస్తున్నది. కలకండ పలుకులవంటి పదజాలములతో మలిచిన ఈ కావ్యము నిండు శిల్పమును పుణికి పుచ్చుకున్నది. చరిత్ర ప్రాశస్త్యమున్న కథా కథనము సమర్థనీయంగా నడచినది.

"మొదటి యేనుగు గౌతమిన్ మునుకలాడ
జివరి యేనుగు సింహాద్రి సీమనుండు
వరుస నిలబడి నపుడింత వారణేంద్ర
బలము కలవాడు త్రికళింగపతి బుధేంద్ర"

"కరిని కరి హరిని హరియును బరిని బరియు
మారుకొన నార్భటిం................"

"ఆంధ్ర రాజ్యలక్ష్మి యధివసించిన తెల్ల
దొడ్డతమ్మి పూవు దుద్దనంగ
దనరు గాకతీయ గణపతిదేవుని
చంద్రశాల నయన చంద్రశాల"

ప్రాస అంత్య ప్రాసలపట్ల కవిగారు చూపెట్టిన ప్రతి భకు...............

"కురిసె వెన్నెల పాలకొన్నురుగు వాన
సురిసె శ్రమజీవులకు స్వేద భారము దాన
విరిసె ముడిగిన కుముదిని విరుల వాన
దరిసె మగనిని కడుముగుదెయును జాణ"

షష్ఠాశ్వాసమున ఒక పద్యమిది :

"ఇంక నొక్కసారి యిట్టులే రావలె
గంచిమీద నెత్తి కావేరమున
నాట వెలది నటుల నాడింతు గనుసైగ"

ఆట వెలది పద్యంలోనే చెప్పడం అతి మనోహరము గదా?

"ఎట్టిది ఉత్తమ కవిత్వమో ఎట్టిది కాదో తర్కిం చుట పెక్కు గొడవలకు అమ్ముడుపోయిన హృదయములుకల ఈ రోజులలో కొంత నిష్ప్రయోజనము" అని అనుకుంటు న్నట్లు కవిగారు తమ పీఠికలో అన్నారు.

దీని సత్యాసత్యము లెలాగున్నా "పెక్కు గొడవలకు" మాత్రము దారితీయగలదు.

సువర్ణధారణ

(పద్యకావ్య కదంబము), రచయిత : ముదిగొండ వీరభద్రమూర్తి, ప్రకాశకులు : సాహితీ సమితి, రేపల్లె, వెల : 2.75. సువర్ణధార, శివపంచస్తవి. దండికృతి అనూదితములు ఉద్భటుని యుపనయనము, మార్కండేయము, గిరి మల్లికార్జున స్తవము స్వతంత్రములు.

భక్తిరస ప్రధానమైన ఈ వాఙ్మయము అధ్యాత్మిక శ్రుతిబద్ధమై ఆత్మ సాక్షాత్కార సిద్ధికి చక్కని పునాదులు వేయుచున్నది. అనువాదములుకంటెను స్వతంత్ర రచనలు అత్యంత రసవత్తరములుగా ఉన్నవి.

పోతనామాత్యుని తలపింపజేసే.............

పర్వతుపై మృకండు భవుపై నెలబాలు
నిపై గిరిటిపై
సర్వ గణాళిపై వృషభ చంద్రునిపై
నగరాన్న వాయుపై
బర్విన నీ కటాక్షమున భాగము
మమ్ము ననుగ్రహించుతన్
శర్వ! నమత్సుపర్వ! పుర శాసన!
శ్రీగిరి మల్లికార్జునా''

అనువాద కృతులలో తెలుగుతనం అతి రమణీయమైన లల్పాన్ని అందుకొన్నది.

''దోవతి గట్టి విప్పికొను దొడ్డ శ్రమమ్ము''
''వేలుపు టేటినీట జలివెట్టు తలంజలి వెల్లు''
''అచ్చర మచ్చెకంటి చనులందు బసందుగ బచ్చి
కస్తురిన్''

నవరసాల జలపాతంవలె కన్పించే ఈ పద్య కదంబానికి భక్తి భావం సారథ్యం వహిస్తున్నది.

''శివునియందు భక్తి శివునియందాసక్తి
శివునియందెరక్తి చెలగుగాత!
నెపుడు నెందు నెట్లు నెడయక నాకు నీ
జన్మమునను జన్మ జన్మములను''

కాలంతెచ్చిన మార్పు

రచన : ఆర్. ఎస్. సుదర్శనం. వెల : 1.50 యం. శేషాచలం అండ్ కంపెనీ. మదరాసు.

కాలం తెచ్చిన మార్పు, మొగిలి పువ్వు, ఆత్మ జ్ఞానం, సమర్థుడు, అమృతుడు, నీరుగాపల్ల మెరుగు, పంకజం, ఏడు కథలున్నవిందులో.

నీరు పల్ల మెరుగు కథ గొప్ప కొన్నది. కృష్ణ భవాని మనస్తత్వాన్ని అర్థం లేక పాపం చివరికి స్వానుభవంతో గొప్ప గుణపాఠాన్ని నేర్చు కొంటాడు.

శీలం చెడిన స్త్రీ జీవితం చివరికెలా పతన మవుతుందో నేటి సామాజిక వ్యవస్థలో వారికి లభిస్తున్న స్థానమెలాంటిదో నిర్వచించిన కథ పంకజం. '' తన మీద తనే జాలి పడ్డది. తన కన్నీళ్లు తానే తుడుచు కొన్నది.''

''తనని తనే ప్రేమించు కొన్నది.'' వాస్తవానికి తన్ను ప్రేమించే వారెవరూ లేరని తేలి పోతుంది.

సామాన్య మానవుని ఆర్థిక జీవన స్థాయిని ప్రతి బింబించే గాథ మొగిలి పువ్వు. ఈ కథా చిత్రణలో ప్రైమరీ స్కూలు టీచరు సుజాత మాగుర స్మృతితో శ్రీనివాసరావు వ్యక్తిత్వం కొంత దెబ్బ తింటుంది.

ఆత్మజ్ఞానం కథలో ప్రకాశం జీవితం ఒక్క సంఘటనతో మారి పోతుంది. ఒక యువతి చెంప దెబ్బతో అతనిలో అహం అదృశ్యమై తన్ను తాను తెలుసు కొంటాడు.

మామూలు జీవితంలోని ప్రతి సంఘటనకూ విపరీతమైన విలువ నిచ్చి ,ఇదే లోకం, ఇదే ధ్యేయం అని పట్టుక ప్రేలాడే రాఘవయ్య జీవిత చిత్రణ బాగుంది.

ఏ కోణం నుండి చూచినా అర్థం కాని విచిత్ర మనః ప్రవృత్తితో పాఠకుల హృదయాలపై చెరగనిముద్రను వేసే వేణు అమృతుడు. ఈ కథలో ప్రసూన పాత్ర చక్కగా చిత్రించ బడినది.

ఇందలి చిత్రాలు కథలకు దర్పణాలుగా ఉన్నవి. వివిధ వ్యక్తిత్వాల మనస్తత్వాలను ప్రతి బింబించే ఈ కథలు చదువ దగినవి. భాష సరళంగా చదవడానికి అనువుగా మున్నది.

శార్వాణి

సాంఘిక నవల రచన : వి. యస్. అవధాని. వెల : 2.00 క్రాంతి పబ్లికేషన్స్. 70 — పెరియన్న మొదలి వీధి, మదరాసు — 1.

శార్వాణి, బాబ్జి, జీవితముల విషాద సంఘటనములతో నడిచిన గాథ ఈ నవలగా రూపొందినది. శార్వాణి మోహన రావును ప్రేమిస్తుంది. కథ అడ్డు తిరగడంతో ఆమె ఆత్మ హత్యకు ప్రయత్నిస్తుంది. అదృష్టవశాత్తు ఆ ప్రయత్నం ఫలించదు. కానీ రెండవ ప్రయత్నంలో ఆమె లోకానికి దూరమై పోతుంది.

తాను ప్రేమించిన ఇందిరను దూరం చేసుకున్న బాబ్జి నిస్పృహతో మిగిలి పోతాడు. ఈ కథను మరీ పెంచకుండా పేజీలను కొంత తగ్గించి వుంటే బావుండేదని పిస్తున్నది.

గ్రంథ విమర్శనలు

కన్నతల్లిని, ప్రేయసిని, సోదరిని ఇట్లా వరుసగా తన వారినందరినీ పోగొట్టుకొన్న బొబ్బిలి విషాద గాథ దయనీయంగా ఉంటూ పాఠకులలో ఆ పాత్ర ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తుంది. కాలేజీలలో ఆడ పిల్లలపై అఘాయిత్యాలు పత్రికల జోక్యాల వంటి సన్నివేశాలను తగ్గించి ఉన్న యెడల నవల మరింత రాణించి ఉండేది.

కంపిలరాయలు (సోమేశ్వరుడు)

కర్త : శ్రీనివాసరావ్ కొరటి. మూల్యం : 4.00. జనతా ప్రచురణాలయం. ఏలూరురోడ్డు, విజయవాడ—2.

శ్రీనివాసపురం రామాచార్యులు, శ్రీనివాసపురం నరసింహాచార్యులు కవిరాజు డాక్టర్ ఎస్. శేషాచార్లు (రమ్యశ్రీ, సింహశ్రీ, శుభశ్రీ) గార్ల పరివర్తనముతో విద్యా నగరశ్రీ, చరిత్ర నవలా మాలిక రచన సాగుతున్నట్లు ద్యోతకమవుతున్నది.

కన్నడ రచననుండి సాగుతున్న ఈ పరివర్తనము ప్రోత్సహించదగియున్నది. ఇరువది నవలలతో ఈ ప్రయత్నం పూర్తి కాగలదని తెలుస్తున్నది.

స్వాతంత్ర్య వీరుడైన కంపిల రాయల జీవిత చరిత్రము నాధారముగ రచించిన ఈ నవలలోని సన్నివేశములు చిత్రణ బాగున్నదికాని భాషలో లాలిత్యం కన్పించదు. రాబోవు నవలలలో ఈ లోపం కన్పించదని ఆశించవచ్చు. ఈ సత్ప్రయత్నమునకు పూనుకొన్న సోదరత్రయం చివరి వరకూ ఈ నవలలను పరివర్తనచేసి, ఆంధ్ర సాహిత్యానికి సమర్పించిన యెడల వారి కృషి చరిత్రాత్మకము కాగలదు.

179 పేజీలున్న ఈ నవల వెల నాలుగు రూపాయలనడం అవర్ణనీయమైన అన్యాయంగదా!

విద్యా నగర చరిత్రకు సంబంధించిన ఈ నవలలు గ్రంథాలయములందు ఉండదగినవి. చరిత్రపట్ల ఆసక్తి ఉన్నవారు చదువ దగినవి.

మాట తప్పకు

నాటకం: రచన: రావి వెంకటచలం. ఆంధ్ర విజ్ఞానసమితి విర్డినివాస్, ఎమ్. రోడ్, జంషెడ్‌పూర్. వెల : 2.00.

అభ్యుదయవాదులనే పేరుతో ఆధునికయుగంలో చెలామణీ అవుతున్న యువకులలో అనేకమంది వాస్తవిక జీవితాలలో ప్రాచీన కుల తత్వాలకు లోబడినవారే. లేదా కులాలనే సంకెళ్లలో తమ జీవితాలను బంధించుకొన్నవారే. ఈ నాటకంలో శంకరశాస్త్రి సనాతనుడుగా కన్పించినా తాను చేరదీసిన అనాథ యువతికోసం చివరివరకూ నిలబడి పోరాడుతాడు. ఆమెను చెరచినది తన కన్నకొడుకేనని తెలిసినా వెనుకంజ వేయడు.

రాక్షసత్వానికి ప్రతిబింబంగా చిత్రించిన కామరాజు పాత్ర కొంత అతిశయోక్తిగా కన్పిస్తుంది. పాటలు మధురంగాలేవు. మాటలలో మంచి నాటక ధోరణి ప్రస్ఫుటిస్తున్నది. కథ కూర్పు మంచి శిల్పాన్ని సంతరించుకొన్నది. ప్రోత్సహించదగిన ఉత్తమ నాటకం.

ఆనంద నిలయం

రచన: చంద్రశేఖరం. ప్రచురణ: ఖమ్మంజిల్లా రచయితల సంఘం, ఖమ్మం. వెల రు. 5.00.

జిల్లా రచయితల సంఘం ఇట్టి సాహిత్య ప్రచురణలకు పూనుకోవడం అత్యంత ప్రశంసనీయం. కానీ ఈ నవల రచయితల సంఘం ప్రచురించదగినది మాత్రం కాదు. ఇందులో నవలకు ఉండవలసిన లక్షణాలు అరుదుగానైనా కన్పించవు. యువతీ యువకుల ప్రేమ సల్లాపాలతోనే రెండు వందల పేజీలు దొర్లిపోతాయి. ఈ రెండువందల పేజీలలో రచయిత సాధించినదల్లా వారిద్దరూ ప్రేమించుకోవడం వరకే. ఆ వెనుక ఎక్కువ పేజీలై పోయాయిగదా త్వరత్వరగా ముగించాలనే ఆతురతతో ఆదరాబాదరా అందరూ చైనా యుద్ధానికి వెళ్లిపోతారు. అది ముగియగానే వచ్చి పెండ్లిండ్లు చేసుకొనేస్తారు.

రచనలో ప్రాథమికావస్థను ప్రస్ఫుటించే ఈ నవల ప్రత్యేకించి రచయితల సంఘం ప్రచురించటం ఆశ్చర్యంగా కన్పిస్తుంది. ముమ్ముందు ఉత్తమ సాహిత్యాన్ని ఖమ్మం రచయితల సంఘం అందివ్వగలదని ఆశిద్దాము.

—కె. సభా

తిక్కన మహాభారత రచన

వి. యన్. మూర్తి కవి. అష్టావధాని. సత్తారామేశ్వరం. వెల 1.50.

తిక్కన మహా భారతము నందలి పదునేను పర్వములను హరిహరనాథదేవుని కంకితముగా రచించిన విశేషమును కావ్యముగా రచించారు రచయిత. ఇందులో 116 పద్యములున్నవి.

సోమరసం-సుందరకాండ

కావ్యం : రచన : ఆవంత్స సోమసుందర్. ప్రకాశకులు: కళాకేళి నికేతన్. పిఠాపురం. వెల 1.00.

ఇది వచన పద్యముల కావ్యం. స్వేచ్ఛాపూరిత భావనా స్రవంతి.

సౌందర్య శిఖ

రచన: మాదిరాజు రంగారావు. నవోదయ సమితి. నారాయణగూడ, హైదరాబాదు. వెల తెలియదు. ఇది గేయ సంపుటి.

భక్తిలీలామృతము

రచన: పీసపాటి సుబ్బారావు. గుంటూరు. శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారి తొలి పలుకులతో నున్న ఈ కావ్యము భక్తిపూరితమైనది.

రామ రహస్యము

రచన శ్రీ మిన్నికంటి గురునాథ శర్మ. వెల. 2.00. బ్రాడీపేట, 5 వ లైను. 15 వ అడ్డరోడ్డు, గుంటూరు. 2

రామాయణమందలి ప్రధాన ఘట్టముల అంతరార్థములను పద్యాలలో రచించారు. జిజ్ఞాసువులు చూడదగిన గ్రంథం.

వివేకానందము

రచన: మధుర కవి శ్రీ బెళ్లూరి శ్రీనివాసమూర్తి. ప్రచురణ: కె. ఎద్దిరప్ప, అనంతపురము. వెల. 2.00.

స్వామి వివేకానంద సమగ్ర జీవిత చరిత్రమునందలి మహాద్భుత సన్నివేశములను మధురాతి మధురంగా ద్విపదకావ్యంలో గానం చేశారు రచయిత. ఇందులోఏడు సర్గలున్నవి..

సీతారామ హృదయమ్

రచన: నోరి సీతారామ శాస్త్రి, అడ్వొకేట్, హైదరాబాద్ వెల. 0.40.

108 పద్యములలో రామాయణమును పొదిగించారిందులో. భక్తులు చదువదగినది.

రాఘవ శతకము (లోకాలోకనము)

పుల్లెల శ్రీరామచంద్రుడు. వెల. 1.00. ప్రతులకు: యం. సూర్యనారాయణమూర్తి. యూనివర్సల్ బుక్ సెంటర్. నేటి లోకాన్ని గూర్చి వ్యంగ్యాత్మకమైన పద్యములు సహిత మున్నవిందులో.

లోభ సంహారము

రచన: మామిడిపల్లి సాంబశివశాస్త్రి. ప్రచురణ: ప్రగతి పబ్లికేషన్స్, వేములవాడ. కరీంనగర్ జిల్లా. వెల. 0.25.

లోభాన్ని సంబోధిస్తూ లోకులలో జాలిని రేకెత్తించడానికుద్దేశించబడిన పద్యములిందున్నవి.

కుమార సంభవము

రచన: రాష్ట్రభాషా విశారద పురాణపండ రాధాకృష్ణమూర్తి. ఆధ్యాత్మ ప్రచారక సంఘము. విక్రమ హాలు. రాజమండ్రి. వెల. 0.50. స్కాంధపురాణాంతర్గతమైన కుమార సంభవ గాథ. వచనము.

శ్రీ రామానుజశతకము

శ్రీమాన్: తి.న.చ. నం.జ. తిరువేంకటాచార్యులు. వెల 0-50. శ్రీ గోదాగ్రంథమాల, శ్రీమన్నారాయణపురము, ఉల్లిపాలెం పోస్టు, దివి తాలూకా, కృష్ణా జిల్లా. "రామానుజా" మకుటముతో భక్తి ప్రధానంగా రచించిన శతకమిది..

ప్రియాన్వేషణము

శ్రీమాన్ మాడభూషి గోపాలాచార్యులు. వెల: 1.25.

శ్రీ గోదాగ్రంథమాల, ఉల్లిపాలెం, కృష్ణా జిల్లా. తిరుమంగైయాళ్వారుల వారి శిఱియ తిరుమడల్, పెరియ తిరుమడల్ దివ్య ప్రబంధములకు తెనుగుసేత. పద్యరూపము.

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at The Andhra Patrika Press 6 & 7. Thambu Chetty Street, Madras-1
Editor: S. Sambhu Prasad.